


ఈనాడు



విజయవాడ 6-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 86

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 16 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

అమెరికా సిగలో భారతీయం

న్యూయార్క్ మేయర్‌గా మమ్దానీ

- చరిత్ర సృష్టించిన జోహ్రాన్
- పలుచోట్ల రిపబ్లికన్లకు ఎదురుదెబ్బ
- భారత సంతతి నేతల ఘన విజయం
- వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా.. మన హైదరాబాదీ హష్మీ
- సిన్సినాటి మేయర్‌గా రెండోసారి ఆఫ్తాబ్ విజయం
- నెహ్రూ మాటల్ని గుర్తుచేసుకున్న మమ్దానీ

ట్రంప్ పిలుపును తిప్పికొట్టిన జనం



తల్లిదండ్రులు మీరా నాయర్, మహమూద్ మమ్దానీ, సతీమణి రమా దువాజీలతో జోహ్రాన్ మమ్దానీ

న్యూయార్క్, వాషింగ్టన్

అమెరికా ఎన్నికల చరిత్రలో 'భారతీయం' వెలుగులీనింది. న్యూయార్క్ నగరంతోపాటు పలు చోట్ల భారత సంతతి నేతలు ఘన విజయం సాధించి చరిత్ర సృష్టించారు. అధ్యక్షుడు ట్రంప్‌ను సవాలుచేసి మరీ 34 ఏళ్ల భారత సంతతి యువకుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికయ్యారు. ఆయనతోపాటు వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా.. భారత్‌లో జన్మించి అమెరికాలో స్థిరపడ్డ గజాలా హష్మీ విజయం సాధించారు. సిన్సినాటి మేయర్‌గా భారత సంతతికి చెందిన ఆఫ్తాబ్ పురేవాల్ రెండోసారి ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన కౌంటింగ్‌లో పలు నగరాల్లో డెమోక్రాట్లు విజయం సాధించి సత్తా చాటారు. ఇది ట్రంప్‌నకు పెద్ద దెబ్బగా భావిస్తున్నారు.

తన గెలుపు న్యూయార్క్ నగర నూతన తరానికి ఉషోదయంగా మమ్దానీ అభివర్ణించారు. అందరం కలిసి సరికొత్త (మిగతా 2లో)

మీరా నాయర్ తనయుడు మమ్దానీ

న్యూయార్క్ చరిత్రలో గత వందేళ్లలో అతి పిన్న వయస్కుడైన మేయర్‌గా మమ్దానీ చరిత్ర సృష్టించారు. తొలి దక్షిణాసియావాసిగానూ ఆయన రికార్డు నెలకొల్పారు. న్యూయార్క్‌కు 111వ మేయర్‌గా వచ్చే జనవరిలో బాధ్యతలు చేపట్టనున్న మమ్దానీ 84 లక్షల మందికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆయన తల్లిదండ్రులు.. సుప్రసిద్ధ సినీ దర్శకురాలు మీరా నాయర్, కొలంబియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ మహమూద్ మమ్దానీ.



గజాలా హష్మీ



ఆఫ్తాబ్ పురేవాల్

మమ్దానీ విజయం దేనికి సంకేతం? 12లో

2 కొత్త జిల్లాలు.. 6 కొత్త రెవెన్యూ డివిజన్లు!

- ఎన్టీఆర్ జిల్లాలోకి నూజివీడు.. పరిశీలనలో గన్నవరం
- కృష్ణా జిల్లాలోకి కైకలూరు, నెల్లూరు జిల్లాలోకి గూడూరు
- కొత్తగా తెరపైకి నక్కపల్లి, బనగానపల్లి రెవెన్యూ డివిజన్లు
- 4 గంటల పాటు విస్తృతంగా చర్చించిన మంత్రివర్గ ఉపసంఘం



జిల్లాల పునర్విభజనపై నిర్వహించిన సమావేశంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, మనోహర్, సత్యప్రసాద్, జనార్దనరెడ్డి, అనిత, అధికారులు

ఈనాడు, అమరావతి: మార్కాపురం, మదనపల్లె కేంద్రాలుగా కొత్త జిల్లాలకు ఓకే.. ఏలూరు జిల్లాలోని నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో, కైకలూరు నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో, గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లా నుంచి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తిరిగి చేర్చే ప్రతిపాదనలకూ మంత్రివర్గ ఉపసంఘం సానుకూలత వెలిబుచ్చింది. గన్నవరం నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే అంశంపై స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనుంది. పీలేరు, అద్దంకి, గిద్దలూరు, మడకశిరతోపాటు మరో రెండు కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుకూ సానుకూలంగానే ఉంది. పాలనా సౌలభ్యం, ప్రజల ఆకాంక్షల మేరకే ఇవన్నీ అంటున్నా.. అదే ప్రజలు కోరుతున్నట్లు విజయవాడలో భాగమైన పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలిపే అంశాన్ని అసలు పరిశీలనకే తీసుకోలేదు. జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సరిహద్దుల్లో మార్పుచేర్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం బుధవారం సచివాలయంలో సమావేశమైంది. ఒక నియోజకవర్గంలోని మండలాలన్నింటినీ ఒకే రెవెన్యూ డివిజన్‌లోకి చేర్చడం, మండలాల మధ్య ఉన్న దూరం తదితర అంశాలపై 4 గంటలపాటు చర్చించింది. (మిగతా 2లో)



నిరుపేదరికంపై 'మల్లు'యుద్ధం!

దుర్భర దారిద్ర్యాన్ని పారదోలిన కేరళ

తొలి విడతలో ఎవరిది పైచేయి?

బిహార్‌లో పోలింగ్‌పై ఉత్కంఠ

రెండు కూటముల ధీమా

121 నియోజకవర్గాల్లో నేడు పోలింగ్

లోపలి పేజీల్లో

అమరావతి ఓఆర్ఆర్‌లో కీలక అడుగు

- భూసేకరణ ప్రక్రియకు శ్రీకారం
- పల్నాడు జిల్లాలో గ్రామాలు, సర్వే నంబర్లతో గెజిట్ ప్రచురించిన కేంద్రం
- నెలాఖరులోపు మిగిలిన 5 జిల్లాల గెజిట్



ఈనాడు, అమరావతి: అమరావతి ఔటర్ రింగ్‌రోడ్ (ఓఆర్ఆర్) నిర్మాణంలో కీలక ముందడుగు పడింది. జిల్లాలవారీగా భూసేకరణకు కేంద్రం గెజిట్‌లు ప్రచురిస్తోంది. తొలుత పల్నాడు జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల పేర్లతో గెజిట్‌ను ప్రచురించింది. ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు భూసేకరణ చేయనున్నామని, ఆయా సర్వే నంబర్లలో భూమి అవసరమవుతుందని తెలిపేలా గెజిట్ నోటిఫికేషన్(3ఏ)లో పేర్కొంది. పల్నాడు జిల్లాలోని 2 మండలాల్లోని 12 గ్రామాల పరిధిలో చేపట్టబోయే భూసేకరణకు సంబంధించిన వివరాలు అందులో ఉన్నాయి. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఒకటి, రెండు రోజుల్లో గెజిట్‌ను ప్రకటన రూపంలో పత్రికల్లో ఇవ్వనున్నారు. కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లోనూ కాపీలను అందుబాటులోకి తేనున్నారు. (మిగతా 2లో)

భాగస్వామ్య సదస్సుకు విశాఖ ముస్తాబు!

ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో భారీగా ఏర్పాట్లు

20 మంది బృందంతో పరకామణి కేసు దర్యాప్తు

నిందితుడు రవికుమార్‌కు ఇతర రాష్ట్రాల్లోనూ ఆస్తులు

సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్

లోపలి పేజీల్లో

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచాల పర్వం


- డాక్యుమెంట్ విలువ ఆధారంగా వసూళ్లు
- ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో ఉల్లంఘనలు
- డాక్యుమెంట్ రైటర్లదే రాజ్యం
- అధికారుల దగ్గర రూ.వేలల్లో లెక్కల్లో చూపని నగదు
- 12 కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు



పల్నాడు జిల్లా నరసరావుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

ఈనాడు, అమరావతి, యంత్రాంగం: ఎనీవేర్ రిజిస్ట్రేషన్లలో ఉల్లంఘనలకు పాల్పడ్డ వారు కొందరు... రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను ఇవ్వకుండా అట్టిపెట్టుకున్న వారు మరికొందరు.. నిషేధిత భూముల్ని రిజిస్ట్రేషన్లు చేసింది ఇంకొందరు.. రాష్ట్రంలోని పలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సాగుతున్న ఈ అక్రమాలు ఏసీబీ సోదాల్లో బయటపడ్డాయి. డాక్యుమెంటు విలువను బట్టి పర్సంటేజీల రూపంలో లంచాలు తీసుకుంటున్నారంటూ పెద్దఎత్తున (మిగతా 2లో)

గాడ్స్ ఓన్ కంట్రీపై నిజంగానే దేవుడి దయో మనిషి సంకల్ప బలమోగాని... నాడు సంపూర్ణ అక్షరాస్యతతో యావత్ దేశానికి బలాన్నిచ్చిన మలయాళీ మల్లులు... నేడు మరో అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు... కడు పేదరికానికి... కళ్లెం వేసిన తొలి రాష్ట్రంగా చరిత్ర సృష్టించారు!



కడు పేదరికంపై మల్లుయుద్ధం!



కేరళ నుంచి ఈటీవీ భారత్ ప్రతినిధి

దేశంలో పేదరిక నిర్మూలన...స్వాతంత్ర్యానంతరం అధికారంలోకి వచ్చిన ప్రతి ప్రభుత్వం ప్రకటించే లక్ష్యంగా ఉంటోంది. దశాబ్దాలు గడుస్తున్నా, రూ.లక్షల కోట్ల నిధులు వెచ్చిస్తున్నా ఇప్పటికీ దేశంలో చాలామంది దారిద్ర్య రేఖకు దిగువనే ఉన్నారు. ఈ లక్ష్య సాధనలో పురోగతి సాధిస్తున్నప్పటికీ చేయాల్సింది ఎంతో మిగిలే ఉంటోంది. ఈ పరిస్థితుల్లో కేరళ రాష్ట్రంలోని వామపక్ష కూటమి(ఎల్‌డీఎఫ్) ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం దుర్భర దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాన్ని (ఈపీఈపీ) ప్రకటించింది. ఈ నెల 1న, ఆ రాష్ట్ర 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తాము ఆ లక్ష్యాన్ని 100శాతం సాధించినట్లు ఘనంగా ప్రకటించింది. దుర్భర దారిద్ర్యం నుంచి 64వేల కుటుంబాలకు విముక్తి కల్పించినట్లు తెలిపింది. కనీస అవసరాలైన ఆహారం, ఇల్లు, ఆరోగ్యం, ఉపాధి మార్గాలను వారందరికీ సమకూర్చినట్లు వెల్లడించింది.

ఏం జరిగిందంటే...

- ఐక్యరాజ్యసమితి ఆర్థిక, సామాజిక వ్యవహారాల విభాగం 1961-62లో నిర్వహించిన అధ్యయనం ప్రకారం... కేరళ రాష్ట్రంలో 90.75 శాతం మంది గ్రామీణులు, 88.89 శాతం పట్టణ ప్రాంత ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నారు.
- 2022-23లో వెలువరించిన నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం... కేరళలో కడు పేదరికంతో ఉన్న జనాభా 0.48 శాతం. మూడున్నర కోట్ల జనాభా ఉన్న ఆ రాష్ట్రంలో బీపీఎల్ పరిధిలోకి వచ్చే జనాభా 1,72,800. వీరిలోనూ అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పేదలు 1,03,099 మంది. వీరంతా 64,006 కుటుంబాలకు చెందిన వారు.
- 2021 మే 20న రెండోసారి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం...దుర్భర దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాన్ని ప్రకటించడంతో పాటు వెంటనే కార్యాచరణకు ఉపక్రమించింది.

ఏమిటా కార్యాచరణ?

- పల్లెలు, పట్టణాలు, నగరాలతో సహా దుర్భర దారిద్ర్యంతో ఉన్న వారిని జల్లెడపట్టి మరీ గుర్తించేందుకు కేరళ ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తూ సుశిక్షితులైన 4లక్షల మంది ఎన్యూమరేటర్స్‌ను, వీరికి మద్దతుగా కుటుంబశ్రీ కార్యకర్తలను రంగంలోకి దించింది.
- వాడవాడలా, అన్ని వార్డుల్లోనూ పేదలు ఎవరు, ఆ పేదల్లోనూ మరింత దయనీయ పరిస్థితుల్లో ఉన్నవారెవరో గుర్తించి జాబితాలు రూపొందించారు.
- జాబితాలను సునిశితంగా పరిశీలించి తలదాచుకునే నీడ లేని వారెవరు, ఆహారం, వైద్యం అందని వారెవరు, స్థలం ఉన్నా ఇళ్లు లేనివారెవరు, శిథిల స్థితిలో ఉన్న ఇంటిని మరమ్మతు చేసుకోలేని వారెవరు, ఉపాధి దొరకని వారెందరు, ఆధార్, రేషన్ కార్డులు, గుర్తింపు పత్రాలు లేనివారెవరంటూ వివిధ విభాగాలుగా వర్గీకరించి వారికి తగిన ప్రత్యేక కార్యక్రమాలను ప్రభుత్వం రూపొందించి అమలు చేసింది.

ఈపీఈపీ మూడు దశల్లో అమలు..

1. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారందరికీ ఆహారం, ఆరోగ్య సంరక్షణ సమకూరేలా చేయడం
2. సుస్థిరమైన ఉపాధి, దాంతో పాటే ఆదాయార్జనకు మార్గాలు చూపడం
3. సురక్షితమైన, శాశ్వతమైన గృహ వసతి కల్పన

చేయూత అందిందిలా...

- దుర్భర దారిద్ర్యంలో ఉన్న 64,006 కుటుంబాల్లో... 21,262 కుటుంబాలకు ఆధార్, రేషన్, జాబ్‌కార్డులు, బ్యాంకు ఖాతాలు వంటి వాటికి సంబంధించిన కనీస పత్రాలు లేవని గుర్తించి వాటిని సమకూర్చారు.
- మూడు పూటలా భోజనం చేయలేని దుస్థితిలో ఉన్న 20,648 కుటుంబాలకు నిరంతరం ఆహారం అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. వీటిలో 18,438 కుటుంబాలకు ఆహార ధాన్యాలతో కూడిన కిట్లు రేషన్ దుకాణాల ద్వారా అందించారు. మరో 2,210 కుటుంబాలకు వండిన ఆహారాన్ని సమకూర్చారు.
- స్థలం ఉండీ ఇళ్లులేని 5,422 కుటుంబాలకు కొత్త గృహాల నిర్మాణం.
- 5,522 కుటుంబాలకు శిథిలమైన ఇళ్ల మరమ్మతులకు రూ.లక్ష నుంచి రూ. 2 లక్షల వరకూ అందజేత.
- 439 కుటుంబాలకు స్థలం కేటాయించి ఇళ్ల నిర్మాణానికి తోడ్పాటు.
- 29,427 కుటుంబాలకు చెందిన 85,721 మందికి అవసరమైన వైద్యం, శస్త్రచికిత్సలు అందించారు. వీరిలో 5,777 మంది తీవ్రవ్యాధిగ్రస్థులున్నారు. ఏడుగురికి అవయవ మార్పిడి చేయించారు.



- 3,615 కుటుంబాలకు ఆరోగ్య బీమా.
- 4,394 కుటుంబాలకు స్వయం ఉపాధి ద్వారా ఆదాయార్జనకు మార్గం.
- ఉజ్జీవన పథకం ద్వారా 3,832 మందికి ఆసక్తి ఉన్న వృత్తుల్లో శిక్షణ ఇప్పించడంతో పాటు ఆర్థిక సాయం.
- నైపుణ్యంలేని శ్రామికులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా, ఇతరులకు కుటుంబశ్రీ ద్వారా సొంత ఆదాయమార్గాలు చూపించారు.
- కొట్టాయం, కన్నూర్ జిల్లాలు...ఈపీఈపీ అమలులో అగ్రస్థానంలో నిలిచాయి.

రూ.వెయ్యి కోట్లకు పైగా వ్యయం...

దుర్భర దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం (ఈపీఈపీ) కోసం గత నాలుగేళ్లలో తమ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లకు పైగా వెచ్చించిందని రాష్ట్ర మంత్రి ఎం.బి.రాజేశ్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, లక్ష్యాన్ని సాధించాలనే నిబద్ధత, సమన్వయంతో పనులు చేపట్టడం, నిరంతరం తనిఖీల వల్లే ఈపీఈపీని నిర్దేశిత గడువులోగా విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు.



విద్యార్థులూ.. ఆకాశమే హద్దు

సైన్స్, సాంకేతికతలపై అవగాహన పెంచే దిశగా ఏపీ సైన్స్ సిటీ, సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో 52మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బుధవారం విమానంలో దిల్లీకి వెళ్లారు. విద్యార్థులు ఆటవిడుపుగా కాకుండా నేర్చుకునేందుకు రూపొందించిన కార్యక్రమం కోసం జిల్లాకు ఇద్దరి చొప్పున ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 6 నుంచి 8వ తేదీ వరకు దిల్లీలోని జాతీయ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం, రష్యా సైన్స్, సాంస్కృతిక కేంద్రాలను సందర్శిస్తారు. 8న నాసా ఇంజినీర్ గేబేతో మాట్లాడనున్నారు. – ఈనాడు, అమరావతి

మన ఇంట్లో.. హాయి తెమ్మెరలు!

మనం ఇంట్లోనో, గదిలోనో ఉన్నప్పుడు తలనొప్పి, చికాకుగా అనిపిస్తుంది. అక్కడి నుంచి బయటకు రాగానే ఆ లక్షణాలు తగ్గిపోతాయి. దీన్ని సిక్ బిల్డింగ్ సిండ్రోమ్ అంటారు. దీనికి కారణమేంటో తెలుసా... అక్కడ పరుచుకున్న వాయు కాలుష్యం. మరి ఈ పరిస్థితి ఇంట్లో ఉండకూడదంటే ఏం చేయాలి?

వాయు కాలుష్యం అనగానే మనకు రహదారులపై దుమ్ము, వాహనాలు, ఫ్యాక్టరీ గొట్టాల్లోంచి వచ్చే పొగ గుర్తొస్తాయి. అయితే, బహిరంగ ప్రదేశాల్లోనే కాదు.. మనం నివసించే ఇంట్లో, పనిచేసే కార్యాలయాల్లో కూడా కాలుష్యం వ్యాపించి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే, ఆ గాలిని పీలుస్తుంటే.. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. యూఎస్ ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ పరిశోధన ప్రకారం..కాలుష్య ప్రభావం బయటికంటే ఇళ్లలోపల 2-5 రెట్లు ఎక్కువగా ఉంటుంది.

ఎందుకీ కాలుష్యం...


- ఇంట్లో గాలి నాణ్యత తగ్గేందుకు చాలా కారణాలున్నాయి. గ్యాస్ స్టవ్, ఇంటిని శుభ్రం చేసే ఉత్పత్తుల నుంచి కార్బన్ మోనాక్సైడ్ వంటి హానికర వాయువులు విడుదలవుతాయి.
- క్లీనింగ్ లిక్విడ్స్, పెయింట్లు, పురుగుమందులు, ఎయిర్ ఫ్రెషనర్లు.. వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్ వంటి రసాయనాలను విడుదల చేసి ఇంట్లో వాతావరణాన్ని కలుషితం చేస్తాయి.
- కొత్త భవనాల్లో ఉపయోగించే సింథటిక్ సామగ్రి, ఫర్నిచర్, ప్లైవుడ్ ముక్కలు, చెక్క పొడి వంటివి కూడా గాలి నాణ్యతను తగ్గిస్తాయి.
- పాత భవనాల్లో ఆస్బెస్టాస్, ఫంగస్, రాడాన్ గ్యాస్, పెంపుడు జంతువుల వెంట్రుకలు, ఫంగస్, బల్లులు, ఇతర కీటకాల నుంచి కాలుష్యం వెలువడుతుంది.
- ఇంట్లో కాలుష్యంతో ప్రభావం శాశ్వతంగా ఉంటుంది. కళ్లు, ముక్కు, గొంతు సమస్యలకు కారణమవుతుంది.

ఏం చేయాలి?

- ఇంటికి సరైన వెంటిలేషన్ ఉండాలి. హెపా ఎయిర్ ఫిల్టర్ పరికరాలు పెట్టుకోవచ్చు.
- మొక్కలను పెంచుకుంటే అవి సహజమైన వాయుశుద్ధి కారకాలుగా ఉపయోగపడతాయి.
- అరికాపామ్, డ్రాగన్ ట్రీ, స్నేక్ ప్లాంట్ వంటి మొక్కలు.. రాత్రి సమయంలో కార్బన్ డైఆక్సైడ్‌ను పీల్చుకుంటాయి. వోలటైల్ ఆర్గానిక్ కాంపౌండ్ (వీవోసీలు)ను తొలగిస్తాయి. బెంజీన్ వంటి విషతుల్యాలను తగ్గిస్తాయి.
- తలుపులు, కిటికీలను రోజూ కాసేపు తెరవాలి.
- బాత్‌రూమ్‌లో వాడే యాసిడ్ పరిమాణాన్ని తగ్గించాలి.
- కార్పెట్లను శుభ్రం చేసుకోవాలి. దీనికోసం కాలుష్యం తక్కువగా విడుదల చేసే పరికరాలు వాడాలి.
- బయటి కాలుష్యకారకాలు ఇంట్లోకి రాకుండా నివారించేందుకు డోర్‌మ్యాట్ వాడాలి.
- సువాసనరహిత ఉత్పత్తులను ఉపయోగించాలి.
- వంటగదిని శుభ్రం చేయడానికి నిమ్మరసం, ముక్కలు, బేకింగ్ సోడా ఉత్తమం.
- ఇంట్లో ధూమపానాన్ని నిషేధించాలి.

– ఈనాడు, హైదరాబాద్







కొత్త అవకాశాలను సొంతం చేసుకోవాలంటే..



'అరటి పండు కన్నా తేనె తియ్యగా ఉంటుందని మనం కోతిని ఒప్పించలేం' అనేది ఓ ఆఫ్రికన్ సామెత. ప్రజలు తమకు ఏది ఇష్టమో దానికే పరిమితమవుతారు తప్ప కొత్తవాటిని స్వీకరించడానికి సిద్ధపడరు అని దాని అర్థం. కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చినవారికే కొత్త అవకాశాలు స్వాగతం పలుకుతాయి. – ప్రభాకర్ సింగ్, స్టాక్ మార్కెట్ అడ్వైజర్

అద్దాల మేడలో అందాల తరువు

చాలావరకు మాల్స్‌లో ప్లాస్టిక్ మొక్కలు లేదా కుండీల్లో ఇండోర్ మొక్కలు చూస్తుంటాం. సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాలని నిర్వాహకులు పచ్చని అందాల్ని కల్పించేందుకు ప్రయత్నం చేస్తారు. విశాఖ నగరంలో ప్రారంభంకానున్న లులు మాల్‌లో ఏకంగా భారీ రావి చెట్టే దర్శనమివ్వనుంది. ఈ మాల్ ప్రస్తుతం నిర్మాణంలో ఉంది. చెట్టును కొట్టేయకుండా దాని చుట్టూ వృత్తాకారంలో స్థలం వదిలి.. మూడు అంతస్తుల్లో భవనం కట్టేశారు. గాలి, వెలుతురు తగిలేలా ఉండటంతో చెట్టు ఇంకా పెరిగి మాల్‌కే అందాన్ని తీసుకొచ్చే అవకాశం ఉంది. – ఈనాడు, విశాఖపట్నం





అలతెచ్చిన శంఖాకార గవ్వలు



మొంథా తుపాను నేపథ్యంలో కాకినాడ వద్దనున్న సముద్ర తీరంలోకి కుప్పలు తెప్పలుగా కొట్టుకొచ్చిన శంఖాకార గవ్వలివి. ప్రస్తుతం తీరం వెంట ఎక్కడ చూసినా ఇవే కనిపిస్తున్నాయి. ఇక్కడికి వచ్చే పర్యాటకులు వీటిని ఆసక్తిగా తిలకిస్తున్నారు. మరికొందరు పగిలిపోకుండా ఉన్నవాటిని ఇళ్లకు తీసుకువెళ్తున్నారు. ఇటీవల వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన విపరీత మార్పుల కారణంగానే ఇలా శంఖాకార గవ్వలు కొట్టుకువస్తున్నాయని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకులు కె.బాబు తెలిపారు. – ఈనాడు, కాకినాడ

పున్నమి కాంతుల్లో.. ఆకాశవీధిలో



శరదృతువు.. కార్తీక పౌర్ణమి వేళ.. శశి నిండుగా ధవళ కాంతులు వెదజల్లుతుండగా విశాఖలోని కైలాసగిరి వెలుగులీనింది. బుధవారం ఆ పున్నమి వెలుగుల్లో యువత స్కై సైక్లింగ్ చేస్తూ.. ప్రకృతి అందాలకు పరవశించారు.

– ఈనాడు, విశాఖపట్నం

ఈ పందిరితో ఇల్లంతా వెలుగులే!



సౌర పలకల పందిరి



ఇంటిపై నుంచి చూస్తే ఇలా..

సాధారణంగా సౌర పలకలు భవనంపైన ఏర్పాటు చేసుకుంటారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామానికి చెందిన నాగయ్య, వెంకటసుబ్బమ్మ దంపతులు మాత్రం ఇంటి ఎదుట ఇలా పందిరిలా వేసుకున్నారు. దీంతో ఇంటి ముందు నీడ, అవసరాలకు విద్యుత్తు పొందుతున్నారు. భవనంపైన ఏర్పాటు చేస్తే కోతుల వల్ల సమస్యలు వస్తున్నాయని.. ఇంటి ఎదుట ఏర్పాటు చేసుకున్నట్లు నాగయ్య తెలిపారు. 'వీటి సామర్థ్యం 26 వాట్లు. వచ్చిన విద్యుత్తును తాగునీటి ఆర్వో ప్లాంటుకు వాడుతున్నాం. పందిరి కింద కారు నిలుపుతున్నాం' అని చెప్పుకొచ్చారు.

– ఈనాడు డిజిటల్, నరసరావుపేట



దీపంజ్యోతి పరబ్రహ్మ

ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలోని బ్రహ్మ పుష్కరిణి ఇది. బుధవారం కార్తీక పున్నమిని పురస్కరించుకొని.. పంచ సహస్ర దీపోత్సవాన్ని ఇలా వైభవంగా నిర్వహించారు. - న్యూస్‌టుడే, ధర్మపురి

ప్రాణదాతకు వీరతాడు!



- జాతీయ రహదారిపై ఇద్దరు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొంది. వారు రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్నా... చుట్టూ గుమికూడిన జనం సెల్‌ఫోన్లో ఫొటోలు తీశారు తప్ప ఎవరూ సాయం చేయలేదు. ఎట్టకేలకు ఒకతను 108కి సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే వారు ప్రాణాలొదిలేశారు.

అయిదు నిమిషాల ముందు తీసుకొచ్చి ఉంటే బతికేవారు... ఈ మాట సినిమాల్లోనే కాదు నిజ జీవితంలోనూ ఎదురయ్యేదే!

ఈ రోజుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే చూసినా పట్టించుకోకుండా వెళ్లిపోయేవారే ఎక్కువ. పోలీసు స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందని, మార్గమధ్యలో చనిపోతే కేసు అవుతుందేమోనని భయంతో దూరంగా ఉంటారు. ఇలాంటి సందర్భాల్లో స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించే ప్రాణదాతలకు భయం లేకుండా గుడ్ సమరిటన్ పథకం ద్వారా అభయ హస్తం ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం!

ప్రాణదాతలను ప్రోత్సహించేందుకు గుడ్ సమరిటన్ పథకం కింద రూ.5 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తోంది. ఎక్కువ మందిని కాపాడిన 10 మందికి ఏటా రూ.లక్ష అదనపు ప్రోత్సాహం అందజేస్తుంది.

- గంటలోపు క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించిన తర్వాత స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే 'ప్రాణదాత' అంటూ మీ పేరు, వివరాలు, ప్రమాదానికి సంబంధించిన సమాచారంతో ఎక్నాలెడ్జ్‌మెంట్ ఇస్తారు.
- ఆసుపత్రి వర్గాలు కూడా సంబంధిత ప్రాణదాత వివరాలను ధ్రువీకరిస్తూ పోలీసు స్టేషన్లకు సమాచారం ఇస్తాయి. అనంతరం పోలీసులు వాటిని పరిశీలించి, జిల్లాస్థాయి అప్రైజల్ కమిటీ (కలెక్టర్)కి పంపుతారు.
- అక్కడి నుంచి ప్రాణదాతకు ప్రోత్సాహం అందించాలంటూ రాష్ట్ర రవాణా కమిషనర్‌కు సిఫారసు చేస్తారు. రవాణాశాఖ సంబంధిత వ్యక్తి ఖాతాలో రూ.5వేలు జమ చేయడంతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తుంది.
- ఒక వ్యక్తికి ఏడాదిలో గరిష్ఠంగా అయిదుసార్లు ఈ అవార్డు అందిస్తారు.
- రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్తే పోలీసుస్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోందని ప్రజలు భయపడాల్సిన అవసరంలేదు. ప్రమాద బాధితులకు స్వచ్ఛందంగా సహాయం చేసే వారిని వేధింపులు, నిర్బంధం వంటి వాటి నుంచి గుడ్ సమరిటన్ చట్టం రక్షిస్తుంది.
- దీని ప్రకారం వారు ఎటువంటి పౌర లేదా క్రిమినల్ చర్యలకు బాధ్యత వహించరు. క్షతగాత్రులను చేర్చిన వెంటనే ఆసుపత్రి నుంచి వెళ్లిపోవచ్చు. వ్యక్తిగత వివరాలను అందించాల్సిన అవసరం లేదు. బాధితుడి చికిత్స కోసం డబ్బులు ఖర్చు చేయనక్కర్లేదు.

- ఈనాడు డిజిటల్, భీమవరం, న్యూస్‌టుడే, మొగల్తూరు

ఈనాడు
విజయవాడ 6-11-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 86
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లు

- భాజపాతో ఈసీ కుమ్మక్కయింది
- బ్రెజిల్ మహిళా మోడల్ ఫొటోతో 22 ఓట్లు
- ఒకే ఇంట్లో 501 మంది
- ఇది 'ఆపరేషన్ సర్కార్ చోరీ': రాహుల్



హరియాణా నకిలీ ఓటర్ల జాబితాలను ప్రదర్శిస్తూ విలేకరులతో మాట్లాడుతున్న రాహుల్‌గాంధీ

ఈనాడు, దిల్లీ: గత ఏడాది హరియాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 25 లక్షల నకిలీ ఓట్లు ఉన్నాయని, వాటి ద్వారా అక్కడి ఎన్నికను భాజపా చోరీచేసి అధికారంలోకి వచ్చిందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ తొలిదశ పోలింగు గురువారం జరగబోతున్న తరుణంలో మరోసారి ఓట్లచోరీపై అస్త్రాలు సంధించారు. బుధవారం ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక బ్రెజిల్ మోడల్ ఫొటోతో 22 నకిలీ ఓట్లు సృష్టించినా ఈసీఐ ఎందుకు కనిపెట్టలేకపోయిందని ప్రశ్నించారు. ఒకే ఇంట్లో 501 మంది ఓటర్లు ఉన్నట్లు చూపినా గుర్తించలేకపోయారని ఆరోపించారు. బిహార్‌లో కూడా ఇలాంటి ఓట్ల దొంగతనం జరిగే ప్రమాదం లేకపోలేదని ఆందోళన వ్యక్తంచేశారు.

100% నిరూపించబోతున్నాం

"హరియాణాలో మా అంచనాలు తలకిందులయ్యాయి. లోతుగా అధ్యయనం చేసినప్పుడు ఆశ్చర్యకర విషయాలు వెలుగులోకి వచ్చాయి. సాధారణ ఓటింగు తరహాలోనే పోస్టల్ ఓటింగు సరళి ఉంటుంది. పోస్టల్ బ్యాలెట్లలో కాంగ్రెస్ 73 సీట్లలో మెజార్టీ సాధిస్తే భాజపా 17కే పరిమితమైంది. కానీ ఈవీఎంలలో ఫలితాలు వేరుగా వచ్చాయి. లోతైన అధ్యయనం తర్వాత వచ్చిన వివరాలను చూసి నేను దిగ్భ్రాంతి చెందాను. పలు మార్గాల్లో సరిచూసుకున్న తర్వాతే మీడియా ముందుకొచ్చాను. దీన్ని 100% నిరూపించబోతున్నాం. కాంగ్రెస్ ఘన విజయాన్ని ఓటమి దిశగా మళ్లించేలా అక్కడ ప్రణాళికలు అమలుచేశారు. ఎన్నికలు జరిగిన రెండురోజుల తర్వాత అక్కడి ముఖ్యమంత్రి నయాబ్‌సైనీ విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని భాజపా ఏర్పాటు చేయబోతోందని, అందుకు కావాల్సిన వ్యవస్థ అంతా తమ దగ్గర ఉందని ప్రకటించారు. ఆ వ్యవస్థ ఏంటో ఇప్పుడు అర్థమవుతోంది. భాజపా-కాంగ్రెస్ మధ్య ఓట్ల తేడా 1.18 లక్షలు మాత్రమే" అని రాహుల్ చెప్పారు.

అప్పుడెందుకు ప్రశ్నించలేదు?: భాజపా

హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటరు జాబితాపై రాహుల్ అభ్యంతరాలు వ్యక్తంచేయకుండా, ఇప్పుడు అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారని, అవన్నీ అవాస్తవాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తిప్పికొట్టారు. వైఫల్యాలను దాచుకోవడానికే తప్పుడు వాదనలు చేస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కించపరచడానికే ఇప్పుడు ప్రశ్నలు లేవనెత్తారని మండిపడ్డారు. ప్రతిపక్ష నాయకుడిగా ఆయన తీవ్రమైన సమస్యలపై మాట్లాడాలని, ఇలాంటి అంశాలపై సమయం వృథా చేయకూడదని సలహా ఇచ్చారు. రాహుల్ ఆరోపణల్ని ఈసీ కూడా ఖండించింది. జాబితాలపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదని పేర్కొంది. ఒకేవ్యక్తి పలుమార్లు ఓటు వేయడం నిజమైతే బూత్ ఏజెంట్లు ఎందుకు మౌనంగా ఉంటారని ప్రశ్నించింది.

ఆధారాల్లేకుండా సీసీటీవీ ఫుటేజీ ధ్వంసం

"2 కోట్లమంది ఓటర్లున్న హరియాణాలో 25 లక్షల ఓట్లు చోరీచేశారు. ఇందులో 5,21,619 డూప్లికేట్ ఓట్లు, 93,174 చెల్లని ఓట్లు, 19,26,351 బల్క్‌ఓట్లు ఉన్నాయి. అక్కడ ప్రతి 8 మందిలో ఒకరు నకిలీ ఓటరు. ఒకే ఫొటోతో ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో 100 ఓట్లున్నప్పటికీ ఈసీఐ ఎలా అనుమతిచ్చిందో తెలియడంలేదు. ఇలాంటి ఓట్లను అడ్డుపెట్టుకొని భాజపా కార్యకర్తలు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఓటేశారు. ఒక మహిళ ఫొటో ఒకే నియోజకవర్గంలో రెండు పోలింగ్ బూత్‌లలో 223 చోట్ల ఉంది. ఆమె ఎన్నిసార్లు ఓటేసిందో చెప్పాలని అడిగితే ఈసీఐ చెప్పడంలేదు. ఆధారాలు చూపాల్సి వస్తుందనే సీసీటీవీ ఫుటేజీని ధ్వంసం చేస్తోంది. ఒకేవ్యక్తి ఫొటోలు, పేర్లు, చిరునామాలను సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించి తొలగించడానికి వీలున్నా ఈసీఐ ఆ పనిచేయకుండా భాజపాకు సాయపడింది. ఎవరు ఓటువేశారో తెలియకూడదనే చాలా ఇళ్లకు జీరో నంబరు కేటాయించారు. సీఈసీ బహిరంగంగా అబద్ధాలు చెబుతున్నారు. ప్రధానమంత్రి, హోంమంత్రితో ఈసీ కుమ్మక్కై ప్రజాస్వామ్య పునాదులను ధ్వంసంచేసింది. ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ఈసీదే. రాజకీయ పార్టీలమీద నెపం నెట్టి అది తప్పించుకోలేదు. మేం సమస్యను పరిష్కరించాలంటే మొత్తం డేటాబేస్‌ను అప్పగించాలి. అప్పుడు కచ్చితంగా చేసి చూపుతాం" అని రాహుల్‌గాంధీ ప్రకటించారు.

తుంగభద్రపై కొత్త వంతెన సహా బ్యారేజి!

- ఏపీ, కర్ణాటకలను కలుపుతూ ఏర్పాటు
- మన అనుమతి కోసం కర్ణాటక యత్నాలు
- సీఎం చంద్రబాబుకు లేఖ రాసిన ఆ రాష్ట్ర మంత్రి బోస్‌రాజు
- నీటి కేటాయింపులు లేవు.. ఎలా సాధ్యమంటున్న ఏపీ జలవనరులశాఖ

ఈనాడు - అమరావతి: ఆలమట్టి ఎత్తు పెంపుతో పాటు తుంగభద్రపై అనేక కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధమవుతున్న కర్ణాటక ప్రభుత్వం మరో కొత్త ప్రతిపాదన సిద్ధం చేసింది. ఏపీ, కర్ణాటక మధ్య రాకపోకలు మెరుగుపరిచి, ఆయా ప్రాంతాల్లో భూగర్భజలాలు వృద్ధి చెందేలా తుంగభద్ర నదిపై రెండు రాష్ట్రాలను కలిపేలా కొత్త బ్యారేజితోపాటు వంతెన నిర్మిస్తామని ప్రతిపాదిస్తోంది. తమ సొంత నిధులతో నిర్మిస్తామని, ఇందుకు ఆంధ్రప్రదేశ్ ఆమోదం తెలియజేయాలని కోరుతోంది. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా మాన్వి తాలూకా చిక్కలపర్వి గ్రామం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాలం మండలం కుంబలనూరు వద్ద కలిసేలా ఈ కొత్త బ్యారేజి, వంతెన నిర్మాణాన్ని ప్రతిపాదిస్తోంది. ఈ అంశంపై సీఎం చంద్రబాబు, జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి కర్ణాటక చిన్ననీటి వనరులశాఖ మంత్రి ఎన్.ఎస్.బోస్‌రాజు లేఖలు రాశారు. తాజాగా ఈ బ్యారేజి నిర్మాణం తర్వాత మొత్తం నిర్వహణ అంతా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే అప్పజెబుతామని, అభ్యంతరం చెప్పవలసిన అవసరం ఏమీ లేదంటూ మరో లేఖ రాశారు.

రాకపోకలు మెరుగవుతాయి: కర్ణాటక

'కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తి, కర్ణాటకలోని మాన్వి మధ్య రహదారి నిర్మాణానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేసింది. పత్తికొండ, ఆదోని, మదిరె, హల్వి, కుంబలనూరు మీదుగా మాన్వి చేరేలా ఈ రోడ్డు నిర్మించాలనేది ప్రతిపాదన. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై బ్యారేజితో పాటు వంతెన నిర్మాణానికి 2024-25 బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. ఈ ప్రాజెక్టు ఉద్దేశం రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలకు వీలు కల్పించడంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడటమే' అని బోస్‌రాజు ఆ లేఖలో వివరించారు.

నీటి కేటాయింపులేవి?

నీటి కేటాయింపులు కూడా లేని ఈ బ్యారేజి నిర్మాణానికి ఎలా వీలుంటుందని ఆంధ్రప్రదేశ్ జలవనరులశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. పైగా బ్యారేజి నిర్వహణ బాధ్యతలు మన రాష్ట్రానికి అప్పగించినా నిల్వ చేసిన నీటిని వారు ఎగువన ఎలా ఉపయోగించుకున్నా, ఎలా మళ్లించినా అడ్డుకోలేమని, అలాంటప్పుడు రాష్ట్ర నీటిహక్కులకు భంగం కలుగుతుందని ప్రస్తావిస్తున్నారు.

ప్రతిపాదనలో ప్రధానాంశాలు

- ఈ బ్యారేజి కం వంతెన నిర్మాణంతో తుంగభద్రలో 0.351 టీఎంసీల నీటిని నిల్వ చేస్తారు.
- మొత్తం 73 గేట్లు ఏర్పాటు చేయాలి.
- తుంగభద్ర నదిలో తక్కువ ప్రవాహం ఉన్న సమయంలో ఏడు తలుపులు తెరిచి, దిగువకు నీళ్లు వెళ్లిపోయేలా ఏర్పాట్లు చేయాలనేది కర్ణాటక అభిప్రాయం.

నీటి ఏడాదిలో 168 టీఎంసీల వినియోగం అంచనా

హొసపేటె, న్యూస్‌టుడే: తుంగభద్ర ఎగువ ప్రాంతాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండటంతో ఈ నీటి ఏడాదిలో జలాశయంలో సుమారు 168 టీఎంసీల జలాలు వినియోగానికి అందుబాటులో ఉంటాయని ఇంజినీర్లు అంచనాకు వచ్చారు. తుంగభద్ర నీటి వినియోగంపై మండలి కార్యాలయంలో బుధవారం కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పర్యవేక్షక ఇంజినీర్ల స్థాయి నీటిసమీక్ష సమావేశం జరిగింది. మండలి పర్యవేక్షక ఇంజినీర్ నారాయణ్ నాయక్ నేతృత్వంలో ఈ సమావేశం జరిగింది. జలాశయానికి ఇప్పటికే సుమారు 270 టీఎంసీల నీరు చేరింది. అందులో 70 టీఎంసీలను ఆయకట్టు భూములకు విడుదల చేయగా, 120 టీఎంసీలు నది ద్వారా వెళ్లాయి. ప్రస్తుతం 80 టీఎంసీలు నిల్వ ఉన్నాయని నారాయణ్ నాయక్ వివరించారు.

పెట్టుబడి ఆధారంగా స్టార్ హోటళ్లకు స్థలాల కేటాయింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ స్థలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద స్టార్‌హోటళ్ల నిర్మాణానికి పెట్టుబడిదారుల నుంచి పోటీ పెరగడంతో ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేక మార్గదర్శకాలు జారీచేసింది. పెట్టుబడి, హోటళ్లలో గదుల నిర్మాణం ఆధారంగా స్థలాలు కేటాయించాలని నిర్ణయించింది. ఆ మేరకే కేటాయింపులు చేయాలని రాష్ట్ర పర్యాటకసంస్థను ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర పర్యాటక విధానం 2024-29లో పీపీపీ కింద స్టార్ హోటళ్ల నిర్మాణానికి స్థలాలు కేటాయించాలని నిర్ణయించారు. పెట్టుబడిదారుల నుంచి సమగ్ర ప్రాజెక్టు నివేదికలు ఎక్కువగా రావడం, పలు ప్రాంతాల్లో కొన్ని స్థలాలకు అత్యధికులు పోటీపడటంతో వీటి కేటాయింపులపరంగా తలెత్తే సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఒకే ప్రాంతంలో స్థలానికి ఎక్కువ ప్రతిపాదనలు వచ్చినపుడు ప్రాధాన్యం ఇలా....

- అధిక పెట్టుబడి, సమర్థ భూ వినియోగం
- సంస్థ విశ్వసనీయత, అనుభవం
- అధిక ఆదాయ భాగస్వామ్యం



ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవాలయం రాజగోపురం వద్ద కోటి దీపాలంకరణ

దీపకాంతుల నడుమ దుర్గ గుడి

ఇంద్రకీలాద్రిపై వైభవంగా జ్వాలాతోరణం

విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో కార్తిక పౌర్ణమి సంబరాలు అంబరాన్ని తాకాయి. దుర్గామల్లేశ్వర స్వామికి బుధవారం వేకువజాము నుంచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జ్వాలాతోరణం వద్ద నుంచి పల్లకీలో వేంచేసిన ఆది దంపతులను భక్తులు దర్శించుకున్నారు.

– ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే–ఇంద్రకీలాద్రి

ధాన్యం అమ్మిన రోజే రైతులకు సొమ్ము జమ

- కౌలు రైతులకు ఉచితంగా 50 వేల టార్పాలిన్లు
- జనవరి నుంచి పట్టణాల్లో కిలో రూ.18కే గోధుమపిండి
- పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్



ఈనాడు, అమరావతి: ధాన్యం అమ్మిన రైతులకు అదేరోజు వారి బ్యాంకుఖాతాల్లో సొమ్ము జమచేసేలా ఏర్పాట్లు చేశామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. 'మధ్యాహ్నం 12 గంటలు, 2 గంటలు, సాయంత్రం 4 గంటలు, 7 గంటల సమయాల్లో.. రోజూ నాలుగుసార్లు రైతుల ఖాతాలకు చెల్లింపులు చేసేలా 35 బ్యాంకులతో ఒప్పందం చేసుకున్నాం. అంటే.. ఉదయం 10 గంటలకు ధాన్యం అమ్మితే 12 గంటలకే సొమ్ము జమయ్యేలా చేస్తున్నాం. సెలవు రోజుల్లో పేమెంట్ గేట్‌వే పని చేయదు. వారికి తర్వాత రోజు జమచేస్తాం' అని వెల్లడించారు. జనవరి 1 నుంచి పట్టణాల్లోని రేషన్ దుకాణాల్లో గోధుమపిండి కిలో రూ. 18 చొప్పున పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కౌలు రైతులకు రైతు సేవా కేంద్రాల ద్వారా 50 వేల టార్పాలిన్లు ఉచితంగా అందించేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఖరీఫ్‌లో 85 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని అంచనా. 51 లక్షల టన్నుల సేకరణకు కేంద్రం అనుమతించింది. ఆరు కోట్ల మేర గోతాలు సిద్ధం చేశాం. తేమ శాతాల్లో తేడా రాకుండా.. రైతు సేవా కేంద్రాల్లో, మిల్లర్ల వద్ద బ్లూటూత్‌తో పనిచేసే ఒకే బ్రాండ్‌కు చెందిన యంత్రాలు ఏర్పాటు చేశాం. వాట్సప్ ద్వారా రైతులు తమ పేర్లు నమోదు చేసుకుని ధాన్యం విక్రయించుకోవచ్చు. ధాన్యం సేకరణకు వారం వారీ లక్ష్యాలు నిర్ణయించాం. 92% మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ పూర్తయింది. నెలాఖరు వరకు ప్రక్రియ కొనసాగుతుంది' అని చెప్పారు.

అసత్య ప్రచారం నమ్మొద్దు

'పెట్టుబడి రాయితీ చెల్లిస్తే.. ఆ సర్వే నంబరులో సాగు చేసిన పంటను కొనుగోలు చేయరంటూ చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు. గతంలోనూ రైతుల్ని వారు ఇలాగే మోసం చేశారు. ఇప్పుడూ అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు' అని మనోహర్ మండిపడ్డారు. ఈ-పంట ఆధారంగా రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, డైరెక్టర్ గోవిందరావు పాల్గొన్నారు.

ఈ నెల నుంచి తగ్గనున్న విద్యుత్తు బిల్లులు

• మంత్రి గొట్టిపాటి



చౌడువాడ విద్యుత్తు ఉప కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రవికుమార్. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి తదితరులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగదారులకు ఈ నెల నుంచి బిల్లులు తగ్గేలా చర్యలు తీసుకుంటున్నామని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో బిల్లుల్లో ఎపీఈపీసీ ఛార్జీలు 40 పైసలు అధికంగా వసూలు చేసి పేదలను ఇబ్బంది పెట్టారని గుర్తుచేశారు. వాటిని నవంబరు నుంచి 13 పైసలు వరకు తగ్గిస్తుండటంతో వినియోగదారులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని వెల్లడించారు. అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గం చౌడువాడ, కింతలిలో బుధవారం నూతనంగా నిర్మించిన విద్యుత్తు ఉపకేంద్రాలను ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 విద్యుత్తు ఉపకేంద్రాలు నిర్మిస్తున్నామని చెప్పారు. 20 వేల ఎస్సీ, ఎస్టీ ఇళ్లపైన ఇక్కడ సౌరవిద్యుత్తు యూనిట్లు ఉచితంగా ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ఇద్దరి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు.

అమరావతి ఓఆర్ఆర్‌లో కీలక అడుగు

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాలు ఉంటే 21 రోజుల్లో భూసేకరణ అధికారికి తెలియజేస్తే.. పరిశీలించి నిర్ణయం తీసుకోనున్నారు.

నెలాఖరులోపు మిగిలిన జిల్లాలు

• అమరావతి ఓఆర్ఆర్ 6 వరుసలతో 190 కి.మీ. నిర్మించనున్నారు. ఓఆర్ఆర్‌లో తెనాలి సమీపంలోని నందివెలుగు నుంచి చెన్నై-కోల్‌కతా హైవేలో కాజా వరకు 17.5 కి.మీ. ఓ లింక్ రోడ్డు, నారాకోడూరు నుంచి గుంటూరు శివారులోని బుడంపాడు వరకు 5.5 కి.మీ. మరో లింక్‌రోడ్డు నిర్మిస్తారు.
• ఇందుకు ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో 23 మండలాల్లోని 121 గ్రామాల్లో భూసేకరణ చేయనున్నారు.
• ప్రస్తుతం పల్నాడు జిల్లా గెజిట్ రాగా.. ఏలూరు జిల్లాది ఈవారంలో, మిగిలిన జిల్లాలవి ఈ నెలాఖరులోపు ప్రచురణ కానున్నాయి.
• గెజిట్‌లో గ్రామాల పేర్లు, సర్వే నంబర్లు, రైతుల పేర్లు ఉంటాయి.
• ఏ సర్వే నంబరులో ఎంత విస్తీర్ణం సేకరిస్తారనేది మాత్రం క్షేత్రస్థాయిలో సర్వే చేసి, పెగ్ మార్కింగ్ వేశాక తేలనుంది. ఆ వివరాలతోనే '3డి నోటిఫికేషన్' జారీచేస్తారు.
• కేంద్రం అమరావతి ఓఆర్ఆర్ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చిన తర్వాత.. 3డి నోటిఫికేషన్ జారీచేయనున్నారు.

పరామర్శ పేరిట.. జగన్ డ్రామాలు: మంత్రి కొల్లు



గంజాల వెంకటేశ్వరరావు ఫొటో చూపుతున్న మంత్రి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం; మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రైతుల పరామర్శ పేరుతో జగన్‌రెడ్డి పచ్చి అబద్ధాలతో డ్రామాలు ఆడటం సిగ్గుచేటని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. రహదారులు, భవనాల శాఖ అతిథిగృహంలో తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మంగళవారం జగన్ చేపట్టిన పరామర్శ యాత్ర తీరుపై ధ్వజమెత్తారు. తుపాను ముగిసిన 9 రోజుల తర్వాత చేలగట్ల మీద దయగలవాడిగా నటిస్తూ ఫేక్ రైతులతో మాట్లాడించడం హేయమన్నారు.

మచిలీపట్నం వ్యక్తికి గూడూరులో నష్టమా?: 'ఈ చిత్రంలో జగన్‌తో మాట్లాడుతున్న వ్యక్తి మచిలీపట్నం మండలం కోన గ్రామానికి చెందిన గంజాల వెంకటేశ్వరరావు. ఆయన వైకాపా కార్యకర్త. తనకు కోనలో 50 సెంట్ల భూమి ఉంది. ఆ గ్రామంలో పంటకు నష్టం జరగలేదు. మచిలీపట్నానికి చెందిన అతడి చేత గూడూరులోని రామరాజుపాలెంలో పంట నష్టం జరిగిందని, సహాయం అందలేదని చెప్పించి అడ్డంగా దొరికిపోయారు' అని ఫొటో చూపుతూ వివరించారు.

నాడు రోడ్డు దిగని జగన్.. ఇప్పుడు పొలంలోకి వచ్చారు: మంత్రి మనోహర్

ఈనాడు, అమరావతి: సీఎంగా ఉన్నప్పుడు రోడ్డు దిగని జగన్.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి వచ్చాక పొలాల్లోకి దిగారు' అని మంత్రి మనోహర్ ఎద్దేవా చేశారు. రైతులను కాపాడాలనే ఆలోచన ఆ పార్టీ నేతల్లో లేదని ధ్వజమెత్తారు. 'తుపాను ప్రభావిత ప్రాంతాల పర్యటన పేరుతో హడావుడి చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రైతులకు 6-9 నెలల పాటు సొమ్ము చెల్లించలేదు. రూ.1,647 కోట్ల మేర బకాయిలు పెట్టారు. బడాబాబుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి.. చిన్న, సన్నకారు రైతులకు అన్యాయం చేశారు' అని విమర్శించారు. ఇప్పటివరకు 39.51 లక్షల ఎకరాల్లో వరిని ఈ-క్రాప్‌లో నమోదుచేశాం. రైతుల్ని ఆదుకోవాలని చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలు తెలుసుకుని ప్రభుత్వానికి చెప్పండి' అని సూచించారు.

రైతు పరామర్శ పేరుతో జగన్ రాజకీయ ప్రదర్శన

భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి

ఈనాడు, అమరావతి: మొంథా తుపాను కారణంగా రైతులు నష్టపోయి ఇబ్బంది పడుతుంటే.. మాజీ సీఎం జగన్ పది రోజులు బెంగళూరు ప్యాలెస్‌లో విశ్రాంతి తీసుకుని.. ఇప్పుడు బయటకొచ్చి రైతు పరామర్శ పేరుతో రాజకీయ ప్రదర్శనలు చేస్తున్నారని భాజపా కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి విమర్శించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో వరుస తుపాన్లతో రైతులు నష్టపోతే ఒక్కసారైనా పొలాల్లోకి వెళ్లి రైతులను పరామర్శించారా అని ప్రశ్నించారు. జగన్‌కు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై కేసు నమోదు

పమిడిముక్కల, న్యూస్‌టుడే: మాజీ సీఎం జగన్ కృష్ణా జిల్లా పర్యటన సందర్భంగా పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, అతని అనుచరులు వ్యవహరించిన తీరుపై కేసు నమోదుచేసినట్లు కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం అనిల్‌కుమార్, అతని అనుచరులు సుమారు వెయ్యి మంది వరకు గోపువానిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపైకి చేరి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఉండటాన్ని గమనించిన పమిడిముక్కల సీఐ చిట్టిబాబు అక్కడికి వచ్చేవారిని నియంత్రిస్తుండగా, కైలే అనిల్‌కుమార్ అక్కడకు వచ్చి 'ఇక్కడ జనాలకు ఏమైనా పరిమితి ఉందా.. మమ్మల్ని మీరు ఏమీ చేయలేరు.. మీరెంత? మేం తలుచుకుంటే మీ సంగతి చూస్తాం అని దుర్భాషలాడుతూ, వారి విధులకు ఆటంకం కలిగించారని ఎస్పీ వెల్లడించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను గుర్తించి ఛార్జిషీట్ దాఖలు చేస్తామని ప్రకటనలో తెలిపారు.

అమెరికా సిగలో భారతీయం

(మొదటి పేజీ తరువాయి)

తరాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. విజయానంతరం ఆయన బ్రూక్లిన్ పారామౌంట్‌లో జరిగిన కార్యక్రమంలో వేల మందిని ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. 'మనం రాజకీయ రారాజును కూల్చేశాం. అధికారం, డబ్బుపై విజయానికి నా ఎన్నిక స్ఫూర్తి. ఇప్పుడు న్యూయార్క్‌పై ఆధిపత్యం చెలాయించడానికి ట్రంప్ చేసిన ప్రయత్నాన్ని అడ్డుకున్నాం. ఆ తరువాత వచ్చే ఆయన వారసులనూ అడ్డుకోవాల్సి ఉంది. డియర్ ట్రంప్.. మీరు ఇది వింటున్నారని నాకు తెలుసు. మరింత సౌండ్ పెంచుకుని నా మాటలను వినండి' అని మమ్దానీ పేర్కొన్నారు. 1947లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ.. 'ట్రిస్ట్ విత్ డెస్టినీ' పేరుతో చేసిన ప్రసంగాన్ని మమ్దానీ ఉటంకించారు. చరిత్రలో అరుదుగానే మనకు పాత నుంచి కొత్తకు ప్రయాణించే అవకాశం లభిస్తుందని ఆయన చెప్పారు. న్యూయార్క్ నగరానికి ఇప్పుడా అవకాశం వచ్చిందని వివరించారు. కొత్త శక్తిని నింపుకోవడం, సమానత్వం సాధించడం, అవినీతిని అడ్డుకోవడమే తన లక్ష్యాలని ప్రకటించారు.

• తాను తీవ్రంగా వ్యతిరేకించే మమ్దానీ విజయంపై ట్రంప్ విచిత్రంగా స్పందించారు. తన పేరు బ్యాలెట్ పేపరులో లేకపోవడం, ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌వల్ల ఓడిపోయామని వ్యాఖ్యానించారు.

ప్రపంచ ఆర్థిక రాజధానిలో పాగా..

ప్రపంచ ఆర్థిక రాజధానిగా, ఎంతో మందికి కలల నగరంగా వర్ధిల్లుతున్న న్యూయార్క్‌లో డెమోక్రటిక్ సోషలిస్టు అయిన జోహ్రాన్ మమ్దానీ అద్భుత విజయం సాధించారు. జోహ్రాన్.. తన ప్రత్యర్థి, న్యూయార్క్ మాజీ గవర్నర్ అయిన ఆండ్రూ కువోమోను ఓడించారు. కుంభకోణాల్లో ఇరుక్కున్న కువోమో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా కర్టిస్ స్లీవా పోటీ చేశారు. అయితే అధ్యక్షుడు ట్రంప్ చివరి నిమిషంలో కువోమోకు మద్దతు పలికారు. అయినా ట్రంప్‌నకు షాకిస్తూ ప్రజలు మమ్దానీకి అండగా నిలిచారు.

మధ్య తరగతి కలల నగరంగా మారుస్తానని హామీ

న్యూయార్క్‌ను మధ్యతరగతి కలల నగరంగా మారుస్తానని ఎన్నికల సందర్భంగా మమ్దానీ హామీ ఇచ్చారు. చైల్డ్‌కేర్ ఉచితంగా అందజేస్తానని, అద్దెలను కొంతకాలపాటు ఫ్రీజ్ చేస్తానని, ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తానని, ప్రభుత్వ ఆధ్వర్యంలో కిరాణా దుకాణాలను ఏర్పాటు చేస్తానని ఆయన పేర్కొన్నారు.

మిగిలిన పోట్లు..

వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత్‌లో జన్మించి అమెరికాలో స్థిరపడ్డ 61 ఏళ్ల డెమోక్రాట్ గజాలా హష్మీ విజయం సాధించారు. గవర్నర్ తర్వాత అత్యున్నత పదవి ఇది. ఈ పదవికి ఎన్నికైన తొలి దక్షిణాసియా అమెరికన్‌గా ఆమె చరిత్ర సృష్టించారు. ఆమెకు 18,44,916 (55.3%) ఓట్లు, రిపబ్లికన్ అభ్యర్థి జాన్ రీడ్‌కు 14,84,806 ఓట్లు (44.5%) వచ్చాయి. వర్జీనియా రాష్ట్ర సెనేటర్‌గా ఇప్పటికే ఆమె సేవలందిస్తున్నారు. హష్మీ నాలుగేళ్ల వయసులో హైదరాబాద్ నుంచి అమెరికాకు వెళ్లారు.

• ఒహాయోలోని సిన్సినాటిలో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సవతి సోదరుడైన రిపబ్లికన్ అభ్యర్థి కోరీ బౌమ్యాన్‌ను భారత సంతతికి చెందిన ఆఫ్తాబ్ పురేవాల్ ఓడించారు. ఆయన ఈ నగర మేయర్‌గా ఎన్నిక కావడం ఇది రెండోసారి. అమెరికా అటార్నీ ప్రత్యేక సహాయకుడిగా పని చేసిన 43 ఏళ్ల పురేవాల్ 2021లో మొదటిసారి మేయర్‌గా గెలిచారు. పురేవాల్ తల్లి టిబెట్‌కు చెందినవారు. తండ్రి పంజాబీ. • న్యూజెర్సీ గవర్నర్‌గా మిక్కీ షెరిల్, వర్జీనియా గవర్నర్‌గా అబిగెయిల్ స్పాన్‌బర్గర్ విజయం సాధించారు. వీరిద్దరూ డెమోక్రాట్లే. • పిట్స్‌బర్గ్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీకి చెందిన కోరీ ఓ కానర్ గెలిచారు. • అట్లాంటా మేయర్‌గా డెమోక్రాట్ అయిన ఆండ్రీ డికెన్స్ రెండోసారి గెలిచారు. • నార్త్ కరోలినాలోని అతిపెద్ద నగరం చార్లెట్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీకి చెందిన వి లైల్స్ మరోసారి ఎన్నికయ్యారు.

ఎవరికెన్ని ఓట్లు?

జోహ్రాన్ మమ్దానీ	కువోమో	స్లీవా
10,36,051 (50.4%)	8,54,995 (41.6%)	1,46,137 (7.1%)



మేయర్‌గా ఎన్నికైన అనంతరం న్యూయార్క్ సిటీలో తన మద్దతుదారులకు అభివాదం చేస్తున్న జోహ్రాన్ మమ్దానీ

ఉగాండాలో పుట్టి..

ప్రగతిశీలవాది అయిన మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నిక కావడం తరతరాలకూ ఆదర్శంగా నిలిచే విజయం. ముఖ్యంగా భారతీయ అమెరికన్లలో ఇది స్ఫూర్తిని నింపడం ఖాయం. మమ్దానీ తల్లిదండ్రులు.. మీరా నాయర్, మహమూద్ మమ్దానీ. ఉగాండాలోని కంపాలాలో 1991 అక్టోబరు 18వ తేదీన జోహ్రాన్ జన్మించారు. ఆయన పూర్తి పేరు జోహ్రాన్ క్వామీ మమ్దానీ. ఏడేళ్ల వయసులో తన కుటుంబంతో కలిసి ఆయన న్యూయార్క్‌కు వలస వచ్చారు. తాజాగా 2018లోనే ఆయనకు అమెరికా పౌరసత్వం దక్కింది. భారతీయురాలైన మీరా నాయర్, మహమూద్ మమ్దానీ ఇద్దరూ హార్వర్డ్ పూర్వ విద్యార్థులు.
• బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్‌లో మమ్దానీ చదువుకున్నారు. బౌడోయిన్ కళాశాల నుంచి ఆఫ్రికన్ స్టడీస్‌లో డిగ్రీ పట్టా పొందారు.
• పాఠశాలలోనే మమ్దానీ క్రికెట్ టీంను తయారు చేసుకున్నారు. అంతర్ పాఠశాలల క్రీడల్లో పాల్గొన్నారు.
• క్వీన్స్ ప్రాంతంలో తక్కువ ఆదాయం గలవారి ఇళ్ల జప్తులను అడ్డుకునే హౌసింగ్ కౌన్సెలర్‌గా పని చేశారు. వారి ఇళ్లను ఖాళీ చేయించకుండా సహాయం అందించారు.
• 2020లో న్యూయార్క్ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 36వ అసెంబ్లీ డిస్ట్రిక్ట్‌కు ప్రాతినిధ్యం వహించారు.
• 2021లో న్యూయార్క్‌లో క్యాబ్ డ్రైవర్లతో కలిసి 15 రోజుల నిరాహార దీక్షలో మమ్దానీ పాల్గొన్నారు. వారిని రుణ విముక్తుల్ని చేయాలని డిమాండు చేశారు. దీంతో వేల మంది క్యాబ్ డ్రైవర్లు ఆయనకు అండగా నిలిచారు. వారిలో ఎక్కువ మంది దక్షిణాసియా నుంచి వచ్చినవారే.
• పాలస్తీనియన్లకు మమ్దానీ గట్టి మద్దతుదారు. ఇజ్రాయెల్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తారు. గాజాలో ఆ దేశం మానవ హననానికి పాల్పడుతోందని విమర్శించారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లంచాల పర్వం

(మొదటి పేజీ తరువాయి)

ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో... ఏసీబీ డైరెక్టర్ జనరల్ అతుల్‌సింగ్ ఆదేశాల మేరకు వివిధ జిల్లాల్లోని 12 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అధికారుల బృందాలు తనిఖీలు చేశాయి.

ఈ కార్యాలయాల్లోనే...

జగదాంబ సెంటర్, పెదగంట్యాడ, మధురవాడ(విశాఖపట్నం జిల్లా), భోగాపురం(విజయనగరం), ఇబ్రహీంపట్నం(ఎన్టీఆర్), నరసరావుపేట(పల్నాడు), ఒంగోలు(ప్రకాశం), స్టోన్‌హౌస్‌పేట(నెల్లూరు), రేణిగుంట(తిరుపతి), రాజంపేట(అన్నమయ్య), చిలమత్తూరు(శ్రీసత్యసాయి), ఆళ్లగడ్డ(నంద్యాల) సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ బృందాలు బుధవారం మధ్యాహ్నం ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టాయి. ఇవి రాత్రి 11 గంటల వరకూ కొనసాగాయి.

లెక్కల్లో చూపని నగదు స్వాధీనం...

• భోగాపురం, జగదాంబసెంటర్, ఇబ్రహీంపట్నం, ఒంగోలు, స్టోన్‌హౌస్‌పేట, నరసరావుపేటల్లో లెక్కల్లో చూపని నగదు లభ్యమైంది. రూ.10 వేల నుంచి రూ.75 వేల వరకు నగదును స్వాధీనం చేసుకున్నారు.
• నరసరావుపేటలో కార్యాలయ ఉద్యోగులు, డాక్యుమెంట్ రైటర్ల వద్ద రూ.36 వేలను గుర్తించారు.
• ఇబ్రహీంపట్నంలో లెక్కల్లో చూపని రూ.75వేల నగదు చిక్కింది. ఇక్కడ ముగ్గురు డేటాఎంట్రీ ఆపరేటర్లు అనధికారికంగా పనిచేస్తున్నట్లు తేలింది.
• ఆళ్లగడ్డ సబ్‌రిజిస్ట్రార్ దగ్గర ఉండాల్సిన డబ్బు కంటే అధికంగా ఉంది. సీనియర్ అసిస్టెంట్ దగ్గర రూ.8,100, స్టాంపువెండర్ దగ్గర రూ.17 వేలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. స్టోన్‌హౌస్‌పేట కార్యాలయంలో రూ.62 వేలను సీజ్ చేశారు.
• పలుచోట్ల కార్యాలయాల్లో ఉన్న డాక్యుమెంట్ రైటర్లను అదుపులోకి తీసుకున్నారు.

లంచమిస్తే రిజిస్ట్రేషన్.... అందుకే డబ్బు తెచ్చా

రాజంపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీల సమయంలో.. ఓ వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయకూడని ఆస్తి పత్రాలతో ఏసీబీ అధికారులకు కనిపించాడు. అతడిని విచారించగా.. లంచమిస్తే రిజిస్ట్రేషన్ చేస్తామని అధికారులు చెప్పారని అందుకే డబ్బుతో వచ్చినట్లు చెప్పాడు. అతడిని అదుపులోకి తీసుకుని డబ్బును స్వాధీనం చేసుకున్నారు.

సమాచారం లీకైందా?

• ఏసీబీ దాడులు చేస్తుందనే సమాచారం లీకైందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అన్నమయ్య జిల్లాలో రాజంపేట, పుల్లంపేట సబ్‌రిజిస్ట్రార్లు ఉన్నపళంగా సెలవుపెట్టారు.
• నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట సబ్‌రిజిస్ట్రార్ రెండు రోజులుగా, సీనియర్ అసిస్టెంట్ బుధవారం సెలవులో ఉండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్రాసు బస్టాండు వద్దనున్న మెయిన్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులున్నాయి. అక్కడ తనిఖీలు చేయకపోవటంపై విస్మయం వ్యక్తమవుతోంది.

ఏసీబీ అంటే మేమే..

తనిఖీలు చేస్తే భయం ఉంటుంది

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తనిఖీలపై రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. 'ఏసీబీ అంటే మా ప్రభుత్వమే. తనిఖీలు చేస్తే... తప్పులకు పాల్పడేవారిలో భయం ఉంటుంది. ఇప్పటికే కొందరిపై ఫిర్యాదులు అందాయి. విచారణ చేయిస్తున్నాం. వారిపై చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు.

సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శివర్గం ఎన్నిక

ఈనాడు, అమరావతి: విజయవాడలోని దాసరిభవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర సమితి సమావేశంలో సీపీఐ రాష్ట్ర నూతన కార్యదర్శివర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా జి.ఈశ్వరయ్య, కార్యదర్శివర్గ సభ్యులుగా జేవీ సత్యనారాయణమూర్తి, పి.హరినాథరెడ్డి, కేవీవీ ప్రసాద్, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, డేగ ప్రభాకర్, తాటిపాక మధు, పి.దుర్గాభవాని, కె.రామాంజనేయులు ఎన్నికయ్యారు. శాశ్వత ఆహ్వానితులుగా ముప్పాళ్ల నాగేశ్వరరావు, అక్కినేని వనజ ఎన్నికయ్యారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా వారంపాటు నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డిసెంబరు 20 నుంచి 26 వరకు వేడుకలు కొనసాగుతాయని తెలిపారు.

అవినీతికి పాల్పడితే తీవ్ర పర్యవసానాలు

• కొందరు అధికారులు సొంత ఎజెండా అమలు చేస్తున్నారు
• రాష్ట్రస్థాయి సమీక్షలో ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్‌శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా, కమిషనర్ శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఈనాడు, అమరావతి: 'ఎక్సైజ్‌శాఖలో వ్యవస్థీకృత అవినీతి జరుగుతోందంటూ పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. ఏ ఒక్కరు అవినీతి, అక్రమార్జనకు పాల్పడినా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలిచ్చారు' అని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా అధికారులను హెచ్చరించారు. ఏదైనా నేరం జరిగినప్పుడు అనుసరించాల్సిన ప్రామాణిక ప్రొటోకాల్‌కు విరుద్ధంగా కొందరు అధికారులు వారి సొంత ఎజెండాను అమలుచేస్తున్నారని దీన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. కొందరు అధికారులు ఘటనా స్థలానికి వెళ్లి షార్ట్‌ఫిల్మ్‌లకు దర్శకత్వం వహించామా అన్నట్లుగా అతిగా వ్యవహరిస్తున్నారని, ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని అన్నారు. మంగళగిరిలోని ఎక్సైజ్ కమిషనరేట్‌లో బుధవారం డీసీలు, ఏసీలతో రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విధినిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శించే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.

2 కొత్త జిల్లాలు.. 6 కొత్త రెవెన్యూ డివిజన్లు!

(మొదటి పేజీ తరువాయి)

మూడు రోజుల్లో నివేదిక తయారుచేయాలని రెవెన్యూ శాఖకు సూచించింది.

పెనమలూరు.. స్థానిక ప్రజాప్రతినిధులే మోకాలడ్డు?

పెనమలూరు నియోజకవర్గం విజయవాడలో భాగమే. అయినా వైకాపా ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లాను కాదని కృష్ణా జిల్లాలో చేర్చింది. పెనమలూరు నుంచి జిల్లా కేంద్రమైన మచిలీపట్నం వెళ్లాలంటే 65 కి.మీ. ప్రయాణించాల్సిన దుస్థితి కల్పించింది. పనిపై అక్కడికి వెళ్లిరావాలంటే ఛార్జీలు, ఖర్చులు కలిపితే రూ.500 అవుతోంది. పెనమలూరు నియోజకవర్గాన్ని ఎన్టీఆర్ జిల్లాలో కలపాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. అయితే స్థానిక ప్రజాప్రతినిధులు దీనికి మోకాలడ్డుతున్నారు. వైకాపా హయాంలో జరిగిన తప్పులు సరిదిద్దాలని, పాలనా సౌలభ్యమే ప్రాతిపదికగా నిర్ణయం తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించినా మంత్రివర్గ ఉపసంఘం కూడా దీన్ని పరిశీలించట్లేదు.

ఆ రెండు డివిజన్లతో పోలవరం అథారిటీ!

• చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లతో ప్రత్యేక అథారిటీ ఏర్పాటుచేసి అభివృద్ధి చేయాలనేది సీఎం చంద్రబాబు ఆలోచన. అందుకు అనుగుణంగా మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదనల్ని రూపొందిస్తోంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఈ రెండు డివిజన్ల ప్రజలు జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్లాలంటే ఒక రోజంతా ప్రయాణమే. అలాగని రెండు డివిజన్లతో ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేస్తే మరీ చిన్నదైపోతుంది. తూర్పుగోదావరి జిల్లాలో కలపాలని తొలుత ప్రతిపాదించారు. గిరిజన ప్రాంత జిల్లా నుంచి తప్పించి, మైదాన ప్రాంత జిల్లాలో కలిపితే ఏమైనా సమస్యలొస్తాయా అని ఇప్పుడు అధ్యయనం చేస్తున్నారు. అల్లూరు జిల్లాలోనే కొనసాగిస్తూ అథారిటీ ఏర్పాటును పరిశీలిస్తున్నారు.

• రాష్ట్రంలో 77 రెవెన్యూ డివిజన్లు ఉన్నాయి. కొత్తగా మరో ఆరు డివిజన్ల వరకు ఏర్పాటయ్యే అవకాశం ఉంది. యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లోని మండలాలతో నక్కపల్లి కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని అక్కడి ఎమ్మెల్యే, హోం మంత్రి అనిత చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా ఉంది. రెండు నియోజకవర్గాల్లోని 8 మండలాలతో ఒక ఆప్షన్.. యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాలతో ఏర్పాటు చేయడమనే మరో ప్రత్యామ్నాయాన్ని పరిశీలిస్తున్నారు. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రతిపాదన మేరకు బనగానపల్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపైనా చర్చించారు. అవనిగడ్డ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుపైనా చర్చ జరిగింది.

రెవెన్యూ డివిజన్ల మార్పుచేర్పులపై కొన్ని ప్రధాన ప్రతిపాదనలు

• శ్రీకాకుళం జిల్లా పలాస రెవెన్యూ డివిజన్‌లోని నందిగాం మండలం టెక్కలి డివిజన్‌లోకి
• పెదబయలు మండలాన్ని విభజించి గోమంగి కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటు
• డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గంలోని మండపేట, కపిలేశ్వరం, రాయవరం మండలాల్ని తూర్పుగోదావరి జిల్లాలోకి తెచ్చి రాజమహేంద్రవరం డివిజన్‌లో కలపాలి.
• రామచంద్రాపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలాన్ని అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రామచంద్రాపురం డివిజన్‌లో కలపాలి.
• కాకినాడ జిల్లా పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లోకి తేవాలి.
• భీమవరం డివిజన్‌లోని గణపవరం మండలాన్ని ఏలూరు డివిజన్‌లో కలపాలి.
• నూజివీడు డివిజన్‌లోని చింతలపూడి, లింగపాలెం మండలాల్ని జంగారెడ్డిగూడెం డివిజన్‌లో చేర్చాలి.
• నూజివీడు నియోజకవర్గంలోని 4 మండలాలతోపాటు గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు మండలాల్ని నూజివీడు డివిజన్‌లో కలపాలి.
• వీరులపాడు మండల కేంద్రాన్ని జుజ్జూరు నుంచి వీరులపాడుకు మార్చాలి.
• ఏలూరు డివిజన్‌లోని మండవల్లి, కైకలూరు, కలిదిండి, ముదినేపల్లి మండలాల్ని గుడివాడ డివిజన్‌లో కలపాలి.
• బాపట్ల జిల్లాలోని అద్దంకి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చాలి.
• కొత్తగా అద్దంకి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేసి, ఆ నియోజకవర్గంలోని 5 మండలాలతోపాటు ముండ్లమూరు, తాళ్లూరు మండలాల్ని కలపాలి.
• దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల్ని కందుకూరు డివిజన్‌లో చేర్చాలి.
• బాపట్ల రెవెన్యూ డివిజన్‌లోని పర్చూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల్ని చీరాల రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలి.
• ఉదయగిరి నియోజకవర్గంలోని వరికుంటపాడు, కొండాపురం, జలదంకి, కలిగిరి, దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, సీతారామపురం మండలాల్ని కావలి డివిజన్‌లోకి తేవాలి. విడవలూరు, కొడవలూరు మండలాల్ని కావలి నుంచి నెల్లూరు డివిజన్‌కు మార్చాలి.
• వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల్ని గూడూరు డివిజన్‌లోకి తేవాలి.
• వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్ని శ్రీకాళహస్తి డివిజన్‌లో కలపాలి.
• చిత్తూరు జిల్లాలోని పలమనేరు నియోజకవర్గాన్ని మదనపల్లె జిల్లాలో కలపాలి.
• నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నిండ్ర మండలాల్ని తిరుపతి జిల్లాలోకి తేవాలి.
• వడమాలపేట, పుత్తూరు మండలాలను నగరి డివిజన్‌లో కలపాలి.
• నగరి డివిజన్‌లోని కార్వేటినగరం, పాలసముద్రం మండలాల్ని.. పలమనేరు డివిజన్‌లోని బంగారుపాళ్యం మండలాన్ని చిత్తూరు డివిజన్‌లో కలపాలి.
• మడకశిర, గుడిబండ, రోళ్ల, అమరాపురం, అగలి మండలాలతో మడకశిర కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు.
• కదిరి డివిజన్‌లోని అమడగూరు మండలాన్ని పుట్టపర్తి డివిజన్లలోకి తేవాలి.
• పుట్టపర్తి డివిజన్‌లోని గోరంట్ల మండలాన్ని పెనుగొండ డివిజన్‌లో కలపాలి.

రెండు, మూడు రోజుల్లో సమగ్ర నివేదిక: మంత్రి అనగాని

జిల్లా, రెవెన్యూ డివిజన్, మండలాల సరిహద్దుల్లో మార్పుచేర్పులపై రెండు, మూడు రోజుల్లో నివేదిక రూపొందించి సీఎం చంద్రబాబుకు అందిస్తామని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. సమావేశం అనంతరం మంత్రులు నాదెండ్ల మనోహర్, అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, రామానాయుడు తదితరులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. 'ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం, మదనపల్లె జిల్లాల ఏర్పాటుపై మంత్రివర్గ ఉపసంఘం సానుకూలంగా ఉంది. ఎమ్మెల్యేలు, వివిధ సంఘాలు, పెద్దల నుంచి వచ్చిన ప్రతి వినతిపై కూలంకషంగా చర్చించాం. జిల్లా, రెవెన్యూ డివిజన్లు, మండలాలకు మధ్య దూరాన్ని పరిశీలించాం. సమగ్ర నివేదిక తయారు చేస్తున్నాం. రాష్ట్రంలో 7- 8 కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలు అందాయి. ఇప్పటికే చిన్న జిల్లాలు అయ్యాయి. రెవెన్యూ డివిజన్లలో మార్పుచేర్పులు, కొత్త వాటి ఏర్పాటుపై వినతులు చాలా వచ్చాయి. చాలావాటికి ఆచరణలో సాధ్యమయ్యే పరిస్థితి లేదు' అని పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

6-11-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; శరదృతువు, కార్తిక మాసం, బహుళపక్షం
పాడ్యమి: సా. 4-51 తదుపరి విదియ
భరణి: ఉ. 8-40 తదుపరి కృత్తిక
వర్జ్యం: రా. 7-49 నుంచి 9-18 వరకు
అమృత ఘడియలు: తె. 4-44 నుంచి
దుర్ముహూర్తం: ఉ. 9-50 నుంచి 10-35 వరకు తిరిగి మ. 2-22 నుంచి 3-07 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.04; సూర్యాస్తమయం: సా.5.24
విశాఖ కార్తె

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రాజమహేంద్రవరం	36.0	23.5
నెల్లూరు	34.7	27.4
కర్నూలు	33.4	24.4
తాడేపల్లిగూడెం	33.0	28.0
నరసాపురం	33.0	25.0
కడప	33.0	24.0
తిరుపతి	32.8	24.1
విశాఖపట్నం	32.4	24.8
ఒంగోలు	32.1	26.9
గుంటూరు	32.0	27.0
విజయనగరం	32.0	25.0
అనంతపురం	32.0	23.5
శ్రీకాకుళం	32.0	23.0
విజయవాడ	31.9	23.6
ఆదిలాబాద్	31.8	19.7
హైదరాబాద్	30.6	23.4
మహబూబ్‌నగర్	30.5	23.1
కరీంనగర్	28.0	19.0

ఇదీ సంగతి!



పంట నష్టం నమోదు గడువు పొడిగింపు: అచ్చెన్నాయుడు

ఈనాడు డిజిటల్ శ్రీకాకుళం: మొంథా తుపాను కారణంగా జరిగిన పంట నష్టం నమోదును మరో 2 రోజులు పొడిగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. బుధవారం శ్రీకాకుళంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఈ-క్రాప్ నమోదు వంద శాతం పూర్తిచేశామని, తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందజేస్తామని తెలిపారు. ఈ- క్రాప్ నమోదు చేయలేదంటూ మాజీ సీఎం జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు.

నేడు డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై సమావేశం

ఈనాడు, అమరావతి: 'డేటా డ్రివెన్ గవర్నెన్స్'పై సీఎం చంద్రబాబు గురువారం మంత్రులు, కార్యదర్శులు, పోలీసు, అటవీ శాఖలకు చెందిన సీనియర్ అధికారులతో సమావేశం నిర్వహించనున్నారు. సచివాలయంలో మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఈ సమావేశం జరగనుంది. జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొంటారు.

8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పవన్ పర్యటన

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ 8, 9 తేదీల్లో తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. 8న చిత్తూరు జిల్లాలోని ఎర్రచందనం డిపోను సందర్శిస్తారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా- నిరోధంపై టాస్క్‌ఫోర్స్ అంశాలపై అటవీ శాఖ అధికారులతో సమీక్షిస్తారు. 9న పలమనేరులోని కుంకీ ఏనుగుల క్యాంపును పరిశీలిస్తారు.

ఏసీబీ కోర్టులో పాస్‌పోర్టు అప్పగించిన ఎంపీ మిథున్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి.. తన పాస్‌పోర్టును బుధవారం ఏసీబీ కోర్టులో అప్పగించారు. మద్యం కేసులో నిందితుడైన ఎంపీ.. షరతులతో కూడిన బెయిల్‌పై ఉన్నారు. న్యూయార్క్‌లో పర్యటించే పార్లమెంటరీ బృందంలో సభ్యుడైన మిథున్‌రెడ్డికి ఏసీబీ కోర్టు గత నెల 23 నుంచి ఈ నెల 4 వరకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతించింది. పర్యటన ముగియడంతో న్యాయస్థానంలో పాస్‌పోర్టును స్వాధీనం చేశారు.



వజ్రోత్సవాల వివరాలు వెల్లడిస్తున్న సూరపనేని శ్రీనివాస్, వీజేఎస్ కుమార్, కేఎస్ అప్పారావు, కొల్లి శ్రీనివాస్

డిసెంబరు 16 నుంచి ఏఎన్నార్ కళాశాల వజ్రోత్సవాలు

గుడివాడ, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లా గుడివాడలోని అక్కినేని నాగేశ్వరరావు కళాశాల వజ్రోత్సవాలను డిసెంబరు 16, 17, 18 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కళాశాల వజ్రోత్సవ కమిటీ చైర్మన్ కె.ఎస్.అప్పారావు, అధ్యక్షుడు కొల్లి శ్రీనివాస్, కార్యదర్శి సూరపనేని శ్రీనివాస్, ప్రిన్సిపల్ వీజేఎస్ కుమార్ తెలిపారు. కళాశాలలో బుధవారం వారు విలేకర్లతో మాట్లాడారు. కళాశాల గత 75 ఏళ్లుగా ఎంతో మందికి ఉన్నత విద్య అందించి, వారి భవితకు బంగారు బాటలు వేసిందని తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా డిసెంబరు 16న ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా రైతు సదస్సు నిర్వహిస్తామన్నారు. రెండోరోజు డిసెంబరు 17న రీయూనియన్ పేరుతో 75 ఏళ్లుగా కళాశాలలో చదివిన విద్యార్థుల సమావేశం జరుగుతుందన్నారు. మూడోరోజు వజ్రోత్సవ సభకు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, రామోజీ గ్రూప్ సంస్థల సీఎండీ చెరుకూరి కిరణ్, సినీ నటుడు అక్కినేని నాగార్జున, సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి హాజరై ప్రసంగిస్తారని చెప్పారు.


రోడ్డు దాటుతున్న కొండచిలువ

తిరుమల ఘాట్‌రోడ్డులో కొండచిలువ

తిరుమల, న్యూస్‌టుడే: అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్‌రోడ్డులో భారీ కొండచిలువ భక్తులను హడలెత్తించింది. వినాయకస్వామి ఆలయానికి సమీపంలో మంగళవారం రాత్రి దాదాపు పది అడుగులకు పైగా ఉన్న కొండచిలువ రోడ్డు దాటుతుండగా భక్తుల కంటపడింది. వెంటనే వాహనాల రాకపోకలు ఆపేయడంతో కొండచిలువ మెల్లగా రోడ్డు దాటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. అనంతరం వాహనాలను అనుమతించారు.



మీ ప్రయాణాన్ని ఇతరులతో పోల్చుకోకండి

లక్ష్యసాధనకు ఇతరుల కన్నా మీరు ఎక్కువ సమయం పడుతున్నంత మాత్రాన మీరు విఫలమవుతున్నట్టు అర్థం కాదు. ఇక్కడ ప్రతి ఒక్కరి ప్రయాణం, వారికి ఎదురయ్యే పరిస్థితులు భిన్నంగా ఉంటాయి. కాబట్టి మీ ప్రస్థానంపై మాత్రమే దృష్టి పెట్టండి. ప్రారంభ స్థానంతో పోలిస్తే, గమ్యానికి చేరువగా ఉన్నందుకు గర్వపడండి. అదే ఉత్సాహంతో ముందుకు సాగండి.

- లారెన్ జోసెఫ్, మార్కెటింగ్ కన్సల్టెంట్


అన్నవరం సత్యనారాయణ స్వామి గిరి ప్రదక్షిణలో సత్యదేవుడి రథం వెంట నడుస్తున్న భక్తజనం

వైభవంగా అన్నవరం సత్యదేవుడి గిరిప్రదక్షిణ

- 3 లక్షల మందికిపైగా భక్తుల హాజరు

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం సత్యనారాయణ స్వామి గిరి ప్రదక్షిణ బుధవారం వైభవంగా జరిగింది. కార్తిక పౌర్ణమి సందర్భంగా శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ ఉత్సవానికి తెలుగు రాష్ట్రాల నుంచి మూడు లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. సత్యదేవుడి నామస్మరణతో రత్న, సత్యగిరులు మార్మోగాయి. మధ్యాహ్నం రెండు గంటలకు అన్నవరం తొలిపావంచాల వద్ద గిరి ప్రదక్షిణ ఆరంభమైంది. ప్రధాన రహదారి, జాతీయరహదారి, బెండపూడి పోలవరం కాలువ గట్టు, పంపా సరోవరం మీదుగా గిరుల చుట్టూ 8.2 కిలోమీటర్ల మేర భక్తులు ప్రదక్షిణ చేశారు. సత్యదేవుడి


సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవారు

రథం ఊరేగింపు మూడున్నర గంటల పాటు సాగింది. బెండపూడి నుంచి అన్నవరం వరకు జాతీయ రహదారిపై ఒకవైపు మార్గంలో వాహనాల రాకపోకలను నిలిపేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చేశారు.

సత్యదేవుడి దర్శనానికి వేలమంది భక్తులు మంగళవారం రాత్రే కొండపైకి చేరుకున్నారు. వసతి గృహాలు నిండిపోవడంతో ఆలయ ఆవరణలోనే నిద్రించారు. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి వ్రతాలు మొదలుపెట్టారు. ఒంటిగంట నుంచే సర్వదర్శనానికి అనుమతించారు. భక్తులతో వ్రతమండపాలు, క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. బుధవారం ఉదయం 8.30 గంటలకు వీరవెంకట సత్యనారాయణ స్వామి, అనంతలక్ష్మీ సత్యవతీ దేవి అమ్మవార్ల పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. పోలీసులు సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షించి ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

ఏటిమొగ-ఎదురుమొండి వంతెనకు సాస్కీ నిధులు

- పంట నష్టం అంచనాలు త్వరితగతిన పూర్తిచేయాలి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశం

ఈనాడు, అమరావతి: కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గంలో ఏటిమొగ- ఎదురుమొండి హైలెవెల్ వంతెన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో సాస్కీ పథకంలో నిధులు కేటాయిస్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు, నియోజకవర్గ అభివృద్ధి తదితర అంశాలపై బుధవారం మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. 'కేంద్ర ప్రభుత్వ సహకారంతో అవనిగడ్డ ప్రాంతంలోని అవుట్‌ఫాల్ స్లూయిజ్‌ల సమస్యకు పరిష్కారం చూపుతాం. నిలిచిపోయిన అభివృద్ధి పనులు అటవీశాఖ అనుమతులతో ముందుకెళ్లేలా చర్యలు తీసుకుంటాం. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం అంచనాలు త్వరితగతిన పూర్తి చేయాలి. కృష్ణా జిల్లాలోనే 60 వేల మందికి పైగా సీసీఆర్సీ కార్డులు కలిగిన కౌలు రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. నష్టపోయిన ప్రతి కౌలు రైతుకూ న్యాయం చేయాలి' అని ఉపముఖ్యమంత్రి చెప్పారు.


అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలో తుపానుతో పంటనష్టం, అంచనాలు ఇతర అంశాలపై సమీక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్. చిత్రంలో ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు

★ 'అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని తీర ప్రాంతంలో కాలువలను సముద్రానికి అనుసంధానిస్తూ నిర్మించిన అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో దెబ్బతిన్నాయని, దీంతో నాగాయలంక, కోడూరు మండలాల్లో సుమారు 5 వేల ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని నా దృష్టికి వచ్చింది. సముద్రం పోటెత్తినప్పుడల్లా ఉప్పు నీరు పొలాలను ముంచెత్తుతోందని రైతులు చెబుతున్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో స్లూయిజ్‌ల పునరుద్ధరణకు ప్రస్తుతం రూ.50 కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. నియోజకవర్గ పరిధిలో మొత్తం ఏడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లు పునర్నిర్మించాల్సి ఉంది. జాతీయ విపత్తుల నిర్వహణ నిధి నుంచి కేటాయింపులు చేసి నిర్మాణాలు పూర్తి చేస్తాం. అవసరమైతే దిల్లీ వెళ్లి కేంద్ర పెద్దలతో మాట్లాడతా.

★ ఎదురుమొండి- గొల్లమంద మధ్య రహదారి నిర్మాణానికి పంచాయతీరాజ్‌శాఖ నుంచి రూ.13.88 కోట్లు కేటాయించాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. రోడ్డులో అటవీ భూమి కొంత కలిసి ఉన్నందున పని నిలిచిపోయింది. అటవీశాఖ అధికారులు, కలెక్టర్ కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. హంసలదీవి పవిత్ర సాగర సంగమ ప్రాంతానికి ప్రజలు వెళ్లేందుకు అటవీశాఖ అధికారులు రుసుములు వసూలు చేస్తున్నారని తెలిసింది. భక్తుల మనోభావాలకు సంబంధించిన ఈ అంశంలో ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి' అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రోడ్లు, భవనాలశాఖ ముఖ్య కార్యదర్శి కృష్ణబాబు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్, అటవీ, వ్యవసాయశాఖల ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

తిరుమలలో వసతి పెంచలేం

- తిరుపతిలో 25 వేల మందికి వసతి కల్పించేలా భవనాలు
- కొండపైకి బస్సుల్లో తీసుకెళ్లి దర్శనం చేయిస్తాం
- లడ్డూ ప్రసాద నాణ్యత పెంచాం
- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు


సమావేశంలో మాట్లాడుతున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో బోర్డు సభ్యులు

ఈనాడు, హైదరాబాద్: తిరుమలలో దర్శనాలు సహా వాణిజ్య దుకాణాల విషయంలో వైకాపా ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా వ్యవహరించారని.. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరుమల పవిత్రతను కాపాడటంతో పాటు సామాన్య భక్తులకు సత్వర దర్శనం, లడ్డూల నాణ్యత పెంచడం లాంటి అనేక చర్యలు తీసుకున్నామని తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తితిదే పాలకమండలి బాధ్యతలు చేపట్టి బుధవారంతో సంవత్సరం పూర్తయిన సందర్భంగా బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, నన్నూరి నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి, అనుగోలు రంగశ్రీతో కలిసి హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'తిరుమల కాంక్రీట్ జంగిల్‌లా మారకుండా చూడాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రస్తుతం తిరుమలలో ఉన్న 68 శాతం పచ్చదనాన్ని 80 శాతానికి పెంచుతాం. వసతి కోసం అదనంగా భవనాలను కట్టడం కుదరదు. అందుకే కింద (తిరుపతిలో)50 ఎకరాల భూమి చూశాం. 25వేల మంది వసతికి సరిపడా అన్ని సదుపాయాలతో పెద్ద కాంప్లెక్స్‌లను కట్టే ప్రతిపాదన ఉంది. అక్కడి నుంచే భక్తులను బస్సుల్లో తిరుమలకు తీసుకెళ్లి దర్శనం చేయించి తిరిగి కిందికి తీసుకువచ్చే ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం' అని తితిదే ఛైర్మన్ వివరించారు.

ఏఐ టెక్నాలజీతో సత్వర దర్శనం

'మొదటి సమావేశంలోనే అన్యమతస్తులను తొలగించాలని నిర్ణయం తీసుకున్నాం. ఏఐ టెక్నాలజీతో రెండు గంటల్లోనే సాధారణ భక్తులకు దర్శనం చేయిస్తాం. లడ్డూ, అన్నప్రసాదంలో నాణ్యత పెంచాం. వైకాపా హయాంలో తిరుమలలో అక్రమంగా 1,500 వాణిజ్య దుకాణాల్ని కేటాయించారు. తిరుమల పవిత్రతపై ప్రభావం పడుతుండటంతో వాటిని తొలగించాలని రెవెన్యూశాఖకు చెప్పాం. గత ప్రభుత్వ హయాంలో తిరుపతిలో ముంతాజ్ హోటల్‌కు కేటాయించిన 20 ఎకరాల భూముల లీజును రద్దుచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాం.'

రేణిగుంట ఎయిర్‌పోర్టు పేరును శ్రీ వేంకటేశ్వర ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుగా మార్చే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపనుంది. అని బీఆర్ నాయుడు వివరించారు. బోర్డు సభ్యుల దర్శన కోటాను గణనీయంగా తగ్గించుకుని, సామాన్యులకు పెద్దపీట వేసేందుకు తితిదే చరిత్రలో ఏ బోర్డూ చేయనన్ని మంచి నిర్ణయాలు తీసుకున్నట్లు సభ్యులు పనబాక లక్ష్మి, నర్సిరెడ్డి, మహేందర్‌రెడ్డి తెలిపారు.

గీత దాటితే కఠిన చర్యలు తప్పవు

- 15లోపు నియోజకవర్గ స్థాయి వరకు కమిటీల ఏర్పాటు పూర్తిచేయాలి
- పార్టీ నాయకులతో పల్లా శ్రీనివాసరావు టెలికాన్ఫరెన్స్

ఈనాడు, అమరావతి: కొందరు నాయకుల వ్యవహార శైలితో తెదేపాకు చెడ్డపేరు వస్తోందని. . ఇక నుంచి ఇలాంటి చర్యల్ని ఉపేక్షించబోమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గీత దాటితే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 15వ తేదీ లోపు గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు అన్ని పార్టీ కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో పార్టీ అధినేత ఎదుట హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు. తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా, జోనల్, లోక్‌సభ,



అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యులు, నేతలతో పల్లా శ్రీనివాసరావు బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇక నుంచి ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో వినతుల స్వీకరణ, అనంతరం స్థానిక నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. "మంగళవారం మంత్రి లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బారుకు 4వేల మందికి పైగా వచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కారం అయితే ప్రజలు ఇంతదూరం ఎందుకు వస్తారు? ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం పార్టీ నాయకుల బాధ్యత. శ్రేణుల్ని సమన్వయం చేసుకోవాలి" అని తెలిపారు. కూటమి నేతల మధ్య విభేదాలు సృష్టించేందుకు వైకాపా ప్రయత్నిస్తోందని.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాస్తవాల్ని ప్రజలకు తెలియజేయాలి అని పల్లా శ్రీనివాసరావు సూచించారు.

పక్షివాహన.. పరమపావన

తిరుమలలో ఘనంగా కార్తిక పౌర్ణమి గరుడసేవ

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి ఆలయంలో బుధవారం కార్తిక పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్పస్వామి తనకు ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు జరిగిన గరుడసేవలో పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


గరుడునిపై కొలువుదీరిన శ్రీమలయప్పస్వామి


శ్రీమలయప్పస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శ్రీశైల మల్లన్నకు జ్వాలా తోరణోత్సవం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లాలోని శ్రీశైల మహాక్షేత్రంలో కార్తిక మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శ్రీమల్లికార్జునస్వామికి బుధవారం రాత్రి 7 గంటలకు జ్వాలా తోరణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ గంగాధర మండపం వద్ద నూలు ఒత్తులను నెయ్యితో తడిపి తోరణాన్ని ఏర్పాటుచేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులు, నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, దేవస్థానం ఛైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, ఈవో శ్రీనివాసరావు దంపతులు జ్వాలా తోరణాలు వెలిగించారు. వేలమంది భక్తులు ఉత్సవాన్ని తిలకించారు.


జ్వాలా తోరణోత్సవంలో భక్తులు


ఈనాడు

బిహారీల ఎదురుచూపులు ఫలిస్తాయా?

బుద్ధుడి కాలంలో నిజాయతీ, నిష్పాక్షికత కలిగిన వారిని గణ సంఘాల ఎన్నికల బాధ్యతలు చూసే 'శలాక గహాపక' అనే పదవిలో నియమించేవారు. ఒక రకంగా అది ఈనాటి ఎలక్షన్ కమిషనర్ వంటిది. ఇలా ప్రపంచం మొత్తమ్మీద ప్రజాస్వామ్యం పాదుగొన్న మొట్టమొదటి ప్రాంతాల్లో ఒకటిగా (లిచ్ఛావి గణతంత్రం, వైశాలి) గుర్తింపు పొందిన బిహార్- స్వతంత్ర భారతంలో కొన్ని దశాబ్దాల పాటు 'అరాచక రాజ్యం'గా పరువుమాసింది. జనాభా పరంగా మూడో అతిపెద్ద రాష్ట్రమైన అది పేదరికం కోరల్లోంచి బయటపడలేక ఇప్పటికీ అల్లాడుతోంది. మానవాభివృద్ధి సూచీలో మిగిలిన రాష్ట్రాల కంటే అట్టడుగున ఉన్న బిహార్‌లో జనజీవితాలకు సరికొత్త ప్రగతి వెలుగులు అద్దుతామంటూ పోటాపోటీ ప్రతిజ్ఞలెన్నో చేసిన పార్టీల ప్రచార హోరు సద్దుమణిగింది. 243 స్థానాలు కలిగిన ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికల్లో భాగంగా నేడు 121 చోట్ల తొలిదశ పోలింగ్ జరగనుంది. 2020 ఎలక్షన్లలో వీటిలోని దాదాపు అరవైశాతం సీట్లు గెలుచుకున్న ఎన్డీయేనే మళ్ళీ విజయధ్వజాన్ని ఎగరేస్తుందా? 'మార్పు' నినాదంతో బరిలోకి దిగిన 'మహా గఠ్‌బంధన్' కూటమి ఏమైనా చరిత్రను తిరగరాస్తుందా? కొత్తగా బరిలోకి దిగిన ప్రశాంత్ కిశోర్ జన్‌సురాజ్ పార్టీ ఎవరి ఓట్లకు గండికొట్టనుంది? ఈ ప్రశ్నలకు సమాధానాలిచ్చే ప్రజాతీర్పు వెలువడే నవంబర్ 14కోసం దేశమంతా అమితాసక్తితో ఎదురుచూస్తోందిప్పుడు!

పొట్టకూటికోసం వలసలు పోవాల్సిన దుస్థితిని పరిమార్చి స్వరాష్ట్రంలోనే తమకు ఉపాధి అవకాశాలను కల్పించాలని బిహారీలు, ముఖ్యంగా అక్కడి యువత గట్టిగా గళమెత్తుతోంది. వారి కలలను నిజం చేసేందుకుగానూ తాము గెలిస్తే వచ్చే అయిదేళ్లలో కోటి సర్కారీ కొలువులను కల్పిస్తామని ఎన్డీయే ప్రతిన పూనింది. అంతేనా! మేమొస్తే ఇంటికొక ప్రభుత్వ ఉద్యోగాన్ని ఇస్తామని 'మహా గఠ్‌బంధన్' ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్ వరదానం చేశారు. 2.97కోట్ల కుటుంబాలు కలిగిన బిహార్‌లో ఈ హామీని నిజంగా అమలు చేయాలంటే- రక్షణ బలగాల సిబ్బంది కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల(సుమారు 2.15కోట్ల మంది) కంటే ఎక్కువ మందిని ఈ ఒక్క రాష్ట్ర సర్కారీ యంత్రాంగంలోనే కొలువుతీర్చాలి! అంతమందికి కనీస మొత్తంలో జీతాలివ్వడానికే ప్రస్తుత బిహార్ బడ్జెట్‌కు రెట్టింపు స్థాయిలో నిధులు కావాలి! 2023 కులగణన ప్రకారం, ఎనభై లక్షల మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే ఉన్న ఆ రాష్ట్రంలో కోట్లాది సర్కారీ కొలువుల భర్తీ అసలెలా సాధ్యం? తాయిలాల ప్రకటనలతో ఓటర్లను బుట్టలో వేసుకోవాలనే రాజకీయ ఎత్తుగడలు ఎంతమేరకు సమర్థనీయం?

ఉపాధిని వెతుక్కుంటూ బిహార్‌లో పురుషులు పెద్దసంఖ్యలో పరాయి రాష్ట్రాలకు వెళ్తుంటారు. స్థానికంగా ఉంటూ కుటుంబ బాగోగులను తమ భుజానమోసే స్త్రీలే ఎలక్షన్ ఫలితాలను ఎక్కువగా శాసిస్తారు. అందుకోసమే అధికార, ప్రతిపక్షాలు మహిళల ఓట్లపై గురిపెట్టి పలు సంక్షేమ పథకాలను ప్రకటించాయి. కానీ, వాస్తవ మహిళా సాధికారతకు తోడ్పడే పాలనాధికారంలో వారికి సముచిత భాగమివ్వడంపై మాత్రం ఎవరూ దృష్టిసారించలేదు. పోలింగ్ రెండు దశల్లో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 204 స్థానాల్లో పోటీచేస్తున్న ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు 12.69 శాతం టికెట్లనే స్త్రీలకు ఇచ్చాయి. 202 సీట్లలో బరిలోకి దిగిన జేడీయూ, భాజపాలు 12.87శాతం అభ్యర్థిత్వాలనే మహిళలకు కేటాయించాయి. చట్టసభల్లో మూడో వంతు స్థానాలు స్త్రీలకు దక్కాలన్న ఆదర్శాలు ఇలా నీరుగారిపోయాయి. కుల సమీకరణాలూ నేరచరిత నేతల ప్రభావం ఎక్కువగా ఉండే రాజకీయాలకు ఆలవాలమైన బిహార్‌లో శాంతిభద్రతలు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. మౌలిక సదుపాయాల విస్తరణ, ఉపాధికల్పనలతో తమ రాష్ట్రం నిజమైన అభివృద్ధికి నోచుకోవాలన్నది సగటు బిహారీల ఆకాంక్ష! దాన్ని సాకారం చేసేందుకు చిత్తశుద్ధితో పరిశ్రమించడమే ఈ ఎన్నికల్లో విజయ వరమాలను అలంకరించుకోబోయే పార్టీల లక్ష్యం కావాలి!




ప్రపంచ సమస్యలన్నీ ఏదో ఒక రకమైన అసమానతల ఫలితమే. పేదరికం అంటే డబ్బు లేకపోవడమే కాదు, అవకాశాలను దూరం చేయడం... మనిషి తన పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోలేకపోవడం.

– అమర్త్య సేన్

కబీర్ మార్గం

కాశీ నగరంలో పుట్టిన గొప్ప సంఘసంస్కర్తలలో కవి సంత్ కబీర్ దాస్ ఒకరు. ఆయన తల్లిదండ్రులెవరో తెలియదు. చెరువు ఒడ్డున దొరికిన పసి పిల్లాణ్ని చేనేత కార్మికులైన నీరూ- నీమా అనే దంపతులు కబీర్ అన్న పేరు పెట్టి పెంచుకున్నారు. కబీర్ భార్య లోయి అనీ, వారికి కమాల్, కమాలి అనే కొడుకూ కూతురూ కలిగారని- కథ ప్రచారంలో ఉంది. కబీర్ దాసు గురువు రామానందుడు.

కబీర్ దాసులో ఆధ్యాత్మికత మెండు. తత్వశాస్త్రాన్ని అలవోకగా చెప్పేవాడు. అద్వైత వాదాన్ని అత్యంత సరళంగా విడమర్చి చెప్పిన మేధావి. పరమాత్మ అంశే ఆత్మ అని, తన దోహాల్లో వివరించి చెప్పాడు. నీళ్లతో నిండిన కుండ చెరువు నీటిలో పడి పగిలితే, కుండలోని నీళ్లు చెరువు నీటిలో ఎలాగైతే కలిసిపోతాయో అలాగే ఆత్మ పరమాత్మతో మమేకమవుతుందన్నాడు. నిరాకారుడైన పరమాత్ముడి అంశ ప్రతి జీవిలో ఉంటుందని, కానీ జీవి తనలోని భగవత్ స్వరూపాన్ని తెలుసుకోలేక నాలుగు దిక్కులా ఆయన కోసం వెతుకుతున్నాడని మరో దోహాలో చెబుతాడు. మాయ కారణంగా పరమాత్మతో ఆత్మ కలయికలో ఇబ్బందులు ఏర్పడతాయని, వాటిని తొలగించుకోవడానికి జ్ఞానం తోడ్పడుతుంది కాబట్టి జ్ఞానమే మోక్షానికి మార్గమని కబీర్ వివరిస్తాడు. తన బోధనలతో ప్రజల్లో అచంచలమైన భక్తి భావాన్ని పెంపొందింపజేసిన భక్త కవి కబీర్ దాస్.




అంతర్యామి

కబీర్ బోధనలన్నింటిని 'బీజక్' పేరుతో ఆయన శిష్యుడు ధర్మదాస్ లిపిబద్ధం చేశాడు. కబీర్ తన రచనల్లో ధార్మికచింతన గురించి వివరించడమే కాకుండా, సామాజిక వ్యవహారాలను ఎలా చక్కబెట్టుకోవాలో కూడా సూచించాడు. నీతి-నియమం, పరోపకారం, మనసుపై నియంత్రణ, మధుర భాషణ, సహనశీలత, సేవానిరతి, త్యాగం, గురువు, దైవం తదితరాలన్నిటి గురించి సులభంగా అర్థమయ్యేలా దోహాలు రాశాడు. కులవ్యవస్థ, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గళం విప్పి, సమాజాన్ని సన్మార్గంలో నడిపించడానికి కృషి చేశాడు. పరమాత్ముడి కృపతో లభించిన జీవితాన్ని సార్థకం చేసుకోవాలని చెబుతూనే, విమర్శించే వాళ్లని ఎప్పుడూ దూరం చేసుకోవద్దని సలహా ఇస్తాడు. మన లోపాలను ఎత్తిచూపి సరైన మార్గంలో ముందుకు పోవడానికి సహాయపడేది వాళ్లేనంటాడు. చాలామంది పెద్ద పెద్ద గ్రంథాలు చదువుతూ జీవితాలను గడిపేశారు కానీ పండితులు కాలేకపోయారనీ, అదే రెండున్నర అక్షరాల ప్రేమను ఎవరైతే అర్థం చేసుకున్నారో వాళ్లే నిజమైన పండితులనీ కబీర్ చాటాడు. కబీర్ దార్శనికతతో ప్రభావితులైన రవీంద్రనాథ్ ఠాగూర్ ఆయన రచనలను కొన్నింటిని ఆంగ్లంలోకి అనువదించారు.

దాదాపు నూట ఇరవై సంవత్సరాలు జీవించిన కబీర్ దాస్ ఆధ్యాత్మిక చింతనతో సామాజిక స్పృహను, మానవతా విలువలను ఎలుగెత్తి చాటిన సామాజిక తత్వవేత్త. ఆయన బోధనలను అనుసరించేవారే 'కబీర్ పంథీలు'. దేశం నలుమూలల 'కబీర్ పంథ్' శాఖలు ఉన్నాయి.

– డాక్టర్ నరసింహారావు కల్యాణి

స్టార్టప్ మహారాణులు!



పితృస్వామ్య వివక్షను అధిగమించి మహిళలు స్టార్టప్‌లు ఏర్పాటు చేసి పదిమందికీ ఉపాధి కల్పిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రం అందుకు చక్కని ఉదాహరణ. స్టార్టప్‌ల ఏర్పాటులో ఈ రాష్ట్రం దేశంలో మూడోస్థానంలో ఉంది. ఇక్కడి మొత్తం 12 వేల స్టార్టప్‌లలో 57శాతం మహిళలు నెలకొల్పినవేనని ఆ రాష్ట్ర ప్రణాళికా సంఘం తాజా నివేదిక వెల్లడించింది. తమిళనాడులో 2018లో మహిళా స్టార్టప్‌లు కేవలం 111 ఉండేవి. ఇప్పుడవి ఆరు వేలకు మించిపోయాయి. ఈ మార్పు ఎలా సాధ్యమైందంటే...

ఒక స్టార్టప్ ఏర్పాటు చేయాలంటే ఎంతో గుండెధైర్యం, నైపుణ్యాలు ఉండాలి. సమయస్ఫూర్తితో పెట్టుబడులు పెట్టాలి. తమిళనాడు మహిళల్లో అవి మెండుగా ఉన్నాయి. స్టార్టప్‌లకు యజమానులైన మహిళల్లో 50శాతం ఇతరత్రా కంపెనీల్లో పనిచేసి, అనుభవాన్ని కూడగట్టుకున్నారు. పారిశ్రామిక జ్ఞానాన్ని పొంది, ప్రొఫెషనల్ నెట్‌వర్క్, మార్కెటింగ్ మెలకువలు నేర్చుకుని స్టార్టప్‌లు నెలకొల్పుతున్నారు. వీరి సమర్థత చూసి పెట్టుబడులూ అందివస్తున్నాయి. తాజాగా కోయంబత్తూరులో జరిగిన 'గ్లోబల్ స్టార్టప్ సమ్మిట్'లో మహిళా స్టార్టప్‌లతో రూ.127కోట్ల విలువైన ఒప్పందాలు కుదిరాయి. ఫిన్‌టెక్ సంస్థలు ఎక్కువ పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం తమిళనాడులో ఐటీ, ఆరోగ్యం, వ్యవసాయం, ఫుడ్‌ప్రాసెసింగ్, హ్యాండీక్రాఫ్ట్, టెక్స్‌టైల్, తయారీ, గ్రీన్ టెక్నాలజీ తదితర రంగాల్లో మహిళా సారథ్య స్టార్టప్‌లు విస్తరించాయి. చెన్నై, కోయంబత్తూరు లాంటి పెద్దనగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోనూ అవి ఏర్పాటవుతున్నాయి. కొన్ని స్టార్టప్‌లైతే ప్రభుత్వ టెండర్లకూ పోటీపడుతున్నాయి.



బలమైన విధానాలు

తమిళనాడులో చిన్న వయసులోనే మహిళలు స్టార్టప్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవలి ప్రభుత్వ సర్వే ప్రకారం స్టార్టప్‌లు నెలకొల్పుతున్న మగవారి కనీస వయసు 31 ఏళ్లు. స్త్రీల విషయానికొస్తే 21 ఏళ్లవారూ స్టార్టప్‌లు ప్రారంభిస్తున్నారు. మహిళల సారథ్యంలోని 40 శాతానికి పైగా సంస్థలను 35ఏళ్లలోపు వారే నెలకొల్పారు. వీరంతా భవిష్యత్తులో ఉన్నతస్థానాలకు చేరే అవకాశాలు మెరుగవుతాయని ప్రణాళికా సంఘం నివేదిక పేర్కొంది. సమాజాభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని, స్వతంత్రంగా సత్తా చాటుకోవాలని, సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపాలని, సాటి మహిళల స్థితిగతుల్లో మార్పు తేవాలనే ఆకాంక్షతో స్టార్టప్‌లు నెలకొల్పుతున్న వనితలు తమిళనాడులో ఎక్కువగా ఉంటున్నారు. తమ సంస్థల్లో ఉద్యోగావకాశాల్లో మహిళలకే వీరు అధిక ప్రాధాన్యమిస్తున్నారు.

తమిళనాడులో మహిళా స్టార్టప్‌లకు మొదట్లో పెట్టుబడుల సమస్య తలెత్తింది. దాంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పలు విధానాలు స్త్రీల విజయాలకు పునాది వేశాయి. మహిళల హక్కులు, స్వేచ్ఛను కాపాడేందుకు ప్రత్యేక పాలసీ తెచ్చారు. మరోవైపు స్టార్టప్‌ల ఏర్పాటును సులభతరం చేసేందుకు రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ పాలసీలో మార్పులు చేశారు. ద్వితీయ, తృతీయశ్రేణి నగరాల్లో సాఫ్ట్‌వేర్ స్టార్టప్‌ల వృద్ధికి అది తోడ్పడుతోంది. గ్రామీణంలో స్టార్టప్‌లు ఏర్పాటుచేసిన యువతులు, మహిళలకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు టీఎన్‌రైజ్ పథకం కింద 'విమెన్ స్టార్టప్ కౌన్సిల్'ను ఏర్పాటు చేశారు.

సులువుగా రుణాలు పొందేందుకు, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపరిచేందుకు అది వారికి అండగా నిలుస్తోంది. ఒత్తిళ్లను అధిగమించడం, మానసిక ఆరోగ్య పరిరక్షణపైనా నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. స్టార్టప్‌ల వృద్ధికోసం తెచ్చిన 'స్టార్టప్‌టీఎన్' విభాగం నిధుల సమీకరణకు దన్నుగా నిలుస్తోంది. 71శాతం మహిళా స్టార్టప్‌లు దీని ద్వారానే నిధులు పొందాయి. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వమూ బడ్జెట్లో ప్రత్యేక కేటాయింపులు చేస్తోంది. మహిళా స్టార్టప్‌లకు ఈ ఏడాది రూ.20కోట్లు కేటాయించింది. తమిళనాడు స్టార్టప్ సీడ్ ఫండ్ (తన్‌సీడ్) పథకం కింద మరో 50శాతం నిధులను అదనంగా ఇస్తున్నారు. తాజాగా తమిళనాడు స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ మిషన్ కింద రూ.100కోట్లను ప్రకటించారు. ఇవన్నీ భవిష్యత్తులో మరిన్ని స్టార్టప్‌లు వచ్చేందుకు బాటలు వేస్తున్నాయి.

తమిళనాడు అడుగుజాడలివి...

- తన్‌సీడ్ కింద కొత్త మహిళా స్టార్టప్‌లకు రూ.15లక్షలు అందిస్తున్నారు. ఈ పథకం కింద 25శాతం నిధులను ప్రత్యేకంగా మహిళల కోసమే కేటాయించారు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలశాఖ స్టార్టప్‌లు నెలకొల్పే మహిళలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించింది. లబ్ధిదారుకు రూ.15 లక్షలు ఇస్తున్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాల్లో రాయితీపై సేవలు అందిస్తున్నారు.
- గ్రామీణంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు స్టార్టప్‌లు పెట్టేలా 'స్మార్ట్ ఎస్‌హెచ్‌జీ', వాళ్న్‌దుమ్ కాట్టువోం(జీవించి చూపిద్దాం) పథకాలు తెచ్చారు. ఇందులో భాగంగా శిక్షణతో పాటు నిధుల సేకరణకు సహకరిస్తున్నారు. గ్రాంట్లు అందిస్తున్నారు.
- ఐటీ, తయారీ, సేవలు తదితర రంగాల్లో స్టార్టప్‌లు పెట్టే మహిళలకు నాన్ ముదల్వన్ (నేనే ప్రథమం) పథకం కింద నైపుణ్యాలు నేర్పిస్తున్నారు.
- మహిళలు పారిశ్రామికవేత్తలుగా, స్టార్టప్ నిర్వాహకులుగా ఎదిగేందుకు, విద్య, సాంకేతికత శిక్షణ అందించేందుకు పుదుమై పెణ్ (నవతరం మహిళ) పథకం తెచ్చారు.
- తమిళనాడు స్టార్టప్ అండ్ ఇన్నోవేషన్ మిషన్(తన్‌సిమ్)లో భాగంగా ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేక నిధిని కేటాయించారు. విడతలవారీగా రుణ సాయానికి తమిళనాడు చిన్నతరహా పారిశ్రామికాభివృద్ధి కార్పొరేషన్ కృషి చేస్తోంది.
- ఎస్సీ, ఎస్టీ మహిళలు స్టార్టప్‌లు ఏర్పాటు చేసుకునేందుకు 'అన్నల్ అంబేడ్కర్ బిజినెస్ ఛాంపియన్స్' పథకం కొనసాగుతోంది. తయారీ, రిటైల్ సామర్థ్యాల్ని పెంచుకునేలా స్టార్టప్‌లను విస్తృతం చేసుకునేందుకు ఇందులో ప్రత్యేక నిధిని కేటాయించారు.
- మహిళలకు ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేశారు. చెన్నై, తిరువళ్లూరు, కాంచీపురం, తిరుచ్చి, సేలం జిల్లాల్లో సబ్సిడీతో స్థలాలను లీజ్‌కు ఇవ్వడంతో పాటు తయారీ, రవాణా వసతులు కల్పిస్తున్నారు.

అన్ని రాష్ట్రాలు ఇలా ప్రత్యేక చొరవ తీసుకుంటే మహిళలు పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి అవకాశాలు విస్తారతాయి. దేశాభివృద్ధిని అవి వేగవంతం చేస్తాయి.

– బి.హిదాయతుల్లాహ్



చెట్ల తీర్థం

వనభోజనాలనే మాట కార్తిక మాసంలో బాగా వినపడుతుంది. ప్రకృతి ఒడిలో ఊరు ఊరంతా ఆనందంగా సేదతీరే సందర్భం అది. ఈ పండుగనే కొన్ని ప్రాంతాల్లో 'చెట్ల తీర్థం' అంటారు. ఫలానా రోజున పండుగ అని ఊళ్లో చాటింపు వేయగానే సందడి మొదలయ్యేది. వయసుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరిలో ఆనందం ఉరకలు వేసేది. వంటకు కావాల్సిన వస్తువులన్నీ సిద్ధం చేసుకుని గంపలో పెట్టుకుని, ఊరంతా జాతరలా చెట్ల కిందికి కదిలేది. పంటపొలాలు, దేవాలయ ప్రాంగణాలు, కొండల పక్కన, మామిడి, కొబ్బరిలాంటి తోటలు... ఒక్కసారిగా మనుషులతో కళకళలాడిపోయేవి. ఊరి జనమంతా ఒకే దగ్గర కనిపించే అరుదైన సందర్భం అది.

మూడు బండరాళ్లను వెతికి తెచ్చి పొయ్యి పెట్టి దానికి పసుపు కుంకుమలు రాసి వంట ప్రారంభించేవారు. వంటచెరుకు ఏరుకురావడం, కూరలు కోయడం, వంటచేయడం... ఆడామగా అని లేకుండా అందరూ తలా ఒక చేయి వేసి భోజనాలు సిద్ధం చేసేవారు. ఆ వంటల ఘుమఘుమలు గాల్లో తేలివచ్చి ముక్కుపుటాలకు తాకితే కానీ ఆరుబయట ఆటల్లో మునిగిన పిల్లలకు ఆకలి తెలిసేది కాదు. దోస్తులంతా జట్లు జట్లుగా వరసగా కూర్చుని కబుర్లు చెప్పుకొంటూ భోజనం చేయడం భలే సరదాగా ఉండేది. వంట మొత్తం పూర్తయ్యాక ముందుగా ప్రకృతిమాతకు దండం పెట్టుకుని ఆ తరవాత భోజనాలు చేసేవాళ్లం. కాసేపు చెట్ల కింద నడుం వాల్చి కబుర్లతో కాలక్షేపం చేసి సూర్యాస్తమయానికి ఇళ్లకు చేరుకునేవాళ్లం. చెట్ల నీడ, సాయంకాలపు గాలుల చల్లదనం, బంధుమిత్రుల పలకరింపుల్లో ఆత్మీయత.. మొత్తంగా తనువూ మనసూ పులకరించి చిరకాలం గుర్తుండిపోయే చక్కటి అనుభవం చెట్ల తీర్థం. రోజువారీ పనుల్లో అలసిసొలసిన పెద్దలకు ఇదోరకమైన రిలీఫ్‌ని ఇస్తే- పిల్లలకు ప్రకృతి పట్ల ప్రేమ, గౌరవం, అవగాహన పెరిగేవి. అలాంటిది ఇప్పుడు అన్ని విషయాల్లో లాగే ఈ పండుగ విషయంలోనూ మార్పు వచ్చింది. చాలా చోట్ల ఊరంతా కలిసి కులమతాలకు అతీతంగా పండుగ జరపడమే మానేశారు. వేగంగా మారుతున్న జీవన విధానం మనిషిని ప్రకృతికి దూరంగా వర్చువల్ ప్రపంచంలో బతికేలా చేస్తోంది. ఊరంతా ఒక్కచోట కలుసుకుని మంచి చెడ్డలు మాట్లాడుకున్నదీ వాట్సప్ గ్రూపుల్లో గుడ్ మార్నింగ్‌లు చెప్పుకొన్నదీ ఒకటవుతుందా?

వనభోజనాలు ఒక సంప్రదాయం మాత్రమే కాదు, అదొక జీవనశైలి. కేవలం కడుపు నింపుకొనే కార్యక్రమం కాదు. హృదయాలను జ్ఞాపకాలతో నింపుకొనే ఆత్మీయ కలయిక. మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించే వేడుక. ప్రకృతితో మమేకమై, సమూహంతో కలిసి మెలిసి గడిపే ఇలాంటి సందర్భాలను కొనసాగించాలి. అందుకు అందరూ తలో చేయి వేయాలి. సమష్టి కుటుంబాలు మాయమయ్యాయి. సమష్టి జీవనాన్ని కూడా మరిచిపోతే మనిషి సంఘజీవి అన్నమాటకు అర్థం కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే వీలైనంత త్వరగా వనభోజనం ఏర్పాటు చేసుకోండి. పరిచయాలను, బంధుత్వాలను అప్‌డేట్ చేసుకోండి.

– సందరగిరి రమ్య

చిన్నారులపై ఆగని దాష్టీకాలు

దేశీయంగా చిన్నారులపై దారుణ నేరాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పిల్లల అపహరణ, అక్రమ రవాణా, వారితో వెట్టిచాకిరీ చేయించడం, బాల్య వివాహాలు, లైంగిక దాడులు తదితరాలకు సంబంధించి 2023లో దేశవ్యాప్తంగా 1.77 లక్షల కేసులు వెలుగుచూశాయి. ఆ ఏడాది చిన్నపిల్లలపై దాష్టీకాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో 2,844 కేసులు, తెలంగాణలో 6,113 కేసులు దాఖలయ్యాయి. ఇతర రాష్ట్రాల్లో, యూటీల్లో నమోదైన కేసులు ఎన్నంటే...

మధ్యప్రదేశ్	22,393
మహారాష్ట్ర	22,390
ఉత్తర్ ప్రదేశ్	18,852
రాజస్థాన్	10,577
అస్సాం	10,174
బిహార్	9,906
కర్ణాటక	8,929
పశ్చిమ్ బెంగాల్	8,853
ఒడిశా	8,577
దిల్లీ	7,769
తమిళనాడు	6,968
హరియాణా	6,401
ఛత్తీస్‌గఢ్	5,904
కేరళ	5,903
గుజరాత్	5,083

(ఆధారం: ఎన్‌సీఆర్‌బీ నివేదిక)

ప్రాణాలు తోడేస్తున్నా పట్టదేం?

ప్రపంచవ్యాప్తంగా ఏటా 69శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు కేవలం 20 దేశాల నుంచే వస్తున్నాయి. ఒక్క అమెరికాయే తలసరిన ఏటా 130 కిలోల ప్లాస్టిక్ వ్యర్థాలను వెలువరిస్తోంది. భారత్ విషయంలో అవి 0.12 కిలోలు. ప్రపంచవ్యాప్తంగా అరవై శాతం ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిలో పూడ్చిపెడుతున్నారు. కొంత శాతం వ్యర్థాలను తగలబెట్టినా మిగిలినవి పర్యావరణంలో కలిసిపోతున్నాయి. ఏటా ఎనభై లక్షల టన్నుల ప్లాస్టిక్ సముద్రాల్లోకి చేరుతోంది. 2040కల్లా అది అంతకు నాలుగు రెట్లకు పెరుగుతుందన్న విశ్లేషణలు భయపెడుతున్నాయి. సూక్ష్మ ప్లాస్టిక్‌లు ఆహారం, నీరు, గాలి ద్వారా మానవ శరీరంలోకి చేరుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తి కర్బన ఉద్గారాలకు దారితీసి వాతావరణ మార్పులను కలిగిస్తోంది. 2030కల్లా బొగ్గు వల్ల కంటే ప్లాస్టిక్‌తోనే ఉద్గారాలు ఎక్కువగా వెలువడతాయన్న విశ్లేషణలు తక్షణం మేలుకోవాల్సిన ఆవశ్యకతను చాటుతున్నాయి.

ప్లాస్టిక్‌ల వల్ల సంభవిస్తున్న అనారోగ్యాలూ మరణాలు ప్రపంచానికి ఏటా 1.5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని లాన్సెట్ పత్రికలో ప్రచురితమైన అధ్యయనం ఇటీవల హెచ్చరించింది. ప్లాస్టిక్‌లలో క్యాన్సర్లు, అల్జీమర్స్, ఇతర వ్యాధులను కలిగించగల హానికర రసాయనాలు ఉంటాయి. వాటి వల్ల హృద్రోగాలు, పక్షవాతాల బారిన పడి ఏటా కొన్ని లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇంత జరుగుతున్నా ప్లాస్టిక్ వ్యర్థాలపై పోరాటంలో ప్రపంచ దేశాల వైఫల్యం కలవరపరుస్తోంది.



ముడిపడని ఒప్పందం

ఈ ఏడాది ఆగస్టులో 184 దేశాలూ 400 అంతర్జాతీయ సంస్థలకు చెందిన 2,600 మంది ప్రతినిధులు జెనీవాలోని ఐక్యరాజ్య సమితి కార్యాలయంలో సమావేశమయ్యారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ వ్యర్థాల నిరోధక ఒప్పందం కోసం సమితి ఆధ్వర్యంలో జరిగిన అయిదో సమావేశం అది. ప్రపంచంలో ఏటా నలభై కోట్ల టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు ఉత్పన్నమవుతున్నాయి. 2040కల్లా అవి నాలుగింతలు పెరగనున్నాయి. దీనికి అడ్డుకట్ట వేయడానికి జెనీవా సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటారని అంతా ఆశించారు. కానీ, 11 రోజుల చర్చల తరవాత ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ప్లాస్టిక్కులు, పాదరసం వంటి హానికర రసాయనాలను నియంత్రించాలని జెనీవా సభలో స్విట్జర్లాండ్, మెక్సికోలు సంయుక్తంగా చేసిన ప్రతిపాదనను వంద దేశాలు సమర్థించాయి. కానీ, చమురు ఉత్పత్తి దేశాలు వ్యతిరేకించాయి. అత్యధిక ప్లాస్టిక్కులు పెట్రోలియం నుంచే తయారవుతాయి. జెనీవా సభలో శిలాజ ఇంధన ఉత్పత్తి దేశాలు, రసాయనాల కంపెనీలకు చెందిన 234 మంది ప్రతినిధులు ప్లాస్టిక్ నిషేధానికి వ్యతిరేకంగా పైరవీలు చేశారు. వీరి సంఖ్య 27 దేశాల ఐరోపా సమాఖ్య ప్రతినిధులను మించిపోయింది. ఇలాంటి శక్తుల నుంచి ఒత్తిళ్లు ఎదురవుతాయని ఐరాస మానవ హక్కుల సంస్థ మొదటి నుంచి హెచ్చరిస్తూనే ఉంది.


పట్టు సడలింపులు, తూతూమంత్రం మార్పుచేర్పులతో బలహీన ఒప్పందం కుదుర్చుకోవడంకన్నా అసలు సంధి లేకపోవడమే మంచిదని పర్యావరణ బృందాలు వాదిస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెట్టడం ద్వారా సమస్య పరిష్కారం కాదని, ఈ దహన ప్రక్రియలో మరిన్ని హానికర రసాయనాలు వాతావరణంలో చేరిపోతాయని అవి హెచ్చరించాయి. దీనికన్నా ప్లాస్టిక్ వ్యర్థాలను పునర్వినియోగించడం మేలన్నాయి. అన్నింటినీ మించి ప్లాస్టిక్ ఉత్పత్తిపై పరిమితులు విధించి కచ్చితంగా అమలు చేయడం, నియంత్రణకు నిర్ణీత కాల పరిమితితో లక్ష్యాలను నిర్దేశించి వాటిని అందుకోవడం ఉత్తమమని సిఫార్సు చేశాయి. ధనిక దేశాలు తమ ప్లాస్టిక్ చెత్తను పేద దేశాలకు తరలించడాన్ని వ్యర్థాల వలసగా పర్యావరణ సంఘాలు అభివర్ణించాయి. ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు పేద దేశాలకు అధునాతన టెక్నాలజీలను అందించాలని సిఫార్సు చేశాయి. ఇలాంటి జాగ్రత్తలతో ప్లాస్టిక్ వ్యర్థాలపై సర్వామోద ఒప్పందం కుదుర్చుకోవాలి.

భావితరాల మేలు కోసం...

ధనిక దేశాలు, చమురు ఉత్పత్తి దేశాలు కలిసిరాకపోతే ప్రగతిశీల, చిన్న ద్వీప దేశాలు విడిగా ఒప్పందం కుదుర్చుకుని ప్లాస్టిక్ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి. జెనీవా సభ విఫలమైనా, ప్రపంచ దేశాలు మళ్ళీ ఈ అంశంపై సంప్రదింపులను పునరుద్ధరిస్తాయని ఆశిస్తున్నట్లు ఐరాస పర్యావరణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇంగర్ యాండర్సన్ చెప్పారు. సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా ఇదే ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని దేశాలు పారిస్ వాతావరణ సభ తీర్మానానికి కట్టుబడి శిలాజ ఇంధనాలను, ప్లాస్టిక్కులను కట్టడి చేయాలి. భావితరాల ప్రయోజనాలను కాపాడటానికి ఈ చర్యలు తప్పనిసరి అన్న అంతర్జాతీయ న్యాయస్థానం హితవును అందరూ ఆలకించాలి.



హరికృష్ణ నిబానుపూడి
సీనియర్ యూఎన్ క్లైమేట్ ఎమర్జెన్సీ అడ్వైజర్



With Deepest Sadness and Heavy Hearts

We mourn the passing of

Dr. Surendranath Chalamalasetty

beloved father of
Anil (Gopi), Sunil and Venkatesh.

A kind soul and pillar of strength, his memories will forever remain in our hearts.

May his soul rest in eternal peace.
In Grief and Remembrance,

Kundavarapu Srinivas Naidu
and Family



తొలి విడతలో ఎవరిది పైచేయి?

- బిహార్‌లో పోలింగ్‌పై ఉత్కంఠ
- రెండు కూటముల ధీమా
- నేడు 121 నియోజకవర్గాల్లో పోలింగ్

బిహార్‌లో గురువారం పోలింగ్ జరిగే తొలి విడతలోని 121 నియోజకవర్గాల్లో ఎవరు పైచేయి సాధిస్తారనే దానిపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ విడతలో ఆధిపత్యంపై రెండు కూటములు ధీమాగా ఉన్నాయి. మిథిల, కోసి, ముంగేర్ డివిజన్లలోని 18 జిల్లాల్లో ఉన్న నియోజకవర్గాల్లో తొలి విడత పోలింగ్ జరగనుంది. మొత్తం 1,314 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

2020 ఎన్నికల్లో ఎన్డీయే 70 సీట్లను గెలుచుకుంది. అప్పటితో పోలిస్తే తాము 17 నుంచి 19 సీట్లు అదనంగా ఈసారి గెలుస్తామని ఎన్డీయే చెబుతోంది. మహాగఠ్‌బంధన్‌కు 2020తో పోలిస్తే 19 నుంచి 21 సీట్లు తగ్గుతాయని అంటోంది. గత ఎన్నికల్లోనూ ఈ ప్రాంతాల్లో ఎన్డీయే ఆధిపత్యం చెలాయించింది. అయితే ఈసారి తామే ఆధిపత్యం సాధిస్తామని ఆర్జేడీ కూటమి ధీమా వ్యక్తం చేస్తోంది. మధ్యలో జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ ఎవరి ఓట్లను చీల్చుతారనేది ఆసక్తికరంగా మారింది.

తొలి విడతలో తేజస్వీతోపాటు భాజపా నేత సామ్రాట్ చౌధరి, ఇద్దరు డిప్యూటీ సీఎంలు, 14 మంది మంత్రులు పరీక్షను ఎదుర్కొంటున్నారు.



ఎన్డీయే అంచనాలు

1.21 కోట్ల మంది మహిళలకు రూ.10,000 చొప్పున నగదు బదిలీ చేయడం నీతీశ్‌కు కలిసివచ్చే అంశమని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

- భాజపాకున్న సంస్థాగత బలం దీనికి తోడైతే సత్ఫలితాలు వస్తాయని అంటున్నారు.
- ఉచిత విద్యుత్తు కొంత మేర ప్రయోజనం కలిగిస్తుందని అంటున్నారు.
- చిరాగ్ పాస్వాన్ మళ్లీ ఎన్డీయే గూటికి చేరడంతో ఎస్సీల్లోని పాస్వాన్ల ఓట్లపై ఎన్డీయే ఆశలు పెట్టుకుంది.
- కాంగ్రెస్ ఇంకా పుంజుకోలేదని, అది తమకు లాభిస్తుందని ఎన్డీయే అంచనా వేసుకుంటోంది. ఆ పార్టీలో సీట్ల సర్దుబాటు, సరైన నాయకత్వం లేకపోవడం, అంతర్గత వివాదాల కారణంగా ఓ 10 సీట్లలో ఫలితాలు తమకు అనుకూలంగా ఉండవచ్చని అధికార పక్షం భావిస్తోంది.
- తొలి విడతలో తాము పోటీ చేస్తున్న 57 సీట్లలో గత ఎన్నికల్లో గెలిచిన 23 స్థానాలను మళ్లీ నిలబెట్టుకోవాలని జేడీయూ భావిస్తోంది. ఇది నీతీశ్‌కు పెద్ద సవాలుగానే నిలవనుంది. ఈ సీట్లలో ఎప్పటి నుంచో జేడీయూ ఆధిపత్యం కొనసాగుతోంది. ఈసారి సవాళ్లు ఎదురుకావడంతో కొన్ని చోట్ల అభ్యర్థులను ఆ పార్టీ మార్చింది.
- గత ఎన్నికల్లో 29 చోట్ల జేడీయూ రెండో స్థానంలో నిలిచింది. వీటిలో పాగా వేయడానికి ఈసారి గట్టిగా పోరాడుతోంది. అందులో భాగంగా ఈ నియోజకవర్గాల్లో చాలాచోట్ల అభ్యర్థులను మార్చింది.

ఆర్జేడీ అంచనాలు

విపక్ష కూటమి ఈసారి సామాజిక సమీకరణాలపై ఆధారపడింది. దీంతోపాటు ఇంటికో ఉద్యోగంతోపాటు అనేక హామీలిచ్చింది. ఇవన్నీ తమకు కలిసొస్తాయని ఆ కూటమి అంచనా వేసుకుంటోంది.

- వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ అధినేత ముకేశ్ సహానీ రావడంతో నిషాద్ వర్గంలో మిథిలాంచల్, తిర్హుత్ ప్రాంతాల్లో తమ బలం పెరిగిందని ఇండియా కూటమి భావిస్తోంది.
- జేడీయూలోని బలహీనతలు తమకు లాభిస్తాయని ఆర్జేడీ అంచనా వేసుకుంటోంది.
- ముస్లిం-యాదవ్ సమీకరణం తమకు కలిసి వస్తుందని, ఈబీసీలు, దళితులు తమ వెంటే ఉంటారని ఇండియా కూటమి లెక్కలు చెబుతోంది.

తొలి విడత పోలింగ్ జరిగే జిల్లాలు

పట్నా, భోజ్‌పుర్, బక్సర్, గోపాల్‌గంజ్, సివాన్, సరణ్, ముజఫర్‌పుర్, వైశాలి, దర్భంగా, సమస్తీపుర్, మాధేపుర, సహర్స, ఖగారియా, బెగుసరాయ్, ముంగేర్, లఖీసరాయ్, షేక్‌పురా, నలంద.

- నలుగురు మంత్రులు పోటీ చేస్తున్న దర్భంగా, సమస్తీపుర్‌లలో ఎన్డీయేకు భారీ అంచనాలే ఉన్నాయి.
- కోసి డివిజన్‌లోని సహర్స, మాధేపురలో ఉన్న 8 సీట్లలో రెండు కూటములు నువ్వా నేనా అంటున్నాయి.
- భూమిహార్లు, యాదవ్‌లు, కుష్వాహాలు అధికంగా ఉన్న ముంగేర్‌లో పోటీ తీవ్రంగా ఉంది.
- ఖగారియా జిల్లాలో ఇద్దరికీ సమాన బలం ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.
- లఖీసరాయ్‌లో చెరో సీటులో రెండు కూటములు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.
- షేక్‌పురాలో సమానంగా బలం ఉండగా.. నలందలో ఎన్డీయే బలంగా ఉంది.

\- నేషనల్ డెస్క్

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విశేష సేవలు

- విపత్తుల వేళ బాధితులకు అండగా నిలుస్తున్నాం
- మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



ఈనాడు, అమరావతి: సమాజంలో అందరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఆశయంతో ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా విశేష సేవలందిస్తున్నామని మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వృత్తి విద్యా కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తూ వారి సామర్థ్యాలను పెంచుతున్నామని, మహిళా సాధికారత కోసం పనిచేస్తున్నామని వివరించారు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున లండన్‌లోని గ్లోబల్ కన్వెన్షన్‌లో ‘ప్రతిష్ఠాత్మక డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025’ అందుకున్న అనంతరం ఆమె ప్రసంగించారు. ‘ఏపీ, తెలంగాణ సహా వివిధ రాష్ట్రాల్లో ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో సామాజిక, సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయి. సంజీవని ఫ్రీ హెల్త్‌క్లినిక్స్, మొబైల్ హెల్త్‌క్యాంపులు, సురక్షిత తాగునీరు అందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రకృతి విపత్తుల వేళ బాధితులకు అండగా నిలుస్తున్నాం. వారి జీవితం సాధారణ స్థితికి వచ్చేవరకూ చేయూత అందిస్తున్నాం. పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. వారి జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు వీలుగా సలహాలు, సూచనలు ఇస్తున్నాం. అట్టడుగున ఉన్నవారు కూడా గౌరవంతో జీవించేలా కృషి చేస్తున్నాం. సముద్రమంత ప్రేమను పంచుతూ.. సూర్యుడిలా అందరికీ సేవలందిస్తున్నాం’ అని భువనేశ్వరి పేర్కొన్నారు.

మా కుటుంబానికి అమ్మే ప్రేరణ: లోకేశ్

‘మా కుటుంబానికి అమ్మే ప్రేరణ’ అని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ‘డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్-2025’ పురస్కారాన్ని అందుకున్న తన మాతృమూర్తి నారా భువనేశ్వరికి ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ‘మా అమ్మకు, హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌కు అంతర్జాతీయ స్థాయిలో వచ్చిన గుర్తింపునకు ఎంతో గర్విస్తున్నాను. మా అమ్మ సామాజికసేవ పట్ల చూపిన అంకితభావానికి ఇది గుర్తింపుగా నిలుస్తుంది. మూడు దశల్లో 175 సంస్థలను దాటుకొని హెరిటేజ్ సంస్థ పురస్కారం దక్కించుకోవడం ప్రశంసనీయం’ అని లోకేశ్ పేర్కొన్నారు.

విజ్ఞాన్ కులపతిగా పావులూరి బాధ్యతల స్వీకరణ



సుబ్బారావుతో లావు రత్తయ్య, ఉపకులపతి పి.నాగభూషణ్ తదితరులు

పొన్నూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ కులపతిగా పావులూరి సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఎండీగా, ఏపీ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఉత్తర్‌ప్రదేశ్ ఎకనమిక్ కౌన్సిల్ సభ్యుడిగానూ ఉన్నారు. ఇస్రోలో 15 ఏళ్లు శాస్త్రవేత్తగా సేవలందించారు. 2023లో విజ్ఞాన్ వర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ పొందారు. ఆయన స్వగ్రామం బాపట్ల జిల్లా అమృతలూరు మండలంలోని గోవాడ. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ.. యూనివర్సిటీని ఉన్నత స్థాయికి చేర్చడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధి నైపుణ్యాల పెంపు, విలువ ఆధారిత విద్యకు ప్రాధాన్యం కల్పించనున్నట్లు తెలిపారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల అధ్యక్షుడు డాక్టర్ లావు రత్తయ్య, వైస్ ఛైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఉపకులపతి పి.నాగభూషణ్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ దిరిశాల విజయరాము తదితరులు ఆయన్ను అభినందించారు.

విజ్ఞాన్ వీశాట్ 2026-27 నోటిఫికేషన్ విడుదల

గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయం 2026-27 ఏడాదికి సంబంధించిన బీటెక్, బీ ఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్), బీబీఏ ఎల్ఎల్‌బీ (ఆనర్స్), అగ్రికల్చర్, ఫార్మా-డీ అడ్మిషన్ల నోటిఫికేషన్‌ను ఉపకులపతి పి.నాగభూషణ్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ దిరిశాల విజయరాము, డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.గౌరీశంకరరావు బుధవారం విడుదల చేశారు. అనంతరం నాగభూషణ్ విలేకర్లతో మాట్లాడారు. వీశాట్ దరఖాస్తులు విజ్ఞాన్ సంస్థలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ (https://admissions.vignan.ac.in/) లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వచ్చే ఏడాది మార్చి 1 నుంచి ఏప్రిల్ 15 వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. దీనికి ఫిబ్రవరి 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందులో తొలి 50లోపు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 50%, 51 నుంచి 200లోపు 25%, 201 నుంచి 2000 లోపు 10% రాయితీ ఇస్తామన్నారు. ఇంటర్, జేఈఈ మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగా ఫీజు రాయితీ ఉంటుందన్నారు. వీశాట్ రాసిన వారికి ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు.

పర్యాటకంలో పెట్టుబడులు పెడితే అనేక రాయితీలు

డబ్ల్యూటీఎంలో మంత్రి దుర్గేష్



లండన్‌లో నిర్వహిస్తున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్-2025 ప్రదర్శనలో మంత్రి కందుల దుర్గేష్

ఈనాడు, అమరావతి: పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి తమ ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తోందని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. పెట్టుబడిదారులను ప్రోత్సహించేలా నూతన పర్యాటక విధానం, పారిశ్రామికహోదా వంటివి కల్పించామని ఆయన వివరించారు. లండన్‌లో నిర్వహిస్తున్న ప్రపంచ ట్రావెల్ మార్కెట్ (డబ్ల్యూటీఎం)-2025 ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న మంత్రి యూకే లీడింగ్ ఏషియా ట్రావెల్స్ నిపుణుడు హరి దుగ్గిరాల, ఏకే ట్రావెల్స్ ఏజెన్సీ వ్యవస్థాపకులు ఆంథోనీ కింగ్స్, సీఎంసీవో సంస్థ మైస్ నిపుణుడు క్రిష్ పోర్ట్, తమిళనాడు పర్యాటక మండలి డైరెక్టర్ జెక్కు కురియన్ కురియాకోస్ తదితరులతో భేటీ అయ్యారు. ఏపీలో పర్యాటక రంగంలో ఎందుకు పెట్టుబడులు పెట్టాలని వచ్చిన ప్రశ్నకు రాష్ట్రానికి ఉన్న ప్రత్యేకతలు, పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరఫున కల్పించే రాయితీలు తదితర విషయాలను మంత్రి వివరించారు.

ఉద్యోగాలివ్వని నాలుగేళ్ల ఇంజినీరింగ్ చదువు

- అమీర్‌పేటలో 4 నెలల కోర్సుతో కొలువులొస్తున్నాయి
- ఉన్నతవిద్యపై సమీక్షలో మంత్రి లోకేశ్
- పాఠ్యప్రణాళికను పూర్తిగా ప్రక్షాళించాలని వ్యాఖ్య
- వర్సిటీలు, ట్రిపుల్‌ఐటీల్లో నూరు శాతం ప్రాంగణ నియామకాలు ఉండాలని సూచన



ఈనాడు, అమరావతి: నాలుగేళ్లపాటు ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు దొరకడం లేదు, అదే హైదరాబాద్ అమీర్‌పేటలో నాలుగు నెలలు కోచింగ్ తీసుకుంటే ఉద్యోగాలు సాధిస్తున్నారని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతవిద్య పాఠ్యప్రణాళికను పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐటీఐలు, విశ్వవిద్యాలయాలను నవంబరులోగా పరిశ్రమలతో అనుసంధానం చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు కళాశాలలను సైతం నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానించి, ప్రాంగణ నియామకాలకు భరోసా కల్పించాలని ఆదేశించారు. ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో బుధవారం ఉండవల్లి నివాసంలో నిర్వహించిన సమీక్షలో లోకేశ్ మాట్లాడారు.

విద్యార్థులకు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు

కళాశాలల్లో విద్యార్థులకు ముఖ ఆధారిత గుర్తింపు హాజరు నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్సిటీలు, ట్రిపుల్ ఐటీల్లో విద్యార్థులకు వందశాతం ప్రాంగణ నియామకాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ‘ప్రభుత్వ విశ్వవిద్యాలయాల పరిపాలనకు ఏకీకృత చట్టం రూపొందించాలి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలి. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు చర్యలు చేపట్టాలి. వృత్తివిద్య కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులను ట్రాకింగ్ చేయాలి. ప్రైవేట్ కళాశాలలకు అనుమతులపై కాలపరిమితి ఉండాలి’ అని లోకేశ్ సూచించారు. వర్సిటీల్లో అధ్యాపక పోస్టుల భర్తీ, వర్సిటీలు, ఐటీఐ, ట్రిపుల్ ఐటీల్లో ప్రాంగణ నియామకాలపై మంత్రి చర్చించారు.

జాబ్ మేళాల ద్వారా 78 వేల మందికి ఉద్యోగాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 406 జాబ్‌మేళాల ద్వారా 78వేల మంది యువతకు ఉద్యోగాలు లభించాయని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి లోకేశ్ చెప్పారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం ఆయన నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ‘జాబ్ మేళాల్లో మరిన్ని సంస్థలను భాగస్వాములను చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేలా చూడాలి. ప్రపంచస్థాయి సంస్థలతో భాగస్వామ్యం కోసం కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలి. కొత్త పరిశ్రమలు, వాటి అవసరాలను గుర్తించి ఐటీఐ, పాలిటెక్నిక్ కరిక్యులమ్‌లో మార్పులపై దృష్టి సారించాలి’ అని లోకేశ్ సూచించారు.

★ ‘రాష్ట్రంలో పాలిటెక్నిక్ చదివిన వారిలో 94.6% ఐటీఐ చేసిన 98% మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభిస్తున్నాయి. యువతకు బ్లూకాలర్ ఉద్యోగ అవకాశాల కోసం 30 ఇండస్ట్రీ అనుబంధ కోర్సులు ప్రవేశపెట్టాం. 12 మోడల్ కెరీర్ సెంటర్ల ద్వారా 1,22,575 మందికి శిక్షణ ఇచ్చాం. విదేశీ ఉద్యోగావకాశాలను పెంచేందుకు జర్మన్, ఇటాలియన్, జపనీస్, కొరియన్ భాషల్లో శిక్షణ కోసం ఇప్పటికే చర్యలు చేపట్టాం. 5 క్లస్టర్ల పరిధిలో 273 పారిశ్రామిక సంస్థలతో ఐటీఐ, పాలిటెక్నిక్‌లను అనుసంధానం చేశాం’ అని నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేశ్‌కుమార్, ఓంక్యాప్ సలహాదారు సీతాశర్మ, సీడ్యాప్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 27న సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు

ఈనాడు, అమరావతి: అధునాతన విద్యావిధానాలపై అధ్యయనానికి 78 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఈ నెల 27న సింగపూర్‌కు పంపే ఏర్పాటు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో బుధవారం విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ‘ఈ నెల 27 నుంచి డిసెంబరు 2 వరకు వారం పాటు ఉత్తమ ఉపాధ్యాయులు సింగపూర్‌లోని ప్రముఖ పాఠశాలలను సందర్శించాలి. అధునాతన సాంకేతికతతో కూడిన బోధనా పద్ధతులు, తరగతి గదుల్లోని వాతావరణం తదితరాలపై అధ్యయనం చేయాలి. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల మెరుగుకు ఏం చేయగలమో నివేదిక రూపంలో అందించాలి. ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థుల అసెంబ్లీ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి. గతేడాది మాదిరిగానే డిసెంబరు 5న మెగా పేరెంట్స్-టీచర్స్ సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలి. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలి. విద్యార్థుల పనితీరును తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించేలా లీప్ యాప్‌ను డిజైన్ చేశాం. దీనిపై విస్తృత ప్రచారం చేయాలి’ అని లోకేశ్ సూచించారు.

14 నుంచి తిరుపతిలో పంచగవ్య జాతీయ వైద్యసదస్సు

ఈనాడు డిజిటల్, తిరుపతి: పంచగవ్య జాతీయ 13వ వైద్య సదస్సు.. తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు పంచగవ్య విద్యాపీఠం, పంచగవ్య డాక్టర్స్ అసోసియేషన్ నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సులో పంచగవ్య, సంప్రదాయ, గోఆధారిత వైద్యం, స్థిరమైన జీవనంపై చేసిన పరిశోధనలను పంచుకునేందుకు, చర్చించేందుకు జాతీయ స్థాయిలో ఆయుర్వేద వైద్యులు, పరిశోధకులు రానున్నట్లు వివరించారు. https://www.gavyasiddh.org వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 89500 95000, 94449 61723, 94450 66626 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ద.కోస్తా జోన్ డీజీఎంగా బాలాజీ కిరణ్

ఈనాడు, హైదరాబాద్: ద.మ.రైల్వే పునర్విభజన, విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా ఏర్పాటు ప్రక్రియలో భాగంగా రైల్వేబోర్డు మరో నిర్ణయం తీసుకుంది. ఆ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా ఐఆర్‌టీఎస్ అధికారి బాలాజీ కిరణ్‌ను నియమించింది. ఆయన ప్రస్తుతం ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయం రైల్‌నిలయంలో పనిచేస్తున్నారు. బాలాజీ కిరణ్ దక్షిణ కోస్తా రైల్వే జోన్ జీఎం సందీప్ మాథుర్‌కు సెక్రటరీగా కూడా వ్యవహరిస్తారు.

‘వీఆర్వోలకు డీటీ పేస్కేల్ కల్పించండి’

ఈనాడు, అమరావతి: వీఆర్వోలుగా 15 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి డిప్యూటీ తహసీల్దారు పే స్కేలు కల్పించాలని, 10 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి సీనియర్ అసిస్టెంట్ పే స్కేల్ ఇవ్వాలని వీఆర్వో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు, అసోసియేట్ అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాస్, మిరియాల లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. 5 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వీఆర్వోలకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వీఆర్వోలకు కేడర్ స్ట్రెంత్ ప్రకారం సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇవ్వాలని కోరారు.



అతివిశ్వాసం కన్నా దానితోనే ఎక్కువ చేటు

అతివిశ్వాసం కన్నా స్వీయ సందేహమే ఎక్కువ కలలను చంపేస్తుంది. అతివిశ్వాసం ఉన్నవారికి పరాజయాలు ఎదురుకావొచ్చు. కానీ స్వీయ సందేహమనేది అసలు ప్రయత్నమే చేయకుండా అడ్డుకుంటుంది. దానివల్ల మీ సామర్థ్యాలేంటో మీకెప్పటికీ తెలియవు. కాబట్టి స్వీయసందేహాన్ని విడిచిపెట్టి ముందడుగు వేయండి.

\- అహద్, అంత్రప్రెన్యూర్

మహిళల స్నానాల గదిలో ‘చీకటి కళ్లు’

- రహస్య కెమెరాలు అమర్చిన మహిళ
- డెంకణీకోటలో భారీ ఆందోళన
- నిందితురాలిని అరెస్టు చేసిన పోలీసులు

డెంకణీకోట, న్యూస్‌టుడే: సెల్‌ఫోన్ల తయారీ సంస్థలో పనిచేసే ఉద్యోగినులు ఒక్కసారిగా ఉలికిపాటుకు గురయ్యారు. వారుంటున్న వసతిగృహం భవంతిలోని స్నానాల గదుల్లో రహస్య కెమెరాలు అమర్చారన్న విషయం మంగళవారం బయటపడడంతో మహిళలంతా ఆందోళనకు దిగారు. కర్ణాటక-తమిళనాడు సరిహద్దులోని తమిళనాడు పరిధిలో డెంకణీకోట పట్టణ సమీపాన నాగమంగలంలో విస్తరించిన ఆ భారీ పరిశ్రమలో వేలమంది మహిళలు పనిచేస్తున్నారు. అందులో రెండువేల మంది ఉండడానికి వీలైన ఓ వసతిగృహం ఉంది. ఆ వసతిగృహం స్నానాల గదుల్లో గుర్తుతెలియని వ్యక్తులు రహస్య కెమెరాలు అమర్చినట్లు తేలింది. కొందరు వ్యక్తులు.. మహిళలు స్నానాలు చేస్తున్న వీడియోలను విక్రయించి వ్యాపారం చేస్తున్నారనే అనుమానంతో అక్కడి వారు మంగళవారం సాయంత్రమే అప్రమత్తమయ్యారు. విధులు ముగించుకుని వచ్చినవారంతా ఈ విషయమై కూపీ లాగితే.. కెమెరాలు వెలుగులోకి వచ్చాయి. దీనికి బాధ్యులెవరో తేల్చాలంటూ మహిళలు ఆందోళనకు దిగారు. అర్ధరాత్రి సమయానికి ఈ ఆందోళన తీవ్రమైంది. కృష్ణగిరి జిల్లా ఎస్పీ తంగదురై, డెంకణీకోట డీఎస్పీ ఆనందరాజ్, సీఐ శంకర్ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు ఏమాత్రం శాంతించలేదు. నిందితులను అరెస్టు చేసేవరకు ఆందోళన విరమించబోమని స్పష్టంచేశారు. దీంతో పోలీసులు అధికారిక నిఘా కెమెరాల వీడియోలను పరిశీలించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన నీలకుమారి అనే మహిళే స్నానాల గదుల్లో సీసీటీవీ కెమెరాలు అమర్చినట్లు గుర్తించారు. వాటిలో నిక్షిప్తమైన వీడియోలను బెంగళూరులో సంతోశ్ అనే వ్యక్తికి పంపించి.. వ్యాపారానికి తెగించినట్లు తేలింది. పోలీసులు నీలకుమారిని అరెస్టు చేయడంతో మహిళా ఉద్యోగులు ఆందోళన విరమించారు.

వసతిగృహం వాచ్‌మన్ అరెస్టు

అశ్లీల వీడియోలు చూపించి విద్యార్థులతో అసభ్య ప్రవర్తన

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: వసతిగృహంలోని బాలలకు అశ్లీల వీడియోలు చూపుతూ అసభ్య ప్రవర్తనకు ఒడిగట్టిన ఉద్యోగిపై అధికారులు వేటువేశారు. ఈ మేరకు తిరుపతి చెన్నారెడ్డి కాలనీలోని సాంఘిక సంక్షేమ సమీకృత వసతిగృహంలో శాశ్వత ఉద్యోగి, వాచ్‌మన్ కె.హరి గోపాల్‌పై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మూడున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న హరిగోపాల్ తన మొబైల్‌లో అశ్లీల వీడియోలు చూడడంతో పాటు వాటిని వసతి గృహంలోని బాలలకు చూపిస్తూ అసభ్య ప్రవర్తనకు ఒడిగట్టాడు. బాలురు వారి తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. బాలల కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు చర్యలు తీసుకున్నారు.

బాధ్యులపై కలెక్టర్ చర్యలు

అసభ్య ప్రవర్తనకు పాల్పడిన వాచ్‌మన్‌పై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హరిగోపాల్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించడంతోపాటు వసతిగృహం సంక్షేమాధికారి మునిశంకర్‌ను సస్పెండ్ చేశారు. సహాయ సాంఘిక సంక్షేమాధికారి శ్యాంసుందర్‌రావుకు ఛార్జిమెమో జారీ చేశారు.

ఏ సంస్థ దర్యాప్తు చేయాలో నిందితుడు నిర్ణయించలేరు

- జోగి రమేష్ వ్యాజ్యానికి విచారణార్హత లేదు
- హైకోర్టులో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసుల దర్యాప్తును సీబీఐకి అప్పగించాలంటూ వైకాపా నేత జోగి రమేష్ దాఖలుచేసిన వ్యాజ్యానికి విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టులో వాదనలు వినిపించారు. నకిలీ మద్యం తయారీ కేసులో జోగి రమేష్ నిందితుడని గుర్తుచేశారు. నిందితుడిగా ఉన్న వ్యక్తి ఏ సంస్థ దర్యాప్తు చేయాలో నిర్ణయించలేరన్నారు. వ్యాజ్యం వేసేనాటికి పిటిషనర్ ఈ కేసులో నిందితుడిగా లేరని, ఆ తర్వాత చేర్చి.. అరెస్టు చేశారన్నారు. ఈ విషయాలన్నింటినీ పిటిషన్లో ప్రస్తావించాల్సిన బాధ్యత జోగి రమేష్‌పై ఉందన్నారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు.. వ్యాజ్యం దాఖలు చేసిన తర్వాత చోటుచేసుకున్న పరిణామాలతో అదనపు అఫిడవిట్ వేయాలని జోగి రమేష్ తరఫు సీనియర్ న్యాయవాదికి సూచించింది. మరోవైపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీచేసింది. విచారణను ఈ నెల 12కు వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఉత్తర్వులిచ్చారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. నకిలీ మద్యం వ్యవహారాన్ని బయటపెట్టడంలో పిటిషనర్ పాత్ర కీలకమన్నారు. దీంతో ఆయనను కేసులో ఇరికించారన్నారు. ఈ వ్యాజ్యం దాఖలు చేశాక పిటిషనర్‌ను నిందితుడిగా చేర్చి, అరెస్టు చేశారన్నారు. కేసులో నిష్పాక్షిక దర్యాప్తు జరగడం లేదని భావించినప్పుడు సీబీఐకి అప్పగించాలని నిందితుడూ కోరవచ్చన్నారు. అదనపు అఫిడవిట్ వేయడానికి సమయం కావాలని కోరారు.

ఆడపిల్లల జీవితాలతో ఆటలెందుకు?

- ఇది రాజకీయ దిగజారుడుతనమే
- సాక్షిలో కథనం, వైకాపా ‘ఎక్స్’ ఖాతాపై హోం మంత్రి అనిత ధ్వజం



ఈనాడు, అమరావతి: వైకాపా నేతలు, సాక్షి మీడియా.. ఆడపిల్లల జీవితాలతో ఆటలెందుకు ఆడుతున్నారని? మన ఇళ్లలోనూ ఆడపిల్లలు ఉన్నారనేది తెలియదా? అని హోంమంత్రి వంగలపూడి అనిత ధ్వజమెత్తారు. ఏలూరులో వివాహిత మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందితే, ప్రైవేటు స్కూలు బాలికపై లైంగికదాడి అని సాక్షిలో కథనాలు రాశారని మండిపడ్డారు. మర్నాడు అదే వార్తను ఆమె బాలిక కాదు వివాహిత అని ప్రచురించారని, కానీ వైకాపా అధికారిక ‘ఎక్స్’లో మాత్రం బాలికపై లైంగిక దాడని పోస్టు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాసే కథనాలు ఆ కుటుంబాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయని ఆలోచించరా? వాళ్లను వీధిలోకి లాగకూడదని తెలియదా? అని ప్రశ్నించారు. హోంమంత్రి బుధవారం సచివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. “ఇద్దరు పిల్లల తల్లి అయిన ఆమె మద్యం తాగింది. తర్వాత ఆమెకు ఫిట్స్ రావడంతో స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఆమెపై లైంగికదాడి జరిగినట్లు వైద్యులెవరూ చెప్పలేదు. ఆమె స్పృహలోకి వచ్చాక కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. వైకాపా, జగన్, సాక్షి ఎక్కడ ఏ ఘటన జరుగుతుందా అని గోతికాడ నక్కల్లా కాపు కాస్తున్నారు. చిన్న ఘటనలైతే వీళ్లే కథ అల్లుతున్నారు. మరణాలపై, ఆడపిల్లల మర్యాదలపై తప్పుడు కథనాలతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారు. కర్నూలు బస్సుప్రమాద ఘటనలో బైకర్ కల్తీ మద్యం తాగాడని ప్రచారం చేశారు. కాశీబుగ్గ ఆలయంలో 9 మంది చనిపోతే, వైకాపా 10 మందికి పైగా మృతి అని పోస్టులు పెట్టింది. ఆర్థిక లావాదేవీలతో జరిగిన కందుకూరు ఘటనపై కులాల రంగు పులిమారు’’ అని అనిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికే కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై తప్పుడు ప్రచారం చేసినవారిపై పోలీసు కేసు పెట్టామన్నారు. ఏలూరు ఘటనపై దర్యాప్తు జరిపించి, తప్పుడు వార్తలు రాసిన వారిపై, పోస్టులు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వైకాపా కుట్రలను, సాక్షిలో రాసే కథనాలను ప్రజలు నమ్మొద్దని హోంమంత్రి కోరారు.

★ మంత్రి విలేకర్లతో మాట్లాడుతుండగా ఒక మహిళ భోగాపురానికి అన్యాయం జరిగిందని బిగ్గరగా పేర్కొన్నారు. దీంతో అనిత స్పందించి ఆమె వద్దకు వెళ్లి మాట్లాడారు. తర్వాత ఆమెను తన ఛాంబర్‌కు తీసుకెళ్లి, సమస్య ఏంటో అడిగి తెలుసుకున్నారు.

మేమేం పోలీసు శాఖను నడపడం లేదు

- వీఆర్‌లో ఉన్నవారి విధులను ఎక్కడ వినియోగించుకోవాలో ఆ శాఖకు తెలుసు
- వారి తరఫున మీరెలా పిల్ వేస్తారు?
- హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు
- వైకాపా ఎంపీ గురుమూర్తి వేసిన పిల్ కొట్టివేత



ఈనాడు, అమరావతి: వేకెన్సీ రిజర్వ్(వీఆర్)లో ఉన్న పోలీసు అధికారులకు ఎక్కడ విధులు అప్పగించాలో నిర్ణయించేందుకు తామేమీ పోలీసుశాఖను నడపడం లేదని హైకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. వారి విధులను ఎక్కడ వినియోగించుకోవాలో సంబంధిత శాఖకు తెలుసని పేర్కొంది. ఫలానా చోట బాధ్యతలు అప్పగించాలంటూ ఆదేశించలేమని తేల్చిచెప్పింది. జీతాలందకపోతే ఆ పోలీసులే కోర్టుకు వస్తారని, వారి తరఫున మీరెలా పిల్ వేస్తారని వైకాపా ఎంపీ గురుమూర్తిని సూటిగా ప్రశ్నించింది. పేద, అణగారినవర్గాల గొంతుకను వినిపించడమే పిల్ ఉద్దేశమని పేర్కొంది. పోలీసు అధికారులకు పోస్టింగ్, బదిలీల విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలు కాకపోతే అక్కడికే వెళ్లాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వనందున అవి అమలుకాకపోతే కోర్టుధిక్కరణ చర్యలు ప్రారంభించే అధికారం హైకోర్టులకు ఉండదని స్పష్టం చేసింది. పిల్‌ను కొట్టేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. వీఆర్‌లో ఉన్న పోలీసులకు నిర్ణీత సమయంలో పోస్టింగ్ ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వాలని తిరుపతి వైకాపా ఎంపీ గురుమూర్తి హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు విన్న హైకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

'ఈటీవీ ఆంధ్రప్రదేశ్, ఈటీవీ తెలంగాణ, ఈటీవీ లైఫ్' ఛానళ్ల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విజయవాడ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో నిర్వహించాల్సిన కార్తిక దీపోత్సవం వాయిదా పడింది. భారీ వర్షం కారణంగా రద్దు చేశామని నిర్వాహకులు ప్రకటించారు. తదుపరి నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు.

-విజయవాడ సిటీ, న్యూస్‌టుడే



పెరిగిన కృష్ణా వరద ప్రవాహం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణా నది వరద ప్రవాహం బుధవారం పెరిగింది. ఉదయం ఆరు గంటలకు 43,500 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేయగా, సాయంత్రం 5 గంటలకు మరింత పెరిగింది. 15 గేట్లను రెండు అడుగులు, 54 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 60,150 క్యూసెక్కులు విడుదల చేశారు.

పంట కాల్వలకు 5,199 క్యూసెక్కుల విడుదల

కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 5,199 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 2,011, కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వకు 3,007, గుంటూరు ఛానల్‌కు 181 క్యూసెక్కులు ఇస్తున్నారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ 1,000, కేఈబీ 500, ఏలూరు కాల్వలకు 511 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బందరు కాల్వకు నీటి విడుదల లేదు.

ప్రకాశం బ్యారేజీ గేటు మరమ్మతులకు నిధులు

ఈనాడు, అమరావతి: ప్రకాశం బ్యారేజీలో కొంతకాలం కిందట మరమ్మతులకు గురైన 67వ గేటు బాగు చేసేందుకు రూ.9.94 లక్షల మంజూరుకు బుధవారం పాలనాపరమైన అనుమతులు వచ్చాయి. తదుపరి చర్యలు తీసుకోవాలని కృష్ణా డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జలవనరుల శాఖ ప్రత్యేక కార్యదర్శి సాయిప్రసాద్ ఈమేరకు ఉత్తర్వులు విడుదల చేశారు.

చినుకొస్తే చెరువే..!

కాసేపటి వానకే మునిగిన ఆటోనగర్ ✧ చెరువులా పెద్ద రహదారి...



ఇలా కార్యాలయంలోనే పరిస్థితి ఇదీ..

విజయవాడలో బుధవారం మధ్యాహ్నం కాసేపు వర్షం కురిసింది. ఆటోనగర్‌లో ప్రధానమైన వంద అడుగుల రహదారిపై ఆ చివర బందరు రోడ్డు నుంచి ఈ చివర మహానాడు వరకు కనీసం ఓ పది ప్రాంతాల్లో నీళ్లు మోకాళ్ల లోతున నిలిచిపోయాయి. వందడుగుల రహదారి ఒక్కటే ఆటోనగర్‌లో అన్ని ప్రాంతాలనూ కలిపేది. అలాంటి రోడ్డు దారుణ పరిస్థితికి ప్రత్యక్ష నిదర్శనమిది.

చాలాచోట్ల వందడుగుల రోడ్డుపై భారీ గుంతలున్నాయి. వర్షానికి గుంతల్లో నీళ్లు చేరి.. వాహనదారులకు కనిపించక వాటిలో దిగుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం ఆటోనగర్‌లో రహదారులకు మరమ్మతులు చేసి ఎన్నేళ్లయిందనేది అధికారులకే తెలియదు. ఆసియాలో అతిపెద్ద ఆటోనగర్‌లలో ఒకటని గొప్పగా చెప్పుకోవడమే తప్ప.. కనీసం గుంతలు కూడా పూడ్చని దారుణమిది.



అగ్నిమాపక శాఖ కార్యాలయానికి వెళ్లే దారి..



పంటకాలువ రోడ్డు జంక్షన్ వద్ద..

ఆటోనగర్‌లో వాన నీళ్లు వెళ్లేందుకు ఒక్క కాలువ కూడా సరిగా లేదు. ఉన్న కాలువల్లో వేసవిలో పూడికతీత తీస్తే.. కొంతైనా బాగుండేది. కానీ ఏళ్లుగా వీటిని శుభ్రం చేయలేదు. డ్రెయిన్లలో చెత్త పేరుకుని.. నీళ్లు పారే దారేలేదు. చిన్న వర్షం పడితేనే... అన్ని దారుల్లోనూ మోకాలి లోతు నీళ్లు నిలుస్తున్నాయి. ఇక రోజంతా గట్టిగా కురిస్తే.. ఆటోనగర్‌లో అన్ని కార్యకలాపాలు ఆగాల్సిందే. ఎటునుంచి ఎటు వెళ్లాలన్నా.. పడవలను తెచ్చుకోవాల్సిందే.

ఈనాడు, అమరావతి – ఆటోనగర్, న్యూస్‌టుడే

ఆటోనగర్‌ను వదిలేశారు.. ఆటోనగర్.. కార్పొరేషన్‌లోనే ఉన్నా వాళ్లు పట్టించుకోరు. అదే మిగతా ప్రాంతాల్లో వాన నీరు నిలిస్తే.. నగరపాలక సంస్థ క్విక్ రెస్పాన్స్ బృందాలు రంగంలోకి దిగి తొలగిస్తున్నాయి. ఆటోనగర్‌లో ఇలా ఈ పనులన్నీ చేయాలి. కానీ.. ఇలా పాలకవర్గం లేదు. కమిషనర్ లేరు. సమస్య వస్తే ఎవరికి చెప్పాలో తెలియదు. ఆటోనగర్ బాధ్యతలు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు అప్పగించినా.. కనీసం పట్టించుకోవడం లేదు.



ఆటోనగర్ వందడుగుల రహదారిపై..



తేలిన వారధి.. కూల్చిన తీరిది..

ఎన్టీఆర్- గుంటూరు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై ఉన్న కనకదుర్గా వారధిపై ఎక్కడ చూసినా గుంతలే కనిపిస్తున్నాయి. అతుకులు సరిగా లేక వాటిమధ్య ఖాళీల్లో పడి టైర్లు దెబ్బతింటున్నాయి. ఇనుప చువ్వలు బయటకు చొచ్చుకొచ్చి వాహనాల టైర్లలో దిగిపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

- ఈనాడు అమరావతి



చువ్వలు గుచ్చుకుని ట్రాక్టర్ టైరు పాడైందిలా..



ప్రణతులివే.. పరమేశ్వరా..

కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం జిల్లాలో ఆధ్యాత్మికత పరిఢవిల్లింది. భక్తులు వేకువ జామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు పోటెత్తారు. విజయవాడ ఇంద్రకీలాద్రి దిగువన దుర్గాఘాట్‌లో భారీసంఖ్యలో స్నానాలు చేసి దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులతో శివాలయాలు కాంతులీనాయి.

- ఈనాడు, అమరావతి



కాసులు ఒడిసిపట్టు.. కేసులు విడిచిపెట్టు

ఈనాడు, అమరావతి

- ✦ నకిలీ మద్యం వ్యవహారంలో చూసినా చూడనట్లే
- ✦ ఎక్సైజ్, పోలీసుశాఖలో ముగ్గురి వైఖరిపై విచారణ

ఎక్సైజ్, పోలీసు శాఖల్లో కొందరు అధికారులకు తెలిసే నకిలీ మద్యం దందా సాగింది. ప్రతి నెలా మామూళ్లు అందడంతోనే మిన్నకున్నట్లు తెలుస్తోంది. గత నెల 6న ఇబ్రహీంపట్నంలో దందా వెలుగుచూసింది. ఎన్నికల వేళ తయారీ ఆపేసి.. మళ్లీ ఈ ఏడాది ఇబ్రహీంపట్నంలో ప్రారంభించినట్లు ఏ1 జనార్దనరావు వెల్లడించాడు. నాటి నుంచి దందా సాగినా కన్నెత్తి చూడలేదు. ముఖ్యంగా ఎక్సైజ్ శాఖలో ఇద్దరు, పోలీసు శాఖలో ఓ అధికారి మామూళ్ల మత్తులో పట్టించుకోలేదు. వీరి పాత్రపై గుట్టుగా విచారణ చేపట్టారు. తర్వాత వీరిపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే వీలుంది.

* **ప్రతి నెలా ముడుపులు...** ఇబ్రహీంపట్నం నడిబొడ్డున రెండు గోదాముల్లో నకిలీ మద్యం బాట్లింగ్ చేస్తున్నా పసిగట్టడంలో పోలీసులు విఫలమయ్యారు. జనార్దనరావుకు చెందిన ఏఎన్ఆర్ బార్‌లో వీటి అమ్మకాలు సాగించారు. అక్కడి నుంచి బెల్టుషాపులు, విజయవాడలో దుకాణాలకు సరకు తరలించినా పట్టించుకోలేదు. వేల లీటర్ల నకిలీ మద్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి.. రాత్రుళ్లు సీసాల్లోకి నింపుతున్నా లంచనుగా జనార్దనరావు నుంచి భారీగా అందే ముడుపులతోనే తెలియనట్లే నటించారనే విమర్శలున్నాయి. స్థానిక పోలీసులతో జనార్దనరావుకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులనూ మేనేజ్ చేశారు.



తూతూమంత్రంగా తనిఖీలు..: ఏఎన్ఆర్ బార్‌లో నకిలీ మద్యం అమ్మకాలతో భారీగా ఇండెంట్ తగ్గినా ఎక్సైజ్ అధికారులకు అనుమానం రాలేదు. స్టాక్, అమ్మకాల రిజిస్టర్లనూ తనిఖీ చేయలేదు. బార్‌లో నకిలీ మద్యం లూజుగా భారీగా అమ్మినట్లు తెలిసింది. విద్యాధరపురంలో శ్రీనివాస వైన్స్‌లోనూ వేల కేసుల నకిలీ సరకు అమ్ముతున్నా ఏనాడూ ఎక్సైజ్ అధికారులు తనిఖీ చేయలేదు. అమ్మకాలను ప్రత్యేకంగా ఒక షీట్‌లో నమోదు చేశారు. అయినా ఎక్సైజ్ అధికారులకు కనిపించకపోవడం ముడుపుల బంధాన్ని చాటుతోంది. ములకలచెరువులో బయటపడిన తర్వాత ఇక్కడా సోదాలు చేశారు. ముందు రోజే 60 కార్టన్ల నకిలీ మద్యం సీసాలు పారబోశారు. సోదాలపై ముందే సమాచారం ఉండడంతోనే నిందితులు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఇక్కడా పెద్దఎత్తున నకిలీ సరకును అమ్మినట్లు వెలుగుచూసింది.

ఆహ్లాద మడిలో.. ఆనంద క్రీడ



ఇటీవల కాలంలో నగరాల్లో బాక్స్ క్రికెట్‌కు ఆదరణ పెరుగుతోంది. వారాంతాల్లో ఉద్యోగులు, విద్యార్థులు కొంత రుసుము చెల్లించి మరీ ఈ బాక్స్ క్రికెట్ ఆడేందుకు మొగ్గు చూపుతున్నారు. విజయవాడ నగరం నుంచి కరకట్ట మార్గంలో పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామం వద్ద పొలాల మధ్యలో ఉన్న బాక్స్ క్రికెట్ గ్రౌండ్ ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తోంది.

-ఈనాడు, అమరావతి

ప్రధాన కూడళ్లలో.. ఒక్క పైవంతెన లేదేం?

- ☛ లోపభూయిష్టంగా విజయవాడ-బందరు ఎన్‌హెచ్ విస్తరణ డీపీఆర్
- ☛ ఎలివేటెడ్ కారిడార్ లేదా వీయూపీలు నిర్మించాలని నేతల వాణి...



సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ. పక్కన కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్, వర్లకుమార్ రాజా, జేసీలు నవీన్, ఇలక్కియా తదితరులు

ఈనాడు - అమరావతి: విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 విస్తరణకు కన్సల్టెన్సీ తయారుచేసిన డీపీఆర్ లోపభూయిష్టంగా ఉంది. పేరుకే విస్తరణ తప్ప ప్రజలకు ఉపయోగపడే ప్రతిపాదనల్లేవు. అవసరమైన చోట పైవంతనలు, అండర్‌పాస్‌లు లేకుండా అనవసరచోట ఏర్పాటుకు సిద్ధమయ్యారు. విస్తరణ నేపథ్యంలో విజయవాడ కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన భాగస్వాముల సమావేశంలో కన్సల్టెన్సీ డీపీఆర్ గురించి వివరించింది. జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు సదరు డీపీఆర్‌పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజావసరాలకు తగినట్లు మార్చాలని గట్టిగా చెప్పారు.

ఈ విస్తరణతో లాభమేంటి?: కానూరు సిద్ధార్థ కళాశాల నుంచి దావులూరు ఔటర్ రింగ్‌రోడ్డు వరకు 14 కి.మీ. నాలుగు లైన్లకు రెండు వైపులా సర్వీస్ రోడ్లు నిర్మిస్తారు. అక్కడ నుంచి మచిలీపట్నం వరకు 44 కి.మీ ఆరు వరుసలుగా విస్తరిస్తారు. ✪ డీపీఆర్‌లో బెంజ్ సర్కిల్ నుంచి ఓఆర్ఆర్ మొదలయ్యే చినఓగిరాల వరకు ఒక్క అండర్‌పాస్ లేదా పైవంతెన లేవు. ✪ ఎన్టీఆర్ సర్కిల్ మొదలు ఆటోనగర్, తాడిగడప, పోరంకి, పెనమలూరు, గంగూరు, ఈడుపుగల్లు కూడళ్లలో ట్రాఫిక్ సమస్యతో జనానికి నిత్యం నరకమే. ట్రాఫిక్ ఇబ్బంది లేని ఓఆర్ఆర్ అవతల 11 వెహికల్ అండర్‌పాసులు ప్రతిపాదించారు. దీంతో ఎలాంటి లాభం లేదని సభ్యులు వ్యతిరేకించారు. ✪ రద్దీ ఎక్కువ ఉన్న ఆ ఏడు కూడళ్లలో అండర్‌పాస్‌లు నిర్మించాలని లేదంటే ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సూచించారు. ఆ ప్రాంతంలో మెట్రో ప్రతిపాదనలు ఉన్నాయని కన్సల్టెన్సీ చెప్పగా ఎన్‌హెచ్ 65కి.. మెట్రోను ముడిపెట్టవద్దని అవి నిర్మించేలోగా ప్రజల ఇబ్బందులు పెరుగుతాయన్నారు. ✪ ఒక వేళ మెట్రో వచ్చినా సమస్య లేకుండా డబుల్ డెక్కర్ నిర్మించాలని సూచించారు. మార్పులు చేసిన ప్రతిపాదనలతో మళ్లీ డీపీఆర్‌ను రివైజ్ చేయాలని సూచించారు. ✪ వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు కేంద్రం రూ.2,600 కోట్లు కేటాయించింది. ఈ డీపీఆర్ ప్రకారం ప్రాజెక్టు వ్యయం రూ.900 కోట్లు అవుతోంది. ప్రజాప్రతినిధులు అడిగినవన్నీ చేపట్టేందుకు బడ్జెట్ సమస్య కూడా లేనందున అన్నీ సాకారమయ్యే వీలుంది.

ఎన్‌హెచ్‌ల అనుసంధానంపై దృష్టి..

✦ ఎన్‌హెచ్65ను ఎన్‌హెచ్ 16ని అనుసంధానించేలా తాడిగడప-ఎనికేపాడు వరకు 4 కిమీ, పోరంకి-నిడమానూరు వరకు 6 కి.మీ, కంకిపాడు-కేసరపల్లి మధ్య 10 కి.మీ మేర మొత్తం 20 కిమీ దారులు నిర్మించాలని, నిర్వహణ బాధ్యత ఎన్‌హెచ్ఏఐ తీసుకుంటే విమానాశ్రయానికి సులువుగా వెళ్లవచ్చని సూచించారు. ప్రస్తుతం ఎన్‌హెచ్‌పై డ్రెయినేజీ వ్యవస్థ బాగోలేదనీ, వాన పడితే అండర్‌పాస్‌ల దగ్గర నీరు నిలుస్తోందన్నారు. ఎన్‌హెచ్‌పై సెంట్రల్ లైటింగ్ సరిచేయాలని తెలిపారు. ఎమ్మెల్యేలు బోడే ప్రసాద్, గద్దె రామ్మోహన్, వర్లకుమార్ రాజా, కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ, ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆ నగదు ఖజానాకు జమ చేయండి: కమిషనర్

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: కార్పొరేటర్ల విజ్ఞాన యాత్రను రద్దు చేసినందున నగరపాలక సంస్థ అధికారులు అడ్వాన్సు కింద ముందుగా చెల్లించిన రూ.25 లక్షలను వెంటనే ఖజానాకు తిరిగి జమ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పాలకపక్షానికి సూచించారు. ఇప్పటికే యాత్రకు సంబంధించి దాదాపు 48 మంది కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందికి గన్నవరం, రాజమండ్రి నుంచి ముంబయి వరకు విమాన టిక్కెట్లు బుక్ చేయగా.. వెంటనే వాటిని రద్దు చేయించి సంబంధిత ట్రావెల్ ఏజెన్సీ నుంచి సొమ్మును వాపస్ తీసుకోవాలని సూచించారు. కార్పొరేషన్ ఖజానా నుంచి విడ్‌డ్రా చేయించిన మొత్తం సొమ్మునకు సంబంధించి అడ్వాన్సులు, ఇతర రూపంలోని చెల్లింపులు, వాపస్ తీసుకున్న సొమ్ము లెక్కల నివేదిక సమర్పించాలని, ఆయా వివరాలతో కూడిన దస్త్రాలను సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో దొడ్ల ట్రావెల్ వారితో పాలకపక్షం సభ్యులు, బాధ్యులైన అధికారులు బుధవారం ఉదయం నుంచి ప్రధాన కార్యాలయంలో కూర్చుని చర్చించారు.

ముడుపుల సొమ్ము స్వాధీనం!

- ● అదనంగా ఉన్న రూ.74 వేలు గుర్తింపు
- ● అనధికారిక ఉద్యోగులతో అడ్డగోలు వసూళ్లు

ఈనాడు - అమరావతి, న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం: అనధికారిక ఉద్యోగులతో విధులు.. అదనంగా ఉన్న నగదు.. ప్రైవేటు వ్యక్తుల హవా.. ఇదీ ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ సోదాల్లో బయటపడింది. రాష్ట్రంలో ఎంపిక చేసిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం నుంచి ఇబ్రహీంపట్నంలోనూ మొదలయ్యాయి. అనిశా డీఎస్పీ సుబ్బారావు ఆధ్వర్యంలో తనిఖీలు బుధవారం అర్ధరాత్రి వరకూ కొనసాగాయి. పలు లొసుగులు వెలుగుచూశాయి. ఇటీవల ఇబ్రహీంపట్నం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై పలు అవినీతి ఆరోపణలు ఏసీబీకి అందగా దీనిని ఎంచుకున్నారు.

అదనపు సొమ్ము గుర్తింపు... వాస్తవ లావాదేవీల కన్నా అధిక సొమ్మును తనిఖీల్లో గుర్తించారు. రూ.74,600 ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరి నుంచి వసూలు చేశారనే... విషయాలను అధికారులు, సిబ్బందిని అడిగి వివరాలు రాబట్టారు. ముడుపుల రూపంలో వసూలు చేసిన సొమ్ముగా గుర్తించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాజధాని పనులు ఊపందుకోగా.. విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి వెంట భూముల ధరలు పెరిగాయి. సబ్‌రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. ఎవరూ లేకపోవడంతో ప్రస్తుతం సీనియర్ ఎకౌంటెంట్.. ఇన్‌ఛార్జిగా ఉన్నారు. పూర్తిస్థాయి అధికారి లేక పలు అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ఫిర్యాదులు అందాయి. వీటిని తేల్చేందుకు ఏసీబీ అధికారులు దస్తావేజులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.

అనధికార ఉద్యోగులు... కార్యాలయంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు పెత్తనం చేస్తున్నట్లు గుర్తించారు. వీరితోపాటు ముగ్గురు అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నట్లు తేలింది. వీరు ఎవరని? ప్రశ్నిస్తే.. సిబ్బంది కొరత ఎక్కువగా ఉందని.. దీంతో ప్రైవేటుగా ముగ్గురిని నియమించుకున్నట్లు అక్కడి అధికారులు సమాధానమిచ్చారు. ఈ ముగ్గురు డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు జరిగాయా? అడ్డగోలుగా రిజిస్ట్రేషన్ చేశారా? అని క్షుణ్ణంగా చూస్తున్నారు. అదనంగా దొరికిన సొమ్ముపై కేసు నమోదు చేసే వీలుండగా.. సోదాలు గురువారమూ జరగనున్నాయి.


ఇంద్రకీలాద్రిపై దీపాలు వెలిగిస్తూ..


కోటి దీపోత్సవం ప్రారంభిస్తున్న ఈవో శీనానాయక్, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, స్థానాచార్యులు తదితరులు


జ్వాలాతోరణం..


కళాకారుల నృత్య ప్రదర్శన


వన్‌టౌన్ పాత శివాలయంలో రద్దీ


యనమలకుదురు కొండపై స్వామివారి దర్శనానికి బారులుతీరి..

కార్తిక దీపం.. ఆధ్యాత్మిక సౌరభం..

కార్తిక పౌర్ణమి నేపథ్యంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజామునే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి.. భక్తిశ్రద్ధలతో కార్తిక దీపాలు వెలిగించారు. మా ఇంట నిత్య వెలుగులు నింపాలని వేడుకున్నారు. స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. ఇంద్రకీలాద్రిపైన దుర్గగుడి, కృష్ణా నదీ తీరం భక్తులతో నిండిపోయింది. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. - ఈనాడు, అమరావతి


దుర్గా ఘాట్‌లో....


యనమలకుదురులో శివలింగానికి అభిషేకాలు

సమాచార కేంద్రాన్ని వినియోగించుకోవాలి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: కనకదుర్గానగర్‌లో ఏర్పాటు చేసిన సమాచార కేంద్రాన్ని భక్తులు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని దుర్గగుడి పాలకమండలి ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ తెలిపారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం కనకదుర్గానగర్‌లో నూతనంగా నిర్మించిన సమాచార కేంద్రాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఆర్జిత సేవలు, దర్శనం, విరాళాల చెల్లింపుల కోసం కొండపైకి రాకుండా ఈ కేంద్రంలోనే సేవలు తీసుకోవచ్చన్నారు. ఆక్రమణదారుల గుప్పెట్లో ఉన్న దేవస్థానం స్థలంలో భక్తుల ఉపయోగపడే విధంగా సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాత్కాలికంగా ప్రసాదాల కౌంటరు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం స్థానాచార్య శివప్రసాద శర్మ, ఏఈవోలు చంద్రశేఖర్, శ్రీనివాస్, ఈఈ రాంబాబు పాల్గొన్నారు.

జిల్లా టీటీ జట్ల ఎంపిక నేడు

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: స్థానిక ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ(ఐజీఎంసీ) స్టేడియంలోని జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం హాల్‌లో ఈ నెల 6వ తేదీన జిల్లా అండర్-15 బాలబాలికల, సీనియర్(స్త్రీ, పురుషుల) టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం సంయుక్త కార్యదర్శి బి.శ్రీనివాస్ తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఉదయం 8 గంటలకు స్టేడియంలో శిక్షకులు ఎస్‌కే పాషా, అక్రమ్‌లకు రిపోర్టు చేయాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి మూడు రోజులు విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

గంట వాన.. అదిరే గుండెలోన..


పటమట సచ్చిదానంద ఆశ్రమం సమీపంలో మూడు రోడ్లు జలమయం


మోకాలి లోతు నీళ్లల్లో గ్యాస్ బండ తీసుకొస్తూ..


అవస్థలు పడుతూ ..

గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి నగరం జలమయమైంది. బెంజిసర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు రోడ్లన్నీ నీటమునిగాయి. గుణదల సచ్చిదానంద ఆశ్రమం వద్ద నీరు పారేందుకు దారిలేక నాలుగు వీధులు మోకాలి లోతు నీరు నిలిచి స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఇళ్లలోకి నీరు చేరడంతో ఇక్కట్లు ఎదుర్కొన్నారు. ఇప్పుడు మళ్లీ వర్షపునీరు నిలిచిపోవడంతో కాలువలు శుభ్రం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్‌లోనూ పలు వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోయి ఎక్కడ కాలువలో పడిపోతామేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మోటారు పెట్టి నీళ్లు తోడుతున్నా, ఎన్ని రోజులని ఇలా నెట్టుకొస్తాం.. శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - ఈనాడు, అమరావతి


బందరు రోడ్డులో చోదకుల ఇక్కట్లు

రాష్ట్రం సర్వనాశనం కావాలన్నదే జగన్ ఆకాంక్ష

భారతీరెడ్డి రూ. 400 కోట్ల విలువైన బంగారం కొన్నారు

భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వ్యాఖ్యలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

భవానీపురం - న్యూస్‌టుడే

'రాష్ట్రం సర్వనాశనం కావాలన్నదే జగన్ ఆకాంక్ష. ఆతనికి పదవి, డబ్బులు ఉంటే చాలు.. ధర్మం, న్యాయం అవసరం లేదు. రాష్ట్రంలో కూటమి బలం క్రమంగా పెరుగుతోంది. జగన్ బలం తగ్గుతోంది. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపాను ప్రజలు తరిమికొట్టారు.' అని భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి విమర్శించారు. బుధవారం విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. 'మద్యం, వివేకానందరెడ్డి హత్య కేసుల్లో జగన్ పాత్ర త్వరలో బయటపడుతుంది. అరెస్టు కావడం ఖాయం. పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో వైకాపాను ప్రజలు తరిమికొట్టారు. జగన్, భారతీరెడ్డిలు ఏ దారుణానికైనా పాల్పడతారు. ఆమె రూ. 400 కోట్లు విలువైన బంగారాన్ని కొనుగోలు చేశారు. వివేకానందరెడ్డిని చంపించింది వీళ్లే. అసలు దోషులు త్వరలో బయట పడతారని వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్.. సూపర్ హిట్ అయిందన్నారు. త్వరలో జగన్‌కు సూపర్ చెక్ పెట్టబోతున్నామని, అధోగతి తప్పదని హెచ్చరించారు. ప్రజలు ఛీకొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. డైనోసార్ మాదిరిగా జగన్ అంతరించిపోవడం ఖాయమన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు భారతీరెడ్డి రాజ్యాంగం

'జగన్ అధికారంలో ఉన్నప్పుడు భారతీ రాజ్యాంగాన్ని అమలు చేశారు. నాదే రాజ్యాంగం, నాదే రాజ్యం అన్నట్లు ప్రవర్తించారు. కాశీబుగ్గ, సింహాచలంలో భక్తులు చనిపోతే ప్రభుత్వ వైఫల్యంగా సాక్షిలో ప్రచురించి బురదజల్లారు. జగన్ లాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదు. పూర్తిగా తరిమికొట్టాలి. మేకపాటి రాజమోహన్‌రెడ్డి వ్యాఖ్యలు చూస్తేనే వైకాపా నాయకులు సిగ్గు తెచ్చుకోవాలి. రానున్న రోజుల్లో అమరావతి, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణం పూర్తవుతాయి.' అని వివరించారు. కేంద్రం ఎంపిక చేసిన ఆరు రాష్ట్రాల్లో ఏపీ కూడా ఉందని, రాష్ట్రంలోని ప్రాజెక్టులకు రూ.65 వేల కోట్ల నిధులు కేటాయించనున్నారని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు విమానాశ్రయాలు, సాగరమాల కింద నాలుగు పోర్టులు రానున్నాయని వెల్లడించారు. మిగతా రాష్ట్రాల కంటే ఎక్కువగా గృహాలను మంజూరు చేశారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలసికట్టుగా పోటీ చేసి సత్తాచాటుతామని తెలిపారు.

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఊంజల్ సేవలో పాల్గొన్నారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ శ్రీనివాసరెడ్డికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో వెంకటరెడ్డి

రసాయన ఎరువుల వాడకంతో నష్టాలు


భూమాత రక్షణ కమిటీ సభ్యులతో సమావేశమైన కలెక్టర్ లక్ష్మీశ

పాయకాపురం, న్యూస్‌టుడే : రసాయన ఎరువుల వినియోగం వల్ల పంటకు, భూమికి నష్టం అధిక నష్టం వాటిల్లుతుందని కలెక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ (మదర్ ఎర్త్ ప్రొటెక్షన్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రసాయన ఎరువుల స్థానంలో జీవ ఎరువుల(బయో ఫెర్టిలైజర్స్)ను ప్రోత్సహించాలని కోరారు. రైతులను చైతన్యపరచాలని అధికారులకు సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడేందుకు.. సుస్థిర వ్యవసాయ పద్ధతులు ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం భూమాత రక్షణ కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా సబ్ డివిజన్, గ్రామ స్థాయిలో వివిధ శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, 12వ తేదీ నాటికి గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. గ్రామాలు, సొసైటీల వారీగా ఎరువుల వినియోగాన్ని పరిశీలించాలని చెప్పారు. డ్రోన్‌లు ఉన్న గ్రామాల్లో లిక్విడ్/ నానో యూరియా వినియోగించాలని పేర్కొన్నారు. ఎరువులు పక్కదారి పట్టకుండా ఈ కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో కేసులు నమోదైన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో సభ్యులు పర్యటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి భూమాత రక్షణ కమిటీ సభ్యులైన జడ్పీ సీఈవో కె. కన్నమనాయుడు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి.ఎం.ఎఫ్. విజయకుమారి, పోలీస్ అధికారి తిరుమలేశ్వరరెడ్డి, జిల్లా సహకార శాఖ అధికారి త్రినాథ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రవికిషోర్, ఏడీ అనిత, ఎరువుల కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డీసీపీ బాధ్యతల స్వీకరణ

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ శాంతి భద్రతల విభాగం డీసీపీ-1గా కృష్ణకాంత్ పాటిల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం శాంతిభద్రతల విభాగం డీసీపీ కృష్ణకాంత్ పాటిల్‌ను ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.


సీపీ రాజశేఖరబాబుకు మొక్క అందిస్తున్న కృష్ణకాంత్ పాటిల్

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: నగరంలోని బిషప్ అజరయ్య బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం నిర్వహించారు. డీఈవో యూవీ సుబ్బారావు హాజరయ్యారు. విజయవాడ కార్పొరేషన్‌లో ఖాళీగా ఉన్న సబ్జెక్ట్ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, గత సంవత్సరం పదో తరగతి విద్యార్థుల కోసం వంద రోజుల కార్యాచరణ కార్యక్రమంలో సెలవు దినాల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు పది రోజులు సీసీఎల్ సెలవులు ఇవ్వడంతో పాటు తదితర సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, సుందరయ్యలు డీఈవోకు వినతి పత్రం అందజేశారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మండల విద్యాశాఖాధికారులు, ఉప విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.


డీఈవో సుబ్బారావుకు వినతి పత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు, సుందరయ్య తదితరులు

నూతన అంబులెన్సు బహూకరణ

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించే విధంగా నూతన అంబులెన్సును హైదరాబాద్‌కు చెందిన ఓ ఫార్మా కంపెనీ ప్రతినిధులు బుధవారం దుర్గగుడి అధికారులకు అందజేశారు. పాలకమండలి ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ అంబులెన్సును పరిశీలించారు. భక్తుల సేవకు ఇటీవలలో దాతలు ఇచ్చిన అంబులెన్సును ఘాట్ రోడ్డు మార్గంలో వినియోగిస్తున్నామన్నారు. ఈ అంబులెన్సును కనకదుర్గానగర్ మెట్ల మార్గం వద్ద ఉంచి అత్యవసర వైద్య సేవలకు వినియోగిస్తామని అధికారులు తెలిపారు.


దాత అందజేసిన నూతన అంబులెన్సు పరిశీలిస్తున్న ఈవో శీనానాయక్, ఛైర్మన్ రాధాకృష్ణ

వత్సవాయిలో 26.2 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : జిల్లాలోని 5 మండలాల్లో వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. వత్సవాయి 26.2 మి.మీ., నందిగామ 8.2, పెనుగంచిప్రోలు 3.2, జగ్గయ్యపేట 2.2, గంపలగూడెంలో 1.6 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

జగన్‌కు బీసీలు ఇప్పుడు గుర్తొచ్చారా : మంత్రి సవిత

గొల్లపూడి, న్యూస్‌టుడే: కల్తీ మద్యం తయారీ, అమ్మకం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అరెస్టయినప్పుడు మాత్రమే జగన్‌కు బీసీలు గుర్తొచ్చారా అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ బీసీ కార్పొరేషన్‌ల ఛైర్మన్లు, డైరెక్టర్లతో గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వైకాపా పాలనలో బీసీలపై తప్పుడు కేసులు బనాయించి, అక్రమ అరెస్టులు చేసినప్పుడు ఎందుకు గుర్తుకు రాలేదని, ఇప్పుడు జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. నా బీసీలంటూ జగన్ ఓట్లు వేయించుకుని, అయిదేళ్ల పాటు అన్ని విధాలుగా వెనుకబడిన వర్గాలను అణగదొక్కారని ఆరోపించారు. స్వార్థపూరిత రాజకీయాలకు జగన్ కేరాఫ్ అడ్రస్ అని మండిపడ్డారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని, ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెట్టి అక్రమ అరెస్టు చేయించిన చరిత్ర జగన్‌దేనన్నారు. జోగి రమేష్‌పై ఉన్న ప్రేమ బీసీలపై లేదన్నారు. కల్తీమద్యం తయారీలో ఎంతటి వారున్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెదేపా ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కుల, చేతి వృత్తుల వారికి ఆధునిక పరికరాలను అందజేసి శాశ్వత ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రూ.వెయ్యి కోట్ల నిధులతో ఆదరణ-3 పథకానికి శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. సమావేశంలో బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్, డైరెక్టర్లు పాల్గొన్నారు.


ఛైర్మన్‌లతో మాట్లాడుతున్న మంత్రి సవిత

రెడ్‌క్రాస్.. మనోబంధు సేవలు ప్రశంసనీయం

పాయకాపురం, న్యూస్‌టుడే: ఏ ఒక్క మానసిక రోగి నిరాశ్రయులుగా రోడ్లపై ఉండకూడదని, అందరూ సురక్షితంగా ఆసుపత్రులు, లేదా షెల్టర్ భవనాల్లో ఉండాలనే లక్ష్యంతో రెడ్‌క్రాస్ సొసైటీ, మనోబంధు సంస్థలు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. దీనికి సంబంధించిన గోడ పత్రాలను బుధవారం కలెక్టరేట్‌లో ఆయా సంస్థల ప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. మానసిక ఆరోగ్య పరిరక్షణ చర్యలు, సేవలను కొనసాగించాలని కోరారు. ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలను సమాజం సానుకూల దృక్పథంతో చూడాలని, బాధితులను ఆదరించడం, సమస్యలు వినడం, ప్రోత్సహించడం చేయాలని పేర్కొన్నారు. ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, మనోబంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణ రాజు, రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ వెలగా జోషి పాల్గొన్నారు.

దౌర్జన్యం కేసులో 20 మంది జోగి అనుచరుల గుర్తింపు

పటమట: కల్తీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, ఆయన సోదరుడు రాముకు వైద్య పరీక్షలు నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లిన సమయంలో పోలీసులను దౌర్జన్యంగా నెట్టేసి అద్దాలు పగలగొట్టిన ఘటనపై 20 మంది నిందితులను వీడియోల ఆధారంగా మాచవరం పోలీసులు గుర్తించారు. వారందరూ మైలవరం, ఇబ్రహీంపట్నంకు చెందిన జోగి అనుచరులని తేలింది. ఇంకా మరికొంత మందిని గుర్తించే పనిలో పోలీసులు ఉన్నారు. మరో 50 మందికి పైగా దాడిలో ఉన్నట్లు సమాచారం. పథకం ప్రకారమే దౌర్జన్యానికి పాల్పడినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. నేరపూరితంగానే దాడికి పాల్పడంపై అదనపు సెక్షన్లను చేర్చే ఆలోచనలో పోలీసులు ఉన్నారు. ప్రభుత్వాసుపత్రిలో వైకాపా శ్రేణులు వీరంగం చేయడంపై సీపీ రాజశేఖరబాబు గతంలోనే పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

బ్రాయిలర్ ధరలు

(కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -109 రిటైల్ ధర 134 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 130, 139, 150 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 585 (వాణిజ్యం & పరిశ్రమల సహాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.96/-.

వంశీ బెయిల్ షరతుల సడలింపులపై ముగిసిన విచారణ

ఈనెల 10న తీర్పు వెల్లడించనున్న ఎస్సీ, ఎస్టీ కోర్టు...

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో వైకాపా నేత వంశీ దాఖలు చేసుకున్న బెయిల్ షరతులు సడలింపు పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. బుధవారం విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ కోర్టులో ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. దీనిపై ఇరువర్గాల వాదనలు ముగిశాయి. ప్రస్తుతం అమలులో ఉన్న రెండో, నాలుగో శనివారాలు పటమట స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలన్న షరతులు ఉన్నాయి. అనారోగ్య కారణాల రీత్యా సడలించాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. తీర్పు నిమిత్తం ఈనెల 10వ తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు.

ముందస్తు బెయిల్ పిటిషన్లపై.. ఇదే కేసులో పరారీలో ఉన్న నిందితులు యతీంద్ర రామకృష్ణ, తేలప్రోలు రాములు వేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై పోలీసులు కౌంటర్లు దాఖలు చేశారు. కేసు ఇంకా విచారణలో ఉందని, వీరికి ముందస్తు బెయిల్ ఇవ్వొద్దని వాటిల్లో పేర్కొన్నారు. వీటిపై వాదనల కోసం 10వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. మరో నిందితుడు వజ్రకుమార్.. ముందస్తు బెయిల్ కోసం బుధవారం పిటిషన్ దాఖలు చేశాడు. కౌంటరు దాఖలు కోసం ఈనెల 10వ తేదీకి వాయిదా పడింది.

'పరామర్శ పేరుతో జగన్ దండయాత్ర'


మాట్లాడుతున్న బుద్ధా వెంకన్న

పటమట, న్యూస్‌టుడే: కృష్ణా జిల్లాలో రైతుల పరామర్శకని వెళ్లి పూలవర్షం కురిపించుకున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న విమర్శించారు. రైతులు ఓట్లు వేయలేదనే అక్కసుతో పరామర్శ పేరుతో దండయాత్రలా వెళ్లారని మండిపడ్డారు. బుధవారం గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు వార్నింగ్ ఇచ్చే స్థాయి జగన్‌కు లేదన్నారు. జగన్‌ది మైనింగ్, ఫ్యాక్షన్ కుటుంబమైతే.. చంద్రబాబుది రైతు కుటుంబమని పేర్కొన్నారు. జగన్ తన పాలనలో మూడేళ్లు ఫసల్ బీమా యోజనకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన సొమ్ము చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 92 శాతం మంది రైతులకు బీమా అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. 5 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగితే.. 15 లక్షల ఎకరాల్లో జరిగిందని చెప్పడం జగన్ అబద్ధాలకు పరాకాష్ట అని బుద్ధా మండిపడ్డారు. రైతులను పరామర్శించడానికి వెళ్తే పెయిడ్ ఆర్టిస్టులతో ర్యాలీ చేయడం ఎందుకని ప్రశ్నించారు. తుపానుకు వారం ముందు బెంగళూరు వెళ్లి.. తగ్గిన వారానికి రాష్ట్రానికి వచ్చిన జగన్‌కు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కొండపల్లి: 8008574656, జి.కొండూరు 9063144762

? గుంటుపల్లి గ్రామంలోని ఖాజీపేటలో మురుగు కాలువల్లో మురుగు పారుదల లేక దుర్వాసనతో పాటు దోమల బెడద ఎక్కువై అనారోగ్య పరిస్థితులు నెలకొన్నాయి. **- డి. లక్ష్మణనాయక్, స్థానికుడు** ✔ ఒకటి, రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తాం. **- మురళీ ప్రసాద్, గ్రామ కార్యదర్శి**

? నరసాపురం - చిన్నంపేట వెళ్లే మార్గం డంపింగ్ యార్డులా మారింది. మృతిచెందిన కుక్క కళేబరాన్ని రోడ్డుపై అడ్డుగా వేయడంతో దుర్వాసన వస్తోంది. **- వాహనదారులు** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయిస్తాం. **- జి.స్వాతి, పంచాయతీ కార్యదర్శి, నరసాపురం.**

– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం, విస్సన్నపేట

? జి.కొండూరు గ్రామ శివారు గొల్లగూడెంలో కాలువల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన, దోమలతో అవస్థలు పడుతున్నాం. **- వెంకట్రావు గ్రామస్థుడు** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది తక్షణమే సిబ్బందిని పంపించి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- బసవలింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి**

స్పందనకు వందనం



★ వెల్లటూరు ఉన్నత పాఠశాల సమీపంలో పంచాయతీ బోరు మరమ్మతులకు గురై నీటి సరఫరాకు అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 5వ తేదీన ప్రచురించగా పంచాయతీ కార్యదర్శి మురళి స్పందించారు. సిబ్బందితో బోరు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

★ గొల్లపూడి సూరాయిపాలెంలో వీధిదీపాలు వెలగడం లేదని పంచాయతీ అధికారులకు తెలుపగా కొత్తవాటిని ఏర్పాటు చేయించారు. ★ రామరాజ్యనగర్ ప్రాంతానికి పారిశుద్ధ్య సిబ్బంది సక్రమంగా రావడం లేదని పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు తెలియజేయగా స్పందించారు. సిబ్బందిని పంపి వీధులను శుభ్రం చేసి కాలువల్లోని పూడికలు తీయించారు. ★ పట్టణ 17వ వార్డులోని ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిలిచి దోమల బెడద ఎక్కువైందని స్థానికుడైన శ్రీధర్ చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి దోమల నివారణ మందు చల్లించారు. ★ పట్టణంలోని 16వ వార్డులో గల ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిలిచి దోమల బెడద ఎక్కువైందని స్థానికులు చేసిన ఫిర్యాదుపై శానిటరీ అధికారి స్పందించారు. సిబ్బందిని పంపి దోమల నివారణ మందు చల్లించారు. – న్యూస్‌టుడే, జి.కొండూరు, గొల్లపూడి, తిరువూరు టౌన్

60 మందికి కంటి వైద్య పరీక్షలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కొత్తరెడ్డిగూడెం గ్రామంలోని కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు సిహెచ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శిబిరాన్ని మండల పరిషత్తు ఉపాధ్యక్షుడు సిహెచ్.రాబర్ట్స ప్రారంభించారు. వైద్యనిపుణులు పి.లక్ష్మీకుమారి వైద్యసేవలు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమ శాతం పరిశీలన, రికార్డులు నిర్వహణ, వాహనాల నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి, ఏవో డి.శ్రీనివాసరావు, పీడీఎస్ డీటీ శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



భక్తులపై పడిన జ్వాలా తోరణం నిప్పురవ్వలు

మైలవరం, న్యూస్‌టుడే: కార్తికపౌర్ణమి సందర్భంగా స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన జ్వాలాతోరణం నుంచి నిప్పు రవ్వలు భక్తులపై పడ్డాయి. ఈక్రమంలో అక్కడే బందోబస్తులో ఉన్న ఎస్సై సుధాకర్, సిబ్బంది తోరణం కింద ఎవరూ లేకుండా పక్కకి తీసుకెళ్లడంతో ప్రమాదం తప్పింది.

బీరువా వితరణ

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక బాలికోన్నత పాఠశాల ప్లస్‌లో ఉపయోగార్థం జీఎస్‌ఆర్ వెంచర్స్ నిర్వాహకులు బీరువాను, ప్రధానోపాధ్యాయుడు వై.రాజశేఖర్ ద్వారా పాఠశాలకు బుధవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా దాతను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఆలయాల్లో కార్తిక శోభ

నెమలి, ఊటుకూరు, పెనుగొలను, మేడూరు(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని నెమలి వేణుగోపాలస్వామి గుడిలో బుధవారం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మాసకల్యాణం అర్చకులు గోపాలాచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. ఘనంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై ఆసీనులైన కన్యాదాన క్రతువులో పాల్గొన్నారు. ఊటుకూరు కోదండ రామాలయంలో రమా సహిత సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం అర్చకుల రామకృష్ణాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు పలువురు దంపతులు పాల్గొన్నారు. మెట్లగట్టు శేషాచల శ్రీనివాస గుడిలో సాయంత్రం అభిషేక కమిటీ సభ్యులు, అర్చకుల ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ, జ్వాలా తోరణం వెలిగించారు. గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి గుడి వరకు శ్రీరామసేవకులు ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా పాదయాత్ర చేశారు.

ఆలకిస్తాం.. సమస్యలు అధిగమిస్తాం

మైలవరం, న్యూస్‌టుడే

ప్రజలకు అత్యవసర విభాగంగా ఉన్న విద్యుత్తుశాఖ ద్వారా కలుగుతున్న సమస్యలు, ఇబ్బందులను ఆలకించి, సత్వరమే అధిగమించేలా చర్యలు తీసుకుంటున్నామని విద్యుత్తుశాఖ మైలవరం సబ్ డివిజన్ డీఈఈ వి.సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన డయల్ యువర్ డీఈఈ కార్యక్రమానికి మైలవరం, జి.కొండూరు మండలాల నుంచి పలువురు ఫోన్ చేసి తమ సమస్యలు తెలపగా.. సత్వరమే చర్యలు చేపట్టేలా మండలస్థాయి ఏఈలకు సూచనలిచ్చారు.

ఈనాడు మీతోడు



డయల్ యువర్ డీఈఈలో ప్రజల సమస్యలు నమోదు చేసుకుంటున్న డీఈఈ సుధాకర్

సమస్య: మా గ్రామంలోని రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఇబ్బందికరంగా ఉంది. గతంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. **- వెంకట్రావు, వెలగలేరు, జి.కొండూరు**

డీఈఈ: జి.కొండూరు ఏఈతో పాటు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నాం. తగినంత ఎత్తులోనే నియంత్రిక ఉంది. కంచె ఏర్పాటుకు చర్యలు చేపడతాం.

? ఇంటిపై సోలార్ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. ఏర్పాటుకు ఏం చేయాలి. **- ఎస్.సత్యనారాయణ, మైలవరం**

✔ పీఎం సూర్యఘర్ పథకం కింద ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ సోలార్ యూనిట్ ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వ రాయితీతో పాటు, వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా బ్యాంక్ రుణంగా ఇప్పిస్తాం. లబ్ధిదారులు వాటాగా చెల్లించక్కర్లేదు. ఒక కిలోవాట్ ద్వారా నెలకు 120 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తవుతుంది. మిగులు విద్యుత్తును, తిరిగి మూడు నెలలకోసారి చెల్లిస్తాం. దాదాపు 100 సంస్థలకు పైగా యూనిట్లను ఏర్పాటు చేస్తున్నాం. వారితో మీరే బేరమాడుకోవచ్చు.

? సర్వీస్ కేబుళ్ల ఇబ్బందితో వ్యవసాయ మోటార్లకు విద్యుత్తు సరఫరా జరగడం లేదు. పది మంది వరకు రైతులు ఇబ్బంది పడుతున్నాం. **-వాసుదేవరావు, గడ్డమణుగు**

✔ పరిశీలించి, కొత్త సర్వీస్ కేబుల్‌ను ఏర్పాటు చేయిస్తాం.

? 5 నెలల కిందట వ్యవసాయ సర్వీస్ నిమిత్తం డబ్బు చెల్లించి, డీడీ చెల్లించాం. ఇంకా సర్వీస్ ఇవ్వలేదు. **-పి.తేజేష్బాబు, కొత్త మంగాపురం, మైలవరం**

✔ దరఖాస్తులను ప్రాధాన్య క్రమంలో వ్యవసాయ సర్వీసులను మంజూరు చేస్తాం. ప్రస్తుతం మైలవరం మండలంలో మే నెల వరకు, జి.కొండూరులో మార్చి వరకు వచ్చిన దరఖాస్తులకు పరిష్కారం జరిగింది. మిగతా వాటికి త్వరలో సర్వీస్ ఇస్తాం.

? మైలవరం దేవినేనివెంకటరమణ సత్య కాలేజీ సమస్త ఇబ్బందులు పడుతున్నాం. **- అక్బర్, మైలవరం**

✔ పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాం.

? మా గ్రామంలో పలు వీధిదీపాలు వెలగడం లేదు. కొన్ని చోట్ల చెట్లు తీగలపై పడుతుండడంతో, సరఫరా అంతరాయం ఏర్పడుతోంది. **- జీవీ నరసింహారావు, మునగపాడు, జి.కొండూరు**

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.

? ఏ స్తంభానికి చూసినా తీగలు గుట్టలుగా కనిపిస్తున్నాయి. వాటి ద్వారా సరఫరా జరిగితే ప్రమాదాలు కలుగుతుంది. **-శ్రీనివాస కుమార్, మైలవరం**

✔ విద్యుత్తు స్తంభాలకు కేబుళ్లు ఏర్పాటు అనుమతులు లేవు. చర్యలు తీసుకుంటాం.

చెరకు పంటతో లాభాలు

కొండపల్లి, న్యూస్‌టుడే: మెట్ట, మాగాణి భూములకు అనుకూలంగా చెరకు పంట ఉన్నా యని వాటిని పండించి రైతులు లబ్ధి పొందాలని కేసీపీ షుగర్ కంపెనీ అధికారులు పేర్కొన్నారు. చెరకు వ్యవసాయ విధానం, లాభాలపై అవగాహన కార్యక్రమాన్ని ఈల ప్రోలులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ డీజీఎం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..చెరకు సాగు చేసిన రైతుకు టన్నుకు రూ.3690 కంపెనీ చెల్లిస్తుందన్నారు. ముందుగా రైతులను ప్రోత్సహించడానికి ఎకరాకు 10 వేల మొక్కలు అప్పుగా ఇస్తామన్నారు. లంక భూముల నుంచి రవాణా నిమిత్తం కంపెనీ ఆర్థిక సాయం అందిస్తుందని చెప్పారు. ఎకరా పంటకు సుమారు పద్ధతి ద్వారా రైతులు రూ.20 వేలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకుని చెరకు పంట సాగు చేయాలని కోరారు. ఇందుకు గ్రామ రైతులు కొందరు ముందుకు రావడంతో 150 ఎకరాల్లో చెరకు పంట సాగు చేస్తామని అంగీకరించారు. కార్యక్రమంలో సర్పంచి రంగయ్య, వెంకటరావు, భాస్కరరావు, మాజీ సర్పంచి లక్ష్మణరావు, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కంపెనీ అధికారులు

హామీలు నెరవేర్చాలని వినతి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఎన్టీటీపీఎస్ కాలుష్యం వల్ల సంస్థ పరిసర ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, సంస్థ గతంలో చేసిన హామీలను వెంటనే నెరవేర్చాలని జనసేన నాయకులు ఆకుల రామ్మోహనరావు తదితరులు జెన్‌కో ఎండీ నాగలక్ష్మికి విన్నవించారు. బుధవారం సంస్థ పరిశీలనకు వచ్చిన ఆమెకు వినతిపత్రం అందజేశారు. సంస్థలోని కొన్ని యూనిట్లకు ఈఎస్‌పీల మరమ్మతులు జరగక వాతావరణ అంతా ఏదాదిగా బూడిద వాతావరణంలో కలిసి ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని తెలిపారు. వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించాలని కోరారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మించి ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తామని గతంలో ఇచ్చిన హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా అమలు కాలేదన్నారు. తుమ్మలపాలెంలో వంతెన నిర్మాణం చేయాల్సి ఉన్నా దానిని పట్టించుకోవడం లేదని వాపోయారు. తక్షణం వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



జెన్‌కో ఎండీ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

సమన్వయంతో పనిచేద్దాం



సమావేశంలో పాల్గొన్న తెదేపా నాయకులు, కార్యకర్తలు

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కోవాలని తెదేపా పట్టణ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు మండలంలోని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. బుధవారం తిరువూరు పట్టణ షాదీఖానలో జరిగిన తెదేపా మండలస్థాయి సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. ప్రతీ బూత్‌స్థాయిలోనూ అందరూ సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే పార్టీ బలమని.. ఎన్నికల్లో నిలిచిన అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లెక్కలేని మొక్కలొచ్చాయి..



రాలిన పత్తి నుంచి మొలిచిన మొక్కలు

విత్తనం నాటింది లేదు.. రైతు సాగు చేసిందీ కాదు. కానీ ఏ చేలో చూసినా నాలుగు అంగుళాల పరిమాణంలో పత్తి మొక్కలు కన్పిస్తున్నాయి. అదెలా సాధ్యమని ఆశ్చర్యపోకండి.. అంతా మొంథా తుపాను ప్రభావం. నాలుగురోజుల పాటు వదలని ముసురుతో చెట్లకున్న పత్తి పూర్తిగా నానగా, విచ్చుకున్న పత్తికాయల నుంచి కొంత కిందకు రాలింది. వాటి నుంచి, తేమతో మొక్కలొచ్చాయి. మైలవరం ప్రాంతంలో ప్రస్తుతం ఏ పత్తి చేను చూసినా ఇదే పరిస్థితి. ఫలితంగా ఒక్కో ఎకరానికి సుమారు 2 క్వింటాళ్లకు పైగా నష్టపోయామని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, మైలవరం**

ఇనుప డ్రమ్ములు..ప్రమాదాన్ని ఆపునా..

ఎంటీ రోడ్డుకు అడ్డంగా ఇనుప డ్రమ్ములు పెట్టారు అనుకుంటున్నారా. . అడ్డు కాదండీ ఆపద ఆపడానికి..కందులపాడు అడ్డరోడ్డు వెలగలేరు గ్రామాల మధ్యలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి గుంతలతో అధ్వానంగా మారింది. ఈ మార్గం విజయవాడ-విసన్నపేట రహదారిలో భాగంగా ఉండి నిత్యం భారీ వాహనాలు విజయవాడ వైపు ప్రయాణిస్తుండడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ప్రమాదాల నివారణ అంటూ అధికారులు డ్రమ్ములను అడ్డుగా పెట్టారు. గుంతలకంటే వాటిని ఢీకొట్టే ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



దారంతా గుంతలే..రోజంతా చింతలే



గొల్లపూడి వద్ద విజయవాడ పశ్చిమ బైపాస్ రహదారి అధ్వానంగా మారింది. ప్రస్తుతం ఎన్‌హెచ్-65 నుంచి విజయవాడ పశ్చిమ బైపాస్ మీదకు వాహనాలను మళ్లిస్తున్నారు. వందలాది వాహనాలు ఆ మార్గంలో వెళ్తున్నాయి. దీంతో రహదారిపై పడిన గోతులు కారణంగా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాత్రుళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతులు చేయాలని వాహనచోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, గొల్లపూడి**

హమ్మయ్యా.. మరమ్మతులు చేశారు

ఈనాడు కథనానికి స్పందన

మండలంలోని పెనుగొలను బొడ్డురాయి కూడలి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంతకు ఆ శాఖ ఏఈ అచ్చారావు మరమ్మతులు చేయించారు. రహదారి మధ్యలో భారీగా ఏర్పడిన గుంతలతో వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ఈ నెల 1న ఈనాడులో 'గుంతనైనా..పూడ్చించరా' శీర్షికతో ప్రచురించిన కథనానికి ఏఈ స్పందించారు. **- న్యూస్‌టుడే, పెనుగొలను(గంపలగూడెం)**



త్రినేత్రధారీ.. నమఃశివాయ



కొండపర్వలో భక్తుల రద్దీ



కొండపల్లి వీరభద్రస్వామి ఆలయంలో..

న్యూస్‌టుడే బృందం: కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లోని వైష్ణవ, శివాలయాల్లో భక్తులు భారీగా పాల్గొని దీపోత్సవం చేశారు. శివనామస్మరణతో ఆలయాలు మార్మోమోగాయి. అధికారులు సందర్శించి నిర్వాహకులు భక్తులకు కల్పించిన ఏర్పాట్లు తనిఖీ చేశారు.



పెనుగొలనులో పుష్పాలంకరణలో పార్వతీదేవి



మైలవరం: ప్రత్యేక అలంకరణలో అనంతేశ్వర స్వామి



విద్యుద్దీపకాంతుల్లో వెల్లడం పరమేశ్వర ఆలయం



గొల్లపూడిలోని ఆలయంలో..



జి.కొండూరులో అఖండ జ్యోతి



తిరువూరు వేంకటాచలస్వామి గరుడ సేవ



నెమలి కృష్ణాలయంలో..



గుంటుపల్లి శివాలయంలో..



ఊటుకూరు రామాలయంలో..



తిరువూరు రామలింగేశ్వరస్వామి గుడిలో

నూతన కార్యవర్గం ఎంపిక

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడిగా బి.అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. మంగళవారం రాత్రి రెడ్డిగూడెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల్లో ఆశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా వై.మోహన్‌కృష్ణ, ఆర్థిక కార్యదర్శిగా వై.పిచ్చియ్య, జిల్లా కౌన్సిలర్లుగా పి.ప్రేమ్ కుమార్, డి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా బి.రవిశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అనుగ్రహప్రసాద్ వ్యవహరించారు. నాయకులు ఎన్.రామకోటయ్య, ఎల్.అంకరాజులు పాల్గొన్నారు.

ఆగని మూత్రపిండాల వ్యాధి మరణాలు



భరోతు ధర్మ (పాత చిత్రం)

కృష్ణారావుపాలెం (ఎ.కొండూరు): మండలంలోని కృష్ణారావుపాలెం శివారు దీప్లానగర్ తండాకు చెందిన భరోతు ధర్మ(40) మూత్రపిండాల వ్యాధితో మంగళవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా డయాలసిస్ కూడా చేయించుకుంటున్నారని, వ్యాధి తీవ్రతతో మరణించారని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యం కోసం ఆర్థిక స్తోమతకు మించి ఖర్చు చేసినా తగ్గలేదని వాపోయారు. ధర్మకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం వీఆర్వో రాణి మృతుని కుటుంబానికి మట్టి ఖర్చులకు ప్రభుత్వ సాయంగా రూ.10వేలు అందించారు. సీపీఎం, తెదేపా నాయకులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. దీప్లానగర్ తండాలో రెండు రోజుల క్రితమే ఇదే వ్యాధితో మంగ్యా అనే వ్యక్తి చనిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

మద్యం తరలించిన కేసులో జైలు

భవానీపురం, న్యూస్‌టుడే: మద్యం తరలిస్తూ పట్టుబడిన ఐదుగురికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి బి.రాధారాణి బుధవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి... గొల్లపూడి ప్రాంతంలో భవానీపురం పోలీసులకు 2 సెప్టెంబరు 2020న వాహన తనిఖీలను చేపడుతున్నారు. పోలీసులను చూసి ఇద్దరు వ్యక్తులు పారి పోవడంతో చూసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద తెలంగాణ రాష్ట్రానికి చెందిన రూ.48 వేలు విలువైన 250 క్వార్టర్ సీసాలు లభించాయి. వారిని విచారించగా.. గుంటుపల్లి ప్రాంతానికి చెందిన వెలిసెల శివకుమార్, మాణికొండ రవికుమార్, కిలాడీ నరసయ్య, భూక్యా జమున, విజయవాడ మాచవరం ప్రాంతంలో నివాసం ఉండే గోడె అంకమ్మ తదితరులు మద్యం విక్రయాలు చేస్తున్నట్లు తేలింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆధారాలను కోర్టుకు సమర్పించగా. . విచారించి న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం భాజపా నాయకుల ఆధ్వర్యంలో మండల ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాజపా బూత్‌స్థాయి కమిటీలు, శక్తి కేంద్రాల నియామకాలపై సీనియర్ కార్యకర్తలతో చర్చించారు. భాజపా మండల శాఖ అధ్యక్షుడు జి.నాగమల్లేశ్వరరావు, కార్యక్రమం ఇన్‌ఛార్జులు డి.వెంకటేశ్వరరెడ్డి, ఎ.క్రాంతికుమార్, ఎస్.నరసింహారావు, సీహెచ్.నాగేశ్వరరావు, వి.మురళి పాల్గొన్నారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మండలంలో భాజపా బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలని పార్టీ నాయకుడు ఆర్.రఘునాథరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేటలో భాజపా ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బొల్లిపోగు ప్రకాశంను బి.గోపి, కె.నాగేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, ఎ.లచ్చారెడ్డి పాల్గొన్నారు.

సత్తా చాటి.. రాష్ట్ర స్థాయికి ఎంపికై..

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు భోగినేని రాజగోపాలరావు పుష్పావతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి డీ విక్రమ్ స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-14 హర్డిల్స్ పోటీల్లో ప్రతిభ చూపి శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జీవీ రామకృష్ణ బుధవారం తెలిపారు. విద్యార్థిని, పీడీ శ్రీలతను హెచ్ఎం, పీఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు. ◆ వెలగలేరులోని చనుమోలు ఫకీరాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అండర్-17 యు. రాజేంద్ర 400 మీటర్ల హర్డిల్స్, సీహెచ్ మనికంఠ అండర్-14 హర్డిల్స్‌లో ప్రతిభ చాటారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్ఎం కే పద్మ, ఉపాధ్యాయులు, పీడీ పురుషోత్తం తదితరులు అభినందించారు.

గంపలగూడెం, న్యూస్‌టుడే: గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14 బాలికల జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో గంపలగూడేనికి చెందిన బంకా శ్రావ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. మండలంలోని ఓ ప్రైవేటు విద్యాలయంలో 6వ తరగతి చదువుతున్న సదరు బాలిక ఈ నెల 22 నుంచి విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర స్థాయి ఖోఖో బాలికల విభాగంలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందని ఎస్జీఎఫ్ మండల సమన్వకర్త రాంబాబు తెలిపారు.

తిరువూరు టౌన్ న్యూస్‌టుడే: పట్టణంలోని గురుకుల పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి ఎస్జీఎఫ్ అండర్ 17 కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని బుధవారం ప్రధానోపాధ్యాయులు రవిబాబు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం ఐఐటీ మద్రాస్ ఆన్‌లైన్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎం.మురళీకృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన పోటీల్లో నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారని హెచ్ఎం ఎస్ శోభాలత, తిరువూరు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇన్‌ఛార్జి పీడీ రమేష్ తెలిపారు. హైస్కూల్‌లో బుధవారం విద్యార్థులను అభినందించారు. కబడ్డీ అండర్ 14 బాలుర విభాగంలో వి చందు (9వ), చేతన ప్రియ (9వ), రన్నింగ్‌లో ఎన్ ఉమాదేవి (9వ), కె ప్రసన్న (9వ) సత్తాచాటారన్నారు.

చదువు

■ e-mail: edc@eenadu.in

కార్పొరేట్ స్కిల్స్



కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగం చేయాలని కలలుగనే యువ గ్రాడ్యుయేట్లు.. మేనేజ్‌మెంట్‌ల అంచనాలు, కంటికి కనిపించని పని సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలి. దాంతో ఉద్యోగంలో నిరంతరం ఎదురయ్యే సవాళ్లను అధిగమించి, కార్పొరేట్ కెరియర్‌లో ఉన్నత స్థాయికి చేరుకోగలుగుతారు.

సొంత ప్రాజెక్షనూ కొంత అవసరమే!

'మనం కాదు - మన పని మాట్లాడాలి' అని కాలేజ్‌లో తమ ప్రొఫెసర్ తరచూ చెప్పే మాట పాటించిన స్వాతి పనిమీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించి, అంచనాలను మించి ఫలితాలను సాధించింది. తదుపరి ప్రాజెక్ట్‌లో స్వాతి టీం లీడర్ అవుతుందని అందరూ భావించినా కొత్త ప్రాజెక్ట్‌లో స్వాతిని తప్పించి, వేరొకరిని టీం లీడర్ చేశారు. ఈ పరిణామాలను అర్థంచేసుకోలేని స్వాతి, మేనేజర్‌ని కలిసింది. పనితీరు బాగున్నప్పటికీ, బాహ్యంగా కన్పించడంలేదని (విజిబిలిటీ), పనితోపాటు పనిచేస్తున్నామన్న విషయాన్ని మేనేజ్‌మెంట్‌కు తెలియజెప్పాలని, మేనేజర్ ద్వారా తెలుసుకుంది. వివిధ వేదికలపై మీ పని గురించి మీరు చెప్పలేకపోతే మరెవరో మిమ్మల్ని రీప్లేస్ చేస్తారు. సమర్థతా వలయం నుంచి, ప్రభావితా వలయంలోకి రావాలన్నారు మేనేజర్. పని నైపుణ్యంతో పాటు, ప్రజెంటేషన్ నైపుణ్యాలు, వ్యక్తిగత మార్కెటింగ్ నైపుణ్యాలకు ప్రాధాన్యమిచ్చిన వారు కార్పొరేట్ సంస్థలలో అభివృద్ధి పథంలో ఉంటారని తెలుసుకుంది స్వాతి.

పనిచేయగల సామర్థ్యంతో పాటు, పని చేయాలన్న తపన, సంస్థ విలువలతో రాజీపడని ప్రవర్తన ఉన్నవారిని ఉద్యోగులుగా ఎంపిక చేసుకుంటాయి కార్పొరేట్ సంస్థలు. చేసిన పని గురించి పదిమంది ముందు చెప్పగలిగితే మేనేజ్‌మెంట్ మిమ్మల్ని మరో మెట్టు పైకెక్కించేందుకు యోచిస్తుంది.


1 వ్యక్తిగత వైఖరి.. వృత్తిపర ప్రవర్తన: సమస్య పరిష్కారానికి ఉద్యోగుల మధ్య జరిగే మేధామథనంలో, సంఘర్షణలు సహజం. సమస్య పరిష్కరించే క్రమంలో జట్టు సభ్యుల మధ్య వచ్చే అభిప్రాయభేదాలను చర్చించే అంశానికి మాత్రమే పరిమితం చేయడం వృత్తిపరమైన పరిపక్వతకు గుర్తు. కార్పొరేట్ చర్చా వేదికలలో సమస్య ఎంత జటిలమైనదైనా, చర్చ ఎంత వేడిగా సాగుతున్నా సహోద్యోగులపై నెగెటివ్ కామెంట్స్ చేయకుండా ప్రొఫెషనల్‌గా హ్యాండిల్ చేయాలి. స్థిమితంగా సమస్యపైనే ఫోకస్ చేయాలి.

ఒక రివ్యూ మీటింగ్‌లో టైం లైన్స్ పాటించ లేదని డెవలపర్ రవిని ప్రశ్నించాడు టీం లీడర్. అతడు తనను తాను రక్షించుకునే క్రమంలో సమస్యను డైవర్ట్ చేస్తూ టీం లీడర్‌పై తిరుగుబాటు ధోరణి ప్రదర్శించాడు. రవి ప్రవర్తనతో అతడిని ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పించారు. రవి అభిప్రాయాలు, సమస్యలు ఏమైనప్పటికి స్పందించిన తీరు అసహజమైనది. కార్పొరేట్స్‌లో వాస్తవాలు తెలియచెప్పే పద్ధతి, సమయం, సందర్భాలు కూడా ఉద్యోగి కెరియర్‌పై గొప్ప ప్రభావం చూపుతాయి. ఈ సంఘటనతో కార్పొరేట్ సంస్థలలో ప్రతిభతో పాటు, వ్యక్తిగత ప్రవర్తనా ముఖ్యమన్న విషయం తెలుసుకున్నాడు రవి.

2 నైపుణ్య ప్రదర్శన: కార్పొరేట్ సంస్థల్లో మన గత విజయాలు వర్తమానంలోనూ సహాయపడతాయనుకోవడం సరికాదు. వివేక్ ఒక ఐటీ సంస్థలో ట్రెయినీగా చేరాడు. తాను కాలేజీలో ఉత్తమ విద్యార్థి అని, అక్కడ తనకు వచ్చిన అవార్డులు, సాధించిన మార్కులు, ర్యాంకుల గురించి తన టీం సభ్యులతో నిరంతరం చెప్పేవాడు. తన టీంలో ఎవరి పని వారు చేస్తుంటే, తాను తన గతాన్ని ప్రాజెక్టు చేసేవాడు. టీంలో వివేక్‌కు షో మాస్టర్ అనే ముద్ర పడింది. అదే టీంలో ఉన్న ప్రియ.. అందరితో సౌమ్యంగా మాట్లాడుతూ, తనకు తెలియని విషయాలు ఇతరుల నుంచి తెలుసుకుంటూ, తన ఆలోచనలు పంచుకుని, మంచి ఫలితాలు సాధించి, హై విజిబిలిటీతో కెరియర్‌లో ఉన్నత స్థాయికి చేరుకుంది.



3 అజ్ఞాత ప్రభావశీలురు: రాజేష్ ఒక స్టార్టప్‌లో ట్రెయినీగా చేరాడు. తాను బాగా పర్ఫార్మ్ చేస్తూనే, తన టీం లీడర్, హెచ్.ఆర్. హెడ్‌లతో టచ్‌లో ఉంటూ వారి నమ్మకాన్ని సంపాదించాడు, అయితే తాను ఆశించిన ప్రమోషన్ కోల్పోయాడు. ప్రమోషన్స్, వర్క్ అలాట్‌మెంట్ అంతా ఆ సంస్థలో సీనియర్ ఆర్కిటెక్ట్ పరిధిలో ఉందనే విషయాన్ని గ్రహించలేదు రాజేష్. సీనియర్ ఆర్కిటెక్ట్‌కు దగ్గర కాలేకపోవడంతో, తన పని గురించి ఆయనకు అవగాహన లేకపోవడంతో, ప్రమోషన్ రాలేదని అర్థం చేసుకున్న రాజేష్ తనని తాను సరిదిద్దుకుని, అజ్ఞాత ప్రభావశీలురని గుర్తించి, కెరియర్‌లో ఉన్నత స్థాయికి చేరుకున్నాడు.





4 మనో వైఖరి: స్నేహ.. ఒక ప్రముఖ ఐటీ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరైంది. ఉన్నతస్థాయి సాంకేతిక నైపుణ్యాలున్నప్పటికీ, ఇంటర్వ్యూ ప్యానల్ అడిగే ప్రతి ప్రశ్నకు సమాధానంగా.. 'నేను టాప్ యూనివర్సిటీలో చదివాను, ఈ సమస్య నాకు చాలా చిన్నది' అని చెప్పింది. ఇంటర్వ్యూలో స్నేహ మాట తీరు, బాడీ లాంగ్వేజ్ సమర్థనీయంగా లేకపోవడంతో ఆమె సెలెక్ట్ కాలేదు. అదే ఇంటర్వ్యూకు హాజరైన రాహుల్.. ఇంటర్వ్యూలో తన పరిజ్ఞానాన్ని నమ్రతతో, స్పష్టంగా వివరించాడు. కొన్ని ప్రశ్నలకు సమాధానంగా 'నేను ఇంకా నేర్చుకుంటున్నాను, నాలో నేర్చుకోవాలన్న తపన ఉంది' అని వినయంగా చెప్పి ఇంటర్వ్యూ ప్యానెల్‌ను ఆకట్టుకుని ఉద్యోగం సాధించాడు. కార్పొరేట్ సంస్థల్లో జ్ఞానం మాత్రమే కాదు, వినయం చాలా ముఖ్యం.

కార్పొరేట్ సంస్థలలో మీరు ఎంత తెలివిగా ఉన్నా, మీ దృక్పథం, మానవ సంబంధాలు, నేర్చుకునే తపనతోనే కెరియర్‌లో ఉన్నతస్థాయికి చేరుకోగలరు.



– దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో కస్టమర్ సక్సెస్

సంస్థ: వెక్సా ఏఐ
నైపుణ్యాలు: క్లయింట్ ఇంటరాక్షన్, క్లయింట్ రిలేషన్‌షిప్, క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, కొలాబరేషన్, డేటా అనలిటిక్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ప్రాసెస్ మేనేజ్‌మెంట్, రిపోర్ట్ జనరేషన్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: నవంబరు 12
☛ https://shorturl.at/goP4H

హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్

సంస్థ: క్లయింట్‌కేరెక్స్ ఏఐ ప్రై.లి.
నైపుణ్యాలు: ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, హ్యూమన్ రిసోర్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, పేరోల్, రిక్రూట్‌మెంట్, టీమ్ మేనేజ్‌మెంట్ **స్టైపెండ్:** రూ.11,000-14,000
దరఖాస్తు గడువు: నవంబరు 20
☛ https://shorturl.at/axXJC

కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్‌లో..


కెనరా బ్యాంక్ సెక్యూరిటీస్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 10 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ జూనియర్ ఆఫీసర్: 04 ✦ అసిస్టెంట్ మేనేజర్: 04
✦ డిప్యూటీ మేనేజర్: 02
అర్హత: ఏదైనా విభాగంలో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ, బీఈ/బీటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏతో పాటు ఉద్యోగానుభవం ఎన్ఐఎస్ఎం/ఎన్‌సీఎఫ్ఎం సర్టిఫికేషన్ ఉన్న వారికి ప్రాధాన్యం.
వేతన శ్రేణి: నెలకు జూనియర్ ఆఫీసర్‌కు రూ.38,160 - రూ.50,360; అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.25,440 - రూ.36,740; డిప్యూటీ మేనేజర్‌కు రూ.34,800- రూ.40,800. **వయసు:** 20 నుంచి 30 సంవత్సరాలు మధ్య ఉండాలి. **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూతో.
ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: 14.11.2025.
వెబ్‌సైట్: https://www.canmoney.in/careers

డయాలసిస్ టెక్నీషియన్లు

హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 354 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
✦ సీనియర్ డయాలసిస్ టెక్నీషియన్, డయాలసిస్ టెక్నీషియన్: 350 ✦ సెంట్రల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్: 04
అర్హత: సంబంధిత విభాగంలో డిప్లొమా/బీఎస్సీ, ఎమ్మెస్సీ/ ఎంబీఏ, బీఈ/బీటెక్, మెడికల్ డయాలసిస్ టెక్నాలజీలో సర్టిఫికెట్ కోర్సుతో పాటు సంబంధిత పని అనుభవం ఉండాలి. **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా hrwestrecruitment@lifecarehll.com
దరఖాస్తుకు చివరి తేదీ: 16.11.2025.
ఇంటర్వ్యూ తేదీలు: నవంబరు 9, 16
వెబ్‌సైట్: https://www.lifecarehll.com/

ఆర్కియాలజీలో పీజీని దూరవిద్యలో చదవాలనుంది. ఈ కోర్సును ఏ వర్సిటీలు అందిస్తున్నాయి? - పి.మూర్తి

దూరవిద్యలో ఆర్కియాలజీ?



■ సృష్టిలో మనిషి పుట్టుక నుంచి ఇప్పటి వరకూ అనేక రకాల మార్పులు చోటుచేసుకున్నాయి. ఆ మార్పులను, పూర్వపు జీవన విధానాలను, సంస్కృతిని, సాంకేతికతను తెలుసుకోవడానికి సహాయపడేదే పురావస్తు శాస్త్రం లేదా ఆర్కియాలజీ. ఇది ప్రధానంగా భూమిలో దాగి ఉన్న పురాతన వస్తువులను, నిర్మాణాలను వెలికి తీసి, వాటి ఆధారంగా గతాన్ని అర్థం చేసుకోవడంలో సహాయపడుతుంది.

ప్రాచీన కాలంలో మనుషులు ఎలా జీవించారు, వారు ఉపయోగించిన సాధనాలు, భవనాలు, నాణేలు, కుండలు, శిల్పాలు, శాసనాలు వంటి అవశేషాలను అధ్యయనం చేయడం ద్వారా, చరిత్రకు కొత్త అర్థాలు కల్పిస్తూ, పరిశోధనా ఆధారాలతో నిర్ధారిస్తుంది. సాధారణంగా, ఆర్కియాలజీ సబ్జెక్ట్ హిస్టరీ విభాగం ద్వారా అందుబాటులో ఉంటుంది. ఆర్కియాలజీ సబ్జెక్ట్ హిస్టరీతో కలిపి ఏన్షెంట్ హిస్టరీ అండ్ ఆర్కియాలజీగా అందిస్తున్నారు. కానీ, ఇది కొన్ని యూనివర్సిటీల్లో మాత్రమే రెగ్యులర్ విధానంలో ఉంది. దూరవిద్య విషయానికి వస్తే.. కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ, కువెంపు యూనివర్సిటీ, భోజ్ ఓపెన్ యూనివర్సిటీల్లో అందుబాటులో ఉంది. తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ లాంటి కొన్ని సంస్థల్లో ఆర్కియాలజీ సబ్జెక్ట్‌ని డిప్లొమాగా చదివే వెసులుబాటూ ఉంది. ఏదైనా పీజీ/డిగ్రీ/ డిప్లొమా దూరవిద్యా విధానంలో చేరే ముందు.. ఆ ప్రోగ్రాంకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు చెందిన డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో (యూజీసీ డెబ్) గుర్తింపును నిర్ధారించుకోండి. యూజీసీ డెబ్ గుర్తింపులేని దూరవిద్య/ఆన్‌లైన్ డిగ్రీల చెల్లుబాటు విషయంలో సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

–ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

రబ్బరు బోర్డులో సైంటిస్టులు

రబ్బర్ బోర్డు, కేరళ.. సైంటిస్టు-ఏ, బీ, సీ, ఇతర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ✦ సైంటిస్ట్-ఏ: 05 ✦ సైంటిస్ట్-బీ: 19 ✦ సైంటిస్ట్-సీ: 05 ✦ అసిస్టెంట్ డైరెక్టర్: 01 ✦ మెకానికల్ ఇంజినీర్: 01 ✦ స్టాటిస్టికల్ ఇన్‌స్పెక్టర్: 02 ✦ ఎలక్ట్రీషియన్: 03 ✦ సైంటిఫిక్ అసిస్టెంట్: 10 ✦ హిందీ టైపిస్ట్: 01 ✦ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్(హౌస్ కీపింగ్): 01 ✦ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్(ఏసీ): 01 ✦ సిస్టం అసిస్టెంట్: 01 ✦ విజిలెన్స్ ఆఫీసర్: 01
అర్హత: పోస్టులను అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, బీఈ/బీటెక్, పీజీతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 27 ఏళ్ల నుంచి 40 ఏళ్ల మధ్య ఉండాలి. **దరఖాస్తు ఫీజు:** పోస్టులను అనుసరించి రూ.500 నుంచి 1,500. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబరు 1. **ఎంపిక:** రాత పరీక్షతో **వెబ్‌సైట్:** https://recruitments.rubberboard.org.in/

సమగ్ర కథనాలు, మరిన్ని ఇంటర్న్‌షిప్పులు
https://epaper.eenadu.net లో.

గ్రూప్-1 జవాబుపత్రాలున్న బాక్స్‌లకు సీల్ వేసి.. భద్రత కల్పించండి

రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: గ్రూప్-1 జవాబుపత్రాలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఏపీపీఎస్సీ తరఫున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ బుధవారం హైకోర్టుకు నివేదించారు. 325 మంది అభ్యర్థుల జవాబుపత్రాలు 21 బాక్స్‌లలో ఉన్నాయని తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. జవాబుపత్రాలను రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని ఏపీపీఎస్సీ అధికారులను ఆదేశించించింది. ఏపీపీఎస్సీ అధికారులిచ్చే.. మాన్యువల్ మూల్యాంకనం(చేతితో దిద్దిన) జవాబుపత్రాలు, డిజిటల్ మూల్యాంకన పత్రాల సీడీలకు సీల్ వేసి, భద్రపరచాలని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌ను ఆదేశించింది. 24 గంటల పోలీసు భద్రత, సీసీ కెమెరాల పర్యవేక్షణలో వాటిని ఉంచాలని స్పష్టంచేసింది. తదుపరి విచారణను ఈనెల 11కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. గ్రూప్-1 జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు చోటు చేసుకున్నాయన్న కారణంతో పరీక్షను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న కీలక తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. దీన్ని సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లపై ఇటీవల తుది విచారణ జరిగింది. సందేహాల నివృత్తి కోసం సోమవారం విచారణ జరిపిన ధర్మాసనం పలు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన విచారణలో జవాబుపత్రాలను అందజేసేందుకు సిద్ధమని ఏజీ హైకోర్టుకు నివేదించారు.

భాగస్వామ్య సదస్సుకు విశాఖ ముస్తాబు!

- ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో భారీగా ఏర్పాట్లు
- నగరంలో రూ.42 కోట్లతో అభివృద్ధి, సుందరీకరణ పనులు



ద్రోణంరాజు కూడలి సుందరీకరణ



తెలుగుతల్లి వంతెనపై ఏర్పాటుచేసిన ప్రతిమ

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచస్థాయి సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖపట్నం ముస్తాబవుతోంది. ఈ నెల 14, 15 తేదీల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ మైదానంలో జరగనున్న ఈ సదస్సుకు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. 40 దేశాల నుంచి 3వేల మంది ప్రతినిధులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా ప్రధాన వేదికతో పాటు, ప్రత్యేక ప్రాంగణాలు సిద్ధం చేస్తున్నారు. సీఎంతోపాటు గవర్నర్, ఉప రాష్ట్రపతి ఆయా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు ఉండడంతో భద్రతాపరమైన చర్యలు తీసుకుంటున్నారు.

ఒప్పందాలు.. శంకుస్థాపనలు ఇక్కడే

ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో 13 ఎకరాల్లో సదస్సుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడే దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు ప్రభుత్వంతో 410 ఒప్పందాలు చేసుకోనున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు సుమారు రూ.9.80 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. అదే సమయంలో రూ.2.70 లక్షల కోట్లతో చేపట్టనున్న ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపనలు చేయనున్నారు.

అతిథులకు చంద్రబాబు విందు

సదస్సు నేపథ్యంలో నవంబరు 13వ తేదీనే ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ చేరుకోనున్నారు. అతిథులకు ఆ రోజు రాత్రి సీఎం నోవోటెల్ హోటల్‌లో విందు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. దేశ, విదేశాలకు చెందిన రాయబారులు, కాన్సుల్ జనరళ్లు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, పారిశ్రామిక దిగ్గజాలు, వ్యాపార రంగ ప్రముఖులు, అతిథుల కోసం నగరంలోని 26 హోటళ్లలో 1,200 గదులు సిద్ధం చేశారు. దేశ, విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులు పర్యాటక ప్రదేశాలను వీక్షించే అవకాశం ఉండడంతో విందు ఏర్పాటుచేసి, అక్కడ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నారు.

వేగంగా సుందరీకరణ పనులు

సదస్సు నేపథ్యంలో విశాఖ నగరంలో ప్రధాన కూడళ్లు, పర్యాటక ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దుతున్నారు. నగర సుందరీకరణకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఒక కమిటీని సైతం ఏర్పాటు చేశారు. రూ.42 కోట్లతో మొత్తం 212 అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. ప్రతినిధులు పర్యటించే అవకాశం ఉన్న 17 రహదారుల్లో 64 కి.మీ. మేర తారు లేయర్లు, డివైడర్లకు రంగులు, సూచికలు, ఫుట్‌పాత్‌లకు టైల్స్ మార్పు, ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. పచ్చదనానికే రూ.8.80 కోట్లు ఖర్చు చేస్తున్నారు. రహదారుల వెంబడి ఉండే గోడలపై సదస్సు ఉద్దేశం, విశాఖ ప్రత్యేకత తెలిపేలా కుడ్య చిత్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

క్యూఆర్ కోడ్‌లతో గుర్తింపుకార్డులు

సదస్సుకు ఈనెల 9వ తేదీలోగా పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయ్యేలా చూస్తున్నారు. హాజరయ్యే ప్రతినిధులకు ఇచ్చిన గుర్తింపు కార్డులపై ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుంది. దానినే సెక్యూరిటీ తనిఖీలకు ఉపయోగించనున్నారు. ఏయూలోని ప్రధాన ప్రాంగణానికి మూడు వైపులా ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రముఖులు నేరుగా సదస్సు వద్దకు చేరుకునేలా మూడు హెలిప్యాడ్‌లు సిద్ధం చేశారు. సదస్సు జరిగే సమీపంలో 1,100 కార్లు నిలిపేలా పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గౌరవ డాక్టరేట్



ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కర్ణాటక గవర్నర్, థావర్‌చంద్ గహ్లోత్, కర్ణాటక న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం (కేఎస్ఎల్‌యూ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. కర్ణాటకలోని ధార్వాడలో బుధవారం నిర్వహించిన యూనివర్సిటీ ఏడో స్నాతకోత్సవంలో ఆ రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్ గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ప్రదానం చేసి సత్కరించారు. తనకు గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చినందుకు కర్ణాటక న్యాయ విశ్వవిద్యాలయానికి గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి.బసవరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కర్ణాటక న్యాయ శాఖ మంత్రి డాక్టర్ హెచ్‌కే పాటిల్ కర్ణాటక రాష్ట్ర సరిహద్దు-నదీ భద్రత కమిషన్ ఛైర్మన్ జస్టిస్ శివరాజ్ వి.పాటిల్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ఎస్ఏఈఎల్ రూ.22వేల కోట్ల పెట్టుబడులు

భాగస్వామ్య సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోనున్నట్లు వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో రూ.22 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రత్యక్షంగా 7వేల మందికి, పరోక్షంగా 70వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొంది. విశాఖలో ఈ నెల 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సులో ప్రభుత్వంతో పెట్టుబడుల ప్రతిపాదనలపై ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు తెలిపింది.

పెట్టుబడుల ప్రతిపాదనలు..

✦ కడప, కర్నూలు జిల్లాల్లో 1,750 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం(బెస్) ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రతిపాదన ఉంది. ఎన్‌హెచ్‌పీసీ, సెకి లింక్డ్ టెండర్లలో వాటిని సంస్థ దక్కించుకుంది.
✦ ఒక్కొక్కటి 25 మెగావాట్ల సామర్థ్యంతో 8 బయోమాస్ ప్లాంట్ల ఏర్పాటు. వాటిద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు.
✦ రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకుని రూ.3వేల కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్ ఏర్పాటు.
✦ మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను బలోపేతం చేసేందుకు రూ.4వేల కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధి.

20 మంది బృందంతో పరకామణి కేసు దర్యాప్తు

- నిందితుడు రవికుమార్‌కు ఇతర రాష్ట్రాల్లోనూ ఆస్తులు
- కొన్నేళ్లలోనే ఇంత కూడబెట్టడం అసాధ్యం
- సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్



సమాచారం తెలపాల్సిన ఫోన్ నంబరు, మెయిల్ ఐడీ చూపుతున్న రవిశంకర్ అయ్యన్నార్

ఈనాడు డిజిటల్– తిరుపతి; న్యూస్‌టుడే– తిరుపతి (నేరవిభాగం): తిరుమలలో జరిగిన పరకామణి కుంభకోణం కేసు దర్యాప్తును 20 మంది సభ్యులతో ఐదు బృందాలుగా బుధవారం ప్రారంభించామని సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ తెలిపారు. ప్రధాన కార్యాలయంలో మరో 10 మంది సాంకేతిక సిబ్బంది దర్యాప్తులో పాలుపంచుకుంటున్నారన్నారు. ఈ కేసులో నిందితుడు రవికుమార్‌కు తమిళనాడు, కర్ణాటక, హైదరాబాద్, తిరుపతిల్లో ఆస్తులున్నాయని చెప్పారు. ఇంకా ఎక్కడెక్కడ ఆస్తులున్నాయో సమగ్రంగా విచారించి డిసెంబర్ రెండో తేదీ నాటికి హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి అతిథిగృహంలో బుధవారం సాయంత్రం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి చోరీ కేసు నమోదు, విచారణలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. హైకోర్టు ఆదేశాల మేరకు బృందాలుగా దర్యాప్తు ప్రారంభించాం. అప్పటి తితిదే పాలకమండలి సభ్యులు, అధికారులు, పోలీసు దర్యాప్తు అధికారులను విచారించనున్నాం. 1985లో మఠంలో చేరిన రోజు నుంచి రవికుమార్ వ్యవహార శైలి, సహకరించిన అధికారుల పాత్రపైనా విచారణ జరుగుతుంది. రవికుమార్ స్థిరచరాస్తులు, బ్యాంకు లావాదేవీలు, ఆస్తుల క్రయవిక్రయాలు, బహుమానంగా ఇచ్చిన ఆస్తుల రిజిస్ట్రేషన్, ఇతర అంశాలపై సమగ్రంగా విచారణ చేపట్టనున్నాం. కొన్నేళ్లలో ఇంత ఆస్తులు కూడబెట్టడం సాధారణ ఉద్యోగికి సాధ్యం కాకపోవచ్చు' అని డీజీ పేర్కొన్నారు.

అనుబంధ విషయాలపైనా విచారణ

పరకామణి చోరీ కేసుతోపాటు సంబంధిత ఇతర అంశాలపైనా విచారణ చేపడతామని డీజీ తెలిపారు. నిందితుడి నుంచి తితిదేకు అందిన ఆస్తి పుస్తక విలువ రూ.14 కోట్లుగా చెప్పారు. మార్కెట్‌లో దాని విలువ రూ.40-50 కోట్ల మధ్య ఉంటుందని గుర్తించామన్నారు. మఠం నుంచి పరకామణి విధులకు వచ్చిన సిబ్బందిని విజిలెన్స్ అధికారులు తనిఖీ చేయలేదని తెలిపారు. రవికుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలిసిందన్నారు. ఈ కేసులో ఇప్పటికే కొంతమందికి నోటీసులు జారీ చేశామన్నారు.

ప్రజలు సహకరించాలి

పరకామణి చోరీ కేసు సమగ్ర దర్యాప్తునకు ప్రజల సహకారం అవసరమని, నిందితుడి వివరాలు తెలిసినవారు 94407 00921 ఫోన్ నంబరుకు లేదా adgcid@ap.gov.in మెయిల్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారమిచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

రాజధాని నిర్మాణంలో భాగస్వాములుకండి: మంత్రి నారాయణ

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని దుబాయ్‌కి చెందిన ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ విజ్ఞప్తి చేశారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు అనుకూల వాతావరణం ఉందని తెలిపారు. దుబాయ్ పర్యటనలో భాగంగా చివరి రోజు బుధవారం అజ్మాన్‌లో టెక్టాన్ ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ ఎస్.లక్ష్మణ్‌తో మంత్రి భేటీ అయ్యారు. విద్యుత్తు, ఆయిల్, గ్యాస్‌తో పాటు భారీ నిర్మాణ ప్రాజెక్టుల్లో టెక్టాన్‌కు 22 ఏళ్ల అనుభవం ఉంది. రిజర్వాయర్లు, పంపింగ్ స్టేషన్లు, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనేక దేశాల్లో ప్రాజెక్టులు చేపట్టింది. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, గత 17 నెలల కాలంలో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టుల వివరాలతో పాటు అమరావతి నిర్మాణంపై ఆ కంపెనీ ప్రతినిధులకు మంత్రి వివరించారు. ఆ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరిచిందని నారాయణ తెలిపారు. కార్బోనాటిక్ కంపెనీ ప్రతినిధులతోనూ మంత్రి సమావేశమై ఏపీలో నౌకా నిర్మాణం, ఏవియేషన్ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు. బియా కంపెనీ ప్రతినిధులతో మంత్రి సమావేశమై ఏపీలో ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో పురపాలక సంఘాలను డంపింగ్ యార్డుల రహితంగా మార్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నట్లుగా వివరించారు.

టీసీఎస్‌కు భూ కేటాయింపుపై కౌంటర్ వేయండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: టీసీఎస్ సంస్థకు విశాఖపట్నంలో 21.16 ఎకరాల భూమి కేటాయింపును సవాలు చేస్తూ మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు దాఖలుచేసిన పిల్‌పై బుధవారం హైకోర్టు విచారణ జరిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ, విచారణను ఈ నెల 26కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ ఉత్తర్వులిచ్చింది. శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో వేసిన పిల్‌పై బుధవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. భూములను విక్రయించడం లేదని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ)గతంలో హైకోర్టుకు తెలిపారన్నారు. ఆ తర్వాత విక్రయించేందుకు జీవో వచ్చిందన్నారు. ఎస్‌జీపీ ఎస్.ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ఒప్పందాన్ని టీసీఎస్ అమలుచేస్తేనే భూమిని విక్రయించే అవకాశం ఉందన్నారు. కౌంటర్ వేసేందుకు సమయం కావాలన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

ఫైబర్ మ్యాక్సింగ్ మంచిదేనా?

ఫైబర్ మ్యాక్సింగ్ అంటే ఏమిటి? ఈ మధ్య సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. బరువు తగ్గడానికి ఈ ట్రెండ్ మంచిదేనా? – కాంచన, రాజానగరం

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

మన జీవనశైలిలో పాశ్చాత్య ఆహారపు అలవాట్లు ఒక భాగం అయిపోయాయి. వీటిల్లో తగినంత పీచు ఉండట్లేదు. దాంతో కడుపు ఉబ్బరం, అజీర్తి... వంటి జీర్ణసమస్యలు. అలానే, బరువు తగ్గాలన్నా... డయాబెటీస్, చెడు కొలెస్ట్రాల్ వంటివి దరిచేరకూడదన్నా మూడుపూటలా ఆహారంలో ఎక్కువ మొత్తంలో ఫైబర్ తీసుకోవాలని చెబుతోంది 'ఫైబర్ మాక్సింగ్' ట్రెండ్. అయితే ఒక్కసారిగా ఇలా చేయడం వల్ల ఇబ్బందులు వస్తాయి. సాధారణంగా ఒక వ్యక్తికి రోజులో 25-48గ్రా. వరకూ పీచు కావాలి. ఎత్తు, బరువు, అనారోగ్య సమస్యలు, రోజువారీ ఆహారపు అలవాట్లను బట్టి దీని శాతం ఆధారపడి ఉంటుంది. కాబట్టి రోజులో మీకు ఎంతమేర అవసరమో తెలియాలంటే... పోషకాహార నిపుణుల సలహా తీసుకోవాల్సిందే..

మన శరీరానికి పీచు తగిన మొత్తంలో అందితేనే ఆకలి, ట్రైగ్లిజరాయిడ్స్ అదుపులోకి వస్తాయి. తద్వారా బరువు తగ్గే అవకాశాలూ ఎక్కువ. దంపుడు బియ్యం, గోధుమ, జొన్న, సజ్జ రవ్వలు, ఓట్స్, రాజ్మా, శనగల నుంచి ఫైబర్ పుష్కలంగా లభిస్తుంది. పొట్టుతో ఉండే ధాన్యాలు, పప్పులు, పండ్లు, ఆకుకూరల్లోనూ ఇది ఎక్కువే. ఆకుకూరలతో సూప్, చపాతీ, పుల్కా, చియా సీడ్స్, స్వీట్ కార్న్, పాప్‌కార్న్, అరటికాయ చిప్స్ వంటివి తినొచ్చు. వీటివల్ల న్యూట్రియంట్స్ కూడా అంది... చక్కెర, గుండెజబ్బులు వంటివి నియంత్రణలో ఉంటాయని అధ్యయనాల్లో తేలింది. ఈ డైట్ పాటించాలంటే... ఒకేసారి ఎక్కువ మొత్తంలో కాకుండా, ఆహారంలో నిదానంగా పీచు పదార్థాన్ని పెంచుతూ వెళ్లాలి. మొదట్లో ఒక పూట మాత్రమే తీసుకోవాలి. క్రమేణా మూడు పూటలా ఆహారంలో భాగం చేసుకోవాలి. వారానికి 5-10గ్రా.లు పెంచుకుంటూ వెళితే మీ జీర్ణాశయం దీనికి అలవాటుపడి ఇతర అనారోగ్య సమస్యలూ రావు. అయితే నీళ్లు ఎక్కువగా తీసుకున్నప్పుడు మాత్రమే దీనివల్ల ప్రయోజనం ఉంటుంది. తక్కువ బరువు, జీర్ణ సమస్యలున్న వాళ్లూ, కీమో థెరపీ తీసుకుంటున్న వాళ్లూ ఆహారంలో పీచు పదార్థాన్ని పెంచినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ మేయర్ మీరా కొడుకు!

భారత్‌లో పుట్టి, హార్వర్డ్‌లో చదవడానికి వెళ్లి, హాలీవుడ్ దర్శకురాలిగా మారారు మీరా నాయర్. ఆపై భిన్న సంస్కృతుల్ని జీవితంలో భాగం చేసుకుని గ్లోబల్ సిటిజన్ అయ్యారు. ఇవే లక్షణాలను తల్లినుంచి పుణికిపుచ్చుకున్నారు న్యూయార్క్ మేయర్‌గా ఎంపికైన జోహ్రాన్ మమ్దానీ. ఈ తల్లీకొడుకుల బంధం గురించి...



మీరా

సహానుభూతి ప్రధానాంశంగా సినిమాలు తీస్తూ వచ్చారు మీరా. సలామ్ బాంబే, మిసిసిపీ మసాలా, మాన్‌సూన్ వెడ్డింగ్... వంటి సినిమాలతో సామాజిక భిన్నత్వాన్నీ, వలస ప్రజల జీవితాలనూ తెరకెక్కించారు. ఈ ఆలోచనలే జోహ్రాన్ పెంపకంలోనూ కనిపిస్తాయి. మీరా కుటుంబంలో సినిమా అంటే వినోదం కాదు, వ్యక్తుల ఉనికినీ, సమాజాన్నీ, మార్పునీ అన్వేషించడం. 'చిన్నప్పుడు అమ్మానాన్నలతో కలిసి ఓ ర్యాలీకి వెళ్లాను. ప్రజా జీవితంలో తొలి అడుగులు బాల్యంలోనే పడ్డాయి. వాస్తవాలను దాయడంకంటే వాటిని బయటకు చెప్పడం గురించి తల్లిదండ్రులు నేర్పించారు. అందువల్లే ఎన్నికల ప్రచారంలోనూ వలస జీవుల బతుకులు, సమానత్వం గురించి స్పష్టంగా చెప్పగలిగా' అంటారు జోహ్రాన్. మీరా సినిమాల్లోని అంశాలే జోహ్రాన్ రాజకీయాల్లో 'ప్రజాస్వామ్య సామ్యవాద' బాటను ఎంచుకోవడంలో కీలకమయ్యాయి.

అసిస్టెంట్ డైరెక్టర్

తల్లికి దగ్గరగా ఉంటాడు జోహ్రాన్. కానీ తన చిన్నప్పుడు ఆమె నెలలపాటు సినిమా కోసం దూరంగా వెళ్లడం నచ్చేది కాదు. క్రమంగా మీరా, జోహ్రాన్‌ల బంధం తల్లీకొడుకులుగానే కాదు, అంతకు మించి అన్నట్టుగా మారింది. 'నేమ్‌సేక్' తీయడానికి సిద్ధమవుతున్న దశలో 'హ్యారీ పోటర్ అండ్ ద ఆర్డర్ ఆఫ్ ద ఫీనిక్స్' కథకు దర్శకత్వం వహించమంటూ 'వార్నర్ బ్రదర్స్' సంస్థ మీరాను సంప్రదించింది. ఒక వ్యక్తి తన తండ్రిని విదేశీ గడ్డమీద కోల్పోవడం గురించిన కథే నేమ్‌సేక్. 'ఏం చేయమంటావ'ని 14ఏళ్ల జోహ్రాన్‌ని సలహా అడిగితే... 'హ్యారీ పోటర్‌ని మంచి డైరెక్టర్ ఎవరైనా తీయగలరు. నేమ్‌సేక్ నువ్వు మాత్రమే తీయగలవు' అని బదులిచ్చారట. దాంతో అటుగానే అడుగులు వేశారు మీరా. ఆ సినిమాలో కీలక పాత్రకు కాల్ పెన్ అనే భారతీయ మూలాలున్న హాలీవుడ్ నటుణ్ని ఎంపికచేయమనీ మీరాకు సలహా ఇచ్చింది జోహ్రాన్‌నేనట. 2012లో వచ్చిన 'ద రిలెక్టంట్ ఫండమెంటలిస్ట్'ని చేయమంటూ మీరాను ప్రోత్సహించారట జోహ్రాన్. అప్పటికి ఆయనకు 20 ఏళ్లు. సెప్టెంబర్ 11 దాడుల నేపథ్యంలో ఉంటుందా కథ. 2016లో మీరా తీసిన 'ద క్వీన్ ఆఫ్ కాత్వే'కి మమ్దానీ అసిస్టెంట్ డైరెక్టర్.

కొడుకుకి ప్రచారం చేస్తూ...

జోహ్రాన్ ఎన్నికల బరిలో దిగాక ప్రచారంలోనూ చురుగ్గా పాల్గొన్నారు మీరా. తన ఇన్‌స్టా ఖాతా నుంచి తరచూ రీల్స్, పోస్టులు పంచుకునేవారు. 'ఈద్ ముబారక్... ఆల్ న్యూయార్క్‌వాలాస్... ఈ అమ్మ మాట వినండి. ప్రగతిశీల భావాలున్న మేయర్‌కావాలా, మా అబ్బాయికి ఓటు వేయండి', 'మాన్‌సూన్ వెడ్డింగ్ స్క్రీనింగ్, ప్రశ్నలు-జవాబుల సెషన్‌కు రావాలనుకుంటున్నారా, జోహ్రాన్‌కి ఓటు వేశాకే' అంటూ అభిమానులూ, దక్షిణాసియా వాసుల్ని ప్రత్యేకంగా ఆకర్షించారు. కేన్స్‌లో సలామ్ బాంబే స్క్రీనింగ్ సమయంలో మీరా తల్లి ప్రవీణ్ నాయర్ కూడా వెళ్లారట. ఆ సమయంలో మీడియా 'మీరు నటినా' అని అడిగితే... 'నేను ప్రొడ్యూసర్ ఆఫ్ ది డైరెక్టర్' అంటూ బదులిచ్చారట ప్రవీణ్. ఆ సంఘటనను గుర్తుచేసుకుంటూ... మీరా తనను 'ప్రొడ్యూసర్ ఆఫ్ ది క్యాండిడేట్' అంటూ సరదాగా చెప్పుకొచ్చారో సందర్భంలో. 'అమ్మానాన్నా... నన్ను తీర్చిదిద్దింది మీరే. మీ కొడుకుని అయినందుకు ఎంతో గర్విస్తున్నా' అంటూ తన గెలుపు ప్రసంగంలో చెప్పారు జోహ్రాన్. 'జోహ్రాన్ కొత్త వెలుగులు తెస్తాడని ఆశిస్తున్నా. అధికారం గురించి కాకుండా, సమానత్వం, న్యాయం, కార్మికులకు దక్కే గౌరవం గురించి ఆలోచిస్తాడు' అంటూ జోహ్రాన్‌లో నాయకత్వ లక్షణాల్ని వివరిస్తారు మీరా.

పాఠాలు చెప్పే అధ్యాపకురాలామె. తన బోధనలు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు అనుకున్నారు. ప్రజల్లో మార్పుకీ కారణమవ్వాలనుకున్నారు. ఆ ప్రయత్నమే గజాలా హష్మీని వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా నిలిపింది.



గజాలా

పాఠాలు మాని... ప్రజల్లోకి వచ్చి!

కొన్నేళ్లవరకూ గజాలా సాధారణ మహిళే! కుటుంబం, బోధన, విద్యార్థులే లోకం. రాజకీయాల గురించిన ఆలోచన లేదు. ఆసక్తి అంతకన్నా లేదు. అయినా వాటిలోకి అడుగు పెట్టాలనుకున్నారు. అందుకు కారణం ట్రంప్ విధానాలే అంటారామె. గజాలా మన భారతీయురాలే. ఇంకా చెప్పాలంటే హైదరాబాదీ. పుట్టిందీ ఇక్కడే. తండ్రి ఉద్యోగరీత్యా నాలుగేళ్ల వయసులో అమెరికాలోని జార్జియాకి చేరారామె. చిన్నప్పట్నుంచీ చదువుల్లో చురుకే. విద్యానేపథ్యమున్న కుటుంబం కావడంతో పుస్తకాలన్నా, నేర్చుకోవడమన్నా ప్రాణం ఆమెకి. జార్జియా సదరన్ యూనివర్సిటీ నుంచి బీఏ ఆనర్స్, ఆపై అమెరికన్ లిటరేచర్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. తరవాత తండ్రి బాటలోనే నడుస్తూ ప్రొఫెసర్‌గా కెరియర్ ప్రారంభించారు. దాదాపు మూడు దశాబ్దాలపాటు ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. ఓ కమ్యూనిటీ కాలేజీలో సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇన్ టీచింగ్ అండ్ లర్నింగ్ కేంద్రం వ్యవస్థాపక డైరెక్టర్‌గానూ సేవలందించారు. ముస్లిం దేశాలపై ట్రంప్ ట్రావెల్ బ్యాన్ విధించడం... దానికితోడు వలసదారులు, ముస్లింలపై పెరుగుతున్న ద్వేషం, వాళ్ల పట్ల ప్రవర్తిస్తున్న తీరు చూశాక... 'ఇక నేను తరగతి గదికే పరిమితం కాకూడదు' అనుకున్నారట గజాలా. రాజకీయాల్లోకి ప్రవేశించి మార్పు తేవాలనుకున్నారు. 2019లో వర్జీనియా స్టేట్ సెనేట్‌కి ఎంపికయ్యారు. ఆ హోదా దక్కించుకున్న తొలి ముస్లిం, తొలి దక్షిణాసియా-అమెరికన్‌గానూ గుర్తింపు పొందారు. ఆపై ఎడ్యుకేషన్, హెల్త్ కమిటీ ఛైర్‌పర్సన్ అయ్యి డెమొక్రటిక్ పార్టీలో కీలకనేతగా మారారు. తాజాగా వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించారు. ఈ పదవికి ఎంపికైన తొలి ముస్లిం మహిళ, తొలి భారత అమెరికన్ గజాలా. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, మహిళా హక్కులు, అందరికీ సమానత్వం... వీటిపైనే ఆమె దృష్టంతా. వాటికోసమే కృషి చేస్తున్నారు. మంచి చదువు, ధైర్యం ఉంటే ఎవరైనా మార్పుకి కారణమవ్వగలరని నమ్మే గజాలా... తన ప్రయాణం ద్వారానే ఎంతోమందిలో స్ఫూర్తినీ నింపుతున్నారు.

పది నిమిషాలు చాలు!



రేపు పరీక్ష... మార్కులు సరిగా రాలేదో ఇంట్లో బడిత పూజే. ఆఫీసులో గంటలకొద్దీ సాగిన మీటింగ్. చేయాల్సిన పనులు... గుర్తుంచుకోవాల్సిన అంశాలతో బుర్రంతా వేడెక్కిపోయింది.

ఉదయం లేచినప్పట్నుంచీ చిరాగ్గా ఉంది. ఇంటి పనులు చూస్తేనేమో బోలెడున్నాయి. ఇలాంటి పరిస్థితులు మనకు రోజూ చాలానే ఎదురవుతాయి కదూ! పేరుకి చిన్నవే. కానీ ఓ పట్టాన పని సాగనీయవు. మనసునీ స్థిమితపడనీయవు. అలాంటప్పుడు నచ్చకపోయినా పని కొనసాగించొద్దు. ఆనందం వెతుక్కోవాలి. దానికోసం ఏవేవో చేయాలని నీరసపడిపోకండి. ఓ పది నిమిషాలు కేటాయిస్తే చాలు. ఎలాగంటే... ఉన్న ప్రదేశం నుంచి లేచి పక్కకు వెళ్లండి. హాయిగా చుట్టుపక్కల ఏం జరుగుతోందో గమనిస్తూ పది నిమిషాలు నడవండి. శరీరాన్ని ఇలా కదిలిస్తే ఒత్తిడి పెంచే కార్టిసాల్ స్థాయులు తగ్గుతాయి. దీంతో శరీరానికి విశ్రాంతి భావన కలిగి మనసూ నెమ్మదిస్తుంది. అంతేకాదు, మెదడుకి రక్తం, ఆక్సిజన్ సరఫరా మెరుగ్గా జరిగి ఆనందాన్నిచ్చే సెరటోనిన్ విడుదలవుతుంది. నడక శ్వాస ప్రక్రియనూ మెరుగుపరుస్తుంది. ధ్యాసంతా వేసే అడుగులు, గమనించే వస్తువులు, వ్యక్తులు, ప్రదేశాల మీదకు వెళ్తుంది. దీంతో నెగెటివ్ ఆలోచనలు పక్కకు వెళతాయి. అందుకే బుర్రంతా గజిబిజిగా ఉన్నా, ఒత్తిడిగా అనిపించినా పది నిమిషాలు నడిచేయండి. కాస్త ఎండపడే ప్రదేశానికి వెళ్లారంటే డి విటమిన్ కూడా అందుతుంది. సెరటోనిన్‌కితోడు డి విటమిన్ కూడా అందితే ఆనందం రెట్టింపు అవుతుంది. ఇంకేం... ప్రయత్నించేయండి మరి!

ఆమె బ్యాట్‌నీ పరీక్షించారు!

వైరల్

'విమెన్ ఇన్ బ్లూ' సాధించిన అపూర్వ విజయం... దేశాన్ని ఆనందంలో ముంచెత్తింది. అందరూ వాళ్లమీద ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా కొన్ని ఆసక్తికరమైన విషయాలు...



- తన తొలి వన్డే మ్యాచ్‌లో సెంచరీ చేసిన అతి పిన్న వయస్కురాలు మిథాలీ రాజ్. 1999లో మిల్టన్ కీన్స్‌లో ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 114 రన్స్ చేసింది. అప్పుడామె వయసు 16 సంవత్సరాల 250 రోజులు. ఆట ప్రారంభించిన తొలినాళ్లలో 2000–2007 మధ్యలో అంటే, ఆ ఏడేళ్లలో మిథాలీ ఒక్కసారీ డకౌట్ కాలేదు.
- స్మృతి మంధానాది సహజంగా కుడిచేతి వాటం. కానీ తండ్రికి ఎడమచేతి బ్యాట్స్‌మెన్‌ల మీద ఉన్న ఇష్టంతో తప్పనిసరై ఆ దిశగా మారింది. అయితే ఈమె ఫేవరెట్ ప్లేయర్ లెఫ్ట్ హ్యాండర్ కుమార సంగక్కర.
- 2005లో సిల్హార్‌లో జరిగిన వన్డేలో ఇంగ్లండ్ మహిళల జట్టుపై ఐదు వికెట్లు తీసిన తరవాత ఝూలన్ గోస్వామి తన హోటల్ గదిలో బీబీసీకి 30 నిమిషాలపాటు ఫోన్‌లో ఇంటర్వ్యూ ఇచ్చిందట. గది బయట తన సహచరులు నవ్వులు వినిపించాక గానీ అది మిథాలీ రాజ్ బీబీసీ జర్నలిస్టుగా నటిస్తూ చేసిన ప్రాంక్ అని అర్థం కాలేదట.
- పదిహేడేళ్ల వయసులో దేశీ క్రికెట్‌లో డబుల్ సెంచరీ చేసిన తొలి మహిళ స్మృతి మంధాన. అప్పుడు ఆమె ఆడిన బ్యాట్ రాహుల్ ద్రవిడ్‌ది. దాన్ని ఆయన స్మృతి సోదరుడు శ్రవణ్‌కి జూనియర్‌గా ఆడుతున్నప్పుడు ఇచ్చిన బహుమతి.
- క్రికెట్ ప్రాక్టీసు తరవాత ప్రతిరోజూ తన పొడవాటి జుట్టును శుభ్రం చేసుకోవడం కష్టంగా అనిపించడంతో హర్మన్‌ప్రీత్ కౌర్ దాన్ని కత్తిరించింది. ఇందుకామె తండ్రి కొన్ని నెలలపాటు ఆమెతో మాట్లాడలేదట. క్రమంగా దాన్ని అంగీకరించారట.
- 2009లో ఆస్ట్రేలియాలో జరిగిన ఐసీసీ ప్రపంచ కప్ సందర్భంగా ఆతిథ్య జట్టుతో జరిగిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ భారీ సిక్స్ కొట్టడంతో ఆమె బ్యాట్‌ని ప్రయోగశాలకు పంపారు. ఆమె ఒకలాంటి పిచ్చి బలంతో కొట్టిందని అనుమానించడంతో డోప్ టెస్ట్ కూడా చేయించుకోవాల్సి వచ్చిందట.

బంగారం - వెండి

05న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,23,780	1,11,750	1,50,954
విజయవాడ	1,19,740	1,11,350	1,50,000
ప్రొద్దుటూరు	1,20,400	1,10,770	1,50,000
రాజమహేంద్రవరం	1,21,480	1,11,350	1,63,000
విశాఖపట్నం	1,21,030	1,11,350	1,50,000
తమిళనాడు	-----	1,11,800	1,63,000

3-6-9-12 నిబంధన తెలుసా?



డిజిటల్ తెరలకు బానిసలవుతున్న పిల్లలు నానాటికీ పెరుగుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే... అనతి కాలంలోనే మానసిక సమస్యలు మరింత ఎక్కువ అవుతాయి. బాల్యం తెరలకు బానిస అవుతుంది. అలాకాకూడదంటే ఈ నిబంధనలు తప్పకుండా పాటించాల్సిందే...

- మూడేళ్ల దాటేంత వరకూ పిల్లలకు అసలు స్క్రీన్ సమయమే ఉండకూడదు. ఈ వయసులో వాళ్లకి కావాల్సింది... సెన్సరీ యాక్టివిటీలూ, కుటుంబ సభ్యులతో తిరగడం, పర్యావరణ పరిచయం... వంటివి. వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి.
- మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు డిజిటల్ పరికరాలు అందిస్తే... రోజులో 30 నిమిషాలకు మించకుండా చూసుకోవాలి. తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే వాటిని ఇవ్వాలి. ఆన్‌లైన్ ఆటల జోలికి పోకుండా జాగ్రత్త పడాలి. ఆరుబయట ఆటలు ఆడేలా ఎక్కువ ప్రోత్సహించాలి.
- తొమ్మిదేళ్లలోపు పిల్లలకు ఒంటరిగా డిజిటల్ తెరలు ఉపయోగించే అవకాశం ఇవ్వకూడదు. ప్రాజెక్టులు, ఆన్‌లైన్ తరగతులు తదితర కారణాలతో ఇప్పటికే పిల్లల జీవితాల్లో ఫోన్లు, ట్యాబ్‌లు భాగమైపోయాయి. అలాంటి వారికి అవసరమైన పనులకే తప్ప... మిగతా వేటికీ ఇంటర్నెట్‌ను వాడనీయకుండా జాగ్రత్త పడాలి. ఒకవేళ బ్రౌజింగ్ చేయాల్సి వస్తే... నమ్మకమైన, వాడదగ్గ వెబ్‌సైట్లు మాత్రమే యాక్సెస్ ఉండేలా చూసుకోమంటున్నారు.
- పన్నెండు, ఆ తర్వాత... ఆలోచనలు, అభిప్రాయాలు, ఇష్టాయిష్టాలు అభివృద్ధి చెందే దశ ఇది. ఈ దశలో పిల్లలు సామాజిక మాధ్యమాలు విరివిగా ఉపయోగిస్తున్నారు. చెడుసావాసాలు, సైబర్, ఆర్థిక మోసాల బారిన పడుతున్నారు. అందుకే మంచీ చెడుల వ్యత్యాసం తెలిసే వరకు వీలైన మేర పిల్లలు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటేనే మేలట.

తరగతి గదిని మార్చేస్తోంది!



డిజిటల్ తెరలు, వర్చువల్ రియాలిటీ పాఠాలు... నగరాల్లోని విద్యార్థులకు కొత్తేమీ కాదు. గ్రామీణ విద్యార్థులకీ వాటిని అందించాలనుకుంది హర్షిణి కిషోర్. అలాఅని దానికే పరిమితం కాలేదు. వ్యాపారాలు, ఇంటర్నెట్‌లో జాగ్రత్తగా వ్యవహరించడం వంటివీ నేర్పిస్తోంది. ఇంతకీ ఎవరీమె?



పాకెట్ మనీ కోసం కాదు... పనిచేయడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవచ్చని 14 ఏళ్ల నుంచే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేసేది హర్షిణి. ఈమెది మదురై. 16 ఏళ్లకే కార్పొరేట్ గిఫ్టింగ్‌లు చేసిచ్చే వ్యాపారాన్ని ప్రారంభించింది. కాకపోతే కొంత నష్టాన్ని చవిచూసింది. అలాగని నిరాశ పడలేదామె. దాని గురించి ఇంకా అవగాహన పెంచుకోవాలి అనుకుని బీబీఏ ఆంత్రప్రెన్యూర్‌షిప్ చదివింది. అది చదివేటప్పుడే ఇంటర్న్‌షిప్‌లో భాగంగా అనాథ పిల్లలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధించింది. అప్పుడే వాళ్లెంత వెనకబడి ఉన్నారో అర్థమైందామెకు.

అతిపిన్న ఉద్యోగిని

18 ఏళ్లకే రూ.9లక్షల ప్యాకేజీతో బెంగళూరులో గూగుల్ ఆపరేషన్స్ సెంటర్‌లో ఉద్యోగం సంపాదించింది. అక్కడ అతిపిన్న ఉద్యోగిని హర్షిణినే. దీంతోపాటు ఇతర ఉద్యోగాలూ చేసేది ఆ వచ్చిన మొత్తంతో, సేకరించిన విరాళాలతో టెక్నికల్ సామగ్రి సమకూర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వీఆర్ పరికరాలతో టెక్ పాఠాలతోపాటు ఇంటర్నెట్ సేఫ్టీపైనా తరగతులు తీసుకుంటోంది. 'ఈ తరం పిల్లలకి ఇంటర్నెట్‌ని సురక్షితంగా ఉపయోగించడమే కాదు, ఆన్‌లైన్ వేధింపుల బారిన పడితే తమని తాము ఎలా రక్షించుకోవాలో తెలియడమూ ముఖ్యమే' అంటుందీమె. దీనికోసం సంబంధిత కోర్సునీ చేసింది. గ్రామీణ విద్యార్థులకోసం మొబైల్ లైబ్రరీ, వీఆర్, రొబోటిక్స్ టూల్స్‌ని సమకూరుస్తోంది.

2024లో 'రూరల్ టెక్ రైజ్' పేరుతో సంస్థను ప్రారంభించి ఈ పల్లె పిల్లలకు ప్రత్యేక కరిక్యులమ్‌ని వాళ్ల స్థానిక భాషలోనే రూపొందిస్తోంది. వ్యాపారాల దిశగా పిల్లలను ప్రోత్సహిస్తోంది. 'షార్క్ ట్యాంక్' తరహాలో కార్యక్రమాన్ని రూపొందించి, బాగున్న ఆలోచనలకు కావాల్సిన పెట్టుబడినీ అందిస్తోంది. తన టీమ్‌లో 10మంది కీలక సభ్యులున్నారు. వీళ్లూ పల్లె నేపథ్యాల వాళ్లే. హర్షిణి వాళ్లకి శిక్షణిచ్చి మరీ తీర్చిదిద్దింది. 'కేవలం తరగతులు పూర్తిచేసుకుంటూ వెళ్తే సరిపోదు. మారుతున్న కాలానికి తగ్గట్టుగా సిద్ధమవ్వాలి. అప్పుడే కొత్త ఆవిష్కరణలు సృష్టించగలరు. లోకంతో పోటీపడగలరు' అనే 22ఏళ్ల హర్షిణి అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలకు ప్రయత్నిస్తోంది. అప్పుడు సేవలను విస్తృతం చేయొచ్చు. పిల్లలకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించొచ్చు అంటుందీమె. ఇప్పటికీ రాత్రుళ్లు ఉద్యోగం చేస్తూ పగలు సమాజ సేవకు కేటాయిస్తోంది. అలా తన సేవల్ని తమిళనాడు, కర్ణాటకల్లోని 5 వేలకు పైగా పిల్లలకు చేరువ చేసింది. పైగా 'ఇదంతా కష్టమనుకోను. ఉదయం నలుగురికి సాయపడొచ్చన్న ఆలోచన మరింత ఉత్సాహంగా పనిచేసేలా చేస్తుంది. సభ్యుల సంఖ్యను పెంచుకోవాలి. మా సేవల్ని మరింతమందికి చేరువ చేయాలన్నదే నా లక్ష్య'మంటోన్న తన ప్రయత్నాన్ని అభినందించకుండా ఉండగలమా?

అందాల ఆంథూరియం... ఆరోగ్యానికీ!

ఇంటి తోట

అందంలో పూలూ, ఆకులూ ఒకదానితో మరొకటి పోటీపడుతూ చూపరులను మెప్పించే మొక్క ఆంథూరియం. దీన్ని ఇంట్లో పెంచుకుంటే ఆ ప్రదేశానికి కళ రావడమే కాదు... గాలి శుద్ధి అవుతుందట. ఇంకెందు కాలస్యం... ఎలా పెంచుకోవాలో తెలుసుకుందామా!



ఆంథూరియం మొక్కనే ఫ్లెమింగో ఫ్లవర్ ప్లాంట్, లేస్ లీఫ్, టెయిల్ ఫ్లవర్... వంటి అనేక పేర్లతో పిలుస్తారు. కరీబియన్ దీవుల్లో పుట్టి ప్రపంచవ్యాప్తంగా అలంకరణ మొక్కగా ప్రాచుర్యం పొందుతోంది. దీంట్లో 1000కి పైగా జాతులున్నాయట. దీని ఆకులు, పెద్దవిగా ముదురాకుపచ్చ రంగులో మెరుస్తుంటాయి. పూల మధ్యలోంచి పొడవాటి మొవ్వ బయటకి వస్తుంది. దీనికి వచ్చిన పూలు, ఆకులు కనీసం ఆరునెలల పాటు తాజాగా ఉంటాయి. ఎరుపు, గులాబీ, తెలుపు, ఆకుపచ్చ వంటి రంగుల్లో హృదయాకారంలో ఈ పూలు పుష్పిస్తాయి. ఇవి కీటకాలను ఆకర్షిస్తాయి. నాసా ఇచ్చిన గాలిని శుద్ధి చేసే మొక్కల జాబితాలో ఇదీ ఒకటి. ఆంథూరియం... వాతావరణంలోని అమోనియా, ఫార్మాల్డిహైడ్ వంటి విషపదార్థాలను సైతం తొలగించి మన ఆరోగ్యాన్నీ కాపాడుతుందట.

సంరక్షణ ఎలా...

పరోక్ష సూర్యకాంతిలో ఆంథూరియం మొక్కలు చక్కగా పెరుగుతాయి. నేరుగా ఎండ తగిలితే మాత్రం ఆకులు మాడిపోతాయి. చల్లగాలికి వీటిని దూరంగా ఉంచాలి. నీళ్లు అదేపనిగా పోయకూడదు. కానీ, గాల్లో తేమ మాత్రం ఎక్కువగా ఉండాలి. ఇందుకోసం అప్పుడప్పుడూ గాల్లోకి నీటిని స్ప్రే చేయండి. మట్టిలో కోకోపీట్, పర్లైట్, కంపోస్ట్, సారవంతమైన మట్టి... వీటిని బాగా కలిపి కుండీల్లో నింపాలి. అయితే, పూలు ఎక్కువ రావాలంటే క్రమం తప్పకుండా నెలకోసారి ఫాస్ఫరస్ అధికంగా ఉండే ద్రవరూప ఎరువుని అందించాలి. ముఖ్యంగా పుష్పించే దశలో తప్పనిసరిగా ఇవ్వండి. ఆంథూరియంను కొమ్మల ద్వారా కూడా కొత్త మొక్కలు చిగురించేలా చేయొచ్చు. దీని ఆకుల మీద దుమ్ము చేరకుండా ఎప్పటికప్పుడు తడి గుడ్డతో తుడవాలి. పాత ఆకుల్ని తొలగించాలి. ఈ మొక్కకు సాధారణంగా మిల్లీ బగ్స్, స్పైడర్ మైట్, తెల్లదోమ, పేనుబంక వంటి తెగుళ్లు వచ్చే అవకాశం ఉంది. వీటిని నివారించడానికి నీరు నిలవకుండా చూసుకోవడంతో పాటు వేపనూనెనూ స్ప్రే చేయాలి.



డ్రాపవుట్ పిల్లలతో రోబోటిక్స్ అద్భుతాలు

పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నగరానికి చెందిన బలహీనవర్గాల పిల్లలు రోబోటిక్స్‌లో అద్భుతాలు చేస్తున్నారు. వీరంతా మెకానిక్, దినసరి కూలీలు, ఇళ్లలో పనిచేసే కార్మికుల పిల్లలు. వారాంతపు డ్రాపవుట్లు కూడా ఉన్నారు. ఇటువంటి వారితో సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ కుందూ అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపారు. ఫలితంగా వారిలో పలువురు ఇప్పుడు మళ్లీ బడిబాట పడుతున్నారు. ఈ పిల్లల కోసం ఆహారం, సంగీత నృత్యాలు, ఫుట్‌బాల్, కరాటే అభ్యాసాలతో కూడిన క్యాంప్ ఏర్పాటుచేసిన చంద్రశేఖర్ ఐదేళ్ల క్రితం నుంచి ఉచితంగా స్మార్ట్ తరగతుల ద్వారా రోబోటిక్స్ బోధిస్తున్నారు. ఇంజినీరింగ్ విద్యార్థి దేబ్‌నారాయణ్ సింగ్ ఆయనకు సహకరిస్తున్నారు. చంద్రాణి పాల్, రాహుల్ శేఖర్ అనే వైద్య దంపతులు చంద్రశేఖర్ సామాజిక సేవకు ఆర్థికంగా చేయూతను అందిస్తున్నారు. వీరందరి సాయంతో ఈ విద్యార్థులు 'అంధుల చేతికర్ర', ముందున్న ఆటంకాల గురించి కారును ముందే హెచ్చరించే డివైజ్, ఆటోమేటెడ్ వీల్‌చైర్ వంటి పరికరాలను స్వయంగా తయారు చేస్తున్నారు.



వారసులు జరిపిన ముత్తాత పెళ్లి!

చిన్న కుటుంబాలుగా విస్తరిస్తున్న నేటి సామాజిక జీవన పరిస్థితుల్లో ఛత్తీస్‌గఢ్‌లోని అంబికాపూర్‌కు చెందిన బలదేవ్ ప్రసాద్ వారసులు ఓ వివాహ వేడుకతో ఉమ్మడి కుటుంబాల ప్రాధాన్యాన్ని మళ్లీ చాటే ప్రయత్నం చేశారు. ఈ కుటుంబ పెద్దలైన బలదేవ్ ప్రసాద్ సోని, బేవనీ దేవిల 65వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు మనవలు, 18 మంది మునిమనవళ్లు అందరూ ఒక్కటయ్యారు. హల్దీతో మొదలుపెట్టి వైభవంగా సాగిన పెళ్లి వేడుకలో వేదికపై వరుడు గుర్రంతో ముస్తాబైపోయిన వధువు మెళ్లో దండ వేశారు. అతిథులుగా విచ్చేసిన బంధుమిత్రులు బారాత్‌లో నృత్యాలతో అదరగొట్టారు. మునిమనవడు తనిష్క్ కారు నడుపుతూ వివాహ మండపానికి తీసుకురాగా, వధూవరుల జంట పెళ్లి ప్రమాణాలు మళ్లీ చేసింది. "అప్పట్లో మా పెళ్లి చాలా సాదాసీదాగా జరిగిపోయింది. ఇప్పుడు మా మనవలు వైభవంగా వేడుక జరిపి ఆ ముచ్చట తీర్చారు" అని బలదేవ్ అన్నారు. కుటుంబ విలువలు, అనుబంధాల మాధుర్యాన్ని కొత్త తరాలకు చాటేందుకే ఈ వేడుక జరిపినట్లు బలదేవ్ మనవడు సిద్ధార్థ్ తెలిపారు.



నేపాల్‌లో 10 వామపక్ష పార్టీల విలీనం

కాఠ్‌మాండూ: నేపాల్‌లో ప్రముఖ కమ్యూనిస్టు పార్టీలైన సీపీఎన్(మావోయిస్టు సెంటర్), సీపీఎన్ (యూనిఫైడ్ సోషలిస్టు) సహా మొత్తం 10 వామపక్ష పార్టీలు బుధవారం విలీనమయ్యాయి. 'నేపాలీ కమ్యూనిస్టు పార్టీ'గా ఏకతాటిపైకి వచ్చాయి. నాలుగు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. విలీన ప్రకటనకు ముందు 10 వామపక్ష పార్టీలు భారీ ప్రదర్శన నిర్వహించాయి. అవినీతి, బంధుప్రీతి, రాజకీయ అస్థిరతకు వ్యతిరేకంగా యువతరం(జెన్-జడ్) ఉద్యమించిన నేపథ్యంలో కమ్యూనిస్టుల ఐక్యత తెరపైకి వచ్చింది. కొత్త పార్టీకి సమన్వయకర్తగా సీపీఎన్ (మావోయిస్టు సెంటర్) చైర్మన్, మాజీ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ వ్యవహరిస్తారు. సీపీఎన్ (యూనిఫైడ్ సోషలిస్టు) అధినేత మాధవ్ కుమార్ సహ సమన్వయకర్తగా ఉంటారు. మార్క్సిజం-లెనినిజం తమకు మార్గదర్శక సిద్ధాంతంగా ఉంటుందని, ఆరు నెలల్లో పార్టీ జాతీయ మహాసభను నిర్వహిస్తామని నేతలు పేర్కొన్నారు. రాజకీయ పార్టీల బలహీనతలను బహిరంగపరుస్తూ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమించి తమ కళ్లు తెరిపించారంటూ జెన్-జడ్ యువతకు ప్రచండ కృతజ్ఞతలు తెలిపారు. అయితే సీపీఎన్(మావోయిస్టు సెంటర్)కు చెందిన జనార్దన శర్మ నేతృత్వంలోని గ్రూపు ఈ విలీనాన్ని వ్యతిరేకించింది. మరో పార్టీగా కొనసాగుతామంది.

మమ్దానీ విజయం దేనికి సంకేతం?

- అమెరికాలో భిన్నాభిప్రాయాలు

న్యూయార్క్: జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికవడంపై అమెరికాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన విజయం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెంపపెట్టని, దేశంలో డెమొక్రటిక్ సోషలిస్టులు సాధించిన పైచేయికి నిదర్శనమని కొందరు పేర్కొంటున్నారు. అమెరికాలో మార్క్సిజం బలోపేతమవడానికి ఈ విజయం సంకేతమని మరో వర్గం భావిస్తోంది. మరోవైపు మమ్దానీ గెలుపు డెమొక్రటిక్ పార్టీలోని వైరుధ్యాలను బహిర్గతం చేసింది. ఆయన డెమొక్రటిక్ పార్టీకి మంచి భవిష్యత్తు అందించగలరని ఒక వర్గం భావిస్తుండగా, మరో వర్గం ఆ పార్టీలో డెమొక్రటిక్ సోషలిస్టుల ప్రాబల్యం పెరుగుతోందనడానికి నిదర్శనమని భావిస్తోంది.



'మమ్దానీ, కువోమోలు జాతీయ స్థాయిలో ప్రాభవం కోల్పోతున్న డెమొక్రటిక్ పార్టీ భిన్న పార్శ్వాలకు ప్రతిరూపాలు. కువోమో పార్టీ అపఖ్యాతికి ప్రతీక కాగా.. మమ్దానీ స్ఫూర్తిమంతమైన కొత్త భావాలకు ప్రతిరూపం. ఈ ఎన్నిక ద్వారా న్యూయార్క్ ఓటర్లు తమ మొగ్గు ఎటువైపో తేల్చి చెప్పారు' అని ద గార్డియన్ పత్రిక తన వ్యాసంలో పేర్కొంది. వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్, వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రికలు మమ్దానీ విజయాన్ని ఒక డెమొక్రటిక్ సోషలిస్టు గెలుపుగా అభివర్ణించాయి. ఫాక్స్ న్యూస్, న్యూయార్క్ పోస్ట్ వంటి పత్రికలు మమ్దానీ విజయాన్ని ఒక సోషలిస్టు ప్రయోగంగా, ప్రబలమవుతున్న మార్క్సిజం ప్రాభవంగా పేర్కొన్నాయి.

ట్రంప్ పాలనకు రెఫరెండమేనా?

అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత దూకుడుగా వ్యవహరిస్తున్న ట్రంప్‌నకు ఏడాది కాకముందే చుక్కెదురైంది. తాజాగా జరిగిన పలు రాష్ట్రాల గవర్నర్ల ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చాయి. మేయర్ ఎన్నికల్లోనూ చేదు అనుభవం ఎదురైంది. ఈ ఎన్నికలపై 'బిగ్ బ్యూటిఫుల్ బడ్జెట్ బిల్లు' సహా కేంద్ర ప్రభుత్వ షట్‌డౌన్ వంటి ట్రంప్ ప్రభుత్వ విధానాల ప్రభావం చూపాయనే వాదన వినిపిస్తోంది. అయితే ఎన్నికలకు ట్రంప్ దూరంగా ఉండటం, షట్‌డౌన్‌వల్లే రిపబ్లికన్ల ఓటమిపాలయ్యారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు తన సొంత సోషల్ మీడియా వేదికగా పేర్కొనడం గమనార్హం.

బిహార్‌లో ఎన్డీయే మోసాలంటూ కాంగ్రెస్ 20 అంశాల పత్రం

తొలిదశ ఎన్నికల వేళ విడుదల

దిల్లీ: బిహార్‌లో నిరుద్యోగం, వలసలు, అవినీతి, గూండాగిరీ అంతం కావాలంటే ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో ప్రజలు అధికార ఎన్డీయే కూటమిని ఓడించాలని కాంగ్రెస్ బుధవారం పిలుపునిచ్చింది. ప్రజలకు ఎన్డీయే చేసిన మోసాలు, అన్యాయాలు, నిర్లక్ష్యాల సంకలనం పేరుతో 20 అంశాలను. . బిహార్ శాసనసభ తొలిదశ ఎన్నికలకు ఒకరోజు ముందు ఆ పార్టీ ప్రకటించింది. తన స్వప్రయోజనాలు, అధికార దాహం కోసం ఉజ్వల బిహార్ భవితవ్యాన్ని ఎన్డీయే అంధకారంలోకి నెట్టివేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. "బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వ హయాంలో 10 ఉద్యోగ నియామక పరీక్షలు, ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాలు లీకయ్యాయి. లక్షలమంది యువకుల భవిష్యత్తు నాశనం చేశారు. ఒక్కో ప్రశ్నపత్రాన్ని రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలకు విక్రయించారని శూలశోధనలో బయటపడింది. ఎన్డీయే విఫల విధానాల కారణంగా 3.18 కోట్ల మంది బిహారీలు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లి కూలీలుగా పనిచేయాల్సి వస్తోంది" అని జైరాం విమర్శించారు.

బాంబులా పేలిన విమానం

అమెరికాలో 9 మంది మృతి

లూయీవిల్: అమెరికాలోని లూయీవిల్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. టేకాఫ్ సమయంలో యూపీఎస్ కార్గో విమానం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా.. 13 మంది తీవ్రగాయాల పాలైనట్లు అధికారులు తెలిపారు. మంగళవారం సాయంత్రం 5:15 గంటలకు(అమెరికా కాలమానం ప్రకారం) జరిగిన ఈ భయంకరమైన ప్రమాదంలో విమానం బాంబులా పేలిపోయింది. తొలుత విమాన ఎడమ రెక్కకు మంట అంటుకున్నట్లు వీడియోలో కనిపించింది. భవనాలపై కూలిపోవడం.. విమానంలో భారీగా ఇంధనం ఉండడంతో తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు విమానయాన అధికారి పాబ్లో రోజస్ తెలిపారు.

యూపీలో కార్తిక స్నానాలకు వెళుతూ రైలు ఢీకొని ఆరుగురి మృతి

మీర్జాపుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీర్జాపుర్ జిల్లా చునార్ రైల్వేస్టేషనులో బుధవారం పట్టాలు దాటుతున్న యాత్రికులను ఓ రైలు ఢీకొంది. కార్తిక పౌర్ణమికి గంగానదిలో స్నానాలు ఆచరించడానికి వెళుతున్న ఆరుగురు మహిళా యాత్రికులు ఈ ప్రమాదంలో మృతిచెందినట్లు రైల్వే అధికారులు తెలిపారు. వారణాసికి వెళ్లేందుకు చోపాన్ ఎక్స్‌ప్రెస్ రైలులో చునార్ రైల్వేస్టేషనుకు చేరుకున్న యాత్రికులు ప్లాట్‌ఫాం వైపు దిగకుండా మరోవైపు ఉన్న పట్టాలపై దిగి.. ఎదురుగా ఉన్న మరో ప్లాట్‌ఫాం పైకి వెళ్లబోయారు. అదే సమయంలో ట్రాకు పైకి వచ్చిన హౌరా - కల్కా నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొన్నట్లు నార్త్ సెంట్రల్ రైల్వే ప్రయాగ్‌రాజ్ డివిజను అధికారి అమిత్‌సింగ్ తెలిపారు. రైల్వేస్టేషనులోని ఫుట్ ఓవర్ బ్రిడ్జి మీదుగా యాత్రికులు వెళ్లి ఉంటే ప్రమాదం జరిగేది కాదన్నారు. ఈ ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ సహాయక చర్యలకు అధికారులను ఆదేశించారు. కేంద్ర మంత్రి, మీర్జాపుర్ ఎంపీ అనుప్రియా పటేల్ సైతం 'ఎక్స్' ద్వారా సంతాపం వ్యక్తం చేశారు.

ఫిలిప్పీన్స్‌లో కల్మేగీ బీభత్సం

85కు చేరిన మృతుల సంఖ్య

మనీలా: సెంట్రల్ ఫిలిప్పీన్స్‌లో కల్మేగీ తుపాను బీభత్సం సృష్టించింది. దీని ధాటికి మృతి చెందిన వారి సంఖ్య 85కు చేరింది. మరో 76 మంది గల్లంతయ్యారు. భారీ వరదలకు పలువురు ఇళ్లలోనే చిక్కుకున్నారని, డజన్లకొద్దీ కార్లు కొట్టుకుపోయాయని బుధవారం అధికారులు వెల్లడించారు. ఇళ్లను వరద ముంచెత్తడంతో సహాయం కోసం ప్రజలు ఇళ్ల పైకప్పులు ఎక్కినట్లు తెలిపారు. రక్షించాలంటూ వందల సంఖ్యలో ప్రజలు తమకు ఫోన్ చేసినట్లు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పేర్కొన్నారు. సహాయక చర్యలు చేపట్టడానికి వెళ్లిన వైమానిక దళ హెలికాప్టర్ అగుసాన్ డెల్‌సర్ ప్రావిన్సులో మంగళవారం కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. కల్మేగీ తుపాను ప్రభావంతో సెబూలో అధిక ప్రాణ నష్టం జరిగినట్లు సమాచారం. ఇక్కడ 49 మంది మృత్యువాతపడ్డారని, 13 మంది గల్లంతయ్యారని అధికారులు తెలిపారు.



వరద తీవ్రతకు సెబూ నగరంలో కొట్టుకువచ్చిన కార్లు



ఐరన్ లోపాన్ని ఇలా భర్తీ చేసుకోండి

శరీరంలో ఐరన్ లోపాన్ని సహజసిద్ధంగా భర్తీ చేయడానికి ఓ చిట్కా ఉంది. ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలను, సి విటమిన్ కలిగి ఉన్నవాటితో కలిపి తీసుకోండి. ఉదాహరణకు పాలకూర-నిమ్మ, క్వినోవా-బ్రకోలి, డార్క్ చాకొలేట్-బెర్రీలు.. ఈ కాంబినేషన్లను ప్రయత్నించండి.

– క్రిస్టైన్ జకోబిట్జ్, ఫిట్‌నెస్ కోచ్

మెక్సికో అధ్యక్షురాలికి నడిరోడ్డుపై లైంగిక వేధింపులు

మెక్సికో సిటీ: మెక్సికోలో దిగ్భ్రాంతికర ఘటన చోటుచేసుకుంది. ఏకంగా ఆ దేశాధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ నడిరోడ్డుపై లైంగిక వేధింపులు ఎదుర్కోవడం కలకలం సృష్టించింది. మిచొకాన్‌లో ఆమె మంగళవారం ఓ బహిరంగ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ క్లాడియా ప్రజలతో మాట్లాడుతుండగా.. వెనుక నుంచి వచ్చిన ఓ వ్యక్తి చేయి వేస్తూ.. ఆమెను ముద్దు పెట్టుకోబోయాడు. వెంటనే భద్రతా సిబ్బంది అతడిని పక్కకు నెట్టారు. అయినప్పటికీ అతడు క్లాడియాను అసభ్యంగా తాకుతుండడంతో ఆమె ఇబ్బంది పడుతూ.. అతడి చేతిని పక్కకు నెట్టారు. ఆ వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తనపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు పెట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు క్లాడియా బుధవారం తెలిపారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు.



క్లాడియాను అసభ్యంగా తాకేందుకు ప్రయత్నిస్తున్న వ్యక్తి

నరభక్షక చిరుత కాల్చివేత

పుణె: మహారాష్ట్రలోని పుణె జిల్లా శిరూర్ తహసీలు పరిధిలో గత నెల రోజులుగా భయానక వాతావరణం సృష్టించిన నరభక్షక చిరుతను షూటర్లు కాల్చిచంపినట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. మంగళవారం రాత్రి పింపర్‌ఖేడ్ గ్రామం వద్ద చిరుతను గుర్తించిన షూటర్ల బృందం ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. గత నెల ఈ చిరుత దాడిలో ఇద్దరు చిన్నారులతోపాటు ఓ మహిళ మృత్యువాతపడ్డారు. దీంతో అధికారులు తగిన నివారణ చర్యలు తీసుకోవాలంటూ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఆందోళనలకు దిగారు. అటవీశాఖ వాహనాన్ని తగులబెట్టారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన షూటర్ల బృందం అయిదారేళ్ల వయసున్న చిరుతను కాల్చిచంపినట్లు జున్నార్ అటవీ డివిజను అధికారులు తెలిపారు. మరో రెండు చిరుతలను సైతం బంధించామని, వాటిని వన్‌తారాకు తరలిస్తామని వెల్లడించారు.



పంజాబ్‌లో కబడ్డీ ఆటగాడి కాల్చివేత

- ఇది మా పనే: బిష్ణోయ్ గ్యాంగ్
- వారం వ్యవధిలో ఇద్దరి హత్య

ఈటీవీ భారత్: పంజాబ్‌లోని లుధియానాలో కబడ్డీ ఆటగాడు గుర్విందర్ సింగ్‌ను (23) గుర్తుతెలియని వ్యక్తులు కాల్చి చంపారు. ఈ హత్యను తామే చేశామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చేసిన పోస్టు వైరల్ అవుతోంది. పోలీసులు ఆ విషయాన్ని ఇంకా ధ్రువీకరించలేదు. మంకీ గ్రామానికి చెందిన గుర్విందర్ తన స్నేహితులు ధర్మవీర్ సింగ్, లవ్ ప్రీత్‌సింగ్‌లతో కలిసి సోమవారం రాత్రి 9.00 గంటల సమయంలో ఓ దుకాణం బయట నిల్చొని ఉండగా ఈ ఘటన జరిగింది. ముసుగులు ధరించి మోటార్ బైకులపై వచ్చిన నలుగురు దుండగులు గుర్విందర్, అతడి స్నేహితులపై తుపాకులతో కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో గుర్విందర్, ధర్మవీర్ తీవ్రంగా గాయపడ్డారు. లవ్‌ప్రీత్ సురక్షితంగా బయటపడ్డాడు. చండీగఢ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్విందర్ మరణించగా, ధర్మవీర్‌కు చికిత్స కొనసాగుతోంది. గుర్విందర్ తండ్రి రాజేంద్రసింగ్ ఈ ఘటనపై స్పందిస్తూ.. తమకు ఎవరితోనూ శత్రుత్వం లేదన్నారు. పంజాబ్‌లో కబడ్డీ ఆటగాళ్లు లక్ష్యంగా వారం రోజుల వ్యవధిలో జరిగిన రెండో హత్య ఇది. అక్టోబరు 31న లుధియానాలోని జాగ్రావ్ ప్రాంతానికి చెందిన కబడ్డీ ఆటగాడు తేజ్‌పాల్ సింగ్ హత్యకు గురయ్యారు.



గుర్విందర్ సింగ్

పాక్ చరిత్రలోనే మునీర్ అత్యంత క్రూరమైన నియంత: ఇమ్రాన్‌ఖాన్



లాహోర్: పాకిస్థాన్ సైన్యాధిపతి ఆసీమ్ మునీర్.. ఆ దేశ చరిత్రలోనే అత్యంత క్రూరమైన నియంత అని జైల్లో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పేర్కొన్నారు. మానసికంగా కూడా స్థిమితం లేని వ్యక్తి అని విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఇమ్రాన్ అధికారిక 'ఎక్స్' ఖతాలో పోస్టు వెలువడింది. తన పార్టీ (పాకిస్థాన్ తెహ్రీకే ఇన్సాఫ్) కార్యకర్తలపై అనేక దారుణాలకు మునీర్ ఒడిగట్టారని అన్నారు. "నిరాయుధులైన పౌరులపై కాల్పులు జరపడం ఏ సభ్య సమాజమూ కలలో కూడా ఊహించదు. ఎన్నడూ లేని విధంగా మహిళలపై అనేక దారుణాలకు ఒడిగట్టారు" అంటూ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు తనపై ఒత్తిడి పెంచడానికి తన భార్య బుష్రా బీబీని ఒంటరిగా నిర్బంధించారని అన్నారు. "బానిసత్వం కంటే చావుకే ప్రాధాన్యమిస్తాం. నన్ను, నా భార్యను అన్ని రకాలుగా మునీర్ ఇబ్బంది పెట్టాడు. ఇలాంటి క్రూరత్వం.. గతంలో ఏ రాజకీయ కుటుంబమూ ఎదుర్కోలేదు. మునీర్ ఎంతకు తెగించినా నేను తలవంచను. లొంగను" అని తెలిపారు.

'సామూహిక వీసాల రద్దు'.. అధికారాల కోసం కెనడా ప్రయత్నాలు



ఇంటర్నెట్ డెస్క్: వీసా మోసాలను అరికట్టేందుకు కెనడా మరిన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా భారత్, బంగ్లాదేశ్ నుంచి వీసా మోసాలు పెరుగుతున్నాయన్న అనుమానాల నేపథ్యంలో సామూహికంగా వీసాలను రద్దు చేసే అధికారాల కోసం కెనడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి అమెరికా సంస్థలతో కలిసి ఇమిగ్రేషన్, రెఫ్యూజీ, సిటిజన్‌షిప్ కెనడా (ఐఆర్‌సీసీ), కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ)లు ఇమిగ్రేషన్ మంత్రిత్వశాఖకు ఇప్పటికే ఓ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు సీబీసీ వార్తా కథనం వెల్లడించింది. మోసపూరిత విజిటింగ్ వీసా దరఖాస్తులను తిరస్కరించడం, రద్దు చేయడం కోసం కెనడా సంస్థలు అమెరికా భాగస్వామ్యపక్షాలు ఓ బృందంగా ఏర్పడినట్లు ఇమిగ్రేషన్ నివేదికల్లో ప్రస్తావించినట్లు తెలిపారు. మహమ్మారి, యుద్ధం తదితర సమయాల్లో సామూహిక వీసా రద్దు అధికారాలు ఉపయోగించాలని భావిస్తున్నారు. ప్రతిపాదిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టినట్లు తెలుస్తోంది.



ట్రయల్ రన్‌లో పక్కకు ఒరిగిన మోనో రైలు

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని వడాలా డిపో వద్ద బుధవారం సిగ్నలింగ్ ట్రయల్ రన్ నిర్వహిస్తుండగా మోనోరైలు పక్కకు ఒరిగింది. ఓ స్తంభాన్ని బలంగా ఢీకొట్టడంతో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బంది గాయపడ్డారు. వీరిలో రైలు కెప్టెన్ కూడా ఉన్నారు. గాయపడిన వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమయంలో అందులో ప్రయాణికులు లేరని అధికారులు తెలిపారు. అంతకుముందు ఇది చిన్న ప్రమాదమని ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని మోనో రైలు నిర్వహణను చూస్తున్న ముంబయి మెట్రోరైలు ఆపరేషన్స్ లిమిటెడ్ పేర్కొనడం గమనార్హం.

జకీర్ నాయక్ పర్యటనను తిరస్కరించిన బంగ్లాదేశ్!

దిల్లీ: పరారీలో ఉన్న వివాదాస్పద మత బోధకుడు, భారత్ బలగాలు అన్వేషిస్తున్న జకీర్ నాయక్‌ను తమ దేశంలోకి అనుమతించకూడదని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం నిర్ణయించినట్లు స్థానిక మీడియా వర్గాలు పేర్కొన్నాయి. జకీర్ రావడంపై మంగళవారం హోం మంత్రిత్వశాఖ నేతృత్వంలో జరిగిన లా అండ్ ఆర్డర్ కోర్ కమిటీ భేటీలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. జకీర్ బంగ్లాదేశ్‌కు వెళ్తే ఆయన కార్యక్రమాలకు పెద్దఎత్తున జనసమూహం వచ్చే అవకాశం ఉందని, వారి నియంత్రణకు భారీగా బలగాలను మోహరించాల్సి ఉండటంతో ప్రస్తుతం అది సాధ్యపడదని ఆయన పర్యటనను నిరాకరించినట్లు వివరించాయి. ప్రభుత్వ అనుమతితో జకీర్‌ను నవంబరు చివరిలో బంగ్లాకు తీసుకొస్తామని స్పార్క్ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఇటీవల వెల్లడించింది.

'ఓటు చోరీ' ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటోంది

- ఎన్డీయేపై ప్రియాంకా గాంధీ ఆరోపణలు

బెతియా: బిహార్‌లో ఎన్డీయే 'ఓటు చోరీ' ద్వారా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటోందని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంకా గాంధీ ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ద్వారా ఓటరు జాబితా నుంచి మహిళలు సహా 65 లక్షల మంది ఓట్లను తొలగించారని దుయ్యబట్టారు. పశ్చిమ చంపారణ్ జిల్లాలో పలుచోట్ల నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్డీయే అన్నింటిని నాశనం చేస్తోందని, భవిష్యత్తులో ఎన్నికలు ఉంటాయో, ఉండవోనని అనుమానం వ్యక్తం చేశారు. 'అవినీతి, నేరాలు, యువతకు విద్య మొదలైన విషయాలను పట్టించుకోని ప్రధాని మోదీ.. కాంగ్రెస్ పోస్టర్‌లో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఫొటో లేకుంటే మాత్రం ఆందోళన చెందుతారు. ర్యాలీలో బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌నూ ఆయన పట్టించుకోరు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వరాష్ట్రమైన గుజరాత్‌లోనే అన్ని పరిశ్రమలను ఏర్పాటు చేస్తారు' అని ఆమె విమర్శించారు.



పశ్చిమ చంపారన్ జిల్లా వాల్మీకీ నగర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రియాంకాగాంధీ


మా పూర్వీకుల త్యాగాలను అభినందించలేకపోతున్నారు

"వారసత్వ రాజకీయాలు' అంటూ విమర్శించే భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి.. మా పూర్వీకుల త్యాగాలను అభినందించలేకపోతోంది. తాజాగా అమెరికాలోని న్యూయార్క్ నగరానికి మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దానీ.. మా ముత్తాత, భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని ప్రస్తావించారు. కానీ, భాజపా నేతలు మాత్రం. . ఉదయం నుంచి సాయంత్రం వరకు నెహ్రూపై దుర్భాషలాడుతుంటారు. దేశంలోని అన్ని రుగ్మతలకు ఆయనే కారణమని నిందలు వేస్తారు. ఈ భూమి మా రక్తంతో తడిసి ఉంది. వారసత్వ రాజకీయాలంటూ వేదికల మీద నుంచి ప్రసంగించేవారు త్యాగాలను ఎప్పటికీ అర్థం చేసుకోలేరు' అంటూ ప్రియాంక ఎన్డీయేపై విరుచుకుపడ్డారు.

నాడు వద్దనుకుని.. నేడు ఆయనకే పట్టం

- నాసా అధిపతిగా ఐజక్‌మాన్‌కే ట్రంప్ ఓటు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ అంతరిక్ష సంస్థ నాసా పరిపాలకునిగా వ్యాపారవేత్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, పైలట్, వ్యోమగామి అయిన జారెడ్ ఐజక్‌మాన్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. నాసా పదవికి ఐజక్‌మాన్ అభ్యర్థిత్వం గత మే నెలలోనే పరిశీలనకు వచ్చింది. అయితే ట్రంప్ ఆయన అభ్యర్థిత్వాన్ని పక్కనపెడుతున్నట్లు ప్రకటించారు. విస్తృత సమీక్ష అనంతరం ఆ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ అప్పట్లో చెప్పారు. 'ఐజక్‌మాన్ చాలా మంచి వ్యక్తి అని అనుకున్నాను. అయితే ఆయన ఒక సంపన్నుడైన డెమొక్రాట్ అని తెలిసి ఆశ్చర్యపోయాను. ఆయనకు ఏనాడూ రిపబ్లికన్ పార్టీతో సంబంధం లేదు" అని ట్రంప్ ఆనాడు ప్రకటించారు. అయితే ఆ టెక్ కుబేరునికి టెస్లా అధినేత ఎలాన్ మస్క్ మద్దతు ఉండటంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. "లబ్ధప్రతిష్ఠుడైన వ్యాపారవేత్త, పరోపకారి, పైలట్, వ్యోమగామి అయిన ఐజక్‌మాన్‌ను నాసా పరిపాలక అధికారిగా నియమిస్తున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది" అని ట్రంప్ తన తాజా సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.



ఐజక్‌మాన్

ఛత్తీస్‌గఢ్ రైలు ప్రమాదం.. 11కు చేరిన మృతుల సంఖ్య

బిలాస్‌పుర్: ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పుర్ రైలు ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య 11కు చేరినట్లు బుధవారం అధికారులు తెలిపారు. ఇందులో ఆరుగురు మహిళలు ఉన్నట్లు వెల్లడించారు. గాయపడిన వారి సంఖ్య కూడా 14 నుంచి 20కి పెరిగిందన్నారు. వీరికి తక్షణ సహాయంగా రూ.50 వేలు అందించినట్లు అధికారిక ప్రకటన వెలువడింది. మంగళవారం బిలాస్‌పుర్ రైల్వేస్టేషన్ పరిధిలో ప్యాసింజర్ రైలు గూడ్స్ రైలును ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 8 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. అయితే బుధవారం మరో ముగ్గురు ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. దీంతో మృతుల సంఖ్య 11కి చేరింది. రెడ్ సిగ్నల్ దగ్గర ప్యాసింజర్ రైలును నియంత్రించడంలో సిబ్బంది విఫలమయ్యారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

అదనపు సుంకాల సస్పెన్షన్‌ను పొడిగించిన చైనా

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్- చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ల భేటీ తర్వాత రెండు దేశాల మధ్య ట్రేడ్‌వార్ కాస్త సద్దుమణిగింది. ఈ క్రమంలోనే అమెరికా వస్తువులపై ఉన్న అదనపు 24 శాతం సుంకాల సస్పెన్షన్‌ను పొడిగిస్తున్నట్లు చైనా తాజాగా ప్రకటించింది. ఈ పొడిగింపు ఏడాది పాటు అమల్లో ఉండనుంది. పది శాతం టారిఫ్ మాత్రం కొనసాగనుంది. నవంబర్ 10 నుంచి ఈ నిర్ణయం అమల్లోకి రానుంది. కాగా, గత నెల చివర్లో డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్‌లు భేటీ అయిన విషయం విదితమే!

మంగోలియా నుంచి దిల్లీకి చేరిన 228 మంది ప్రయాణికులు

దిల్లీ: మంగోలియా రాజధాని ఉలాన్‌బాతర్‌లో చిక్కుకున్న 228 మంది ప్రయాణికులు ఎయిరిండియా విమానంలో బుధవారం ఉదయం దిల్లీ చేరుకున్నారు. శాన్‌ఫ్రాన్సిస్కో నుంచి దిల్లీకి వస్తున్న విమానాన్ని సాంకేతిక సమస్యల కారణంగా సోమవారం మంగోలియాకు మళ్లించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఉలాన్‌బాతర్ చేరుకున్న ఎయిరిండియా విమానం ప్రయాణికులతో బుధవారం దిల్లీ చేరుకున్నట్లు అధికారులు తెలిపారు.

అణు పరీక్షల పునరుద్ధరణకు ప్రతిపాదనలు సమర్పించాలన్న పుతిన్

మాస్కో: అణు పరీక్షల్ని పునరుద్ధరించడానికి కావాల్సిన ప్రతిపాదనలు సమర్పించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ బుధవారం తమ అధికారుల్ని ఆదేశించారు. అమెరికా సొంతంగా అణు పరీక్షల్ని పునఃప్రారంభించనున్నట్లు ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతవారం చేసిన ప్రకటనపై పుతిన్ ఈ మేరకు స్పందించారు. ముందుగా అమెరికాగానీ అణు పరీక్షలు ప్రారంభిస్తే తాము కూడా అదే పని చేస్తామని ఇదివరకు తాను చేసిన ప్రకటనను రష్యా భద్రతామండలి సమావేశంలో పుతిన్ పునరుద్ఘాటించారు. అమెరికా ఉద్దేశాలేమిటో విశ్లేషించాలని రక్షణ, విదేశాంగ మంత్రిత్వశాఖల్ని ఆదేశించారు.



రిటైర్మెంట్ హోమ్‌లో అగ్నిప్రమాదం.. 10మంది మృతి

బోస్నియాలో ఘటన

సారాజెవో: ఐరోపాలోని బోస్నియా దేశం తుజ్లా పట్టణంలోని ఓ రిటైర్మెంట్ హోమ్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో కనీసం 10 మంది చనిపోగా..20 మంది గాయపడ్డారు. భవనంలోని పైఅంతస్తులో ఈ ప్రమాదం జరిగింది.

ఆధ్యాత్మికవేత్త రవిశంకర్‌కు 'వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డు

ఇంటర్నెట్‌డెస్క్: ప్రముఖ ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ '2025 వరల్డ్ లీడర్ ఫర్ పీస్ అండ్ సెక్యూరిటీ' అవార్డును అందుకున్నారు. బోస్టన్ గ్లోబల్ ఫోరం (బీజీఎఫ్), ఏఐ వరల్డ్ సొసైటీ (ఏఐడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో అమెరికాలోని బోస్టన్‌లో ఆయన్ను ఘనంగా సన్మానించారు. భారత్‌తో పాటు ప్రపంచంలో శాంతి పరిరక్షణ, నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికిగాను ఈ పురస్కారంతో గౌరవించారు. ఈ అవార్డును ప్రారంభించినప్పటి నుంచి ప్రపంచ శాంతికి సంబంధించి నైతిక, వ్యూహాత్మక మూలాలను బలోపేతం చేసిన అసాధారణ వ్యక్తులను సన్మానిస్తున్నారు. గతంలో ఈ పురస్కారం అందుకున్న ప్రముఖుల జాబితాలో జపాన్ మాజీ ప్రధాని షింజో అబే, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ (2022), ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ (2024) ఉన్నారు.



రాణించిన అవంతీ ఫీడ్స్

ఈనాడు, హైదరాబాద్: రొయ్యల మేతను ఉత్పత్తి చేసే అవంతీ ఫీడ్స్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1659.12 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.168.79 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.11.25గా ఉంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.1393.91 కోట్లు, నికర లాభం రూ.121.47 కోట్లుగా ఉన్నాయి. 2025-26 ఏప్రిల్-సెప్టెంబరులో ఆదాయం రూ.3,316.11 కోట్లు, నికర లాభం రూ.354.46 కోట్లుగా నమోదయ్యాయి.

ఎంటార్ టెక్ ఆదాయం రూ.136 కోట్లు

ఎంటార్ టెక్నాలజీస్ సెప్టెంబరు త్రైమాసికంలో రూ.135.6 కోట్ల ఆదాయంపై రూ.4.2 కోట్ల లాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో రూ.190.19 కోట్ల ఆదాయం, రూ.18.7 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. 2024-25 తొలి 6 నెలల్లో ఆదాయం రూ.675.99 కోట్లు, నికర లాభం రూ.52.88 కోట్లు ఉండగా, ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.318.45 కోట్లు, లాభం రూ.23.2 కోట్లుగా ఉన్నాయి.



మారుతీ కార్లు 3 కోట్లు విక్రయమయ్యాయ్



మారుతీ సుజుకీ ఇండియా (ఎంఎస్ఐ), కార్యకలాపాలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు దేశీయ విపణిలో 3 కోట్ల కార్లు విక్రయించింది. తొలి కోటి కార్ల విక్రయాలు నమోదు కావడానికి 28 ఏళ్ల 2 నెలల సమయం పట్టగా, తర్వాత కోటి కార్లను 7 ఏళ్ల 5 నెలల్లో అమ్మగలిగింది. మూడో కోటి కార్ల విక్రయాలకు 6 ఏళ్ల 4 నెలలే పట్టిందని సంస్థ వెల్లడించింది.

ఆల్టోనే అగ్రగామి: దేశంలో అమ్మిన 3 కోట్ల కార్లలో అత్యంత పాపులర్ మోడల్‌గా ఆల్టో నిలిచింది. 47 లక్షలకు పైగా ఆల్టో కార్లను సంస్థ విక్రయించింది. దీని తర్వాత స్థానంలో వ్యాగన్ ఆర్ (34 లక్షలు), స్విఫ్ట్ (32 లక్షలు) నిలిచాయి. కాంపాక్ట్ ఎస్‌యూవీలు బ్రెజా, ఫ్రాంక్స్ కూడా కంపెనీ విక్రయించిన టాప్-10 బ్రాండ్లలో ఉన్నాయి. 1983 డిసెంబరు 14న కంపెనీ తన తొలి వినియోగదారుకు మారుతీ 800ను డెలివరీ చేసింది. మారుతీ ప్రస్తుతం 19 మోడళ్లలో 170 వేరియంట్లను విక్రయిస్తోంది.

జీసీసీలు ఎక్కడున్నా.. నాయకత్వ స్థానాలు

హైదరాబాద్, బెంగళూరుల్లోనే



ఈనాడు, హైదరాబాద్: మనదేశంలో ఏర్పాటవుతున్న జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లకు సంబంధించి నాయకత్వ స్థానాలు హైదరాబాద్, బెంగళూరుల్లోనే అధికంగా ఉంటున్నాయి. దాదాపు 70% నాయకత్వ స్థానాలు ఈ రెండు నగరాల్లోనే కేంద్రీకృతం అవుతున్నట్లు 'క్వెస్‌కార్ప్ ఇండియాస్ జీసీసీ- ఐటీ టాలెంట్ ట్రెండ్స్, 2025' నివేదిక వెల్లడించింది. ప్రతి 10 జీసీసీ నాయకత్వ స్థానాల్లో 7 స్థానాలు హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఉంటున్నట్లు పేర్కొంది. అంతర్జాతీయ, దేశీయ కంపెనీలు వివిధ నగరాల్లో జీసీసీలను నెలకొల్పుతున్నాయి. వీటి విభాగాలకు నేతృత్వం వహించేవారు హైదరాబాద్, బెంగళూరుల్లో ఎక్కువగా ఉంటున్నారని నివేదిక విశ్లేషించింది.

ఈ నివేదిక ప్రకారం హైదరాబాద్‌లో ఈ నియామకాల్లో వృద్ధి అత్యధికంగా 42 శాతంగా ఉంది. వీరికి వేతనాలు కూడా 6-8% ఎక్కువగా లభిస్తున్నాయి. బెంగళూరులో జీసీసీలకు అవసరమైన మానవ వనరుల లభ్యత అధికంగా ఉంది. ఫైనాన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాలకు చెందిన వారిని చెన్నై బాగా ఆకర్షిస్తోంది. అనలిటిక్స్, క్వాలిటీ అస్యూరెన్స్ విభాగాల్లో పుణె ఆకర్షణీయంగా ఉంది. ద్వితీయ శ్రేణి నగరాల్లో కోచి, కోయంబత్తూరు, అహ్మదాబాద్ క్రియాశీలకంగా ఉన్నాయి. 'జనరేటివ్ ఏఐ, ఎల్‌ఎల్‌ఎం ఇంజినీరింగ్, ఫిన్‌ఆప్స్, జీరో ట్రస్ట్ సెక్యూరిటీ, కుబెర్నెట్స్, టెర్రాఫామ్ స్కిల్స్' విభాగాల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉన్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. ఈ కొత్త సాంకేతికతలకు సంబంధించి హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ఎన్నో ఉద్యోగాలు వస్తున్నాయని, కానీ నిపుణుల లభ్యత తగినంతగా లేదని వివరించింది.

బంగారం కొంటూనే ఉన్నాయ్

- సెప్టెంబరులో కేంద్ర బ్యాంకుల చేతికి 39 టన్నులు
- అత్యధికంగా బ్యాంక్ ఆఫ్ బ్రెజిల్



ఈనాడు, హైదరాబాద్: బంగారం ధర ఈ ఏడాది అక్టోబరులో జీవనకాల రికార్డు స్థాయికి చేరింది. అంతర్జాతీయంగా ఔన్సు (31.10 గ్రాముల) మేలిమి బంగారం 4,379.13 డాలర్లు పలకగా, దేశీయంగా 10 గ్రాముల ధర (24 క్యారెట్లు) రూ.1.32 లక్షలకు చేరింది. దీనికి ఎన్నో కారణాలున్నా, వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు భారీస్థాయిలో బంగారాన్ని కొనుగోలు చేయడం ముఖ్య కారణమని తెలుస్తోంది. సెప్టెంబరులో వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు నికరంగా 39 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. వీటి కొనుగోళ్లు 43 టన్నులు కాగా, అమ్మకాలు 4 టన్నులు మాత్రమే. ఈ ఏడాదిలో ఒక నెలలో కేంద్ర బ్యాంకుల బంగారం కొనుగోళ్లు ఇంత అధికంగా నమోదు కావడం అక్టోబరులోనే అని డబ్ల్యూజీసీ (ప్రపంచ స్వర్ణ మండలి) తెలిపింది.


ఈ విభాగాల్లోనూ: ఆభరణాలతో పాటు కొంతకాలంగా బంగారానికి పెట్టుబడిదార్ల నుంచి డిమాండ్ పెరుగుతోంది. ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్)ల్లోకి ఎన్నడూ లేనంత అధికంగా పెట్టుబడులు వస్తున్నాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదలుపెట్టిన సుంకాల యుద్ధం, ద్రవ్యోల్బణ భయాల నేపథ్యంలో, భద్రమైన పెట్టుబడిగా బంగారం వైపు మొగ్గుచూపడం ఎంతో పెరిగింది. దీనికి తోడు కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లతో, పసిడి ధరకు రెక్కలు వచ్చినట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

విక్రయించింది ఉజ్బెకిస్థాన్ ఒక్కటే: సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ బ్రెజిల్ ఈ ఏడాది సెప్టెంబరులో అత్యధికంగా 15 టన్నుల బంగారం కొనుగోలు చేసింది. నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్థాన్ 8 టన్నులు, బ్యాంక్ ఆఫ్ గ్వాటిమాలా 6 టన్నులు కొనుగోలు చేశాయి. రష్యా 3 టన్నులు, తుర్కియే 2 టన్నులు కొనుగోలు చేశాయి. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఉజ్బెకిస్థాన్ మాత్రం 4 టన్నుల బంగారాన్ని విక్రయించింది.

జనవరి నుంచి 200 టన్నులు: ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు చివరివరకు కేంద్ర బ్యాంకులు నికరంగా 200 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసినట్లు డబ్ల్యూజీసీ వెల్లడించింది. ఇందులో నేషనల్ బ్యాంక్ ఆఫ్ పోలండ్ అధికంగా 67 టన్నుల బంగారాన్ని సొంతం చేసుకుంది. నేషనల్ బ్యాంక్ ఆఫ్ కజకిస్థాన్ 40 టన్నులు, అజర్‌బైజాన్ (స్టేట్ ఆయిల్ ఫండ్ ఆఫ్ అజర్‌బైజాన్) 38 టన్నుల బంగారాన్ని కొన్నాయి.

'ఇండియా టెక్ అలయన్స్'లోకి ఎన్‌విడియా

విదేశీ ఏఐ చిప్‌లపై చైనా నిషేధం నేపథ్యం



చైనా ప్రభుత్వం విదేశీ ఏఐ చిప్‌ల వినియోగంపై నిషేధం విధించింది. ప్రభుత్వ నిధులు పొందిన కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులు కేవలం దేశీయ ఏఐ చిప్‌లు మాత్రమే వాడాలని అధికారిక ఆదేశాలు జారీ చేసినట్లు వార్తా సంస్థ రాయిటర్స్ తెలిపింది. ప్రస్తుతం చైనాలో అమెరికా సంస్థ ఎన్‌విడియా రూపొందించిన హెచ్ 20, బీ200, హెచ్200 చిప్‌లు వాడుతున్నారు. తాజా పరిణామాల్లో చైనాలో కొత్త డేటా సెంటర్లు ఏర్పాటు చేస్తున్న వారు, విదేశీ చిప్‌ల కొనుగోలు ప్రణాళికలను రద్దు చేసుకోవాల్సిందే. ముందస్తు దశలో ఉన్న కొన్ని ప్రాజెక్టుల విషయంలో, విదేశీ చిప్‌ల వినియోగంపై ప్రాజెక్టు వారీగా నిర్ణయం తీసుకుంటారు. దీంతో చైనాలో మార్కెట్ వాటా పెంచుకోవాలనుకుంటున్న ఎన్‌విడియా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. 2022లో చైనా ఏఐ చిప్ తయారీ పరిశ్రమలో ఎన్‌విడియాకు 95% వాటా ఉండగా.. ఇపుడు సున్నా అయ్యే పరిస్థితి.

భారత్‌వైపు ఎన్‌విడియా చూపు: జెన్సెన్ హువాంగ్ ఆధ్వర్యంలోని ఎన్‌విడియా కార్ప్ తాజాగా 'ఇండియా డీప్ టెక్ అలయన్స్'లో చేరినట్లు రాయిటర్స్ వెల్లడించింది. భారత్, అమెరికాకు చెందిన ఇన్వెస్టర్లు దక్షిణాసియా దేశాల్లోని డీప్ టెక్ అంకురాలకు నిధులు అందించడమే ఈ అలయన్స్ ఉద్దేశం. క్వాల్‌కామ్ వెంచర్స్, యాక్టివేట్ ఏఐ, ఇన్ఫోఎడ్జ్ వెంచర్స్, కలారి క్యాపిటల్ వంటివీ ఈ అలయన్స్‌లో కొత్తగా చేరాయి. సెప్టెంబరులో ఆవిష్కరించిన ఇండియా డీప్ టెక్ అలయన్స్ ఇప్పటిదాకా 1 బి. డాలర్ల (సుమారు రూ.8800 కోట్ల) పెట్టుబడుల హామీలను పొందింది. ఇందులో భాగంగా ఎన్‌విడియా పలు అంకురాలకు సాంకేతిక మార్గదర్శనం, శిక్షణ ఇస్తుంది. సెమీకండక్టర్ పరిశోధన, అభివృద్ధికి సాయపడే నిమిత్తం భారత ప్రభుత్వం 12 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.06 లక్షల కోట్ల) పెట్టుబడులతో ప్రత్యేక పథకాన్ని ప్రారంభించిన నేపథ్యంలో ఎన్‌విడియా కూడా ముందుకు వచ్చింది. భారత డీప్‌టెక్ అంకురాల్లోకి పెట్టుబడులు కూడా గతేడాది 78% పెరిగి 1.6 బిలియన్ డాలర్ల (సుమారు రూ.14,000 కోట్ల)కు చేరినట్లు నాస్కామ్ వెల్లడించింది కూడా. ఈ పరిస్థితుల్లో భారత సెమీకండక్టర్ రంగం శరవేగంగా రాణించనుంది.

అరబిందో ఫార్మా లాభం రూ.848 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అరబిందో ఫార్మా ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి రూ.8,286 కోట్ల ఆదాయం, రూ.848 కోట్ల నికరలాభం ఆర్జించింది. ఈపీఎస్ రూ.14.61 ఉంది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.7,796 కోట్లు, నికరలాభం రూ.817 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ఈసారి ఆదాయం 6.3%, నికరలాభం 3.8% పెరిగాయి. అమెరికా, ఐరోపా మార్కెట్ల నుంచి ఆదాయం పెరిగినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. అమెరికా ఫార్ములేషన్ల ఆదాయం 3.1%, ఐరోపా ఆదాయం 17.8% పెరిగినట్లు పేర్కొంది. ఏఆర్‌వీ (యాంటీ రెట్రోవైరల్) ఆదాయం ఎంతో అధికంగా 68.7% పెరగడం ప్రత్యేకత. సమీక్షా త్రైమాసికంలో..పరిశోధన- అభివృద్ధి కార్యకలాపాలపై రూ.414 కోట్లు ఖర్చు నమోదైంది. మొత్తం ఆదాయంలో ఇది 5 శాతానికి సమానం. యూఎస్‌ఎఫ్‌డీఏ నుంచి 7 ఔషధాలకు ఏఎన్‌డీఏ అనుమతులు లభించాయి. కొత్తగా 13 ఏఎన్‌డీఏ దరఖాస్తులు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. అమెరికా మార్కెట్లోకి 6 ఔషధాలు విడుదల చేసినట్లు వివరించింది. సెప్టెంబరు చివరకు నికరంగా 170 మిలియన్ డాలర్ల (సుమారు రూ.1500 కోట్ల) నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. తమ ఔషధాల శ్రేణి, తమ ముఖ్యమైన వ్యాపార విభాగం బలాన్ని ఈ ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని అరబిందో ఫార్మా వైస్‌ఛైర్మన్, ఎండీ కె.నిత్యానందరెడ్డి వివరించారు.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీకి రూ.188.20 కోట్ల ఆదాయం

రెండు కంపెనీల కొనుగోలు



ఈనాడు, హైదరాబాద్: స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్, ఏకీకృత ఖాతాల ప్రకారం సెప్టెంబరు త్రైమాసికానికి రూ.188.20 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.20.45 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.167.95 కోట్లు, నికర లాభం రూ.20.78 కోట్లు ఉన్నాయి. దీంతో పోలిస్తే నికరలాభం స్థిరంగా ఉండగా, మొత్తం ఆదాయం పెరిగింది. రూ.40- 45 కోట్ల విలువైన ఎగుమతులను తమ క్లయింట్ల సూచనల ప్రకారం సమీక్షా త్రైమాసికానికి బదులుగా, మూడు- నాలుగో త్రైమాసికాలకు వాయిదా వేసినట్లు కంపెనీ వెల్లడించింది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి 6 నెలలకు ఈ సంస్థ రూ.366.37 కోట్ల ఆదాయాన్ని, రూ.41.58 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంతో పోలిస్తే ఆదాయం 17.4%, నికరలాభం 14.6% పెరిగాయి.

నూతన విభాగాల్లోకి విస్తరించేందుకు: స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఇటీవల సైజెనిక్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.9 కోట్లకు కొనుగోలు చేసింది. ఈ సంస్థకు బయోటెక్నాలజీ, రసాయన శాస్త్రం, బయోఫార్మా రంగాల్లో 3 దశాబ్దాలకు పైగా అనుభవం ఉంది. చెన్నైకు చెందిన సీ2సీ ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 51% వాటా కొనుగోలు చేయడానికీ ఒప్పందం కుదుర్చుకుంది. ప్రాసెస్, మెకానికల్, పైపింగ్, సివిల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఈ కంపెనీకి 2 దశాబ్దాల అనుభవం ఉన్నట్లు స్టాండర్డ్ గ్లాస్ వెల్లడించింది. వీటిని సొంతం చేసుకోవటం వల్ల పలు నూతన విభాగాల్లోకి విస్తరించగలమని పేర్కొంది.

ఇకపై స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ లిమిటెడ్: కొత్త వ్యాపార విభాగాల్లోకి విస్తరిస్తున్నందున స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పేరును స్టాండర్డ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ లిమిటెడ్ అని మార్చాలని నిర్ణయించినట్లు కంపెనీ ఎండీ నాగేశ్వరరావు కందుల తెలిపారు. దీనికి కంపెనీల రిజిస్ట్రార్ నుంచి అనుమతి లభించింది. ఫార్మా, కెమికల్, బయోటెక్నాలజీ, ఫుడ్-బెవరేజెస్, పెయింట్, టైర్.. తదితర రంగాలకు సేవలు అందించే ప్రెసిషన్ ఇంజినీరింగ్ కంపెనీగా విస్తరిస్తున్నందున, దీర్ఘకాలంలో స్థిరమైన వృద్ధి సాధించగలమని పేర్కొన్నారు.

సీసీఎల్ ప్రోడక్ట్స్ లాభం రూ.100 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సీసీఎల్ ప్రోడక్ట్స్ రూ.1128.21 కోట్ల ఆదాయంపై రూ.100.85 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.7.57గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.738.74 కోట్లు, లాభం రూ.73.95 కోట్లుగా ఉన్నాయి. ఏప్రిల్-సెప్టెంబరు కాలానికి ఆదాయం రూ.2186.24 కోట్లు, నికర లాభం రూ.173.30 కోట్లుగా నమోదయ్యాయి. 2024-25 తొలి 6 నెలల్లో ఆదాయం రూ.1513.36 కోట్లు, లాభం రూ.145.42 కోట్లుగా ఉన్నాయి.

కోడి గుడ్లు



6న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	575
వరంగల్	577
విజయవాడ	585
తూ/ప గోదావరి	590
విశాఖపట్నం	575
చిత్తూరు	603

హైదరాబాద్‌లో ఇళ్ల ధరలు 13% పెరిగాయ్: ప్రాప్‌టైగర్



హైదరాబాద్‌లో ఇళ్లు/ఫ్లాట్ల ధరలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరులో 13% పెరిగాయని స్థిరాస్తి కన్సల్టెంట్ ప్రాప్‌టైగర్ ప్రకటించింది. చదరపు అడుగు సగటు ధర ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో రూ.6,858 కాగా, ఈసారి రూ.7,750కు చేరినట్లు తెలిపింది. విలాసవంత ఇళ్లు/ఫ్లాట్లకు గిరాకీ పెరగడం వల్ల హైదరాబాద్ సహా 8 నగరాల్లో ఇళ్ల సగటు ధరలు 7-19% వృద్ధి చెందినట్లు సంస్థ వెల్లడించింది.

జులై-సెప్టెంబరులో ఇళ్ల ధరలు (చదరపు అడుగు రూ.లలో)

నగరం	2025-26	2024-25	వృద్ధి(%)
దిల్లీ-ఎన్‌సీఆర్	8,900	7,479	19
బెంగళూరు	8,870	7,713	15
హైదరాబాద్	7,750	6,858	13
చెన్నై	7,173	6,581	9
పుణె	7,250	6,651	9
కోల్‌కతా	6,060	5,611	8
అహ్మదాబాద్	4,820	4,467	7.9
ముంబయి-ఎంఎంఆర్	13,250	12,383	7

టీసీఎస్‌తో ఏబీబీ భాగస్వామ్యం కొనసాగింపు

టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో 18 ఏళ్లుగా కొనసాగుతున్న భాగస్వామ్యాన్ని ఏబీబీ మళ్లీ పొడిగించింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత ఐటీ ఆపరేషన్లు, డిజిటల్ మౌలిక వసతుల ఆధునికీకరణల కోసం ఒప్పందం కుదుర్చుకున్నట్లు రెండు సంస్థలూ వెల్లడించాయి. ఈ కొత్త ఒప్పందం ప్రకారం ఏబీబీ తన 'ఫ్యూచర్ హోస్టింగ్ మోడల్'ను అమలు చేయనుంది. ఇది భవిష్యత్ తరానికి అనుగుణమైన మాడ్యులర్ ఐటీ ప్లాట్‌ఫామ్‌గా రూపుదిద్దుకోనుంది.

జులై - సెప్టెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
బ్రిటానియా ఇండస్ట్రీస్	655.06	531.55	4840.63	4667.57
బ్లూ స్టార్	98.78	96.06	2,422.37	2,215.96
టీమ్‌లీజ్ సర్వీసెస్	27.52	24.58	3,032.07	2,796.83
ఎన్ఐఐటీ ఎంటీఎస్	46.9	57	475.7	397.4
ఓరియెంటల్ గ్రీన్ పవర్	80.94	66.46	135.45	123.41
బీఈఎంఎల్	48.03	51.03	846.13	874.70
సరిగమ ఇండియా	43.8	44.9	230	241.8
ఎవరెడీ ఇండస్ట్రీస్	(7.91)	29.56	386.78	362.61
దీపక్ ఫెర్టిలైజర్స్	214	---	3,005.83	2,746.72
రామ్‌కో సిమెంట్స్	77.88	25.77	2,238.74	2,044.13
ఆర్‌బీఎల్ బ్యాంక్	160	138	1,458	1,064
డెలివరీ	(50.49)	10.20	2,651.53	2,309.33
మఫతలాల్ ఇండస్ట్రీస్	21.52	19.97	1029.69	995.52

ప్రభుత్వ రంగ బ్యాంకుల లాభం రూ.49,456 కోట్లు

జులై-సెప్టెంబరులో 9% వృద్ధి

దిల్లీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)తో పాటు మొత్తం 12 ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీల) నికర లాభం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై-సెప్టెంబరు త్రైమాసికంలో రూ.49,456 కోట్లకు చేరింది. 2024-25 ఇదే త్రైమాసిక లాభం రూ.45,547 కోట్లతో పోలిస్తే ఇది 9% (రూ.3,909 కోట్లు) అధికం.

✦ సమీక్షా త్రైమాసికంలో మార్కెట్ దిగ్గజం ఎస్‌బీఐ ఒక్కటే, మొత్తం లాభంలో 40% (రూ.20,160 కోట్లు) వాటా దక్కించుకుంది. ఏడాది క్రితం ఎస్‌బీఐ ఆర్జించిన లాభం కంటే ఇది 10% అధికం.

✦ శాతాల్లో పరిశీలిస్తే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ అత్యధికంగా రూ.1,226 కోట్ల నికర లాభాన్ని (58% వృద్ధి) నమోదు చేసింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.1,213 కోట్ల లాభాన్ని (33% వృద్ధి) ప్రకటించింది.

✦ బ్యాంక్ ఆఫ్ బరోడా లాభం రూ.5,238 కోట్ల నుంచి 8% తగ్గి రూ.4,809 కోట్లకు; యూనియన్ బ్యాంక్ లాభం 10% తగ్గి రూ.4,249 కోట్లకు పరిమితమైంది.

✦ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌ల నికర లాభం చెరో 23% పెరిగింది. కెనరా బ్యాంక్ లాభం 19%, పంజాబ్ నేషనల్ బ్యాంక్ లాభం 14%, ఇండియన్ బ్యాంక్ లాభం 12%, బ్యాంక్ ఆఫ్ ఇండియా లాభం 8%, యూకో బ్యాంక్ లాభం 3% పెరిగాయి.



✦ 2024-25 ఏప్రిల్-జూన్‌లో 12 పీఎస్‌బీల నికరలాభం రూ.39,974 కోట్లు కాగా, ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్‌లో ఇది 11% వృద్ధితో రూ.44,218 కోట్లకు చేరింది.

✦ 2025-26 ఏప్రిల్-సెప్టెంబరులో పీఎస్‌బీల నికర లాభం తొలిసారిగా రూ.90,000 కోట్లను అధిగమించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.85,520 కోట్లతో పోలిస్తే ఈసారి 10% వృద్ధితో రూ.93,674 కోట్లకు చేరింది.

సన్‌ఫార్మా లాభం రూ.3,118 కోట్లు

ఔషధ దిగ్గజ సంస్థ సన్‌ఫార్మా, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.3,118 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,040 కోట్లతో పోలిస్తే ఇది 3% ఎక్కువ. ఇదే సమయంలో మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.13,264 కోట్ల నుంచి రూ.14,405 కోట్లకు వృద్ధి చెందింది. భారత్‌లో ఫార్ములేషన్ విక్రయాలు 11% పెరిగి రూ.4736 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం విక్రయాల్లో ఇవి 33 శాతానికి సమానం. అమెరికా ఫార్ములేషన్ విక్రయాలు 4.1% తగ్గి 496 మి.డాలర్ల (సుమారు రూ.4400 కోట్ల)కు చేరాయి.

గ్రాసిమ్ లాభంలో 52% వృద్ధి

ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ గ్రాసిమ్ ఇండస్ట్రీస్, సెప్టెంబరు త్రైమాసికంలో రూ.1,498.04 కోట్ల నికర లాభాన్ని నమోదుచేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.982.94 కోట్లతో పోలిస్తే ఇది 52.4% అధికం. సిమెంట్, రసాయనాల వ్యాపారాలు రాణించడం ఇందుకు కలిసొచ్చిందని కంపెనీ తెలిపింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.34,222.50 కోట్ల నుంచి 16.6% వృద్ధితో రూ.39,899.5 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 15.24% పెరిగి రూ.37,795.75 కోట్లుగా నమోదయ్యాయి.

11 నుంచి ఫిజిక్స్‌వాలా ఐపీఓ

దిల్లీ: ఎడ్‌టెక్ యూనికార్న్ ఫిజిక్స్‌వాలా, రూ.3,480 కోట్ల నిధుల సమీకరణ లక్ష్యంతో తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)ను ఈ నెల 11 నుంచి 13 వరకు నిర్వహించనుంది. యాంకర్ మదుపర్లకు 10న షేర్లు కేటాయిస్తారు. ముసాయిదా పత్రాల (ఆర్‌హెచ్‌పీ) ప్రకారం, తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.3,100 కోట్లు సమీకరించబోతోంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ చెరో రూ.190 కోట్ల చొప్పున (మొత్తం రూ.380 కోట్ల) షేర్లను విక్రయించనున్నారు. ప్రస్తుతం వీరిద్దరికీ కంపెనీలో చెరో 40.31% వాటా ఉంది.

బెంగళూరులో రూ.13,125 కోట్లకు 48 ఎకరాల కార్యాలయ స్థలం

దిల్లీ: బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్ (బీఐఆర్‌ఈటీ) బెంగళూరులో అతిపెద్ద కార్యాలయ సముదాయాన్ని కొనుగోలు చేసే యత్నాల్లో ఉంది. ఇందులో భాగంగా అర్లిగా ఎకో వరల్డ్ బిజినెస్ పార్క్స్‌లో 100% వాటాను రూ.13,125 కోట్లతో కొనడానికి బీఐఆర్‌ఈటీ బోర్డు ఆమోదం తెలిపింది. దీంతో 48 ఎకరాల్లో 77 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలం సంస్థకు లభిస్తుంది. ఇప్పటికే దిల్లీ, ముంబయి, గురుగ్రామ్, నోయిడా, కోల్‌కతాల్లో 10 గ్రేడ్ ఏ స్థిరాస్తులను సంస్థ నిర్వహిస్తోంది.

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 3.45% వాటా విక్రయిస్తున్న ఎం అండ్ ఎం

ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో ఉన్న మొత్తం 3.45% వాటాను మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. ఒక్కో షేరు ధరను రూ.317గా నిర్ణయించినందున, ఈ లావాదేవీ విలువ రూ.682 కోట్లుగా ఉంది. 2023 జులైలో ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో రూ.417 కోట్ల పెట్టుబడిపై 64% లాభాన్ని మహీంద్రా పొందనుంది.

✦ ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 26% వరకు వాటాకు సమానమైన షేర్లు కొనుగోలు చేసేందుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ డిసెంబరు 12 నుంచి ఓపెన్ ఆఫర్ ప్రారంభించనుంది.

డిసెంబరు నుంచి రష్యా చమురు దిగుమతి తగ్గనుంది

అమెరికా ఆంక్షల నేపథ్యం



దిల్లీ: రష్యా చమురు దిగ్గజ సంస్థలైన రాస్‌నెఫ్ట్, లుకాయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించిన నేపథ్యంలో, ఆ దేశం నుంచి నేరుగా చేసుకునే చమురు దిగుమతులను భారత్ తగ్గించుకోబోతోంది. ఈనెల 21 నుంచే అమెరికా ఆంక్షలు అమల్లోకి వస్తున్నాయి. భారత రిఫైనరీల్లో సగానికి పైగా, రష్యా చమురునే దిగుమతి చేసుకుంటున్నాయి. తాజా పరిస్థితుల్లో డిసెంబరు నుంచి భారత్‌కు వచ్చే రష్యా దిగుమతుల్లో కోత పడొచ్చని మారిటైమ్ ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ అంటోంది. అయితే ఇంటర్మీడియరీలు, ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాల ద్వారా 2026 ప్రారంభం నుంచి క్రమంగా రష్యా చమురు దిగుమతులు పెరిగే అవకాశం ఉందనీ అంచనా వేస్తోంది.

✦ రాస్‌నెఫ్ట్‌తో దీర్ఘకాల సరఫరా కాంట్రాక్టు ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్ ఇకపై రష్యా చమురు దిగుమతిని నిలిపివేయొచ్చు.

✦ మంగళూరు రిఫైనరీ అండ్ పెట్రోకెమికల్స్, హెచ్‌పీసీఎల్-మిత్తల్ ఎనర్జీ సంయుక్త సంస్థ కూడా భవిష్యత్ దిగుమతులను రద్దు చేసుకుంటున్నట్లు ఇప్పటికే ప్రకటించాయి. 2025 ప్రథమార్థంలో దిగుమతైన రష్యా చమురులో ఈ మూడు సంస్థల వాటా సగానికి పైగా ఉంది.

✦ రాస్‌నెఫ్ట్‌కు వాటాలున్న నయారా ఎనర్జీ మాత్రం దిగుమతులను కొనసాగించొచ్చు.

✦ ఆంక్షలకు ముందు రష్యా నుంచి భారత్‌కు రోజుకు 1.6-1.8 మిలియన్ బ్యారెళ్ల మేర దిగుమతులు రాగా, అక్టోబరు 21 తర్వాత తగ్గుతూ వచ్చాయి.

బ్రిటానియా కొత్త సీఈఓగా రక్షిత్

దిల్లీ: బ్రిటానియా ఇండస్ట్రీస్‌కు కొత్త సీఈఓ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా రక్షిత్ హర్గవే నియమితులయ్యారు. ఆయన నియామకం 2025 డిసెంబరు 15 నుంచి అమల్లోకి వస్తుందని కంపెనీ తెలిపింది. 5 ఏళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారు. దీనికి ముందు ఆయన ఆదిత్య బిర్లా గ్రూప్ పెయింట్స్ వ్యాపారం బిర్లా ఓపస్‌కు సీఈఓగా పని చేశారు.

కూటమి ఏర్పాటుపై విజయ్‌దే నిర్ణయాధికారం

- టీవీకే ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తీర్మానం

చెన్నై, న్యూస్‌టుడే: వచ్చే ఏడాది తమిళనాడు శాసనసభకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో కూటమి ఏర్పాటుపై పూర్తిస్థాయి నిర్ణయాధికారాన్ని తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కి అప్పగిస్తూ ఆ పార్టీ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తీర్మానించారు. బుధవారం మామల్లపురం సమీపాన పూంజేరిలోని ఓ హోటల్‌లో విజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మొత్తం 12 తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదించారు. సముద్రజలాల్లో సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారన్న అభియోగంతో తమిళనాడుకు చెందిన మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేసి వారి పడవలను స్వాధీనం చేసుకుంటున్న వరుస ఘటనలపై ప్రధాని మోదీ మెతకవైఖరి అవలంబిస్తున్నారని, ఈ వ్యవహారంలో కేంద్రానికి లేఖలు రాసి స్టాలిన్ సర్కారు చేతులు దులుపుకొంటోందని, ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్రంలో నిలిపివేయాలంటూ తీర్మానాలు చేసింది. ముఖ్యమంత్రి అభ్యర్థి విజయ్ అని, వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఆయన్ను గెలిపించాలంటూ పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సి ఆనంద్ తన ప్రసంగంలో తెలిపారు.



అభిమానులను కలుస్తున్న టీవీకే అధ్యక్షుడు విజయ్

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులో ఎదురు కాల్పులు

- ముగ్గురు మావోయిస్టుల మృతి!

చర్ల, న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని బీజాపూర్ జిల్లాలో బుధవారం మధ్యాహ్నం భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఇందులో ముగ్గురు మావోయిస్టులు మరణించినట్లు సమాచారం. మద్దేడు ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు ఉన్నారనే సమాచారంతో తాళ్లగూడెం పోలీసుస్టేషన్ పరిధిలోని అన్నారం-మరిమల్ల అడవుల్లో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో బలగాలు మావోయిస్టులను చుట్టుముట్టడంతో ఇరువర్గాల నడుమ భారీగా ఎదురుకాల్పులు జరిగాయి.

EENADU Vol: 52, Issue: 86 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

చాంపియన్



షమి

షమికి మళ్లీ నిరాశే

● పంత్ పునరాగమనం

● దక్షిణాఫ్రికాతో టెస్టులకు భారత జట్టు

దిల్లీ



పంత్

టీమ్‌ఇండియాలోకి పునరాగమనం చేయాలని తహతహలాడుతున్న సీనియర్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ షమికి మళ్లీ నిరాశ తప్పలేదు. గాయం నుంచి కోలుకున్నాక వరుసగా నాలుగో టెస్టు సిరీస్‌లోనూ షమికి జట్టులో చోటు దక్కలేదు. దక్షిణాఫ్రికాతో ఈ నెల 14న మొదలయ్యే రెండు టెస్టుల సిరీస్‌కు షమి ఎంపిక కాలేదు. రంజీ ట్రోఫీలో బెంగాల్ తరపున రెండు మ్యాచ్‌లాడి 15 వికెట్లు పడగొట్టి ఫామ్, ఫిట్‌నెస్ చాటుకున్నప్పటికీ.. 35 ఏళ్ల షమికి సెలక్టర్లు మొండిచేయి చూపారు. మరోవైపు ఇంగ్లాండ్ పర్యటన మధ్యలో గాయపడ్డ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్ తిరిగి జట్టులోకి వచ్చాడు. పంత్ ఇటీవలే కోలుకుని దక్షిణాఫ్రికా-ఎతో నాలుగు రోజుల మ్యాచ్ ఆడి సత్తా చాటాడు. జట్టుకు వైస్ కెప్టెన్ కూడా అయిన పంత్ పునరాగమనంతో.. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్‌కు జట్టులో ఉన్న నారాయణన్ జగదీశన్‌పై వేటు పడింది. ఇంగ్లాండ్ పర్యటనలో గాయపడ్డ పేసర్ ఆకాశ్ దీప్ సైతం తిరిగి చోటు దక్కించుకున్నాడు. అతడి కోసం ప్రసిద్ధ్ కృష్ణను తప్పించారు. వెస్టిండీస్‌తో రెండు టెస్టులు ఆడిన జట్టులో ఇంతకుమించి మార్పులేమీ లేవు. దక్షిణాఫ్రికాతో భారత్ తొలి టెస్టు 14 నుంచి కోల్‌కతాలో జరుగుతుంది. రెండో మ్యాచ్ 22న గువాహటిలో మొదలవుతుంది. దీంతో పాటు ఈ నెల 13, 16, 19 తేదీల్లో దక్షిణాఫ్రికా-ఎతో మూడు అనధికార వన్డేల్లో తలపడే భారత్-ఎ జట్టును కూడా సెలక్టర్లు ప్రకటించారు. ఈ జట్టుకు తిలక్ వర్మ నాయకత్వం వహిస్తాడు.

భారత టెస్టు జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, రిషబ్ పంత్, దేవ్‌దత్ పడిక్కల్, ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, వాషింగ్టన్ సుందర్, జస్‌ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, నితీశ్ కుమార్ రెడ్డి, మహ్మద్ సిరాజ్, కుల్‌దీప్ యాదవ్, ఆకాశ్‌దీప్.

భారత్-ఎ వన్డే జట్టు: తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ, రియాన్ పరాగ్, ఇషాన్ కిషన్, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, విప్రజ్ నిగమ్, మానవ్ సుతార్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఖలీల్ అహ్మద్, ప్రభ్‌సిమ్రన్.



మహిళల వన్డే ప్రపంచకప్ గెలిచిన భారత జట్టుతో ప్రధాని నరేంద్ర మోదీ

పాఠశాలలకు వెళ్లండి

మహిళల జట్టుతో ప్రధాని మోదీ

దిల్లీ: ప్రపంచకప్ గెలిచిన భారత మహిళల జట్టు సభ్యులు, ప్రధాన కోచ్ అమోల్ మజుందార్ బుధవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని ప్రధాని అభినందించారు. టోర్నీలో మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయిన తర్వాత భారత జట్టు పుంజుకున్న తీరును ఆయన మెచ్చుకున్నారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, ఇతర ప్లేయర్లతో మోదీ మాట్లాడారు. ఫైనల్ బంతిని హర్మన్ జేబులో వేసుకోవడం గురించి ఆయన చర్చించారు. అదృష్టవశాత్తు బంతి తన దగ్గరకు వచ్చిందని, దాన్ని తన దగ్గరే పెట్టుకున్నానని హర్మన్ చెప్పింది. హర్లీన్ డియోల్ 2021లో ఇంగ్లాండ్‌పై అందుకున్న అద్భుత క్యాచ్‌ను కూడా ప్రధాని గుర్తు చేశారు. మోదీని కలవడం కోసం 2017 నుంచి తాను ఎదురుచూస్తున్నానని 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' దీప్తి శర్మ ఆయనతో చెప్పింది. కలను సాకారం చేసుకోవడం కోసం కష్టపడుతూనే ఉండాలని అప్పుడు మోదీ జట్టుతో చెప్పడాన్ని ఆమె గుర్తు చేసింది. ఫిట్ ఇండియా సందేశాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా ప్రధాని క్రికెటర్లను కోరారు. ఊబకాయ సమస్య పెరిగిపోతుండడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్లి క్రీడలను ఎంచుకునేలా యువతకు ప్రోత్సాహాన్నివ్వాలని మోదీ సూచించారు. జట్టు సభ్యులంతా సంతకాలు చేసిన జెర్సీని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ప్రధానికి బహూకరించింది.



హర్మన్‌ప్రీత్

చారిత్రక విజయం.. చెరిగిపోని విధంగా

ముంబయి: మహిళల వన్డే ప్రపంచకప్ విజయాన్ని ఎప్పటికీ మరిచిపోలేని విధంగా.. తన ఒంటిపై పచ్చబొట్టేయించుకుంది భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్. తన చేతిలో ప్రపంచకప్‌తో పాటు 2025, 52 అంకెలను టాటూగా వేయించుకుంది హర్మన్. ఇందులో 2025 ప్రపంచకప్ జరిగిన సంవత్సరాన్ని సూచిస్తే.. 52 ఫైనల్లో గెలుపు పరుగుల తేడాకు సంకేతం. ఈ ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్న హర్మన్.. "నా గుండెల్లోనే కాదు, చర్మం మీదా దీన్ని ముద్రించుకున్నా. దీని కోసం కెరీర్లో తొలి రోజు నుంచి ఎదురుచూస్తున్నా. ఇకపై ప్రతి రోజూ ఉదయం లేచి చూస్తా" అని వ్యాఖ్య జోడించింది.

ఆస్ట్రేలియా పర్యటనలో ఇప్పటికే ఆరు మ్యాచ్‌లు అయిపోయాయి. అటు వన్డేల్లో, ఇటు టీ20ల్లో ఇప్పటిదాకా ఒక్కసారీ ఆతిథ్య జట్టుపై పైచేయి సాధించలేదు టీమ్‌ఇండియా. వన్డే సిరీస్‌ను కోల్పోయాక ఓ విజయం సాధించింది. టీ20 సిరీస్‌ను ఓటమితో మొదలుపెట్టాక ఓ మ్యాచ్ గెలిచింది. పొట్టి క్రికెట్ సిరీస్‌లో ఇంకో రెండు మ్యాచ్‌లు ఉండగా 1-1తో ఆసీస్‌తో సమానంగా ఉన్న భారత్‌కు.. ఇప్పుడు ఆతిథ్య జట్టును వెనక్కి నెట్టే అవకాశం వచ్చింది. మూడో టీ20లో ఘనవిజయంతో జోరుమీదున్న భారత్.. ఇదే ఊపులో గురువారం నాలుగో మ్యాచ్‌లో నెగ్గి సిరీస్ విజయం దిశగా అడుగులేయాలనుకుంటోంది.

పైచేయి సాధిస్తారా?

ఆస్ట్రేలియాతో భారత్ నాలుగో టీ20 నేడే



సూర్య కుమార్

బుమ్రా

మధ్యాహ్నం 1.45 నుంచి

కరారా (గోల్డ్‌కోస్ట్)

భారత్, ఆస్ట్రేలియా మధ్య ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. తొలి టీ20 వర్షార్పణం అయ్యాక, చెరో మ్యాచ్ నెగ్గిన ఈ రెండు జట్లు.. సిరీస్‌లో పైచేయి సాధించడమే లక్ష్యంగా గురువారం నాలుగో టీ20లో తలపడనున్నాయి. ఆసీస్‌కు వన్డే సిరీస్‌ను కోల్పోయిన టీమ్‌ఇండియా.. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్ చేజారే అవకాశం లేకుండా చూసుకోవాలనుకుంటోంది. మూడో టీ20లో సమష్టి ప్రదర్శనతో సాధికార విజయం సాధించడం జట్టు ఆత్మవిశ్వాసాన్ని పెంచేదే.

అతను అందుకోవాలి: నాలుగో టీ20లో అందరి దృష్టి వైస్ కెప్టెన్, ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌పై నిలవనుంది. కొన్ని నెలల వ్యవధిలో టెస్టు, వన్డే జట్లకు అతను కెప్టెన్ అయ్యాడు. టెస్టుల్లో సారథిగా అతడి ప్రయాణం ఘనంగా మొదలైనప్పటికీ.. వన్డేల్లో మాత్రం నిరాశ తప్పలేదు. ఆస్ట్రేలియాతో ఆడిన తొలి సిరీస్‌లో ఓటమి చవిచూశాడు. పైగా అతను రాణించలేదు. టీ20ల్లో వైస్ కెప్టెన్‌గా ఎంపికైన అతడు.. భవిష్యత్తులో జట్టు పగ్గాలు కూడా అందుకోవచ్చనే చర్చ జరుగుతోంది. కానీ వన్డే సిరీస్‌లో నిరాశాజనక ఫామ్‌ను టీ20ల్లోనూ కొనసాగిస్తున్నాడు గిల్. రద్దయిన తొలి టీ20లో 37 పరుగులు చేసిన అతను.. తర్వాతి రెండు మ్యాచ్‌లో 5, 15 పరుగులకే ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో అయినా అతను జోరందుకుంటాడేమో చూడాలి. గిల్ వైఫల్యం కొనసాగిస్తే కెప్టెన్ కావడం సంగతి అటుంచితే జట్టులో స్థానమే ప్రశ్నార్థకం అవుతుంది. మరోవైపు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సైతం ఫామ్‌తో తంటాలు పడుతున్నాడు. అతను ఓ అర్ధసెంచరీ కొట్టి చాన్నాళ్లయింది. సూర్య సైతం రద్దయిన మ్యాచ్‌లోనే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. గత మ్యాచ్‌లో అతను 24 పరుగులే చేసినా.. మంచి లయలోనే కనిపించాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, శుభ్‌మన్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, సుందర్, అక్షర్, జితేశ్, దూబె, బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్.

ఆస్ట్రేలియా: మార్ష్ (కెప్టెన్), షార్ట్, ఇంగ్లిస్, బీర్డ్‌మన్/ఫిలిప్, స్టాయినిస్, మ్యాక్స్‌వెల్, ఓవెన్, జంపా, డ్వార్షుయిస్, బార్ట్‌లెట్, ఎలిస్.

అభిషేక్ నిలిస్తే..: ఓపెనర్ అభిషేక్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉండడం జట్టుకు కలిసొచ్చే అంశం. అతను ఆస్ట్రేలియా బౌలర్లను బాగానే భయపెడుతున్నాడు. అభిషేక్ ఎంత ఎక్కువసేపు నిలబడితే అంత త్వరగా భారత్ వైపు మ్యాచ్ మొగ్గుతుంది. మూడో టీ20లో బ్యాటింగ్ ఆర్డర్లో ముందు వచ్చిన ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ మెరుపు ఇన్నింగ్స్‌తో జట్టును గెలిపించాడు. మరోసారి అతను ముందే బ్యాటింగ్‌కు రావచ్చు. తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడగా.. సంజు శాంసన్ స్థానంలో తుది జట్టులోకి వచ్చిన జితేశ్ శర్మ కూడా ఆడిన కాసేపు ఆకట్టుకున్నాడు. వీరికి తోడు శివమ్ దూబె, అక్షర్ పటేల్‌లతో భారత బ్యాటింగ్ ఆర్డర్ ఎంతో బలంగా కనిపిస్తోంది. బౌలింగ్‌లోనూ భారత్ మెరుగ్గా ఉంది. సిరీస్‌లో తొలి అవకాశం దక్కించుకున్న అర్ష్‌దీప్ 3 వికెట్లతో అదరగొట్టాడు. బుమ్రా పొదుపుగా బౌలింగ్ చేస్తున్నాడు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఆసీస్ బ్యాటర్లకు సవాలు విసురుతున్నాడు. ఈ మ్యాచ్‌కు తుది జట్టులో మార్పులు ఉండకపోవచ్చు.

మ్యాక్సీ మెరుపులకు సిద్ధమా?: ఆస్ట్రేలియా కొన్ని మార్పులతో నాలుగో టీ20లో బరిలోకి దిగనుంది. ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ఈ మ్యాచ్‌లో ఆడబోతున్నాడు. గాయం కారణంగా జట్టుకు దూరంగా ఉన్న అతను.. ఈ సిరీస్ మధ్యలో అందుబాటులోకి వచ్చాడు. తొలి మూడు టీ20ల్లో కెప్టెన్ మిచెల్ మార్ష్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన హెడ్ స్థానంలో చివరి రెండు మ్యాచ్‌ల్లో మాథ్యూ షార్ట్ ఆడబోతున్నాడు. ప్రమాదకర స్పిన్నర్ ఆడమ్ జంపా కూడా గురువారం బరిలోకి దిగనున్నాడు. వన్డేల్లో భారత్‌ను దెబ్బ కొట్టిన అతడితో జాగ్రత్తగా ఉండాల్సిందే. మూడో టీ20లో చెలరేగిన టిమ్ డేవిడ్ సిరీస్‌లో ఇక ఆడడు. మిడిలార్డర్లో ఆసీస్‌కు స్టాయినిస్, ఓవెన్ కీలకం. ఎలిస్, బార్ట్‌లెట్, డ్వార్షుయిస్‌లతో పేస్ విభాగం మెరుగ్గానే ఉంది.

మేమలా చెయ్యం: హెచ్ఐ

దిల్లీ: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఆసియాకప్‌లో భారత క్రికెటర్లు.. పాకిస్థాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయడానికి తిరస్కరించడంతో వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. కానీ హాకీ ఇండియా (హెచ్ఐ) మాత్రం బీసీసీఐకి పూర్తిగా భిన్నమైన నిర్ణయం తీసుకుంది. భవిష్యత్తులో పాకిస్థాన్‌తో అంతర్జాతీయ హాకీ మ్యాచ్‌ల సందర్భంగా.. ఆ జట్టు ఆటగాళ్లతో కరచాలనం చేయకుండా భారత ఆటగాళ్లను అడ్డుకోమని స్పష్టం చేసింది. తాము ఆట నియమావళి ప్రకారం నడుచుకుంటామని తెలిపింది. "మమ్మల్ని పాలించేది క్రికెట్ కాదు. క్రికెటర్లు వాళ్ల ఇష్ట ప్రకారం చేశారు. మేం ఒలింపిక్ చార్టర్‌ను అనుసరిస్తాం. ఎఫ్ఐహెచ్ చెప్పినట్లు నడుచుకుంటాం. కరచాలనం చేయకుండా మేం ఆంక్షలు పెట్టలేదు. పాకిస్థాన్‌తో భవిష్యత్తు మ్యాచ్‌ల సందర్భంగా కూడా ఆటగాళ్లకు మేం ఎలాంటి ఆదేశాలివ్వం. మేం మ్యాచ్‌లు ఆడతాం. గెలవడానికి ప్రయత్నిస్తాం" అని హాకీ ఇండియా కార్యదర్శి భోలానాథ్ సింగ్ చెప్పాడు.



అర్జున్

మూడో రౌండుకు అర్జున్, హరి

పంజిమ్: చెస్ ప్రపంచకప్‌లో తెలంగాణ కుర్రాడు అర్జున్ ఇరిగేశి దూసుకెళ్తున్నాడు. అతను రెండో రౌండ్లో రెండు గేమ్‌లనూ సొంతం చేసుకున్నాడు. బుధవారం రెండో గేమ్‌లో అర్జున్.. మార్టిన్ పెట్రోవ్ (బల్గేరియా)ను ఓడించి మూడో రౌండుకు చేరుకున్నాడు. సీనియర్ క్రీడాకారుడు పెంటేల హరికృష్ణ కూడా ముందంజ వేశాడు. అతను రష్యా ప్లేయర్ నెస్టెరోవ్‌ను ఓడించాడు. భారత్ నుంచి ప్రస్తుత టోర్నీలో మొదటగా మూడో రౌండు చేరిన క్రీడాకారుడు హరికృష్ణనే. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ కూడా రెండో రౌండు దాటాడు. ఈ రౌండు రెండో గేమ్‌లో అతను నాగర్బెక్ (కజకిస్థాన్)ను ఓడించాడు. మరో స్టార్ ప్లేయర్ ప్రజ్ఞానంద మూడో రౌండు చేరేందుకు టైబ్రేక్ ఆడనున్నాడు. టెబూర్ (ఆస్ట్రేలియా)తో అతను వరుసగా రెండో గేమ్‌నూ డ్రా చేసుకున్నాడు. అగ్రశ్రేణి క్రీడాకారుడు నెపోమ్నియాషి (రష్యా)కి భారత గ్రాండ్‌మాస్టర్ దిప్తయాన్ ఘోష్ షాకిచ్చాడు.

విరిగిన వేలితోనే..



రిచా ఘోష్

దిల్లీ: భారత మహిళల జట్టు వికెట్‌కీపర్ రిచా ఘోష్.. విరిగిన వేలితోనే ప్రపంచకప్ సెమీఫైనల్, ఫైనల్లో ఆడిందట. "రిచా ఎడమ చేయి మధ్య వేలికి గాయమైంది. చిన్న పగులు వచ్చింది. అయినా ఆమె ఆడింది" అని రిచా కోచ్ శిబ్ సర్కార్ చెప్పాడు. న్యూజిలాండ్‌తో లీగ్ మ్యాచ్ సందర్భంగా రిచా గాయపడింది. దాంతో ఆమె ఆఖరి లీగ్ మ్యాచ్ (బంగ్లాదేశ్‌తో)కు దూరమైంది. అయితే ఆ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. గాయంతో బ్యాటింగ్ చేసినప్పటికీ రెండు నాకౌట్ మ్యాచ్‌ల్లోనూ రిచా విలువైన పరుగులు చేసింది. ఆమె సెమీఫైనల్లో 16 బంతుల్లో 26, ఫైనల్లో 24 బంతుల్లో 34 పరుగులు సాధించింది.



స్మిత్

కెప్టెన్‌గా స్మిత్

గోల్డ్ కోస్ట్: బ్యాటర్ మార్నస్ లబుషేన్ యాషెస్ సిరీస్ కోసం తిరిగి ఆస్ట్రేలియా జట్టులోకి వచ్చాడు. ఈ నెల 21న ఇంగ్లాండ్‌తో మొదలయ్యే తొలి టెస్టుకు ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో అతడికి చోటు దక్కింది. లబుషేన్ పేలవ ఫామ్ కారణంగా జులైలో వెస్టిండీస్‌తో సిరీస్‌కు దూరమయ్యాడు. కానీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో ఫామ్‌ను అందుకున్నాడు. గాయం నుంచి కోలుకుంటున్న రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ స్థానంలో స్టీవ్ స్మిత్ తొలి టెస్టులో ఆస్ట్రేలియాకు నాయకత్వం వహించనున్నాడు.

ఆస్ట్రేలియా జట్టు: స్టీవ్ స్మిత్ (కెప్టెన్), సీన్ అబాట్, బోలాండ్, అలెక్స్ కేరీ, బ్రెండన్ డోగెట్, గ్రీన్, హేజిల్‌వుడ్, హెడ్, జోష్ ఇంగ్లిస్, ఖవాజా, లబుషేన్, లైయన్, స్టార్క్, జేక్ వెథరాల్డ్, వెబ్‌స్టర్.

విండీస్‌దే తొలి టీ20

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో వెస్టిండీస్ శుభారంభం చేసింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రోస్టన్ ఛేజ్ (3/26) విజృంభించడంతో బుధవారం జరిగిన తొలి టీ20లో విండీస్ ఏడు పరుగుల తేడాతో కివీస్‌ను ఓడించింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సంపాదించింది. కెప్టెన్ షై హోప్ (53; 39 బంతుల్లో 4×4, 3×6), ఛేజ్ (28; 27 బంతుల్లో 1×4, 1×6), రోమన్ పావెల్ (33; 23 బంతుల్లో 2×4, 2×6) రాణించడంతో మొదట విండీస్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 164 పరుగులు సాధించింది. కివీస్ బౌలర్లలో జాకబ్ డఫీ (2/19), జాక్ ఫౌక్స్ (2/35) మెరిశారు. అనంతరం లక్ష్య ఛేదనలో కివీస్ తడబడింది. నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 157 పరుగులే చేయగలిగింది. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ (55 నాటౌట్; 28 బంతుల్లో 8×4, 2×6) పోరాడినా ఫలితం లేకపోయింది. ఛేజ్‌తో పాటు జేడెన్ సీల్స్ (3/32) సత్తాచాటి విండీస్‌కు విజయాన్ని అందించారు.

ఓ కోచ్ ఎలా ఉండాలో తెలుసుకున్నా



యువరాజ్

దిల్లీ: టీమ్‌ఇండియా బ్యాటర్ అభిషేక్ శర్మకు శిక్షణ ఇవ్వడం వల్ల ఓ కోచ్ ఎలా ఉండాలి.. ఏం చేయాలన్నది నేర్చుకున్నానని మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ అన్నాడు. "అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్‌లకు మొదట నా అనుభవాలను మాత్రమే చెప్పేవాడిని. ఆ తర్వాత ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం ఆరంభించాను. గత కొన్నేళ్లుగా అభిషేక్ ఆటను సానబెట్టే క్రమంలో కోచ్‌గా, మార్గనిర్దేశకుడిగా ఏం చేయాలో తెలుసుకున్నా. ఓ ఆటగాడి నైపుణ్యం పెంపొందేలా ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలన్న దానిపై అవగాహన వచ్చింది. అభిషేక్ ఈ దశకు చేరుకోవడానికి ఎంతో కష్టపడ్డాడు. ఆరేడు నెలల నుంచే అతడి అసాధారణ ప్రతిభను అంతా చూస్తున్నారు. కానీ అందుకోసం అతడు నాలుగైదేళ్లుగా శ్రమిస్తున్నాడు. దాని ఫలితమే ఇప్పుడు కనిపిస్తోంది. ఒకరికి కోచింగ్ ఇస్తున్నామంటే అతడి ఆలోచన ధోరణిని పసిగట్టాలి. ఓ 19 ఏళ్ల కుర్రాడికి ట్రైనింగ్ ఇవ్వాలంటే అతడి మనసు తెలుసుకుని శిక్షణ ఇవ్వాలి. నేను ఆ వయసులో ఉన్నప్పుడు నేను ఎదుర్కొన్న సవాళ్లను ఎవరూ గుర్తించలేదు. ఇప్పుడు ఓ 19, 20 ఏళ్ల కుర్రాడిని చూస్తే వాళ్లు ఎలాంటి సవాళ్లు ఎదుర్కొంటున్నారో నేను చెప్పగలను. ఇలా చెయ్.. అలా చెయ్.. అని వాళ్లకు చెప్పడం సరికాదు. వాళ్ల మనసు తెలుసుకుని అందుకు తగ్గట్టుగా శిక్షణ ఇస్తేనే మంచి ఫలితం రాబట్టగలం" అని యువరాజ్ వివరించాడు.

సఫారీ టెస్టుకు సన్నాహకంగా..


దక్షిణాఫ్రికా-ఎతో ఇండియా-ఎ అనధికారిక రెండో టెస్టు నేటి నుంచే



సిరాజ్

బెంగళూరు: దక్షిణాఫ్రికా-ఎతో రెండో అనధికారిక టెస్టు మ్యాచ్ (నాలుగు రోజులు)కు రిషబ్ పంత్ సారథ్యంలోని ఇండియా-ఎ సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో విజయంతో జోరుమీదున్న ఇండియా-ఎ రెండో పోరులోనూ సత్తాచాటి సిరీస్‌ను సొంతం చేసుకోవాలని ఆశిస్తోంది. ఆస్ట్రేలియాలో పరిమిత ఓవర్ల సిరీస్‌లో పాల్గొన్న కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్ సొంతగడ్డపై సఫారీలతో టెస్టు సిరీస్‌కు ముందు ఈ మ్యాచ్‌ను సన్నాహకంగా ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. గాయంతో భారత జట్టుకు దూరమైన పంత్.. దక్షిణాఫ్రికా-ఎతో మొదటి మ్యాచ్‌లో అద్భుతంగా రాణించి ఫామ్ చాటుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో విఫలమైనా.. రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ ఇన్నింగ్స్ (90; 113 బంతుల్లో 11×4, 4×6)తో ఇండియా-ఎకు విజయాన్ని అందించాడు. రెండో మ్యాచ్‌లోనూ సత్తాచాటి ఈనెల 14న దక్షిణాఫ్రికాతో ప్రారంభమయ్యే తొలి టెస్టుకు పూర్తి స్థాయి సన్నద్ధతతో ఉండాలని పంత్ కోరుకుంటున్నాడు. రాహుల్, సిరాజ్, కుల్దీప్ సైతం సఫారీ సిరీసే లక్ష్యంగా సుదీర్ఘ ఫార్మాట్ మ్యాచ్ ప్రాక్టీస్‌పై దృష్టిసారించారు.

జూనియర్లను సుల్తానా కొడుతుంది



జహనారా

ఢాకా: బంగ్లాదేశ్ మహిళల జట్టు కెప్టెన్ నిగర్ సుల్తానాపై పేసర్ జహనారా ఆలం సంచలన ఆరోపణలు చేసింది. జట్టులోని జూనియర్ క్రికెటర్లను సుల్తానా కొడుతుందంటూ స్థానిక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో జహనారా ఆరోపించింది. "ఇది కొత్తేమీ కాదు. తాజా వన్డే ప్రపంచకప్‌లోనూ ఆమె అలాగే చేసింది. 'నేను మళ్లీ అలా చేయను. లేదంటే చెంపదెబ్బ తినాల్సి ఉంటుంది' అని కొందరు జూనియర్లు నాతో అన్నారు. 'నిన్న నన్ను కొట్టింది' అని మరొకరు చెప్పారు. దుబాయ్ పర్యటనలో కూడా ఒక జూనియర్‌ను గదికి పిలిచి చెంపదెబ్బ కొట్టింది" అని 32 ఏళ్ల జహనారా పేర్కొంది. అయితే జహనారా ఆరోపణల్ని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) కొట్టిపారేసింది. "ఈ ఆరోపణలు పూర్తిగా నిరాధారం.. కల్పితం. ఎలాంటి నిజం లేనివి. అంతర్జాతీయ వేదికపై బంగ్లా మహిళల జట్టు ప్రశంసనీయ పురోగతి, ఐక్యతను ప్రదర్శిస్తున్న సమయంలో ఇలాంటి అవమానకర, అపకీర్తి వాదనలు చేయడం దురదృష్టకరం" అని బీసీబీ తెలిపింది. 2024 యూఏఈలో టీ20 ప్రపంచకప్ సందర్భంగా మానసిక ఆరోగ్యం క్షీణించడంతో జహనారా రెండు నెలలు విరామం తీసుకుంది. నిరుడు డిసెంబరులో ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో బంగ్లాకు చివరగా ప్రాతినిధ్యం వహించింది.

అగ్రస్థానాల్లో అభిషేక్, వరుణ్

దుబాయ్: ఐసీసీ పురుషుల టీ20 బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. తాజా ర్యాంకింగ్స్‌లో అభిషేక్ 925 పాయింట్లతో అందరికంటే ముందున్నాడు. ఇంగ్లాండ్ బ్యాటర్ ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో, తిలక్‌వర్మ మూడో స్థానంలో నిలిచారు. టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో వరుణ్ చక్రవర్తి నంబర్‌వన్ స్థానంలో ఉండగా.. అకీల్ హొసేన్ (వెస్టిండీస్) 2, రషీద్ ఖాన్ (అఫ్గానిస్థాన్) 3 ర్యాంకుల్లో కొనసాగుతున్నారు. వరుణ్ మినహా భారత్ నుంచి ఎవరూ టాప్-10లో చోటు దక్కించుకోలేదు.


ఈనాడు సినిమా

దర్శకుడు దొరికాడు


రజనీకాంత్, కమల్‌హాసన్


రజనీకాంత్ - కమల్ హాసన్ కలయికలో రూపొందనున్న సినిమాకి సుందర్.సి దర్శకత్వం వహించనున్నారు. 2027 సంక్రాంతికి విడుదల చేయనున్నట్టు నిర్మాత కమల్‌హాసన్ ప్రకటించారు. ఈ కలయికలో సినిమా ఖరారైనప్పటి నుంచి ప్రేక్షకులు ప్రత్యేకమైన ఆసక్తి, అంచనాలతో ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా విషయంలో లోకేశ్ కనగరాజ్ సహా పలువురు దర్శకుల పేర్లు వినిపించాయి. అయితే ఆ అవకాశం మాత్రం సీనియర్ దర్శకుడు సుందర్.సి సొంతం చేసుకున్నారు. రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై కమల్‌హాసన్, ఆర్.మహేంద్రన్ కలిసి నిర్మిస్తున్న చిత్రమిది. మా ఇద్దరి మధ్య ఐదు దశాబ్దాల స్నేహం, సోదర బంధానికి వేడుకలాంటి సినిమా ఇదని కమల్‌హాసన్ అన్నారు. రెడ్ జెయింట్ మూవీస్ పతాకంపై ఈ చిత్రం విడుదల కానుంది. మరి ఇందులో కమల్‌హాసన్ నటిస్తారా లేక, నిర్మాతగా మాత్రమే ఉంటారా అనేది తెలియాలంటే ఇంకొంతకాలం ఆగాల్సిందే. రజనీకాంత్‌కి ఇది 173వ చిత్రం. 'అరుణాచలం' తరువాత రజనీ, సుందర్.సి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం ఇది.

ప్రతి యువకుడి కథలో శ్రీవిష్ణు


శ్రీవిష్ణు

ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బుధవారం కొత్త చిత్రాన్ని ప్రకటించింది. శ్రీవిష్ణు కథానాయకుడిగా... సన్నీ సంజయ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తోంది. ఆసక్తికరమైన కథ, కొత్తతరం వినోదంతో ఈ సినిమాని రూపొందిస్తున్నట్టు నిర్మాతలు తెలిపారు. 'ప్రతి యువకుడి కథ...' అనే ఉపశీర్షికతో కనిపిస్తున్న పోస్టర్‌తో ఈ సినిమాని అధికారికంగా ప్రకటించారు. ఈటీవీ విన్ నుంచి వచ్చిన 'అనగనగా' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకుడే సన్నీ సంజయ్. మరోసారి సున్నితమైన భావోద్వేగాలు, సంఘర్షణతో యువతరం రోజువారీ జీవితంలోని సంతృప్తి, ఆశల అన్వేషణకు అద్దం పడుతూ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి.

సైనికుడి భార్య పాత్ర చాలా కష్టం


రాశీ ఖన్నా

'తెలుసు కదా' అంటూ ఇటీవలే ప్రేక్షకుల్ని పలకరించింది అందాల తార రాశీ ఖన్నా. త్వరలో ఆమె '120 బహాదూర్' సినిమాతో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ఆమె, బాలీవుడ్ నటుడు ఫర్హాన్ అక్తర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రమిది. రెజాంగ్ లా యుద్ధానికి నాయకత్వం వహించిన మేజర్ షైతాన్ సింగ్ భాటి జీవితం ఆధారంగా రూపొందుతుంది చిత్రం. ఇందులో షైతాన్ సింగ్ భార్యగా కనిపించనుంది రాశీ. ఈ నేపథ్యంలో ఓ కార్యక్రమంలో ఆమె తన పాత్ర గురించి మాట్లాడుతూ.. "'120 బహాదూర్'లో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇందులో నేను సైనికుడి భార్యగా కనిపిస్తా. ఆ పాత్రలో నటించడం చాలా సవాలుతో కూడుకున్న విషయం. ఒక సైనికుడి భార్య యుద్ధభూమిలోకి వెళ్తున్న తన ప్రియమైన వ్యక్తి ఇక తిరిగి రాకపోవచ్చు అనే వాస్తవాన్ని అంగీకరిస్తుంది. కానీ అలా జీవించడం ఎంతో బాధతో కూడుకున్నది. ఇందులో సన్నివేశాల్ని ఎంత లోతుగా రాశారో నాకు అంత కష్టమైంది. ప్రతిసారీ నేను చాలా భావోద్వేగానికి గురయ్యాను. ఎంచుకున్న పాత్రలో జీవించడానికి నా వంతు ప్రయత్నం చేశాను. ఈ చిత్రం మీ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అంటూ చెప్పుకొచ్చింది రాశీ. ఈ నెల 21న విడుదల కానుందీ సినిమా.

కీర్తి యాక్షన్ అడ్వెంచర్


కీర్తి సురేశ్

కథల ఎంపికలో ప్రత్యేకత చూపించే కథానాయిక కీర్తి సురేశ్. పెళ్లి తర్వాత వరుస సినిమాలతో జోరు మీదుంది. ఇటీవలే ఆంటోనీ వర్గీస్‌తో ఓ చిత్రంలో నటిస్తున్నట్టు ప్రకటించిందామె. ఈ మలయాళ చిత్రాన్ని రిషి శివకుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ సినిమాకు 'తొట్టం' అనే పేరును ఖరారు చేశారు. ది డెమోన్స్ అనేది ఉపశీర్షిక. బుధవారం ఈ విషయాన్ని తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. "అడవులకు అతీతంగా.. సరిహద్దులకు అతీతంగా రాబోతుంది 'తొట్టం' అనే వ్యాఖ్యలను జోడించింది. దీన్ని యాక్షన్ అడ్వెంచర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు ఈ వీడియోతో స్పష్టమవుతోంది.

చెప్పలేని నిజాలకు సమాధానం..

ది గర్ల్‌ఫ్రెండ్


ధీరజ్, విద్య, రాహుల్, అల్లు అరవింద్, దీక్షిత్, హేషమ్

"ఈ సినిమాతో నేను సంపాదించాలనుకున్నది డబ్బు కాదు, సంతృప్తి. ఈ సినిమా నిర్మించాననే విషయం ఎంతో సంతృప్తినిస్తోంది" అన్నారు నిర్మాత అల్లు అరవింద్. ఆయన సమర్పణలో రూపొందిన చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్'. రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి జంటగా నటించారు. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 7న తెలుగు, హిందీ భాషల్లోనూ, 14న తమిళ, మలయాళ, కన్నడలోనూ విడుదలవుతోంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. అల్లు అరవింద్ మాట్లాడుతూ 'కొన్ని చెప్పలేని నిజాల్ని సినిమా మాధ్యమంతో చెబుతున్నామనే అనుభూతి కలిగింది ఈ కథ విన్నప్పుడు. రాహుల్ ఎంత ఉద్వేగంతో కథ చెప్పాడో, అంత బాగా సినిమాని తెరకెక్కించాడు. అక్క, చెల్లి, పిన్ని... వాళ్ల మనసుల్లో ఏముంటుంది? ఎలాంటి కోరికలు ఉంటాయో తెలుసుకునేందుకు ఈ సినిమా చూడాలి' అన్నారు. ఈ కార్యక్రమంలో దీక్షిత్ శెట్టి, నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ తదితరులు పాల్గొన్నారు.

"ఇప్పుడున్న ట్రెండ్ రెండేళ్ల తర్వాత ఉంటుందో లేదో చెప్పలేం. అందుకే ట్రెండ్‌ని దృష్టిలో ఉంచుకుని నేనెప్పుడూ కథల్ని ఎంపిక చేసుకోను'' అంటున్నారు కథానాయకుడు సుధీర్‌బాబు. హారర్, దైవిక అంశాలున్న సినిమాల ట్రెండ్ నడుస్తున్న వేళ... ఆయన 'జటాధర' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో... తెలుగుతోపాటు, హిందీలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 7న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సుధీర్‌బాబు బుధవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

హిందీ నుంచి అవకాశాలు వచ్చాయి కానీ...


సుధీర్‌బాబు

"దైవిక అంశాలు, ఆత్మల కోసం అన్వేషణ, కుటుంబ భావోద్వేగాలు... ఇలా పలు కోణాలున్న కథ ఇది. అరుణాచలం ప్రస్తావన కూడా ఉంటుంది. ఈ కథలో ఉన్న సంఘర్షణకు, కొన్ని ప్రశ్నలకు.. . మన పురాణాల్లోని కొన్ని కథల్నే సమాధానంగా చూపించే చిత్రమిది. నేను ఈ సినిమా చేయడానికి ప్రధాన కారణం ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌కు తోడు, అన్ని రకాల భావోద్వేగాలు ఇందులో ఉండటమే. ఆద్యంతం ఆసక్తికరంగా సాగుతుంది. చిన్నప్పుడు మనం విన్న జానపద కథలు, చందమామ కథల్లాంటి చిత్రం ఇది. బ్యాంకులు లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతిపెట్టి ఒక బంధనం వేసి, దానికి ఒక పిశాచిని కాపలాగా పెట్టడంలాంటి కథలు చాలానే ప్రచారంలో ఉంటాయి. అలాంటి జానపద కథే ఈ సినిమాకీ ఆధారం. ఇందులో నేను ఆత్మల్ని అన్వేషించే వ్యక్తిగా కనిపిస్తా. అయితే తనకి దెయ్యాలకంటే కూడా, దేవుడిపైనే ఎక్కువ నమ్మకం ఉంటుంది. సైన్స్‌ని నమ్ముతుంటాడు. అలా ఎందుకన్నదే ఈ సినిమాలోని ఆసక్తికరమైన విషయం. 'జటాధర' అనగానే దైవశక్తి గుర్తొస్తుంది. చివరికి కథలోకి శివుడు వస్తాడని ముందే అర్థమవుతుంది. ఆ దశకు కథ వెళ్లే క్రమం ప్రేక్షకుల్ని ఎంతగానో థ్రిల్ చేస్తుంది".

● "నా తొలి సినిమా 'ఎస్.ఎం.ఎస్' చేసిన రోజున 20 సినిమాలు చేస్తానని అస్సలు అనుకోలేదు. ఇన్ని సినిమాల ప్రయాణం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ప్రతి సినిమాకీ వంద శాతం కష్టపడ్డా. పాత్ర కోసం అహర్నిశలూ కష్టపడటమే నాకు తెలుసు. హిందీలో 'బాఘీ' చేశాక, అక్కడి నుంచి మరిన్ని అవకాశాలు వచ్చాయి. కానీ నా దృష్టంతా తెలుగు సినిమాలపైనే ఉంది. తదుపరి రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తా. ఇప్పటివరకూ అలాంటి కాన్సెప్ట్‌తో ప్రపంచంలో ఎవ్వరూ సినిమా చేయలేదు. అదొక 'బాహుబలి' తరహా సినిమా. దాంతోపాటు పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాల్సి ఉంది".

● "ఈ సినిమా విడుదలవుతున్న ఈ సమయంలో దైవిక అంశాలు, హారర్ కథల ట్రెండ్ నడుస్తోంది. అందుకే ఈ సినిమాపై అందరిలోనూ అంత ఆసక్తి ఏర్పడింది. అయితే ఇది యాదృచ్ఛికమే తప్ప, ట్రెండ్‌ని దృష్టిలో ఉంచుకుని చేసిన సినిమా అయితే కాదు. నా కెరీర్‌లో నేనెప్పుడూ ట్రెండ్ కోసం సినిమాలు చేయను. 'జటాధర' తెలుగు సినిమానే. కాకపోతే నిర్మాతలు ఉత్తరాది నుంచి వచ్చారు. నాతోనూ, నానితోనూ కలిసి సినిమాలు చేద్దామని వచ్చారు. ముందు వాళ్లు ఒక కథతో వచ్చారు, నాకు అంతగా నచ్చలేదు. కొన్ని రోజుల తర్వాత మీ దగ్గర ఏదైనా కథ ఉంటే చెప్పండని అడిగారు. అప్పుడే ఈ కథ గురించి చెప్పా. విజయవంతమైన సినిమాలు తీసిన నిర్మాతలు వీళ్లు. సోనాక్షి సిన్హా అద్భుతమైన నటి. ఆమె దక్షిణాది యువతిలాగే కనిపిస్తారు. ధనపిశాచి పాత్రలో ఒదిగిపోయారు. శిల్పా శిరోద్కర్, అవసరాల శ్రీనివాస్, రాజీవ్ కనకాల, ఝాన్సీ, కిశోర్, ప్రదీప్ రావత్ ఇలా తెలుగులో తెలిసిన నటులే ఇందులో కీలక పాత్రల్లో కనిపిస్తారు".

కన్నీళ్ల భయంతో నిండిన లోకం


ప్రణవ్ మోహన్ లాల్

ప్రణవ్ మోహన్ లాల్ కథానాయకుడిగా నటించిన సినిమా 'డీయస్ ఈరే'. మిస్టరీ హారర్ థ్రిల్లర్‌గా రూపొందింది. 'భూత కాలం', 'భ్రమ యుగం' ఫేమ్ రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో నైట్ షిఫ్ట్ స్టూడియోస్, వైనాట్ స్టూడియోస్ సంస్థలపై చక్రవర్తి రామచంద్ర, ఎస్ శశికాంత్ నిర్మించారు. తెలుగులో శ్రీ స్రవంతి మూవీస్ ఈ నెల 8న విడుదల చేస్తోంది. 7న పెయిడ్ ప్రీమియర్లు వేయనున్నారు. బుధవారం 'డీయస్ ఈరే' తెలుగు ట్రైలర్‌ని విడుదల చేశారు. 'ఆకాశం... భూమి... భూడిద అవ్వగా, లోకం కన్నీళ్ల భయంతో నిండుతుంది' అని ట్రైలర్ ముగిసింది.

తెలుగులో పతాక సన్నివేశాల్ని మార్చాం!


శ్రద్ధా శ్రీనాథ్, విష్ణు విశాల్, మానస చౌదరి

"గొప్ప థ్రిల్‌ని పంచే 'ఆర్యన్' తరహా సినిమాల్ని చేయడం ఓ పెద్ద సవాల్. తమిళంలో మంచి విజయాన్ని అందుకుంది. పతాక సన్నివేశాలకు మాత్రం మిశ్రమ స్పందన వచ్చింది. అందుకే తెలుగులో మార్పులు చేసి విడుదల చేస్తున్నాం. తెలుగు ప్రేక్షకులు థియేటర్లలో మంచి అనుభూతిని పొందుతార'ని చెప్పారు విష్ణు విశాల్. ఆయన కథానాయకుడిగా ప్రవీణ్.కె దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే 'ఆర్యన్'. సెల్వ రాఘవన్, శ్రద్ధా శ్రీనాథ్, మానస చౌదరి ప్రధాన పాత్రలు పోషించారు. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. తమిళంలో ఇప్పటికే విడుదలైన ఈ చిత్రాన్ని శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి ఈ నెల 7న తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం చిత్ర బృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసింది. విష్ణు విశాల్ మాట్లాడుతూ "తెలుగు ప్రేక్షకులు నా 'రాక్షసన్', 'ఎఫ్.ఐ.ఆర్', 'మట్టికుస్తీ' చిత్రాల్ని ఎంతగానో ఆదరించారు. సీటు అంచున కూర్చోబెట్టి థ్రిల్‌ని పంచే మరో మంచి కథతో 'ఆర్యన్' చేశా. అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాలని కోరుతున్నా'' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "పదేళ్ల కిందట ఈ ఆలోచన వచ్చినప్పుడే తెలుగులో చేయాలనుకున్నా. తెలుగు ప్రేక్షకులు ఇలాంటి కొత్త ఆలోచల్ని ఎంతగానో ఆదరిస్తారు. తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తుండడం నా అదృష్టంగా భావిస్తున్నా'' అన్నారు. కథానాయిక శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ "ఇందులో ఒక పాత్రికేయురాలిగా కనిపిస్తా. 'డాకు మహారాజ్' తర్వాత మరో మంచి పాత్రలో నటించడం, అది తెలుగు ప్రేక్షకుల ముందుకొస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది'' అన్నారు. మరో కథానాయిక మానస చౌదరి మాట్లాడుతూ "అందమైన చిత్రమిది. నేనొక విభిన్నమైన పాత్రలో కనిపిస్తా'' అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు హరీశ్ కన్నన్‌తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

ప్రేమికుల రోజున శనయా పోరాటం


శనయా కపూర్

బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ కపూర్ కుమార్తెగా తెరకు పరిచయమైంది యువకథానాయిక శనయా కపూర్. ఈ ఏడాది ప్రారంభంలోనే 'ఆంఖోన్ కి గుస్తాఖియాన్'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఆమె త్వరలో 'తూ యా మెయిన్' సినిమాతో రాబోతుంది. శనయా, ఆదర్శ్ గౌరవ్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రముఖ దర్శకుడు ఆనంద్ ఎల్ రాయ్, హిమాన్షు శర్మ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. బెజోయ్ నంబియార్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా చిత్రీకరణ పూర్తయినట్లు ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలను పంచుకుంది శనయా. "సర్వైవల్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నారు. ఇందులో ఆదర్శ్, శనాయాల కెమిస్ట్రీ, వారిద్దరూ మనుగడ కోసం చేసే పోరాటం ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేమికుల రోజున విడుదల కానుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

తెలుగు తెరపైకి కుంభమేళా మోనాలిసా


సాయిచరణ్, మోనాలిసా

కుంభమేళాలో పూసలమ్ముతూ తన అందంతో అందరి దృష్టినీ ఆకర్షించింది మోనాలిసా భోంస్లే. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఆమె అందం సినిమా పరిశ్రమనీ ఆకట్టుకుంది. కథానాయికగా హిందీలో తొలి అవకాశం అందుకున్న ఆమె... త్వరలోనే తెలుగు తెరపైనా సందడి చేయనుంది. మోనాలిసా భోంస్లే, సాయిచరణ్ జంటగా వెంగమాంబ క్రియేషన్స్ పతాకంపై తెరకెక్కుతున్న 'లైఫ్' అనే తెలుగు చిత్రం బుధవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్నారు. అంజయ్య విరిగినేని నిర్మాత.


సప్తగిరి, పవన్‌కల్యాణ్, కసిరెడ్డి రాజ్‌కుమార్

జీవితం ఓ యుద్ధభూమి

బ్రహ్మచారి భర్త కావాలని నిర్ణయించుకున్న తర్వాత జీవితం ఒక యుద్ధభూమిగా మారుతుందని చెబుతున్నారు ముగ్గురు భర్తలు. వాళ్లకు జీవితంలో ఎదురైన అనుభవాలు ఎలాంటివో, వాళ్లు చేసిన యుద్ధం ఏ తీరున సాగిందో తెలియాలంటే 'పురుషః' చూడాల్సిందే. పవన్‌కల్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రమిది. వైష్ణవి వీరు పులవల తెరకెక్కిస్తున్నారు. బత్తుల కోటేశ్వరరావు నిర్మాత. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల విడుదల చేశారు. "హాస్యం ప్రధానంగా సాగే చిత్రమిది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామ''ని సినీ వర్గాలు తెలిపాయి.

ఆసక్తికరమైన కథతో 'చిరంజీవ'


అభినయ కృష్ణ, రాజ్‌తరుణ్, అనిల్ రావిపూడి

"జబర్దస్త్ చేసేటప్పుడు స్కిట్స్‌లో కొత్తదనం ఉండేలా చూసుకునేవాణ్ని. 'చిరంజీవ' సినిమాని కూడా అదే తరహాలో ఓ కొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కించా. ఈ ప్రయత్నం అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది" అన్నారు. అభినయ కృష్ణ. ఆయన దర్శకత్వంలో.... రాజ్‌తరుణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమే 'చిరంజీవ'. కుషిత కల్లపు కథానాయిక. రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మాతలు. ఈ నెల 7న ఆహాలో ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు రానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం వేడుకని నిర్వహించింది. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అభినయ్ కృష్ణ మాట్లాడుతూ "దర్శకుడిగా పన్నెండేళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా. ఈ ప్రయాణంలో ఆహా సంస్థకు కొన్ని కాన్సెప్ట్స్ చెప్పా. అందులో 'చిరంజీవ' కథ వాళ్లకు బాగా నచ్చింది. అలా మొదలైందే ఈ చిత్రం" అన్నారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ "లాక్‌డౌన్ సమయంలో నేను చేసిన 'ఒరేయ్ బుజ్జిగా' ఆహాలో స్ట్రీమింగ్ అయ్యింది. ఇప్పుడు 'చిరంజీవ'తో ప్రేక్షకుల ముందుకొస్తుండడం ఆనందంగా ఉంది. సినిమా కోసం అందరం కష్టపడతాం. కానీ అభి అందరికంటే ఎక్కువగా కష్టపడ్డాడు. అతను మంచి విజయానికి అన్ని విధాలా అర్హుడు'' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "కంటెంట్ ఉన్న కథతోనే ఈ చిత్రం రూపొందింది. రాజ్‌తరుణ్, అభి అందించిన సహకారం మరిచిపోలేనిది'' అన్నారు. ఈ కార్యక్రమంలో కిరీటి, సంజయ్‌కృష్ణ, హైపర్ ఆది, రాంప్రసాద్, రాకెట్ రాఘవ, ఆహా కంటెంట్ హెడ్ శ్రావణి, సీఈఓ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్ కండీషనల్ లవ్‌తో ప్రేమిస్తున్నా


ప్రీతి, రోషన్, పూరి ఆకాశ్, సాత్విక్

సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరోహీరోయిన్లుగా భాను దర్శకత్వంలో మర్రి రవికుమార్ నిర్వహణలో రాబోతున్న సినిమా 'ప్రేమిస్తున్నా'. కనకదుర్గారావు పప్పుల నిర్మాత. ఈ సినిమా ఈ నెల 7న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు యువ హీరోలు పూరి ఆకాశ్, రోషన్ కనకాల ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. దర్శకుడు భాను మాట్లాడుతూ.. "అన్ కండీషనల్ లవ్‌తో తెరకెక్కిన చిత్రం 'ప్రేమిస్తున్నా'. తెలుగులో ఇలాంటి అన్ కండీషనల్ లవ్‌తో ఏ సినిమా రాలేదు" అన్నారు.

చట్టం... ధర్మం


ఐశ్వర్య రాజేశ్, అర్జున్ సర్జా

అర్జున్ సర్జా, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్న చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేశ్ లక్ష్మణన్ దర్శకత్వం వహించారు. జి.అరుల్‌కుమార్ సమర్పణలో జి.ఎస్.ఆర్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. బుధవారం పోస్టర్‌తోపాటుగా విడుదల తేదీని ప్రకటించింది చిత్రబృందం. చట్టం, ధర్మంతో ముడిపడిన ఈ కథని ఆద్యంతం థ్రిల్‌ని పంచేలా తెరకెక్కించామని, తమిళంతో పాటు, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో ఏకకాలంలో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి.

మకరందం

makarandam@eenadu.in

ఈనాడు

గురువారం నవంబరు 6, 2025

17

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512

భక్తాగ్రేసరుడు కనకదాసు

నవంబరు 8 కనకదాసు జయంతి

పరమ భక్తుడు, తత్వవేత్త, సంగీతకారుడు, కవి, స్వరకర్త.. కనకదాసు. ఆయన కర్ణాటక రాష్ట్రం హావేరీ జిల్లా, బాడా గ్రామంలో 1509 సంవత్సరంలో కార్తిక బహుళ చవితి నాడు జన్మించాడు. తల్లిదండ్రులు బీరప్ప, బాచమ్మ దంపతులు. ఆయన రచించిన కీర్తనలు ఎంతో ప్రాచుర్యం పొందాయి. ఆ కీర్తనల్లోని తాత్విక భావాలు సాధారణ ప్రజానీకానికి కూడా అర్థమయ్యేలా సరళ భాషలో ఉండటం విశేషం.


కనకదాసు అసలు పేరు తిమ్మప్ప నాయకుడు. చిన్న వయసులోనే వేదాంత ధోరణిని అలవరచుకుని మహా భక్తుడయ్యాడు.



నరసింహ స్తోత్రం, మోహన తరంగిణి, నలచరిత్ర, హరిభక్తిసార తదితర భక్తి గ్రంథాలు రచించాడు.

కనకదాసుకు ఉడిపితో ప్రత్యేక అనుబంధం ఉంది. వ్యాసరాయ స్వామిజీ అభ్యర్థన మేరకు కనకదాసు ఉడిపికి వెళ్లాడు. అస్పృశ్యత పేరుతో కొన్ని కులాలను హీనంగా చూసే కాలమది. కనకదాసు ఆలయంలోకి వెళ్లాలని ప్రయత్నించగా పూజారులు అనుమతించలేదు. వ్యాసరాయ స్వామిజీ చెప్పినప్పటికీ ఫలితం లేకపోయింది. దాంతో గుడి బయటే భక్తి పారవశ్యంతో శ్రీకృష్ణ కీర్తనలు గానం చేశాడు. అలా కొన్ని వారాలపాటు ఆలయం వెలుపలే కాలం గడిపాడు. ఒకరోజు ఆలయ ప్రహరీ గోడకు పగులు ఏర్పడింది. ఆ పగులు గుండా స్వామిని దర్శించుకున్నాడు. విగ్రహం కనకదాసు వైపు తిరిగినట్లు కనిపించింది. ఉడిపి దేవాలయం తూర్పు ముఖంగా ఉన్నప్పటికీ.. కృష్ణుడి విగ్రహం మాత్రం పడమర ముఖంగా దర్శనమిస్తుంది. కనకదాసు భక్తి గోడను బీటలు పడేలా చేసి దైవాన్ని తన దిక్కుకు మళ్లించుకుందని చెబుతారు. ఆ మహా భక్తుడి జయంతిని సెలవుదినంగా ప్రకటించి, పండుగలా నిర్వహిస్తుంది కర్ణాటక ప్రభుత్వం.

ధర్మవర్తనం.. జీవన పరమార్థం



మన జీవిత గమనం సుగమం అయ్యేందుకు వేదోపనిషత్తులు నిర్దేశించిన నియమనిబంధనలను పాటించాల్సి ఉంటుంది. అలాంటి సూత్రీకరణల్లో ధర్మార్థకామమోక్షాలు ముఖ్యమైనవి. వాటి పరమార్థమేమిటో తెలుసుకుందాం.

చతుర్విధ పురుషార్థాల్లో ధర్మం మొదటిది. ఈ పదానికి అనేక అర్థాలున్నాయి. కర్తవ్యాలను నెరవేర్చడం, సమతుల్య జీవితాన్ని గడపటం, సామాజిక కార్యకలాపాలను నిర్వహించడం వంటివన్నీ ధర్మంలో భాగమే. ధర్మం చర.. ధర్మ వర్తనుడవై మెలగమని- హితవు పలుకుతోంది తైత్తరీయ ఉపనిషత్తు. ధార్మికులే ఇహలోకంలో కీర్తిని, పరలోకంలో ముక్తిని పొందుతారన్నది పురాణోక్తి.

ధర్మాచరణమే మోక్షానికి దారి అని తెలియజేసింది భాగవతం సప్తమ స్కంధంలోని త్రిపురాసుర వృత్తాంతం. ఈ విషయం తెలిసిన భగవద్భక్తులు సదా ధర్మాచార వర్తనులై ఉంటారు. అది తెలియనివారి కోసం ధర్మసూక్ష్మాలు తెలియజేయమని నారదుణ్ణి అడిగాడు ధర్మరాజు. అప్పుడు నారదమహర్షి మానవాళి అనుసరించాల్సిన ధర్మాలను తెలియజేయడమే గాక ప్రాణాపాయం వంటి క్లిష్ట పరిస్థితుల్లో అధర్మం కూడా ధర్మమౌతుందని వివరించాడు. తపస్సంపన్నుడైన విశ్వామిత్రుడు కరువు సమయంలో ప్రాణం నిలబెట్టుకోవడానికి శునక మాంసం తిన్నాడు. ఇది ధర్మ విరుద్ధమైనప్పటికీ మనుగడ సాగించడం ముఖ్యమైనందున ధర్మసమ్మతమే అయ్యింది. నిజం చెప్పడం ధర్మం. కానీ వివాహం, ప్రాణం, ధనం, గౌరవానికి భంగం వాటిల్లడం వంటి పరిస్థితుల్లో, గోరక్షణ వంటి సందర్భాల్లో అసత్యం చెప్పినప్పటికీ పాపం అంటదన్నది విదురనీతి.

రాముడి నుంచి ప్రహ్లాదుడి వరకూ..

ధర్మాచరణ తనకు, పొరుగువారికి, సకల చరాచర సృష్టికీ మేలు చేస్తుంది. ధర్మరాజు, రాముడు, హరిశ్చంద్రుడు, బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు.. ఇలా ఎందరో పురాణ పురుషులు ధర్మబద్ధంగా జీవించి, ఆదర్శంగా నిలిచారు. కురుక్షేత్ర యుద్ధం తర్వాత ఇంద్రుడు వచ్చి స్వర్గానికి రమ్మని ధర్మరాజును ఆహ్వానించాడు. ధర్మరాజును సారమేయం అనే శునకం అనుసరించసాగింది. ఆ శునకాన్ని విమానంలో ఎక్కనిస్తేనే తాను అధిరోహిస్తానన్నాడు ధర్మరాజు. 'ఈ నీచ ప్రాణి కోసం నీకు వచ్చిన స్వర్గావకాశాన్ని ఎందుకు వదులుకుంటావు? శునకాన్ని విడిచిపెట్టు, అదే వెళ్లిపోతుంది' అన్నాడు ఇంద్రుడు. 'నా వాళ్లందరూ దూరమైనా అది నన్ను విడవలేదు. నా సుఖం కోసం దాన్ని విడిచిపెట్టడం ధర్మంకాదు' అన్నాడు. అప్పుడు సారమేయ రూపంలో ఉన్న ధర్మదేవత ప్రత్యక్షమై ధర్మరాజును ప్రశంసించింది.

వామనుడు మూడడుగుల నేల అడిగినప్పుడు బలిచక్రవర్తి దానం ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. రానున్న అనర్థాన్ని గ్రహించిన శుక్రాచార్యుడు అభ్యంతరం చెప్పాడు. అప్పుడు బలి 'మహాత్మా! తమరు చెప్పింది నిజమే. కానీ నాలుగు పురుషార్థాల్లో అర్థకామ్యాలు రెండింటినే నేను ఇవ్వగలను. అలా ఇచ్చినప్పుడే నేను ధర్మాన్ని అనుసరించినట్లవుతుంది. అప్పుడే మోక్షాన్ని పొందగలుగుతాను. అందుకే కోరింది ఇస్తానని మాట ఇచ్చాను. ఆశతో వచ్చినవారిని నిరాశపాలుచేయడం ధర్మం కాదు' అన్నాడు శుక్రాచార్యునితో. చతుర్విధ పురుషార్థ సాధన ఎలాగో తెలియజేస్తుంది ఈ ఉదంతం.

ప్రవహించే గుణం...

వ్యక్తిగత, సామూహిక శ్రేయస్సు కోసం, ఆర్థిక వనరులను సంపాదించడమే రెండో పురుషార్థమైన అర్థ లక్ష్యం. అయితే ధనార్జన నీతిబద్ధంగా ఉండాలి, విచక్షణతో ఖర్చు చేయాలని విదురుడు తెలియజేశాడు. సంపదను బాధ్యతాయుతంగా నిర్వహించడం ఎలాగో ధర్మరాజు ఆచరణలో చూపాడు. జీవితంలో విలువైన ఫలితాలను ఇచ్చే అంశాలను సైతం యశోధనం, త్యాగధనం, విద్యాధనం- అంటూ వ్యవహరిస్తారు.

ధనానికి అధిదేవత లక్ష్మీదేవి. మహాలక్ష్మి నీటిలో పద్మం మీద ఆశీనురాలై ఉంటుంది. నిరంతరం ప్రవహించటం నీటి లక్షణం. ప్రవహించకుండా ఆగిపోతే పాకుడు పడుతుంది. అలాగే ధనం కూడా ఒకరి నుంచి మరొకరికి, వారి ద్వారా వేరొకరికి చేరుతుండాలి. అందుకు భిన్నంగా రాశులుగా కూడబెట్టిన ధనం వల్ల ఆరోగ్యప్రదమైన జీవితం సాధ్యంకాదు- అనేది లక్ష్మీదేవి నీటిలో నివసించడంలోని ఆంతర్యం- అని చమత్కరించాడొక కవి.

ఆర్థిక క్రమశిక్షణ ఆవశ్యకతను, అందుకు అవసరమైన మార్గాలను సూచిస్తుంది కౌటిల్యుని అర్థశాస్త్రం. నైతిక విలువలను పాటిస్తూ ధనాన్ని ఆర్జించడమే శ్రేయోదాయకమని, ఆర్థిక క్రమశిక్షణ ఉన్నప్పుడే జీవనం సజావుగా ఉంటుందని సూచించాడు. పాలకుల వద్ద ఏడాదికి సరిపడేంత ధనం ఉంటే ప్రజావసరాలకు ఇబ్బంది కలగదు, అంతకుమించి ధనరాశులుంటే పాలకులు వ్యసనపరులై సుపరిపాలన అందించలేరన్నాడు కౌటిల్యుడు. పని చేయాలి, ఫలితం పొందాలి.. లేకుంటే ప్రగతి ఆగిపోతుందని సూచించాడు. దేన్నీ ఎవరికీ ఉచితంగా ఇవ్వకూడదని, అలా ఇస్తే సోమరితనం మొదలు అన్యాయాలూ అక్రమాల వరకూ అరాచకం ప్రబలుతుందని వివరించాడు.



దుఃఖ హేతువులవి!

'కామం' అంటే శారీరక వాంఛ అనే భావం స్థిరపడింది. నిజానికి అదొక కోణం మాత్రమే. ఏదైనా కావాలని బలంగా కోరుకోవడమే కామం. ఆహారం, డబ్బు, కీర్తి, అధికారం మొదలైన వాటి పట్ల తీవ్రమైన కోరికను కామం అంటారు. కామాన్ని సంతృప్తిపరిస్తే ఆనందం, హాయి, ప్రేమ, మానసిక తృప్తి, ఇంద్రియ సుఖాలు కలుగుతాయి. జీవితం పట్ల ఉత్సాహం పెరుగుతుంది. కానీ కోరికలకు అంతం ఉండదు. ఎన్ని సమకూరినా మరేవో కొత్త కోరికలు పుడుతూనే ఉంటాయి. అందుకే నియంత్రణ లేని కామం అనర్థదాయకమని తెలియజేసే దృష్టాంతాలు పౌరాణిక కథల్లో అనేకం ఉన్నాయి. అహల్యను కామించిన ఇంద్రుడు 'సహస్రయోనుడు' అయ్యాడు. కామం వల్లనే విశ్వామిత్రుడు ఆర్జించిన తపోఫలాన్ని మేనక సమాగమంతో నష్టపోయాడు. పరస్త్రీ వ్యామోహం వినాశకారి అని రావణాసురుడి వృత్తాంతం నిరూపించింది. కామాన్ని ధర్మబద్ధంగా తీర్చుకోవాలని తెలియజేసింది మనుచరిత్రలో ప్రవరాఖ్యుని వృత్తాంతం. బొందితో స్వర్గానికి వెళ్లాలనే త్రిశంకుడి కోరిక అతన్ని శూన్యంలో తలకిందులుగా వేలాడేటట్లు చేసింది. 'అగ్నిని పొగ, అద్దాన్ని దుమ్ము, శిశువును మావి కప్పి ఉంచినట్లు.. జ్ఞానాన్ని కోరికలు కప్పి ఉంచుతాయి. కాబట్టి కామాన్ని జయించాలి' అన్నాడు గీతలో కృష్ణపరమాత్ముడు. కోరికలే దుఃఖానికి మూల కారణమని, వాటిని జయిస్తేనే శాంతిని పొందుతారని, ఇంద్రియ సుఖాలను అదుపులో ఉంచుకుని సంయమనంతో మెలగాలని బౌద్ధం బోధించింది.

జన్మరాహిత్యం

పునర్జన్మల చక్రం నుంచి విముక్తి పొందడమే మోక్షం. అదే జీవాత్మ పరమాత్మతో ఏకమయ్యే స్థితి. అర్థ, కామాలను ధర్మబద్ధంగా నెరవేర్చినప్పుడు ముక్తి తనంత తానుగా వచ్చి చేరుతుందని భాగవతం తెలియజేసింది. ధర్మం, అర్థం గతజన్మ సుకృతితో లభిస్తాయి. కానీ మోక్షప్రాప్తి అంత సులభం కాదు. అందుకు కారణం మాయ. అది ఎంతటి వారినైనా వశపరచుకుంటుంది. ఉపనిషత్తులు వివరించినట్లుగా ఆత్మజ్ఞానాన్ని ఆర్జించినప్పుడే మోక్షమార్గాన్ని అనుసరించగలుగుతాం.

- అయ్యగారి శ్రీనివాసరావు

దయ.. కరుణ..

ప్రచారంలో ఉన్న కథనాన్ని అనుసరించి.. ప్రపంచ ప్రఖ్యాత తత్వవేత్త కన్ఫ్యూషియస్ మరణానికి చేరువలో ఉన్నాడు. ఆయన చుట్టూ బంధుమిత్రులూ, అనుచరులూ ఉన్నారు. ఆయన ఏం చెబుతారా అని అందరూ ఆతృతతో చూస్తున్నారు. ఒకసారి అందరి వంకా చూసి.. మంద్రమైన స్వరంతో 'నా నోట్లో ఏమున్నాయో చెప్పగలరా?' అని నోరు తెరిచాడు. అప్పటికే ఆ తాత్వికుని పళ్లన్నీ ఊడిపోవడం వల్ల నోరు బోసిగా ఉంది. 'నాలుక ఉంది మాస్టారూ' అన్నాడో అనుచరుడు. ఆయన చిన్నగా నవ్వి 'నీ నోట్లో ఏమున్నాయి?' అనడిగాడు. 'నాలుక, పళ్లు ఉన్నాయి' తడుముకోకుండా చెప్పాడు అనుచరుడు. కన్ఫ్యూషియస్ తల పంకించి 'మనిషి పుట్టినప్పుడు నాలుక ఉంటుంది. క్రమంగా పళ్లు సమకూరతాయి. వృద్ధాప్యంలో పళ్లు ఊడిపోయి నాలుకే మిగులుతుంది. అంటే సున్నితమైంది చిరకాలం ఉంటుందని గ్రహించాలి. మన మాటలు మృదువుగా ఉండాలి. ప్రవర్తన లోకానికి మేలు చేసేదయ్యుండాలి. మనం ఏం చేసినా, చేయకున్నా పరుల పట్ల దయతో మెలగాలి, కారుణ్యాన్ని పంచాలి' అన్నాడు.



కారుణ్యం.. ఓ దైవిక లక్షణం

దివ్య ఖురాన్, దైవ ప్రవక్త ముహమ్మద్ (స) బోధనల్లో దయాగుణం కీలకమైనది. మానవాళి కరుణతో జీవనం సాగించాలని ఇస్లాం ప్రవచిస్తోంది. దైవగ్రంథంలో 114 అధ్యాయాలు ఉండగా.. ఒక్క తొమ్మిదో అధ్యాయం మినహా మిగతావన్నీ 'బిస్మిల్లా ఇర్ రెహ్మాన్ ఇర్ రహీమ్' అనే పదబంధంతో ప్రారంభమవుతాయి. 'అనంత కరుణామయుడు., అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో..' అనేది అర్థం. వీటిలో 'అల్ రెహ్మాన్' దైవికమైన సార్వత్రిక దయను.. 'అల్ రహీమ్' నిర్దిష్ట, వ్యక్తిగత కరుణను సూచిస్తాయి. అలాంటి కరుణను ప్రపంచం అంతటా ప్రసరింపజేసేందుకే ప్రవక్తను పంపినట్టుగా ఖురాన్ పేర్కొంది.



ఇస్లాం సందేశం

'మీరేం ఆశిస్తున్నారో.. దాన్నే తోటివారి కోసం కూడా కోరుకోవాలి. అప్పుడే మీరు విశ్వసనీయులు అనిపించుకుంటారు' అంటూ ఇతరుల పట్ల ప్రవర్తించాల్సిన తీరును ఒక హదీసు తెలియజేసింది. కుటుంబసభ్యులు, పొరుగు వారు, పేదలు, అనాథలు, రోగుల పట్ల కారుణ్యం చూపాలి. రాత్రంతా దైవ ప్రార్థనలో గడపటం కంటే ఆకలితో ఉన్న వ్యక్తికి ఆహారం అందించటం పుణ్యప్రదమని ప్రవక్త బోధించారు.

తమను బాధపెట్టిన వారిని కూడా క్షమించగలగడమే నిజమైన కరుణ. సోదరులు తనకు అన్యాయం చేసినప్పటికీ వారిని క్షమించిన యూసుఫ్ కథ ఇందుకు తార్కాణం. ప్రతీకారంతో రగిలిపోవడం కాదు.. ఆగ్రహాన్ని నిగ్రహించుకుని క్షమించేవారే అసలైన కరుణామూర్తులు. ముహమ్మద్ ప్రవక్త (స) సంచరించే మార్గంలో పొరుగు వ్యక్తి రోజూ చెత్త విసిరినప్పటికీ కోపం తెచ్చుకోలేదాయన. అలాంటి వారి పట్ల ప్రేమ, దయ, సహనాలతో మెలగాలని ఆచరించి చూపారు. భూమండలం, ప్రకృతి, సమస్త జీవరాశులకు మనం సంరక్షకులుగా ఉండాలని ఇస్లాం నొక్కిచెబుతుంది.

మన శరీరంలో ఒక అవయవం అనారోగ్యానికి గురైతే తక్కిన భాగాలన్నీ ఆ బాధను అనుభవిస్తాయి. అలా విశ్వాసులు తోటివారి పట్ల దయతో, సానుభూతితో ఒకే శరీరంలా నడుచుకోవాలని ప్రవక్త సూచించారు. ఇతరుల బాధ్యతలను పంచుకోవటానికి జకాత్ వంటి దాతృత్వ కార్యక్రమాలను ప్రోత్సహించారు. పేదరికం, అసమానతలను తొలగించి సమాజ శ్రేయస్సుకు దోహదపడే కార్యాచరణను ఇస్లాం నిర్దేశిస్తుంది.

ఇది ఎలుకల ఆలయం


రాజస్థాన్ బికనీర్ జిల్లా దేశ్నోక్‌లో కరణీమాత ఆలయం ఉంది. చిత్రమైన సంగతి ఏమిటంటే ఇక్కడ ఎలుకలను పూజిస్తారు. అందుకే ఇది ఎలుకల ఆలయంగా ప్రసిద్ధిచెందింది. ఈ ఎలుకలను కాబాలు అంటారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సందర్శించిన తర్వాత ఈ ఆలయానికి ప్రాముఖ్యత పెరిగింది. కరణీమాత ఆలయాన్ని 20వ శతాబ్దం ప్రారంభంలో బికనీర్ మహారాజు గంగాసింగ్ నిర్మించారు. కరణీమాత 15వ శతాబ్దం నాటి ఒక సాధువు. ఆమె ఫలోదీ సమీపంలోని సువాప్ గ్రామంలో జన్మించింది. స్థానికుల కథనాన్ని అనుసరించి- కోలాయత్ తహసీల్‌లోని కపిల సరోవర్ సరస్సులో నీరు తాగేందుకు వెళ్లిన కరణీమాత పుత్రుడు లక్ష్మణ్ నీటిలో మునిగిపోయాడు. పుత్రుణ్ణి బతికించమని ఆమె మృత్యు దేవుడైన యముణ్ణి ప్రార్థించింది. అతడు ఎలుకగా పునర్జన్మ పొందుతాడని దీవించాడు యముడు. అలా కరణీమాత వారసులు ఎలుకలుగా జన్మించసాగారు. ఈ ఎలుకలను పవిత్రంగా భావిస్తారు. మరో కథనం ప్రకారం, 20 వేలమంది సైన్యం దేశ్నోక్‌పై దాడి చేయగా.. కరణీమాత వారిని ఎలుకలుగా మార్చింది. నేడు ఆలయంలో ఉన్న కాబాలు ఈ ఎలుకలేనని నమ్ముతారు.. ఈ ఆలయంలో సుమారు పాతికవేల ఎలుకలున్నాయి, ఇవి ఆలయ ప్రదేశమంతా తిరుగుతాయి. వాటిని రక్షించేందుకు ఆలయ అధికారులు అప్రమత్తంగా ఉంటారు. భక్తులు ఎలుకలు తిన్న ఆహారాన్ని ప్రసాదంగా తీసుకుంటారు. ఇక్కడి తెల్ల ఎలుకలు కరణీమాత కుమారులని నమ్ముతారు. పండుగ సందర్భంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.





దేవుడు ఆలోచించే చేస్తాడు

ఆలయంలో ప్రవచనం పూర్తయ్యాక 'మీలో ఎవరికైనా ఏమైనా సందేహాలుంటే అడగండి' అన్నాడు సాధువు. శంకరం ఆయన దగ్గరగా వెళ్లి 'అయ్యా! దైవం దృష్టిలో అందరూ సమానం కాదా? మా బంధుమిత్రులంతా ఆనందంగా ఉన్నారు. కానీ నా ఆర్థిక పరిస్థితే దయనీయంగా ఉంది. నేను దైవచింతనతో ఉంటాను. తోటివారికి తోచినంత సాయం చేస్తానే గానీ.. ఎవరికీ ఎలాంటి అపకారం తలపెట్టను. అయినప్పటికీ నాకెందుకు ఇంత లోటు చేశాడు?' అనడిగాడు. సాధువు నవ్వి 'నేనో చిన్న కథ చెబుతాను.. విను! ఒక జింక దాహం తీర్చుకోవడానికి కొలను దగ్గరకు వెళ్లింది. తేటగా ఉన్న నీటిలో తన ప్రతిబింబం కనిపించింది. జింక నీరు తాగటం మానేసి, ఆ ప్రతిబింబాన్ని చూస్తూ నిల్చుండిపోయి 'నా దేహం అందంగా ఉంటుంది. నయనాలు విశాలం. చెవులు ముద్దొస్తాయి..' ఇలా ఒక్కో శరీర భాగాన్నీ చూసుకుంటూ చివరికి కాళ్ల వద్దకు వచ్చేసరికి డీలా పడిపోయింది. 'ఇంత అందమైన శరీరాన్ని ఇచ్చిన భగవంతుడు.. సన్నగా పీలగా ఉండే కాళ్లనిచ్చాడేంటి?' అనుకునేసరికి నీరసం ఆవహించింది. అంతలో దూరం నుంచి అలికిడి వినిపించింది. అది పెద్దపులిదని అర్థమై వెంటనే పరుగు లంకించుకుంది జింక. దాని వేగాన్ని అందుకోలేక పులి మధ్యలోనే ఆగిపోయింది. అలా చాలాదూరం వెళ్లి ఓ చెట్టుకింద ఆగిన జింక.. పులి నుంచి రక్షించిన తన కాళ్లను ప్రేమగా చూసుకుంది. 'దేవుడు తనకీ కాళ్లే ఇవ్వకుంటే ఈ పాటికి పులి చంపేసేది కదా' అనుకుంది. కాసేపటి క్రితం అందవిహీనంగా కనిపించిన కాళ్లు ఇప్పుడు దృఢంగా, ఆపదల నుంచి రక్షించేవిగా, అపురూపంగా తోచడంతో దేవుడికి కృతజ్ఞతలు తెలియజేసింది. భగవంతుడు ఏవి ఎవరికి ఇవ్వాలో అన్నీ ఆలోచించే ఇస్తాడు. నీ బంధుమిత్రులకు ఆర్థిక సమస్య లేకపోవచ్చు.. మరేదో ఇబ్బంది ఉంటుంది. నువ్వు నిజాయితీగా వ్యవహరించేమాట నిజం. నీ ద్వారా పూర్తికావాల్సిన ధర్మకార్యాలెన్నో ఉన్నాయి. అందరిలా నువ్వు ధనరాశుల్లో తేలియాడుతుంటే ఆధ్యాత్మిక చింతనకు దూరమయ్యేవాడివి. ఆర్థిక సమస్య నిన్ను కుంగదీయదు, మరింత సానబెడుతుంది. దైవనిర్ణయం వెనుక గొప్ప అర్థం, పరమార్థం ఉంటాయని గ్రహించు' అంటూ సోదాహరణంగా వివరించాడు.



దైవాజ్ఞ మీరిన సొలొమోను

క్రీస్తువాణి

సొలొమోను మొదట ఏసు భక్తుడు. అతడు రాజుగా సింహాసనం అధిష్ఠించాక కొంతకాలం దేవుని యందు భయభక్తులతోనే ఉన్నాడు. కానీ కాలం గడిచేకొద్దీ తన తండ్రి అయిన దావీదు వలె గాక దేవుని ఆజ్ఞను ధిక్కరించసాగాడు. స్త్రీ వ్యామోహం పెరిగింది. తానెంతగానో నమ్మిన దేవుణ్ణి మరిచాడు. సొలొమోను మోజుపడిన స్త్రీలు అతణ్ణి ఇతర వ్యాపకాల దిశగా మళ్లించారు. అయినప్పటికీ కృపామయుడైన దేవుడు సొలొమోను చేసిన పాపాలను గురించి (1 రాజులు 11:9) రెండుసార్లు హెచ్చరించినప్పటికీ అతడు లక్ష్యపెట్టలేదు.



సొలొమోను వైఖరిని మనం గుణపాఠంగా తీసుకోవాలి. అతడి వలె వ్యామోహాలు, ప్రలోభాలకు లోనవకుండా జాగ్రత్తపడాలి. ప్రారంభం నుంచి ముగింపు వరకు యెహోవా పట్ల అపార విశ్వాసంతో ఉండేందుకు ప్రయత్నించాలి. దైవం వ్యతిరేకించే అంశాలన్నింటికీ దూరంగా ఉంటూ, ఎలాంటి చెడుపనుల జోలికీ వెళ్లకుండా ఉండాలి. మనం అప్రమత్తంగా లేనట్లయితే పాపపంకిలమవుతాం. సాతాను మనల్ని దైవానికి దూరంగా తీసుకెళ్లి, పతనావస్థకు చేరుస్తాడు. గొప్ప జ్ఞాని అయిన సొలొమోను పాపకూపంలో పడిపోయాడంటే.. సాతాను ఎంతటివారినైనా సులభంగా తనదిక్కుకు మళ్లించుకుంటాడనేది నిర్వివాదాంశం. కాబట్టి మనం ప్రతినిత్యం ఆత్మపరిశీలన చేసుకుంటూ యెహోవా సన్నిధిలో గడపాలి. నిరంతరం సదాలోచనలతో ఉండేందుకు ప్రయత్నించాలి. అంతేతప్ప చెడువైపు ఆకర్షితులు కాకూడదు. కార్యాచరణలో నిజాయితీ, ప్రభువు పట్ల విశ్వాసం అనే రక్షణకవచాలు ధరించి సాతాను అగ్నిబాణాల నుంచి బయటపడాలి. తద్వారా మనకు సదా విజయం చేకూరుతుంది.

ఇంద్రియ నిగ్రహం ముఖ్యం

అనేక బౌద్ధ కథల్లో ప్రస్తావనకు వచ్చే శ్రావస్తి ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాప్తీ నదీతీరంలో ఉంది. ఈ పట్టణంతో బుద్ధ భగవానుడికి ఎంతో అనుబంధం ఉంది. ఆయనకు ఎంతో ఇష్టమైన జేతవనం కూడా ఇక్కడే ఉంది. ఒకరోజు ఆ జేతవనంలోనే బుద్ధుడు భిక్ష ఆరగించి విశ్రాంతి తీసుకుంటున్నాడు. అంతలో శ్రావస్తి రాజ్యాధికారులైన విశ్వదత్తుడు, పురాణకుడు అక్కడికి వచ్చారు. కొన్ని విషయాల్లో వారిద్దరికీ అభిప్రాయ భేదాలున్నాయి. ఆరోజు శాకాహారం గొప్పదని విశ్వదత్తుడూ, మాంసాహారమే మంచిదని పురాణకుడు వాదించుకుంటున్నారు. ఇద్దరూ ఎటూ తేల్చుకోలేక ఆ విషయాన్ని బుద్ధుడి ముందు పెట్టారు.

వారి వాదనలు విన్న బుద్ధుడు 'రెండూ ఆహారమే. శాకం తింటే ఉత్తములు, మాంసం భుజిస్తే చెడ్డవారు అయిపోరు. శీలానికి కొలబద్దలు ఆహారం, ఆహార్యం కావు. ఇంద్రియ నిగ్రహం ముఖ్యం. ఇంద్రియాలను నియంత్రణలో ఉంచుకుని, నైతిక విలువలు పాటించినపుడు శీలం వర్ధిల్లుతుంది. అందువల్ల చేసే పనులను బట్టి మంచి, చెడు నిర్ధారణ అవుతుందే గానీ, తినే ఆహారాన్ని బట్టి కాదు. ఒక ఉదాహరణ చెబుతాను, వినండి... పూర్వం సంగరుడు అనే ముని ఉండేవాడు. అతను వేళాపాళా లేకుండా అనేకసార్లు స్నానం చేసేవాడు. ఒకసారి ఎందుకు సమయం పాటించడంలేదని అడిగాను. ఎప్పటి పాపం అప్పుడే ప్రక్షాళన అయిపోయేందుకు అలా స్నానం చేస్తుంటానని చెప్పాడు. మనసులోని ఆలోచనలు పరిశుభ్రంగా లేనప్పుడు ఎన్నిసార్లు స్నానం చేసినా ప్రయోజనం ఉండదు. ఈ సూత్రం అన్నిటికీ వర్తిస్తుంది' అంటూ వివరించాడు బుద్ధుడు. ఆ మాటలు విన్న విశ్వదత్త, పురాణకుల హృదయాల్లోని సంశయం నివృత్తి అయింది. ఆయనకు నమస్కరించి తమ విధులు నిర్వర్తించేందుకు అక్కణ్ణించి వెళ్లిపోయారు.



శ్లోకామృతం

యా సృష్టి స్రష్టురాద్యా వహతి
విధిహుతం యా హవిర్యాచ హోత్రీ
యే ద్వే కాలం విధత్తః శృతివిషయగుణా
యా స్థితా వ్యాప్య విశ్వం
యామాహుః సర్వ బీజ ప్రకృతిరితి
యయా ప్రాణినః ప్రాణవంతః
ప్రత్యక్షాభిః ప్రపన్నస్తనుభిరవతు
వస్తాభి రష్టాభి రీశః



భగవంతుడు మనకు ఎనిమిది ప్రత్యక్ష రూపాల్లో నిత్యం దర్శనమిస్తూనే ఉంటాడు. అవి.. జీవ సృష్టికి ముందే ఉన్న జలం, హోమం చేసిన అగ్ని, యజ్ఞం చేసే యజమాని, కాలాన్ని నియంత్రించే సూర్యుడు, చంద్రుడు, విశ్వమంతా వ్యాపించిన ఆకాశం, భూమి, వాయువు- ఈ ఎనిమిది రూపాలతో దర్శనమిచ్చే ఈశ్వరుడు మిమ్మల్ని రక్షించుగాక అనేది మహాకవి కాళిదాసు రచించిన 'అభిజ్ఞాన శాకుంతలం'లోని ఈ శ్లోక భావం. ప్రకృతి దైవస్వరూపం అని తెలియజేయడం ఇందులోని అంతరార్థం.

ప్రక్షాళనతోనే పరిరక్షణ!



మంచినీటి వనరుల లభ్యతతోపాటు వినియోగం అధికంగా ఉన్న దేశం భారత్. దాంతోపాటు ఉపరితల జలకాలుష్యం తీవ్ర స్థాయికి చేరి ప్రధాన పర్యావరణ సమస్యగా మారింది. శుద్ధి చేయకుండా వదిలే మురుగు నీరు, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయ రసాయనాలతో నదులు, ఇతర మంచినీటి వనరులు కలుషితమవుతున్నాయి. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా, సామాజికంగా దుష్ప్రభావాలను కలిగిస్తూ దేశ ప్రగతిని వెనక్కి లాగుతున్న ఈ సమస్యను పోటీపరీక్షార్థులు శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి. నీటికాలుష్యంతో జీవక్రియలు ప్రభావితమయ్యే తీరును, నీటి ఆవరణ వ్యవస్థ విషతుల్యంగా మారే పరిస్థితిని, జాతీయ నదిగా గుర్తించిన గంగా నది పునరుజ్జీవనానికి ఉన్న ప్రాధాన్యం, ఆ దిశగా జరుగుతున్న బృహత్తర ప్రయత్నం గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్
పర్యావరణ అంశాలు

జల కాలుష్యం

నీటి సహజ లక్షణాలను దెబ్బతీసే విధంగా అందులో ఘన, ద్రవ, వాయు పదార్థాలు ఉండాల్సిన దాని కంటే ఎక్కువ పరిమాణంలో ఉంటే దానిని 'జల కాలుష్యం' అంటారు. ఈ కారకాలతోపాటు నీటి ఉష్ణోగ్రతలో మార్పు కూడా నీటి కాలుష్యమే.

నీటి కాలుష్యానికి కారణాలు: గృహ సంబంధ, ఘన, పారిశ్రామిక వ్యర్థాలు; ఆమ్ల వర్షాలు, చమురుశుద్ధి కర్మాగారాలు, కొన్ని నీటి మొక్కలు.

నైట్రేట్స్: ఇవి సాధారణంగా మానవ సంబంధ కారకాల ద్వారా నీటి వనరుల్లోకి చేరతాయి. ఎరువుల ద్వారా నీటిలోకి చేరే నైట్రోజన్ వల్ల జంతువుల్లో జీవ సంబంధ కారకాలు పెరుగుతాయి. ప్రధానంగా వృక్షాల్లో నైట్రోజన్ వినియోగం చాలా ఎక్కువగా ఉంటుంది. నైట్రోజన్, అమైనో ఆమ్లాలు, ప్రోటీన్లు, ఎనర్జీ ఎంజైమ్‌లు జీవ ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. ఎంజైమ్స్ సాధారణంగా రెండు భాగాలతో ఏర్పడతాయి. ఎంజైమ్ ప్రోటీన్ భాగాన్ని 'అపో ఎంజైమ్' అంటారు. ఎంజైమ్ ప్రోటీనేతర భాగాన్ని కో-ఎంజైమ్‌గా వ్యవహరిస్తారు. ఈ కో-ఎంజైమ్స్ ప్రధానంగా రసాయనికంగా కాపర్, జింక్ లాంటి సూక్ష్మ మూలకాలతో నిర్మితమవుతాయి. అపో ఎంజైమ్, కో - ఎంజైమ్‌ల సంక్లిష్ట నిర్మాణాన్ని 'ప్రోస్థటిక్ నిర్మాణం' అంటారు.

నీటి కాలుష్య ప్రభావాలు: నీటికాలుష్యం వల్ల ఎస్ట్రిఫికేషన్ జరుగుతుంది. నీటిలో బీఓడీ, సీఓడీలు పెరుగుతాయి. ఇవి నీటిలో కరగడంతో ఆక్సిజన్ తగ్గుతుంది. నీటి కాలుష్యం వల్ల ద్వితీయ అనుక్రమకానికి గురవుతుంది.

నీటి కాలుష్య నివారణకు ప్రభుత్వ చర్యలు: పరిశ్రమల వ్యర్థాలు ఎంత మోతాదులో నీటిలో కలుస్తున్నాయో తెలుసుకోవడానికి కేంద్రం ఆన్‌లైన్ ఎలిమెంట్ మానిటరీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసింది. చిన్న పరిశ్రమలకు ఎలిమెంట్ చికిత్స ప్లాంటు నిర్మాణానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది. నీటి కాలుష్య చట్టం - 1974లోని సెక్షన్ 18(1)(బి) ప్రకారం పరిశ్రమల్లో కాలుష్య కారకాలను తగ్గించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటుంది. దేశవ్యాప్తంగా నదీ జలాల నాణ్యతను కేంద్ర, రాష్ట్రాల కాలుష్య నియంత్రణ బోర్డులు నిరంతరం పర్యవేక్షిస్తాయి.

గంగా యాక్షన్ ప్లాన్

గంగా నది పరిశుభ్రత కోసం 1985లో ఈ పథకాన్ని ఏర్పాటు చేశారు. భారతదేశంలో నదుల సంరక్షణకు ఏర్పాటు చేసిన మొదటి పథకం ఇదే. గంగానదిలో కలిసే పారిశ్రామిక వ్యర్థాలను తొలగించడం ఈ ప్రణాళిక ప్రధాన లక్ష్యం.

వైఫల్యానికి కారణాలు: గంగా యాక్షన్ ప్లాన్ అమలులో పర్యవేక్షణ లోపించింది. కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించలేదు. గంగా, దాని ఉపనదులపై కట్టిన ప్రాజెక్టుల్లో నాలుగు జలవిద్యుత్తు ప్రాజెక్టులు నది ప్రవాహం తీరును మారుస్తున్నాయి. గంగా నది ప్రవహించే ఐదు రాష్ట్రాల్లోనూ (ఉత్తరాఖండ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్) కాలుష్యం తీవ్రంగా ఉంది. కాన్పుర్‌లోని తోళ్ల పరిశ్రమలు, కోసిలోని చక్కెర, కాగితం పరిశ్రమలు; రామ్‌గంగా-కాళీ నదుల్లోని కాలుష్యం తదితరాలన్నీ గంగా నది కాలుష్యతీవ్రతకు ప్రధాన కారణాలు. పరీవాహక ప్రాంతంలో జరిగిన అక్రమ నిర్మాణాలెన్నో నదిని శుభ్రం చేయడానికి ఆటంకంగా మారుతున్నాయి.




భారతదేశంలో నీటి పరిస్థితి



కేంద్ర ప్రభుత్వం నీటి విజన్ @2047ను భోపాల్‌లో 2023, జనవరి 5-7 తేదీల మధ్య విడుదల చేసింది.

నీటి విజన్ లక్ష్యాలు: * నీటి సంబంధ పర్యావరణ విపత్తులను ముందుగానే గుర్తించి వాటి ద్వారా ఏర్పడే నష్టాలను తగ్గించడం. * సూక్ష్మ నీటిపారుదల ద్వారా 70 మిలియన్ హెక్టార్ల భూమికి నీటిని అందించడం. * నీటిపారుదల రంగంలో ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ)ను ఉపయోగించి నేల ఉత్పాదకతను పెంచడం. * రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బాధ్యులను చేస్తూ నీటికి సంబంధించిన యాజమాన్య విధానాలను పాటించడం. * తాగునీటి నాణ్యత పెంచి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం. * జియో - సెన్సింగ్, జీడబ్ల్యూ మ్యాపింగ్ - రిమోట్ సెన్సింగ్‌లను వినియోగించి నీటి నిక్షేపాలను గుర్తించడం.

జాతీయ సరస్సు పరిరక్షణ ప్రణాళిక



కేంద్ర ప్రభుత్వం 2013, ఫిబ్రవరిలో ఈ ప్రణాళిక తీసుకొచ్చింది. నీటి వనరులు రాష్ట్ర జాబితాలో ఉన్నప్పటికీ నీటివనరుల సంరక్షణ చర్యలు, కాలుష్య నిర్మూలన విధానాలు మొదలైన వాటిని కేంద్రం సిఫార్సుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి.

నమామి గంగా ప్రాజెక్టు

ఈ ప్రాజెక్టును 2014, జులై 2న నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రారంభించారు. బడ్జెట్ రూ.20,000 కోట్లు. గంగా నదిలోని కాలుష్యాన్ని తగ్గించి పునరుజ్జీవింప చేయడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

అమలు విధానం: ప్రజలకు అవగాహన కల్పించడం, పారిశ్రామిక, గృహ వ్యర్థాలను శుభ్రపరిచిన తర్వాతే నదిలోకి వదిలే విధంగా చూడటం, నది జీవవైవిధ్యాన్ని సంరక్షించడం, గంగానదికి నీటిని తీసుకొచ్చే అన్ని జలవనరులను శుభ్రం చేయడం ఇందులోని ప్రధాన అంశాలు.

ఈ ప్రాజెక్టును 'నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా' (ఎన్ఎంసీజీ) అని పిలుస్తున్నారు. నది పునరుజ్జీవనం, రక్షణ, నిర్వహణ కోసం నేషనల్ గంగా కౌన్సిల్ ఏర్పాటైంది. గంగా నది పరిశుభ్రత కోసం కావాల్సిన ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం అందిస్తుంది.

ఎన్ఎంసీజీ లక్ష్యం: గంగానది సహజ స్వాభావిక ప్రవాహాన్ని మార్చకుండా శుభ్రపరచడం ప్రధాన లక్ష్యం. నది ఉపరితల, అంతర్గత నీటిని సహజంగా మార్చాలి. నదీ పరీవాహక ప్రాంతంలో వృక్ష, జంతు జాతులను పునరుద్ధరింపజేయాలి. గంగా ప్రక్షాళనలో స్థానికులను భాగస్వాములను చేయాలి.

గంగా డాల్ఫిన్



'గంగా డాల్ఫిన్' దేశ జాతీయ జల జంతువు. దీనిని స్థానిక భాషలో 'సుసు' అంటారు. బిహార్‌లో 'సూన్స్' అని పిలుస్తారు. గంగా, బ్రహ్మపుత్ర, మేఘన, కర్ణఫులి నదుల్లో ఈ డాల్ఫిన్ ఉంటుంది. దీనిని 1801లో మొదటిసారిగా గుర్తించారు. పుట్టుకతో గుడ్డి జీవి అయినప్పటికీ ఆహారపు గొలుసులో అతి ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమించింది. దీని సంరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలను చేపట్టింది. గంగా డాల్ఫిన్ గువాహటి నగర అధికారిక జంతువు.

* గంగా డాల్ఫిన్లు నీటిలో ఎక్కువ సేపు శ్వాస తీసుకోలేవు. ప్రతి 30-40 సెకన్లకు ఒకసారి నీటి ఉపరితలానికి వచ్చి శ్వాస తీసుకునే క్రమంలో మత్స్యకారులకు దొరికిపోతుంటాయి. ప్రధానంగా నదీకాలుష్యం వల్ల మరణిస్తున్నాయి. వీటి చర్మం నుంచి తీసిన నూనె ఆయుర్వేద వైద్యంలో ఉపయోగిస్తారు. ఇందు కోసం కూడా వాటిని చంపుతున్నారు. జలాశయాల నిర్మాణం కూడా వీటి సంఖ్య క్షీణతకు ఒక కారణం. వేగంగా తగ్గిపోతుండటంతో సంరక్షణ కోసం విక్రమశిలలో ప్రత్యేక అభయారణ్యాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ జీవిని గంగాదేవి బహుమతిగా భావిస్తారు.

యుట్రోఫికేషన్




నీటిలో అకర్బన పదార్థాలు చేరి, పోషకాల స్థాయి అత్యధికంగా పెరగడం వల్ల శైవలాలు మొదలైన చిన్న మొక్కలు చాలా వేగంగా పెరుగుతాయి. ఈ విధంగా శైవలాలు ఒక నీటి ఆవరణ వ్యవస్థలో వేగంగా పెరగడాన్ని 'శైవల మంజరులు' అంటారు. వీటి వల్ల నీటిఆవరణ వ్యవస్థ ప్రమాదకర స్థితికి చేరుతుంది. ఈ నీటిలో కరిగే ఆక్సిజన్ సాంద్రత తగ్గి జీవులకు ప్రాణాంతకంగా మారుతుంది. పంటపొలాల నుంచి నైట్రోజన్ - ఫాస్ఫేట్ సంబంధ రసాయనాలు నీటిలోకి చేరడం యుట్రోఫికేషన్‌కు ప్రధాన కారణం. అలాగే ఎరువులు, మురుగునీరు, ఫాస్ఫేట్ కలిగిన డిటర్జెంట్స్, పారిశ్రామిక వ్యర్థాలు ఇతర కారకాలు.

యుట్రోఫికేషన్ ప్రభావాలు: శైవలాలు వేగంగా పెరిగి మరణిస్తాయి. ఇవి నీటి కిందిభాగంలోకి చేరి బ్యాక్టీరియా ద్వారా విచ్ఛిన్నం చెందుతాయి. ఈప్రక్రియకు ఎక్కువ ఆక్సిజన్‌ను వాడుకోవడంతో నీటిలోప్రాణవాయువు తగ్గిపోతుంది. ఫలితంగా నీటిలోని జీవులకు ఊపిరాడక చనిపోతాయి. అవాయుశ్వాసక్రియ ద్వారా అభివృద్ధిచెందేవి, జిగురుతో కూడిన జంతువులు వేగంగా పెరిగిపోతాయి. జలఆవరణ వ్యవస్థ కింది భాగాల్లో కర్బన సంబంధ పదార్థాలు ఎక్కువగా చేరతాయి. ఈ స్థితిలో నీటిని శుద్ధి చేయడం కష్టం. చేపల సంఖ్య తగ్గి నీటిపరిసరాలు ప్రమాదకర స్థితిలో ఉంటాయి.



రచయిత: ఈదుబిల్లి వేణుగోపాల్

కరెంట్ అఫైర్స్



■ జోనాస్ గహర్ స్టోయిర్ ఇటీవల ఏ దేశ ప్రధాని రెండోసారి తిరిగి ఎన్నికయ్యారు? **జ:** నార్వే (ఈయన నేతృత్వంలోని నార్వే లేబర్ పార్టీ 169 సీట్లలో 87 సీట్లను గెలిచి వరుసగా రెండోసారి అధికారాన్ని దక్కించుకుంది.)

■ కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) 2025, సెప్టెంబరు 10 నాటికి ఎన్ని సంవత్సరాలను పూర్తి చేసుకుంది? **జ:** ఐదేళ్లు

మాదిరి ప్రశ్నలు

■ జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని ఏటా ఎప్పుడు నిర్వహిస్తారు? (2025లో ఈ దినోత్సవాన్ని 'రిమెంబరింగ్ మార్టిర్స్, ప్రొటెక్టింగ్ ఫారెస్ట్స్' అనే థీమ్‌తో నిర్వహించారు. కేంద్ర పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ 2013లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.) **జ:** సెప్టెంబరు 11

■ దేశంలో క్రీడా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా - నేషనల్ సెంటర్ ఆఫ్ స్పోర్ట్స్ సైన్స్ రిసెర్చ్ ఇటీవల ఏ ఐఐటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది? **జ:** దిల్లీ ఐఐటీ

మరింత సమాచారం

దరఖాస్తు చేశారా?




☛ ఇండియన్ ఆర్మీలో 143వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సు
చివరి తేదీ: 06-11-2025

☛ ఎంబీఐఎల్ లిమిటెడ్‌లో 99 ఎలక్ట్రీషియన్ ఉద్యోగాలు
చివరి తేదీ: 2025, నవంబరు 6

సరిగా చేస్తే.. సమయం సరిపోతుంది మిత్రమా! — స్టడీ స్కిల్స్

రేపటి రోజున చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. సమయం సరిపోదు కదా ఏం చేయాలి? రోజు కంటే ఒక అరగంట ముందే నిద్ర లేస్తే కంగారు లేకుండా అనుకున్న పనులన్నీ చక్కబెట్టుకోవచ్చు. స్టడీ రూమ్‌ను శుభ్రంగా ఉంచుకోవడం, బుక్‌షెల్ఫ్‌ను తగిన రీతిలో సర్దుకోవడం, ఎక్కడి వస్తువులు అక్కడే ఉండేలా చూసుకోవడం, రోజులో



అరగంటపాటైనా మనసుకు నచ్చిన పని చేయడం మొదలైనవన్నీ చెప్పడానికి, వినడానికి చిన్న అలవాట్లుగానే కనిపిస్తాయి. కానీ వాటి ఫలితం మాత్రం గొప్పగా ఉంటుంది. అలాంటి సాధారణ అలవాట్లు ఏమిటి? వాటితో వచ్చే పెద్ద మార్పులు ఏవిధంగా ఉంటాయో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.


రైల్వేల విస్తరణతో పెరిగిన ఉక్కు గిరాకీ!

భారతదేశ చరిత్ర

ఇంగ్లండ్‌లో పద్దెనిమిది, పందొమ్మిది శతాబ్దాల మధ్యలో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం ప్రపంచాన్ని ఆధునిక యుగంలోకి నడిపించింది. సామాజిక, ఆర్థిక పరివర్తనలు తీసుకొచ్చి అంతటా ఆర్థిక వ్యవస్థ స్వరూప స్వభావాలను మార్చేసింది. యంత్రాల ప్రవేశంతో వస్తు ఉత్పత్తి పద్ధతులు కొత్త రూపాన్ని సంతరించుకున్నాయి. రవాణా సౌకర్యాలు, జీవన ప్రమాణాలు మెరుగయ్యాయి. మొదట ఐరోపా, ఉత్తర అమెరికా, ఆ తర్వాత ప్రపంచమంతా వాణిజ్య విధానంలో మార్పు వచ్చింది. ఈ పరివర్తన కాలం నాటి విశేషాలను ప్రదర్శించే చిత్రాలు, వాటిని గీసిన చిత్రకారులు, ప్రచురించిన పత్రికలు, ఆనాటి వస్తు ఉత్పత్తి, గిరాకీ, సరఫరాకు సంబంధించిన ప్రాథమికాంశాలు, ముఖ్య పరిణామాలపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఇంగ్లండ్ పరిశ్రమలకు భారత్ ముడిపదార్థాల సరఫరాదారుగా, అక్కడి ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్‌గా, చివరికి వలసరాజ్యంగా మారిన తీరు, అదే సమయంలో ఇక్కడి రైతులు, చేనేతకారులు ఎదుర్కొన్న సమస్యలను, అప్పట్లో దేశంలో ప్రారంభమైన పరిశ్రమల గురించి తెలుసుకోవాలి.


పారిశ్రామికీకరణ యుగం

1. 1900లో న్యూయార్క్, ఇంగ్లండ్‌లో 'శతాబ్దపు ఉషోదయం' పేరుతో కవర్ పేజీని రూపొందించింది?
   1) ఇ.టి.పాల్ సంగీత కంపెనీ
   2) ఇ.టి.జాన్సన్ సంగీత కంపెనీ
   3) 1, 2
   4) ఎన్.వి. పాల్ సంగీత కంపెనీ
2. ప్రోటో అంటే?
   1) ముగింపు రూపం సూచిస్తుంది.
   2) ఏదైనా మొదట లేదా ప్రారంభరూపం సూచిస్తుంది.
   3) ప్రారంభ, ముగింపు రూపం సూచిస్తుంది.
   4) అదొక చరిత్ర.
3. కింది వాటిలో సరైంది గుర్తించండి.
   ఎ) ఇంగ్లండ్, ఐరోపా భూభాగాల్లో కర్మాగారాలు ఆవిర్భవించక ముందే అంతర్జాతీయ మార్కెట్ కోసం ఉత్పత్తి జరిగింది.
   బి) రైతులకు, చేతివృత్తులవారికి డబ్బు ఇచ్చి అంతర్జాతీయ మార్కెట్ కోసం ఉత్పత్తి చేయించారు.
   సి) వ్యాపారులు పట్టణాల్లో ఉత్పత్తిని విస్తరించలేకపోయారు. కారణం వృత్తిసంఘాలు శక్తిమంతంగా ఉండటం.
   1) ఎ, బి 2) ఎ, సి 3) ఎ, బి, సి 4) బి
4. పారిశ్రామికీకరణ కంటే ముందుగా వ్యాపారులు పల్లెల్లో అధికంగా వ్యాపారం చేయడానికి కారణం?
   1) పట్టణ వ్యాపారులు ధనికులు కావడం.
   2) పట్టణాలు పెద్దవిగా ఉండటం.
   3) ఆనాటి పాలకులు పట్టణాల్లో వర్తకసంఘాలకు నిర్దిష్ట ఉత్పత్తికి గుత్తాధిపత్యం ఇవ్వడం.
   4) గ్రామీణ ప్రాంత ప్రజలు నిరక్షరాస్యులు కావడం.
5. కింది వాటిని సరిచూడండి.
   ఎ) స్టాప్లర్ - స్టేపుల్స్ లేదా దాని ఫైబర్‌కు అనుగుణంగా ఉన్నిని క్రమబద్ధీకరించే వ్యక్తి.
   బి) ఫుల్లర్ - ఫ్లీటింగ్ ద్వారా వస్త్రం సేకరించే వ్యక్తి.
   సి) కార్డింగ్ - పత్తి లేదా ఉన్ని లాంటి ఫైబర్లను వడకడానికి ముందు చేసే ప్రక్రియ.



కార్డింగ్

   1) ఎ, బి సరైనవి; సి సరికాదు.
   2) ఎ, బి, సి సరైనవి.
   3) ఎ, బి, సి సరికావు.
   4) ఎ సరైంది; బి, సి సరికావు.
6. కింది వాటిని సరిచూడండి.
   ఎ) స్పిన్నర్ - నూలు వడికే వ్యక్తి.
   బి) ఫుల్లర్ - వస్త్రం పూర్తి చేసే వ్యక్తి.
   సి) సిపాయి - సిపాహి అనే పదం నుంచి వచ్చింది.
   1) ఎ, బి సరైనవి.
   2) ఎ, బి, సి సరైనవి.
   3) ఎ సరైంది; బి, సి సరికావు.
   4) ఎ, బి, సి సరికావు.
7. ఇంగ్లండ్‌లో తొలి కర్మాగారాలను ఎప్పుడు స్థాపించారు?
   1) 1830 2) 1630
   3) 1730 4) 1930
8. కొత్త శకానికి మొదటి చిహ్నం లాంటిది?
   1) గోధుమ పంట 2) మొక్కజొన్న పంట
   3) వరి పంట 4) పత్తి పంట
9. సి.ఇ.టర్నర్ చిత్రించిన ఏ మిల్లు 1925 ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్‌లో ఉంది?
   1) లాంక్‌షైర్ - కాటన్ మిల్లు
   2) లాంక్‌షైర్ - కాగితం మిల్లు



   3) లండన్ - పేపర్ మిల్లు 4) పైవన్నీ
10. ఎం.జాక్సన్ గీసిన పారిశ్రామిక మాంచెస్టర్ చిత్రాన్ని 'ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్'లో ఎప్పుడు ప్రచురించారు?
   1) 1925 2) 1857 3) 1875 4) 1865
11. కింది వాటిలో సరైన అంశాలను గుర్తించండి.
   1) బ్రిటన్‌లో పత్తి, లోహాలే అత్యంత క్రియాశీలక పరిశ్రమలు.
   2) పారిశ్రామికీకరణ మొదటి దశలో పత్తి ప్రముఖ రంగంగా ఉంది.
   3) 1860 నుంచి రైల్వేల విస్తరణ కారణంగా ఇనుము - ఉక్కు గిరాకీ పెరిగింది.
   4) 1873 నాటికి 77 మిలియన్ డాలర్ల ఇనుము - ఉక్కు ఎగుమతి జరిగింది.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
12. కింది వాటిలో సరైన వాక్యాలను గుర్తించండి.
   ఎ) కొత్త పరిశ్రమలు అంత సులువుగా సాంప్రదాయ పరిశ్రమలను స్థానభ్రంశం చేయలేదు.
   బి) 19వ శతాబ్దం చివరి నాటికి 20% కంటే తక్కువమంది సాంకేతికంగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక రంగంలో ఉపాధి పొందుతున్నారు.
   సి) సాంప్రదాయ పరిశ్రమల్లో వచ్చే మార్పు వేగం ఆవిరితో నడిచే పత్తి లేదా లోహ పరిశ్రమ ద్వారా నిర్ణయించలేదు.
   డి) సాంకేతికత మార్పులు నెమ్మదిగా సంభవించాయి.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
13. కింది వాటిలో సరైంది గుర్తించండి.
   ఎ) న్యూకోమెన్ ఉత్పత్తి చేసిన ఆవిరి యంత్రాన్ని జేమ్స్‌వాట్ మెరుగుపరిచారు.
   బి) 1781 లో ఈ యంత్రంపై సర్వహక్కులు పొందారు.
   సి) పారిశ్రామికవేత్త అయిన మ్యాథ్యూ బేల్టన్ కొత్త రకం యంత్రాన్ని తయారుచేశారు.
   డి) 19వ శతాబ్దం ప్రారంభంలో ఇంగ్లండ్ అంతటా చాలా తక్కువ ఆవిరి యంత్రాలు ఉన్నాయి.
   1) ఎ, బి, సి, డి
   2) ఎ, బి, సి
   3) ఎ, సి, డి
   4) బి, డి



ఆవిరి యంత్రం


14. కింది వాటిని జత పరచండి.

1) 1879 ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్	ఎ) ఇంగ్లండ్‌లోని రైల్వే ఫిట్టింగ్ షాపు
2) 1849 ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్	బి) పని అన్వేషణలో ప్రజలు
3) 1868 ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్	సి) పారిశ్రామిక మాంచెస్టర్
4) 1857 ది ఇల్లస్ట్రేటెడ్ లండన్ న్యూస్	డి) లోతైన భూగర్భ రైల్వే చిత్రం

   1) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి 2) 1-బి, 2-ఎ, 3-డి, 4-సి
   3) 1-డి, 2-సి, 3-బి, 4-ఎ 4) 1-డి, 2-సి, 3-ఎ, 4-బి
15. ఇంగ్లండ్‌లో పరిశ్రమలు, వాటి కాలానుగుణ డిమాండ్‌కు సంబంధించి సరైంది?
   ఎ) గ్యాస్, సారా తయారీకి చలి కాలంలో డిమాండ్ ఎక్కువ.
   బి) డిసెంబరుకు ముందు పుస్తకాల బైండ్‌కు, ముద్రించడానికి, క్రిస్మస్ వస్తువుల తయారీకి డిమాండ్ ఎక్కువ.
   సి) శీతాకాలంలో ఓడల మరమ్మతులకు డిమాండ్ ఎక్కువ.
   1) ఎ, బి, సి 2) ఎ, బి 3) సి 4) బి
16. కింది వాటిలో సరైనవి?
   ఎ) కమర్స్ అండ్ గోయర్స్ - హెచ్.జె.జోస్, మైకేల్ ఉల్ఫ్
   బి) విక్టోరియన్ సిటీ ఇమేజస్ అండ్ రియాలిటీస్ - రాఫెల్ శామ్యూల్
   సి) ది స్కిల్డ్ లేబరర్ - జె.ఎల్.హామండ్, బి.హామండ్
   డి) ది ఏజ్ ఆఫ్ మాన్యుఫాక్చరర్స్ - మాక్సిన్ బెర్గె
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
   3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
17. ఏ రాజు/రాణి పరిపాలన కాలంలో శ్రామికుల లభ్యత సరిగా ఉంది?
   1) విక్టోరియా మహారాణి 2) ఎలిజిబెత్ - 1
   3) మేరి 4) జేమ్స్ - 1
18. 1874లో నిరాశ్రయులు, ఆకలితో ఉన్నవారు అనే చిత్రం గీసింది?



   1) శామ్యూల్ ల్యూక్ పిల్డెస్ 2) విలియం బెల్‌స్కాట్
   3) ఎం. జాక్సన్ 4) సీఈ టర్నర్
19. ఏ సంవత్సరం తర్వాత నగరాల్లో భవన నిర్మాణ కార్యకలాపాలు తీవ్రరూపం దాల్చాయి?
   1) 1830 2) 1840 3) 1850 4) 1860
20. వలస పాలనకు ముందు ఆర్మేనియా – పర్షియా వ్యాపారులు పంజాబ్ ద్వారా ఏ దేశాలతో వ్యాపారం చేశారు?
   1) తూర్పు పర్షియా 2) మధ్య ఆసియా
   3) అఫ్గానిస్థాన్ 4) పైవన్నీ
21. గుజరాత్‌లోని సూరత్ భారతదేశాన్ని ఏ ప్రాంతాలతో అనుసంధానం చేసింది?
   1) గల్ఫ్ - ఎర్ర సముద్రం
   2) గల్ఫ్ - మధ్యధరా సముద్రం
   3) కచ్ - ఎర్ర సముద్రం
   4) కచ్ - నల్ల సముద్రం
22. వలస పాలన కాలంలో సూరత్ – హుగ్లీ ఓడరేవులు క్షీణదశకు రాగా ఏ ఓడరేవులు అభివృద్ధి చెందాయి?



   1) బొంబాయి - కలకత్తా
   2) బొంబాయి - మద్రాసు
   3) కలకత్తా - మద్రాసు
   4) కలకత్తా - మచిలీపట్నం
23. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంలో రాజకీయ అధికారం స్థాపించాక వ్యాపారంలో గుత్తాధిపత్యం సాధించడానికి చేసిన కార్యక్రమాలు?
   ఎ) వస్త్ర వ్యాపారంతో సంబంధం ఉన్న ప్రస్తుత వ్యాపారులను, దళారులను తొలగించడం.
   బి) నేత కార్మికుడిపై మరింత ప్రత్యక్ష నియంత్రణ ఏర్పాటు.
   సి) నేత కార్మికులు ఇతర కొనుగోలుదారులతో లావాదేవీలు జరపకుండా చూడటం.
   డి) నేత కార్మికులకు ముందస్తు చెల్లింపులు చేయడం.
   1) ఎ, బి, సి 2) బి, సి, డి
   3) ఎ, బి, సి, డి 4) ఎ, సి, డి
24. "భారతీయ వస్త్రాల డిమాండ్ ఎప్పటికీ తగ్గించలేం. మరే దేశం కూడా ఇంత నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేయలేదు" అని చెప్పే సాహసం చేసిన ఆంగ్ల అధికారి?
   1) హెన్రీ పటుల్లో - 1772
   2) వారన్ హేస్టింగ్స్ - 1772
   3) జేమ్స్ మిల్ - 1773
   4) హెన్రీ పటుల్లో - 1774
25. "ఇంతకుపూర్వం 20 ఏళ్ల కిందట జహనాబాద్, బిహార్‌లలో చురుకుగా సాగే వస్త్రాల తయారీ ఇప్పుడు స్తంభించిపోయింది" అని రాసినవారు?
   1) బొంబాయి కమిషనర్ 2) పట్నా కమిషనర్
   3) కలకత్తా కమిషనర్ 4) మద్రాస్ కమిషనర్
26. కింది వాటిని సూచించండి.
   ఎ) ఇంగ్లండ్‌లో వస్త్రపరిశ్రమ అభివృద్ధి చెందడంతో భారతదేశానికి వస్త్రాల దిగుమతి పెరిగింది.
   బి) బ్రిటన్ దిగుమతులపై సుంకాలు విధించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.
   సి) భారత మార్కెట్‌లో బ్రిటిష్ నూలు వస్తువులు విక్రయించడానికి ఇంగ్లండ్ పారిశ్రామికవేత్తలు తూర్పు ఇండియా కంపెనీని ఒప్పించారు.
   డి) 1850లో ఇంగ్లండ్ నుంచి నూలు వస్త్రాల దిగుమతి 31% నుంచి 1870 నాటికి 50% పైగా ఉంది.
   1) ఎ, బి, సి
   2) ఎ, బి, డి
   3) సి, డి
   4) ఎ, బి, సి, డి



రచయిత: గద్దె నరసింహారావు

సమాధానాలు

1-1; 2-2; 3-3; 4-3; 5-2; 6-2; 7-3; 8-4; 9-1; 10-2; 11-3; 12-4; 13-1; 14-2; 15-1; 16-4; 17-1; 18-1; 19-2; 20-4; 21-1; 22-1; 23-3; 24-4; 25-2; 26-4.

అన్నదాతల జీవితాలతో.. రుతుపవనాలు ఆడే జూదం!

భారత ఆర్థిక సమస్యలు - వ్యవసాయ రంగ ప్రాధాన్యం, సంక్షోభం

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయ రంగం పాత్ర కీలకమైంది. దేశంలో నేటికీ అత్యధిక జనాభా వ్యవసాయం, దాని అనుబంధ రంగాల ద్వారానే ఉపాధి పొందుతున్నారు. గ్రామీణాభివృద్ధికి, ఆహార భద్రతను సాధించడానికి ఇది ఎంతగానో తోడ్పడుతుంది. భారత్‌లో వ్యవసాయం వర్షాధారం. పంటలు ప్రధానంగా రుతుపవన వ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. సకాలంలో వర్షాలు కురవకపోయినా, రుతుపవనాలు ఆలస్యమైనా ఆ ప్రభావం సాగుపై ఉంటుంది. అందుకే దేశంలో వ్యవసాయాన్ని రుతుపవనాలు ఆడే జూదంగా అభివర్ణిస్తారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టి, వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోంది. వాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన అవసరం.



వ్యవసాయ రంగ ప్రాధాన్యం

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

వ్యవసాయ రంగాన్ని ప్రాథమిక రంగం అని కూడా అంటారు. పంట సాగు, పశుసంపద, అటవీ సంపద, చేపల ఉత్పత్తి, గనులు, క్వారీయింగ్ మొదలైనవి దీని ఉపరంగాలు.

- భారత ఆర్థిక సర్వే 2024-25 ప్రకారం దేశంలో నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో 46.1% మంది వ్యవసాయం ద్వారా ఉపాధి పొందుతున్నారు.
- జాతీయాదాయం, ఉపాధి కల్పనలో ఈ రంగం కీలకపాత్ర పోషిస్తోంది. 2024లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో వ్యవసాయ రంగం వాటా 16శాతంగా ఉంది (ప్రస్తుత ధరల్లో).
- 2017-2023 వరకు ఏటా సగటున 5% వృద్ధితో ఈ రంగం స్థితిస్థాపకతను ప్రదర్శించింది.
- 2024-25లో రెండో త్రైమాసికంలో వ్యవసాయరంగం 3.5% వృద్ధిరేటు నమోదు చేసింది. స్థూల అదనపు విలువ (జీవీఏ)లో వ్యవసాయ రంగం వాటా 2015లో 24.38% నుంచి 2023 నాటికి 30.23శాతానికి మెరుగుపడింది.
- 2024లో ఖరీఫ్ సమయంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి 1647.05 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకుంటుందని ఆర్థిక సర్వే అంచనా వేసింది. 2023తో పోలిస్తే ఇది 89.37 లక్షల మెట్రిక్ టన్నుల పెరుగుదలను సూచిస్తుంది.
- 2020-21లో మొత్తం ఆహార ధాన్యాల ఉత్పత్తి 310.7 మిలియన్ టన్నులు ఉండగా 2024-25 నాటికి అది 353.96 మిలియన్ టన్నులకు పెరిగింది.
- వ్యవసాయ ఉత్పాదకత, రైతుల ఆదాయాలు పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాల ఫలితంగానే దిగుబడిలో పెరుగదల నమోదైనట్లు ఆర్థిక సర్వే పేర్కొంది.

కనీస మద్దతు ధర

2018-19 కేంద్ర బడ్జెట్‌లో పంటలకు సగటు ఉత్పత్తి వ్యయం కంటే కనీసం 1.5 రెట్లు కనీస మద్దతు ధరను కల్పించే సూత్రాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా పోషక తృణ - పప్పు ధాన్యాలు, నూనె గింజలకు కనీస మద్దతు ధరను పెంచారు.

❑ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో 2025, అక్టోబరు 1న దిల్లీలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం రబీ సీజన్‌లో ప్రధానంగా పండించే ఆరు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంచింది. దీనివల్ల రూ.84,263 కోట్ల మేర రైతులకు ప్రయోజనం కలగనుంది. శనగ పంటకు మద్దతు ధరను క్వింటాకు రూ.225 పెంచింది. గోధుమ (రూ.160), బార్లీ (రూ.170), మసూర్ పప్పు (రూ.300), ఆవాలు (రూ.250), కుసుమ (రూ.600) కనీస మద్దతు ధరలూ పెరిగాయి.

మత్స్య పరిశ్రమ

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. వాటిలో ముఖ్యమైంది పీఎం - మత్స్యసంపద యోజన (పీఎంఎంఎస్‌వై). దీన్ని ప్రధాని నరేంద్ర మోదీ 2020, సెప్టెంబరు 10న ప్రారంభించారు. ఆక్వాకల్చర్ ఉత్పాదకతను పెంచడం, మత్స్య నిర్వహణను మెరుగుపరచడం; మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి ద్వారా సముద్ర - లోతట్టు మత్స్య పరిశ్రమల్లో వనరుల అభివృద్ధికి ఆర్థిక సహాయం అందించడం లాంటివి పీఎంఎంఎస్‌వై లక్ష్యాలు. మొత్తం చేపల ఉత్పత్తి (లోతట్టు, సముద్ర) 2023లో 184.02 లక్షల టన్నులుగా ఉంది. 2014లో ఇది 95.79 లక్షల టన్నులు. భారతదేశ మత్స్య ఎగుమతులు 2014-15లో 10,51,243 మెట్రిక్ టన్నులు. వీటి విలువ రూ.33,441.61 కోట్లు. 2023-24లో సముద్ర ఆహార ఎగుమతులు 17,81,602 మెట్రిక్ టన్నులు, విలువ రూ.60,523.89 కోట్లు.

పశువులు (Live Stock)

▼ మొత్తం స్థూల అదనపు విలువలో (జీవీఏ) పశువుల రంగం 5.5% వాటాతో ఉంది. ఈ రంగాల సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (Compound Annual Growth Rate - CAGR) 12.99%. ఇది 2023లో రూ.17.25 లక్షల కోట్లకు చేరింది. పాల పరిశ్రమ నుంచి ఏటా సుమారు రూ.11.16 లక్షల కోట్ల ఆదాయం లభిస్తోంది. 2014, డిసెంబరులో ప్రారంభమైన రాష్ట్రీయ గోకుల్ మిషన్ ద్వారా పశువుల ఆరోగ్యం, శ్రేయస్సును పెంపొందించే చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రైతుల ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తారు.

నీటిపారుదల అభివృద్ధి

దేశవ్యాప్తంగా వ్యవసాయానికి సాగునీరు అందించేందుకు ప్రభుత్వం నీటిపారుదల అభివృద్ధి, నీటి సంరక్షణ పద్ధతులకు ప్రాధాన్యం కల్పించిందని 2024-25 ఆర్థిక సర్వే పేర్కొంది.

❖ వ్యవసాయంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రభుత్వం 2015, జులై 1న ప్రధాన మంత్రి కృషి సించాయి యోజన (పీఎంకేఎస్‌వై) పథకాన్ని ప్రారంభించింది. దేశంలోని అన్ని వ్యవసాయ పొలాలకు నీటిపారుదల మార్గాలు అందుబాటులోకి తేవడం ఈ పథకం లక్ష్యం. 2021-26 కాలానికి ఈ పథకానికి రూ.93వేల కోట్లు కేటాయించారు.

❖ పీఎంకేఎస్‌వైలో ఒక భాగంగా 'పర్ డ్రాప్ - మోర్ క్రాప్ (పీడీఎంసీ)' చొరవను అమలు చేశారు. దీని కింద సూక్ష్మ నీటిపారుదల వ్యవస్థాపన కోసం చిన్న, సన్నకారు రైతులకు మొత్తం ప్రాజెక్టు వ్యయంలో 55%, ఇతర రైతులకు 45% ఆర్థిక సహాయం అందిస్తారు. 2016 నుంచి 2025 వరకు పీడీఎంసీ అమలుకు రాష్ట్రాలకు రూ.21968.75 కోట్లు విడుదల చేశారు. 95.58 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో డిప్ ఇరిగేషన్ సౌకర్యం కల్పించారు.

కార్యక్రమాలు

పీఎం కిసాన్ పథకం: దీన్ని 2019, ఫిబ్రవరి 24న ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో ప్రారంభించారు. దీని ద్వారా రైతులకు పెట్టుబడి మద్దతు కోసం సంవత్సరానికి రూ.6000 నగదును 3 సమాన వాయిదాల్లో అందిస్తారు. ఈ పథకం ప్రారంభించినప్పటి నుంచి 2025, ఆగస్టు నాటికి ప్రభుత్వం రూ.3.90 లక్షల కోట్లకు పైగా రైతులకు పంపిణీ చేసింది.

పీఎం- కిసాన్ మంధన్ యోజన: 2019, సెప్టెంబరు 12న ప్రారంభమైంది. 18- 40 ఏళ్ల వయసున్న చిన్న, సన్నకారు రైతులకు 60 ఏళ్లు నిండాక నెలకు కనీసం రూ.3000 పింఛన్ అందించేందుకు ఉద్దేశించింది. 2019, ఆగస్టు 1 నాటికి రెండు హెక్టార్ల వరకు సాగు భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులు దీనికి అర్హులు. 2025 జులై నాటికి ఈ పథకం కింద 24.88 లక్షల మంది రైతులు నమోదు చేసుకున్నారు.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day

Hallowed 822

Telugu meaning: పవిత్రమైన, పావనమైన

English meaning: The word 'hallowed' (హాలోడ్) is an adjective that describes something regarded as holy, sacred, or highly respected.

Synonyms: Sacred, Revered

Antonyms: Unholy, Cursed

Usage: 1. The soldiers stood silently on the hallowed ground where their comrades had fallen.

2. The ancient temple is considered a hallowed place by the local community.

Current Affairs



The government of India has officially constituted the 8th Central Pay Commission (8th CPC) by appointing its chairperson and other officials. The three-member 8th Pay Commission was chaired by Justice Ranjana Prakash Desai, with Prof. Pulak Ghosh as a Part-Time Member and Pankaj Jain as Member-Secretary.

The QS World University Rankings: Asia 2026 was released on 4 November 2025. Five Indian Institutes of Technology (IITs), Indian Institute of Science (IISc), Bengaluru and Delhi University, have figured in Asia's top 100 institutions.

☛ IIT-Delhi, IIT-Madras, IIT-Bombay, IIT-Kanpur and IIT-Kharagpur figured in the list of top 100 Asian institutes.

The 17th meeting of the Joint Working Group (JWG) on defence cooperation between India and Israel was held in Tel Aviv on 4 November 2025.

☛ The meeting was co-chaired by Defence Secretary Rajesh Kumar Singh and Director General of the Israeli Ministry of Defence Major General Amir Baram. During the meeting, a Memorandum of Understanding (MoU) was signed to expand the scope of bilateral defence ties between the two nations.

The Abu Dhabi International Petroleum Exhibition and Conference (ADIPEC) 2025 opened on 3 November 2025 at the Abu Dhabi National Exhibition Centre (ADNEC), drawing over 205,000 participants from 172 countries. Organized by ADNOC, the four-day event running until November 6 is the world's largest energy gathering, focusing on strategies for resilience, intelligence, and decarbonization across the value chain.

For more Current Affairs: Scan QR code

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

గిరిజనులు

అనాది కాలం నుంచి అడవులు, కొండ ప్రాంతాల్లోనే నివాసం. వేట లేదా వ్యవసాయం ప్రధాన జీవన విధానం. నాగరిక సమాజానికి పూర్తిగా దూరం. సొంత సంప్రదాయాలు, మత విశ్వాసాలు, బలమైన బంధుత్వాలతో సాగుతున్న సనాతన సహజీవనం. ప్రకృతి అంటే అపారమైన ప్రేమ. జంతువులపై అంతులేని ఆరాధన. అదే అమాయకులైన అడవి బిడ్డల చారిత్రక బతుకు చిత్రం. వారి సంస్కృతి సామాజికం, సహజసిద్ధం, స్థానికం, పరిణామ క్రమాల ఫలితం. అందుకే ఆ ఆదివాసీలు అసలైన భారతీయులు.

భౌగోళిక విస్తరణ

బి.ఎస్.గుహ అనే మానవ శాస్త్రవేత్త తెగలను మూడు మండలాలుగా విభజించారు. అవి: ఉత్తర-ఈశాన్య మండలం, కేంద్ర/ మధ్యమండలం, దక్షిణ మండలం.



హైడెన్ వివరణ

భారతదేశ ప్రజలను హైడెన్ మూడు రకాలుగా విభజించారు.

1) హిమాలయ ప్రాంతం
2) ఉత్తర మైదాన ప్రాంతం (ప్రస్తుత పాకిస్థాన్)
3) దక్కన్ ప్రాంతం

భారత్‌లో గిరిజనుల జనాభా లెక్కలు, ఆదిమ గిరిజన తెగలు – లక్షణాలు, జాతిపరమైన వర్గీకరణ, భాషా ప్రాతిపదిక, 2011 జనాభా లెక్కలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

సీవీ రామన్ — శాస్త్రవేత్తలు విశేషాలు

భారతదేశ ప్రముఖ భౌతికశాస్త్ర పరిశోధకుల్లో సీవీ రామన్ ఒకరు. ఈయన కాంతి వికిరణం (Scattering of Light)పై ప్రయోగాలు చేసి, 'రామన్ ఎఫెక్ట్'ను కనుక్కున్నారు. దీనికి ఆయనకు భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి లభించింది. ఈయన భౌతిక విజ్ఞానశాస్త్రంలో కాంతి, ధ్వని విభాగాల్లో అనేక విజయవంతమైన ఆవిష్కరణలు చేశారు. రేపు (నవంబరు 7) సీవీ రామన్ జయంతి సందర్భంగా పోటీ పరీక్షల నేపథ్యంలో ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

☛ ఈయన 1888 నవంబరు 7న నాటి మద్రాసు రాష్ట్రం తిరుచిరాపల్లిలో జన్మించారు. పూర్తి పేరు చంద్రశేఖర వెంకట రామన్.

☛ తండ్రి చంద్రశేఖర్ రామనాథన్ అయ్యర్ గణిత, భౌతికశాస్త్రాలు బోధించే ఉపాధ్యాయులు. 1892లో ఆయనకు విశాఖపట్నంలోని ఏవీ నరసింహారావు కాలేజ్‌లో అధ్యాపకుడిగా ఉద్యోగం రావడంతో కుటుంబంతో కలిసి అక్కడికి వెళ్లారు.

☛ రామన్ వైజాగ్‌లోని సెయింట్ అలోసియన్ ఆంగ్లో-ఇండియన్ హైస్కూల్‌లో విద్యను అభ్యసించారు. చదువులో చాలా చురుగ్గా ఉండే ఆయన 11 ఏళ్లకు మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు.

☛ 1902లో రామన్ మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజీలో చేరారు. 1904లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పూర్తి చేశారు. ఫిజిక్స్‌లో మొదటిస్థానంలో నిలిచి బంగారు పతకం నెగ్గారు. 1907లో భౌతికశాస్త్రంలో మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీ పొందారు.

☛ 1907, జూన్‌లో కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో అసిస్టెంట్ అకౌంటెంట్ జనరల్‌గా నియమితులయ్యారు.



పరిశోధనలు

☛ ప్రెసిడెన్సీ కాలేజీలో చదివే సమయంలోనే ఆయన ఆప్టిక్స్, ధ్వనిశాస్త్రంపై పరిశోధనలు చేశారు. 1906లో బ్రిటిష్ జర్నల్ ఫిలసాఫికల్ మ్యాగజీన్‌లో 'Unsymmetrical diffraction bands due to a rectangular aperture' అనే అంశంపై తన మొదటి శాస్త్రీయపత్రం ప్రచురితమైంది.

☛ 1944-68 వరకు వజ్రాల నిర్మాణం, లక్షణాలను అధ్యయనం చేశారు. 1950లలో ఆప్టికల్స్‌పై పరిశోధనలు చేశారు.

రామన్-నాథ్ సిద్ధాంతాన్ని ఎప్పుడు ప్రకటించారు? మన దేశంలో ఏటా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహిస్తారు? తదితర సమాచారం కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Professor Jobs

Employees' State Insurance Corporation (ESIC) Indore is conducting interviews to fill Professor posts in various departments on a contractual basis. The total no. of posts is 18. The application fee is Rs.500. Eligible candidates can appear for the interview on 19 November 2025.

Apprentice Posts

North Eastern Railway Gorakhpur (NER) is inviting applications for the filling of apprentice posts in various units. The total no. of posts is 1104. The application fee is Rs.100. The last date for receipt of online applications is 15th November 2025.

Internship Posts

DRDO - Combat Aircraft System Development and Integration Centre (CASDIC), Bengaluru is inviting applications for internship posts. The total no. of posts is 30. Eligible candidates can apply online before 10 November 2025.

Did You Apply..?

Today (November 6) is the last date for the following Jobs

☛ 225 Staff Assistant posts in Telangana State Cooperative Apex Bank Limited. ***Eligibility:*** Any Graduation.

☛ 99 Electrician Jobs in MOIL Limited. ***Eligibility:*** 10th, ITI, BE/BTech (Electrician).

☛ Telangana State-State Eligibility Test 2025. ***Eligibility:*** Master's Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams — Reasoning

Letter - Number Mixed Series

Directions (Qs. 1 - 26): *In each of the following sequences some letters/ numbers are missing which are given in that order as one of the four alternatives under it. Find the correct alternative in each question.*

1. B ..... 6 ..... FG ..... 5D ..... 8 ..... HI
A) W, 8, 7, I, 6 B) D, 8, 6, C, 7
C) C, 7, 4, E, 9 D) E, 8, 7, D, 9
E) None of the above

2. Z .... 25 YB 23 XC .... W .... 19 .... E 17
A) X, 27, F, W B) A, 27, C, W
C) X, 21, C, W D) A, 21, D, V
E) None of the above

3. F ..... U6 ..... 9 ..... T7 ..... 20 ..... 4D 23
A) 11, G, 16, K, U B) 13, H, 15, L, M
C) 21, R, 18, G, W D) 17, J, 19, R, S
E) None of the above

4. 4A, 12D, 28G, 60J, 124M,?
A) 248 Q B) 252 P C) 256 T
D) 246 S E) None of the above

5. AD 17 39 CF BP 258 108 HJ GN?? LM
A) 203, 181 B) 179, 239
C) 18, 21 D) 9, 29
E) None of the above

6. P3C, R5F, T8I, V12L, (...)
A) X17O B) X17M
C) Y17O D) X16O
E) None of the above

7. K8K, N13E, Q20Z, T31V
A) Z37Z B) Z38Q
C) W44S D) X41X
E) None of the above

8. A 18, X 10, U 6, R 4, ..., L $2^{\frac{1}{2}}$
A) O $3^{\frac{1}{2}}$ B) O 3 C) P $3^{\frac{1}{2}}$
D) P 3 E) None of the above

9. P2X, T3G, V7N, Z46S, ...
A) Q 82 R B) B 2112 V
C) B 92 V D) B 92 R
E) None of the above

10. G 4T, J9R, M20P, P43N, S90L, ...
A) S90L B) V185J
C) M20P D) P43N
E) None of the above

11. B0R, E3U, G9Y, J18D, ...
A) E3P B) H9N C) L30J
D) G3U E) None of the above

12. 1CV, 5FU, 11IT, 19LS, 29OR, ...
A) 15JS B) 41RQ C) 5FU
D) 170R E) None of the above

13. M1, Q2, S8, W33, ...
A) Y140 B) Z156
C) X140 D) Y148
E) None of the above

14. A1, C2, I7, K8, ...
A) Q13 B) P13 C) Q14
D) P14 E) None of the above

15. J3, D5, Y13, U43, R177, ...
A) P856 B) P891 C) P867
D) D897 E) None of the above

16. A729, G343, ..., S27, Y1
A) L64 B) N75
C) Q100 D) M125
E) None of the above

17. 1X, 16D, 81I, 256M, ...
A) 625 P B) 625 Q
C) 125 P D) 125 Q
E) None of the above

18. 16Q1, 24V8, 18Z27, 22C64, ...
A) 20 E 125 B) 25 E 125
C) 30 F 130 D) 30 F 135
E) None of the above

19. X111, ..., M224, V675
A) D11 B) E113
C) F125 D) G130
E) None of the above

20. r125, u64, y27, b8, ...
A) f1 B) e2 C) f3
D) d3 E) None of the above

21. X 1220, B1195, E1145, ... ,L970
A) I1070 B) K1025
C) G100 D) K990
E) None of the above

22. 1A, 8C, 27F, 64J, ...
A) 25N B) 125O
C) 625P D) 5Q
E) None of the above

23. a27, e45, k75, ...
A) m175 B) t225
C) x150 D) s125
E) None of the above

24. M2, P3, U7, X13 , ...
A) C26 B) C27
C) C28 D) C29
E) None of the above

25. 1a, 4b, 9c,16d, 25e, ...
A) 34f B) 35f C) f36
D) 36f E) None of the above

26. 800a, 675e, 500i, ..., 200q
A) 325o B) 375o
C) 375m
D) 325m
E) None of the above

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

ఆ మూడు వ్యవస్థలు కలిసి పని చేయాలి

● సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్



ముంబయి: ప్రజాస్వామ్య అంతర్భాగాలైన ప్రభుత్వం, శాసన నిర్మాణ సభలు, న్యాయవ్యవస్థ ప్రజా సంక్షేమం కోసమే కలిసి పనిచేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ బి.ఆర్.గవాయ్ పేర్కొన్నారు. బుధవారం ముంబయిలోని మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(ఎంఎన్ఎల్‌యూ) క్యాంపస్ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ మద్దతు లేనిదే న్యాయ విద్య, న్యాయవ్యవస్థకు సమున్నత మౌలిక వసతులు సమకూరవని జస్టిస్ గవాయ్ అన్నారు. న్యాయ విద్యకు ఆచరణాత్మక శిక్షణ అవసరమని.. అందుకు కావాల్సిన మౌలిక వసతులను అందించడం ముఖ్యమన్నారు. అనంతరం తూర్పు బాంద్రాలో సరికొత్త బాంబే హైకోర్టు భవన సముదాయ నిర్మాణానికి సీజేఐ శంకుస్థాపన చేశారు. ఒకప్పుడు బాంబే హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన తాను ఇప్పుడు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి హోదాలో దేశంలోనే అత్యుత్తమ కోర్టు కాంప్లెక్స్‌కు శంకుస్థాపనతో పదవీ జీవితం ముగించబోవడం ఆనందంగా ఉందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు.

అది కల్పిత వీడియో

● కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్

పట్నా: బిహార్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారనే ఆరోపణలతో తనపై ఎఫ్ఐఆర్ నమోదుకు దారితీసిన వీడియో కల్పితమని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్(లలన్) పేర్కొన్నారు. మోకామాలో చేసిన ప్రసంగానికిగానూ మంగళవారం బీఎన్ఎస్ఎస్, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద జేడీయూ మాజీ అధ్యక్షుడిపై కేసు నమోదైంది. అయితే.. పూర్తి వీడియో ఫుటేజీని దర్యాప్తు బృందం పరిగణనలోకి తీసుకుని తనను నిర్దోషిగా ప్రకటిస్తుందని కేంద్రమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. 'ఎన్నికల సంఘం చర్యలు గౌరవనీయమైనవే.. కానీ ఆ వీడియో అసలైంది కాదు.. మా ప్రత్యర్థి ఆర్జేడీ నేతలు షేర్ చేసిన కల్పితమైన వీడియో' అని లలన్ ఆరోపించారు.

మోదీ అంటే ట్రంప్‌నకు చాలా గౌరవం

● ఇద్దరూ తరచుగా మాట్లాడుకుంటారు: వైట్‌హౌస్

న్యూయార్క్: భారత్‌తో సంబంధాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చాలా సానుకూలంగా ఉన్నారని వైట్ హౌస్ మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ తెలిపారు. "కొన్ని వారాల క్రితం శ్వేతసౌధంలోని ఓవల్ హౌస్‌లో భారతీయ-అమెరికన్ అధికారులతో కలిసి ట్రంప్ దీపావళి వేడుకలు జరిపినప్పుడు ప్రధాని (మోదీ)తో మాట్లాడారు. ట్రంప్, ఆయన వాణిజ్య బృందం సుంకాల విషయమై భారత్‌తో తీవ్రంగా చర్చలు జరుపుతోంది. ట్రంప్‌నకు ప్రధాని మోదీ అంటే చాలా గౌరవం ఉందని నాకు తెలుసు. వారు తరచుగా మాట్లాడుకుంటారు" అని కరోలిన్ వ్యాఖ్యానించారు.

ఎందుకు మోదీ ఒప్పుకోరు..:కాంగ్రెస్

ప్రధాని మోదీ, ట్రంప్ తరచుగా మాట్లాడుకుంటారని కరోలిన్ లీవిట్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఈ విషయాన్ని మోదీ ఎందుకు అంగీకరించట్లేదని, దేనికి ఆయన భయపడుతున్నారంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రశ్నించారు.

భారత్‌కు సహాయం చేసేందుకు సిద్ధం: చైనా

ఇంటర్నెట్‌డెస్క్: దేశ రాజధాని నగరం దిల్లీ, దాని పొరుగున ఉన్న ప్రాంతాలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) చాలా ప్రాంతాల్లో 400 దాటిపోయిందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) గణాంకాలు వెల్లడించాయి. ఈ సమయంలో భారత్‌కు సాయం చేసేందుకు చైనా ముందుకొచ్చింది. ఈ మేరకు భారత్‌లోని చైనా ఎంబసీ అధికార ప్రతినిధి యూజింగ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. 'చైనా ఒకప్పుడు తీవ్రమైన పొగమంచుతో ఇబ్బంది పడింది. అలాంటి సమస్యను ఎదుర్కొంటున్న వారితో మా ప్రయాణాన్ని పంచుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. భారత్ త్వరలో ఆ పరిస్థితి నుంచి బయటపడుతుందని విశ్వసిస్తున్నాం' అని యూజింగ్ రాసుకొచ్చారు. పొగమంచుతో తీవ్రంగా ఇబ్బందిపడిన చైనా గాలి నాణ్యతను మెరుగుపర్చుకొనే క్రమంలో గణనీయమైన విజయాలు సాధించింది. చైనా గాలి నాణ్యత ప్రమాణాలను (ఏక్యూఐ) నిర్దేశించి నిక్కచ్చిగా పాటించింది. వాటిని ఉల్లంఘిస్తే కఠినమైన జరిమానాలు, శిక్షలు విధించింది. దీనివల్ల నగరాల్లో శుభ్రమైన గాలి వీస్తోంది. భారత్ కూడా వాయు కాలుష్య నియంత్రణకు ఇదేస్థాయిలో కఠిన చర్యలు తీసుకుంటే పరిస్థితి మారుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

స్వదేశీ ఉన్నితో స్వయంసమృద్ధి

ఈటీవీ భారత్: హిమాచల్ ప్రదేశ్‌లోని కుల్లూ జిల్లా నగ్గర్ పట్టణ మహిళలు స్వదేశీ ఉన్నికి సహజసిద్ధమైన ప్రకృతి రంగులద్ది చేతివృత్తుల వారసత్వానికి కొత్తరూపు ఇస్తున్నారు.



చేతివృత్తుల మహిళలతో మమేకమై వారి శ్రమకు ప్రపంచ స్థాయి గుర్తింపు తీసుకురావడం వెనుక 'కుల్వీ విమ్స్ ఫౌండేషను' కృషి ఎంతో ఉంది. గొర్రెల పెంపకందారులు సరఫరా చేసే ఉన్నికి గిట్టుబాటు ధరలు అందించటం, స్థానిక మహిళల ప్రతిభకు తగ్గట్టు సుస్థిర జీవనోపాధిని చూపటం లక్ష్యాలుగా భృగు ఆచార్య అనే వ్యక్తి పన్నెండేళ్ల క్రితం ఈ సంస్థను ప్రారంభించారు. నేడు 14 గ్రామాలకు చెందిన 400 మంది మహిళలు ఈ ఫౌండేషనుతో కలిసి పనిచేస్తున్నారు. తమ తమ ఇళ్లలోనే ఉన్ని వడకటం, నేయటం, రంగులు వేయటం వంటి పనులన్నీ వీరు చేస్తున్నారు. ఈ మహిళలు రూపొందిస్తున్న ఆకర్షణీయమైన కోట్లు, శాలువలు, స్వెటర్లు, చేతి తొడుగులు, సాక్సులు, టోపీల వంటి ఉత్పత్తులకు మన దేశంలోనే కాకుండా 20కు పైగా దేశాల్లో మంచి డిమాండు ఉంది.

ఓట్లకు వలస.. ఎటువైపో వారి వరస!

● బిహార్‌కు రైళ్లలో చేరుకున్న లక్షల ఓటర్లు




సొంత రాష్ట్ర పోలింగులో పాల్గొనేందుకు బిహార్ వలస ఓటర్లు పెద్దఎత్తున వెల్లువెత్తుతున్నారు. వీరు అధికార ఎన్డీయేకు జై కొడతారా, విపక్ష మహాగఠ్‌బంధన్‌కు అవకాశమిస్తారా అన్నది ఆసక్తిగా మారింది. గత కొద్దిరోజులుగా దిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి ప్రత్యేక రైళ్లు బిహార్ రద్దీతో బిహార్‌కు చేరుకుంటున్నాయి. సాధారణంగా దీపావళి, ఛఠ్ పూజ సమయంలో ఇలాంటి రైళ్లు నడుపుతుంటారు. ఈసారి బిహార్ ఎన్నికల్లో ఓటేసేందుకు వెళ్లేవారి కోసం నడుపుతున్నారు. 'ఎన్నికలకు ముందు మహిళలకు రూ.10,000 ఇవ్వడం ద్వారా ప్రభుత్వం వారిని ప్రభావితం చేయడానికి ప్రయత్నించింది. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు లేకపోవడమే బిహార్‌లో ప్రధాన సమస్య. మా రాష్ట్రం పరిశ్రమలతో సందడిగా ఉండాలని, విద్య, వైద్య రంగాలు మెరుగుపడాలని కోరుకుంటున్నాం. నెలకు రూ.15,000–రూ.20,000 సంపాదించడానికి మేమంతా వలస వెళ్లాల్సి వస్తున్న పరిస్థితి మారాలని' జైపుర్ నుంచి పట్నాకు చేరుకున్న రామ్ ప్రసాద్ పాస్వాన్ అనే వలస కూలీ 'ఈటీవీ భారత్'కు తెలిపారు. సెలవు దొరకడం కష్టమైనా తంటాలుపడి బిహార్‌కు వచ్చానని, నీతీశే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని హరియాణాకు వలస వెళ్లిన మధుబని జిల్లా వాసి మహ్మద్ ఖుర్షీద్ చెప్పారు.

మ్యానిఫెస్టోల్లోనూ ప్రస్తావన

బిహార్ ఎన్నికల్లో వలస ఓటర్లు భారీసంఖ్యలో పాల్గొన్నప్పుడల్లా ఎన్డీయే లాభపడిందని ఎన్నికల గణాంకాలు చెబుతున్నాయి. ఈసారి ఎన్నికల సమయంలోనూ వీరిని ఆకర్షించడానికి పార్టీలు ప్రయత్నించాయి. వలస వెళ్లే బిహారీలకు రాష్ట్రంలోనే ఉపాధి కల్పిస్తామని, యువతకు ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని మహాగఠ్‌బంధన్ హామీ ఇచ్చింది. పారిశ్రామికీకరణ, పెట్టుబడులు వంటి అంశాలను ఎన్డీయే ప్రస్తావించింది. 2024 బిహార్ ఆర్థిక సర్వే ప్రకారం.. మూడు కోట్లకు పైగా బిహారీలు దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. వీరిలో దాదాపు 50 లక్షల మంది రాష్ట్రంలో సమీపిస్తే ఓటు హక్కు కలిగి ఉన్నారు. భాజపా నాయకులు ఈ ఏడాది జులై నుంచి దిల్లీ, గుజరాత్, మహారాష్ట్రల్లోని బిహార్ వలసదారులతో అనేక సమావేశాలు నిర్వహించారు. వీడియో కాల్స్, సమావేశాల ద్వారా వలస ఓటర్లకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించారు. అనేక వాట్సప్ గ్రూపుల ద్వారా దాదాపు 2 కోట్ల మంది బిహారీలను చేరుకున్నారు.

రాహుల్ గాంధీ దేశంలో అరాచకం సృష్టిస్తున్నారు

● సైన్యంలో రిజర్వేషన్ల డిమాండ్‌పై రాజ్‌నాథ్ సింగ్



జమూయి/బంకా: రక్షణ దళాల్లో రిజర్వేషన్లను డిమాండ్ చేయడం ద్వారా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ దేశంలో అరాచకం సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శించారు. "రాహుల్‌కు ఏమైందో ఆయన సైన్యంలో రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తుతున్నారు. దీని ద్వారా దేశంలో అరాచకం సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు. మన దళాలు వీటన్నింటికీ అతీతంగా ఉంటాయి" అని బిహార్‌లోని జమూయి జిల్లాలో ఎన్నికల ప్రచారంలో రాజ్‌నాథ్ పేర్కొన్నారు. దేశాన్ని పరిపాలించడం అంటే పిల్లల ఆట కాదని రాహుల్ గాంధీ తెలుసుకోవాలన్నారు. అంతకుముందు బంకాలో జరిగిన మరో ర్యాలీలో మాట్లాడుతూ.. "ఎన్డీయే కూటమి మూడింట రెండొంతుల మెజారిటీతో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. బిహార్ సీఎం నీతీశ్ కుమార్‌పై ఒక్క అవినీతి కేసు కూడా లేదు. కులం, మతం ఆధారంగా ఎన్డీయే ఎప్పుడూ ప్రజల మధ్య వివక్ష సృష్టించదు. ఆర్జేడీ నాయకులు ప్రజలను బెదిరిస్తారు. బిహార్ అభివృద్ధికి ఎప్పుడూ పనిచేయలేరు. మేం ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం" అని సింగ్ పేర్కొన్నారు.

మమ్దానీ విజయం..
'ధూమ్ మచాలే' పాటతో సంబరాలు



దిల్లీ: అమెరికాలోని న్యూయార్క్ నగరానికి మేయర్‌గా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ ఎన్నికై చరిత్ర సృష్టించారు. దీంతో 2004లో విడుదలైన బాలీవుడ్ చిత్రం 'ధూమ్'లోని 'ధూమ్ మచాలే' పాటతో ఆయన తన విజయాన్ని ఉత్సాహంగా వేడుక చేసుకున్నారు. ఈ పరిణామంపై ప్రముఖ జర్నలిస్టు మెహదీ హసన్ జాత్యహంకారులను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. 'ఓ జాత్యహంకారులారా.. జోహ్రాన్ తన ప్రసంగాన్ని బాలీవుడ్ 'ధూమ్ మచాలే' పాటతో ముగించారు. ఇక ఏడవండి.. ఓడిపోయిన జాత్యహంకారులారా..' అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

వెల్లువెత్తిన ప్రశంసలు

జోహ్రాన్ మమ్దానీ మేయర్‌గా ఎన్నికవడం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలియజేశారు.

మీ విజయం మాకూ గర్వకారణమే

మమ్దానీకి హృదయపూర్వక అభినందనలు. భారతీయ మూలాలున్న వ్యక్తి గెలుపొందడం మాకూ గర్వకారణం. ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే పథకాలు ట్రంప్ నేతృత్వంలోని అమెరికాకు అవసరమని ఈ విజయం స్పష్టం చేస్తోంది. ప్రజల గొంతులను అణచివేస్తున్న శక్తులకు వ్యతిరేకంగా ఉండేందుకు మన ప్రజలకు ఒక వేదిక ఉండాలని భావిస్తున్నాం. –ఎం.ఎ.బేబీ, సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

నిరంకుశ పాలనకు ఇది మందలింపు

ట్రంప్ నుంచి అపారమైన ఒత్తిడిని ఎదుర్కొని దృఢంగా నిలబడినందుకు న్యూయార్క్ ప్రజలకు అభినందనలు. మమ్దానీ చరిత్రాత్మక విజయం బహుళ రంగాల్లో లోతైన ప్రాముఖ్యతను కలిగి ఉంది. తమ చర్యలను సమర్థించుకోవడానికి ఎన్నికల ఆదేశాన్ని తప్పుగా చెప్పుకొనే నిరంకుశ పాలనకు ఇది శక్తిమంతమైన మందలింపు. పాలనలో ప్రజలే ప్రధాన పాత్ర పోషించాలని ఇది పునరుద్ఘాటిస్తుంది. –జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎం) రాజ్యసభ ఎంపీ

ట్రంప్, నెతన్యాహులకు స్పష్టమైన ఓటమి

న్యూయార్ మేయర్‌గా మమ్దానీ విజయం ట్రంప్, నెతన్యాహులకు స్పష్టమైన ఓటమి. ప్రజాస్వామ్యం, ప్రజల హక్కులు, పాలస్తీనా స్వేచ్ఛ, వలసదారులకు భద్రత, గౌరవం, ముస్లింలకు ప్రపంచంలో ఎక్కడైనా సమాన హక్కులకై పోరాడే ప్రతీ ఒక్కరికీ.. ఇది అతిపెద్ద విజయం.

– దీపాంకర్ భట్టాచార్య, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి

విజయం.. ఒక శక్తిమంతమైన సందేశం

ద్వేషం, విభజన, ఆధిపత్య శక్తులపై స్ఫూర్తిదాయకమైన విజయం సాధించినందుకు మమ్దానీకి అభినందనలు. ఆశ, న్యాయం, ఐక్యతకు ఆయన విజయం ఒక శక్తిమంతమైన సందేశం. – కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా

సమష్టి పురోగతికి ఒక స్పష్టమైన పిలుపు

జోహ్రాన్ సాధించిన అద్భుత విజయం కేవలం వ్యక్తిగత మైలురాయి కాదు. సమష్టి పురోగతికి ఒక స్పష్టమైన పిలుపు. విద్వేషాన్ని తిరస్కరించి, మానవత్వాన్ని స్వీకరించినప్పుడు మనం శాశ్వతంగా ఉండే వంతెనలు నిర్మిస్తామని ఇది గుర్తుచేస్తుంది.

– ఫరూక్ అబ్దుల్లా, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు

ప్రగతిశీల దృష్టి, న్యాయం గెలిచాయి

ఈ విజయం చారిత్రాత్మక మైలురాయి మాత్రమే కాదు. ఫాసిజం, డబ్బు బలం, ఇస్లామోఫోబియా వేళ్లూనుకున్న శక్తులకు వ్యతిరేకంగా శక్తిమంతమైన వైఖరిని సూచిస్తుంది. డోనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని విద్వేషపూరిత ప్రచారం మీద జోహ్రాన్ అచంచల ప్రగతిశీల దృష్టి, న్యాయం పట్ల నిబద్ధత గెలిచాయి. – మెహబూబా ముఫ్తీ, పీడీపీ అధ్యక్షురాలు

సినీ ప్రముఖుల అభినందనలు

జోహ్రాన్ విజయం సాధించడం పట్ల ఆయన తల్లి, బాలీవుడ్ ప్రముఖ దర్శకురాలు మీరా నాయర్‌కు సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు. ప్రముఖ నటి షబానా అజ్మీ, దర్శకురాలు జోయా అక్తర్, హన్సల్ మెహతాలు ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. జోహ్రాన్ ప్రచారాన్ని దగ్గర నుంచి పరిశీలించానని, ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆయన నిలబడ్డారని అజ్మీ ప్రశంసించారు. సోనమ్ కపూర్, అలీ ఫజల్, తిలోత్తమ సోమ్ సైతం ఆయనకు అభినందనలు తెలిపారు.

డాక్సీసైక్లిన్‌తో స్కిజోఫ్రీనియా ముప్పు తగ్గుదల!

● తాజా అధ్యయనంలో వెల్లడి



దిల్లీ: యువకుల్లో మానసికరుగ్మత (స్కిజోఫ్రీనియా) వచ్చే ముప్పును తగ్గించడంలో డాక్సీసైక్లిన్ అనే యాంటీబయాటిక్ సహకరిస్తున్నట్లు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లు, శ్వాసకోశ, చర్మ సంబంధ ఇన్‌ఫెక్షన్లకు సంబంధించిన చికిత్సకు ఈ ఔషధాన్ని వినియోగిస్తున్నారు. మెదడులోని కణజాలంలో ఇన్‌ఫ్లమేషన్‌ను ఈ ఔషధం తగ్గిస్తున్నట్లు గత అధ్యయనాల్లో వెల్లడైంది కూడా. పరిశోధనలో భాగంగా బ్రిటన్, ఫిన్లాండ్, ఐర్లాండ్ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు 1987 నుంచి 1997 మధ్య జన్మించిన 56,400 మంది ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. వీరంతా 13 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్యలో మానసిక ఆరోగ్య సేవలు పొందారు. చికిత్సలో భాగంగా యాంటీబయాటిక్స్ తీసుకున్నారు. పరిశోధకులు ఈ సమాచారాన్ని ఫిన్లాండ్ ఆరోగ్య రిజిస్టర్ నుంచి సేకరించారు. ఇతర రకాల యాంటీబయాటిక్స్ తీసుకున్నవారితో పోల్చితే డాక్సీసైక్లిన్ తీసుకున్న వారిలో పదేళ్ల తర్వాత స్కిజోఫ్రీనియా ముప్పు 30 శాతం నుంచి 35 శాతం తగ్గినట్లు గుర్తించారు. ఈ పరిశోధన వివరాలు 'అమెరికన్ జర్నల్ ఆఫ్ సైకియాట్రీ'లో ప్రచురితమయ్యాయి. మరోవైపు, చెన్నైకి చెందిన స్కిజోఫ్రీనియా రీసెర్చ్ ఫౌండేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మంగళ మాట్లాడుతూ.. డాక్సీసైక్లిన్, స్కిజోఫ్రీనియాల మధ్యనున్న సంబంధాలపై ఇటీవల పరిశోధనలు జరుగుతున్నాయని, అయితే ఇంకా ఎటువంటి నిశ్చిత ఆధారాలు లభించలేదని స్పష్టంచేశారు.

కృత్రిమ మేధ సాయంతో సౌకర్యవంతంగా గూగుల్ మ్యాప్స్

న్యూయార్క్: గూగుల్ మ్యాప్స్ యాప్ ఇక మరింత సౌకర్యవంతమైన సేవల్ని అందించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. జెమిని కృత్రిమ మేధ సహాయంతో ఈ సరికొత్త సౌకర్యాలను అందించనున్నారు. వాడకందారులు తామెంచుకున్న మార్గంలో ఉన్న ప్రదేశాల వివరాలను మరింత సులువుగా తెలుసుకునేందుకు కొత్త సదుపాయాలు వీలు కల్పిస్తాయి. మార్గ మధ్యంలో ఈవీ చార్జింగ్ కేంద్రాలు, హోటళ్లు, దర్శనీయ స్థలాలు ఎక్కడ ఉన్నాయి వంటి వివరాలూ గూగుల్ మాప్స్ యాప్ అందించనుంది. కృత్రిమ మేధ గూగుల్ మాప్స్ సేవలకు మరింత కచ్చితత్వాన్ని అందించనుంది. పొరపాటున డ్రైవర్‌లను తప్పుడు మార్గంలో తీసుకెళ్లే అవకాశాలు లేని పటిష్ఠ వ్యవస్థను ఇందులో పొందుపరిచారు. గూగుల్ మ్యాప్స్ డేటాబేస్‌లో నిక్షిప్తమైవున్న 25 కోట్ల ప్రదేశాల సమాచారం ఆధారంగా కృత్రిమ మేధ సాయంతో ఈ యాప్ ఇకపై పనిచేయనుంది.

అక్రమ మార్గాల్లో షేర్లపై లాభాలను ఆర్జించడం నేరమే

● చర్యలు తీసుకొనే అధికారం ఈడీకి ఉంది: దిల్లీ హైకోర్టు

దిల్లీ: అక్రమ మార్గాల్లో షేర్ ధరలను పెంచి ఆర్జించిన లాభాలు కూడా నేరం ద్వారా సంపాదించిన సొమ్ము కిందకే వస్తాయని దిల్లీ హైకోర్టు పేర్కొంది. ఇలాంటి కేసుల్లో చర్యలు తీసుకొనే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కు ఉందని ప్రకాశ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (పీఐఎల్) కేసులో తెలిపింది. ఈ కేసులో బొగ్గు బ్లాకు కేటాయింపును అక్రమ మార్గంలో చేజిక్కించుకోవడమే కాకుండా, ఆ బ్లాకు ఇంకా అధికారికంగా తన చేతికి రాక ముందే వచ్చేసినట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కి పీఐఎల్ తెలిపింది. దీనివల్ల ఆ కంపెనీ షేర్ ధర బాగా పెరిగింది. వాటిని ప్రాధాన్యతా (ప్రిఫరెన్షియల్) పద్ధతిపై ఇతరులకు విక్రయించి పీఐఎల్ బాగా ఆర్జించింది. ఇలా ప్రిఫరెన్షియల్ షేర్లు అమ్మి సొమ్ముచేసుకోవడం నేరమేనంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.122.74 కోట్ల పీఐఎల్ ఆస్తుల జప్తునకు ఉత్తర్వులు జారీచేసింది. ఆ అధికారం ఈడీకి లేదని సింగిల్ జడ్జి తీర్పుఇచ్చారు. దీనిపై హైకోర్టు తీర్పు వెలువరిస్తూ.. నేరం ద్వారా ఆర్జించిన ఆదాయంపై చర్యలు తీసుకొనే అధికారం ఈడీకి ఉందని తెలిపింది.

మహిళల నగదు బదిలీ పథకాలతో రాష్ట్రాలపై ఆర్థిక భారం: పీఆర్ఎస్

దిల్లీ: ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన మహిళల సాధికారతే లక్ష్యంగా పలు రాష్ట్రాలు తీసుకువచ్చిన షరతులు లేని నగదు బదిలీ(యూసీటీ) పథకాలపై పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే సంస్థ ఓ నివేదికను విడుదల చేసింది. ఈ పథకాలతో రాష్ట్రాలు ఆర్థికంగా ఒత్తిడికి గురవుతున్నాయని పేర్కొంది. 2022-23లో ఈ యూసీటీలు కేవలం రెండు రాష్ట్రాలకే పరిమితం కాగా, 2025-26 నాటికి దాదాపు 12 రాష్ట్రాలు అమలు చేస్తున్నట్లు వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు రూ.1.68 లక్షల కోట్లు రాష్ట్రాలు ఖర్చు పెట్టనున్నట్లు నివేదిక తెలిపింది. ఇది దేశ జీడీపీలో 0.5శాతం. ఇప్పటికే 12 రాష్ట్రాల్లో ఆరు.. రెవెన్యూ లోటును అంచనా వేసినట్లు నివేదిక పేర్కొంది. నగదు బదిలీలపై ఖర్చును మినహాయిస్తూ రెవెన్యూ బడ్జెట్‌ను సర్దుబాటు చేసినప్పుడు అనేక రాష్ట్రాలు మెరుగైన ఆర్థిక వ్యవస్థను సూచించాయంది. ఉదాహరణకు కర్ణాటకలో స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జీఎస్‌డీపీ) ఆదాయం 0.3శాతం మిగులును కలిగి ఉందని, నగదు బదిలీ పథకం అమలుతో లోటులోకి వెళ్లిందని తెలిపింది. హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, అస్సాం, పశ్చిమబెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాలు ఈ పథకం అమలు చేస్తున్నాయి.

అనుమానంతో భార్య ముక్కుకోశాడు

ఝబువా: భార్యపై అనుమానం పెంచుకున్న ఓ భర్త బ్లేడ్‌తో ఆమె ముక్కును కోసేశాడు. ఈ ఘటన మధ్యప్రదేశ్‌లోని ఝబువా జిల్లాలో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు సర్జరీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ దంపతులు ఐదు నెలలుగా గుజరాత్‌లోని ఓ ఫ్యాక్టరీలో పని చేసేవారు. ఇటీవలే తమ ఆరేళ్ల కుమారుడితో మధ్యప్రదేశ్‌లోని స్వగ్రామానికి వచ్చారు. అయితే గుజరాత్ ఫ్యాక్టరీలో పని చేసే మరో వ్యక్తితో తన భార్య వివాహేతర సంబంధం కలిగి ఉందని నిందితుడు అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఆమె ముక్కుపై బ్లేడ్‌తో దాడి చేశాడని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.



దేవ్ దీపావళి వేళ
దేదీప్యమానంగా వారాణాసి

కార్తిక పౌర్ణమి సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని పవిత్ర వారణాసి నగరంలో దేవ్ దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. ప్రధాని మోదీ సొంత నియోజకవర్గమైన వారణాసి దీపాల వెలుగులతో దేదీప్యమానమైంది. గంగానదీ ఘాట్‌లలో ప్రజలు లక్షలాది దీపాలను వెలిగించారు. వేడుకకు సంబంధించిన ఫొటోలను ప్రధాని మోదీ 'ఎక్స్'లో పంచుకున్నారు.

పెన్షనర్ల కోసం నెలపాటు డీఎల్సీ కార్యక్రమం

దిల్లీ: పెన్షనర్ల కోసం డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల (డీఎల్సీ) సమర్పణను ప్రోత్సహించే దేశవ్యాప్త కార్యక్రమాన్ని కేంద్ర సిబ్బంది శాఖ సహాయమంత్రి జితేంద్ర సింగ్ బుధవారం ప్రారంభించారు. పెద్దలు, వయోవృద్ధుల పట్ల గౌరవభావంతోనే ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని చెప్పారు. కార్యక్రమం ఈ నెల 30 వరకూ కొనసాగుతుందని, గడచిన నాలుగు రోజుల్లో పెన్షనర్లు 21 లక్షల డీఎల్సీలు సమర్పించారని ఒక అధికారి వెల్లడించారు. పెన్షన్ ప్రక్రియలో పారదర్శకత పెంపొందించి పెన్షనర్ల ప్రయోజనం కలిగించే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 నవంబరులో ఆధార్ ప్రాతిపదికన ఆన్‌లైన్ ద్వారా డీఎల్సీ సమర్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పెద్దల పట్ల గౌరవభావమే ఈ సంస్కరణకు మూలమని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. బతికే ఉన్నట్లు భౌతికంగా నిరూపించుకోండని పెన్షనర్లను కోరడం అమానుషంగా భావించిన ప్రధాని ఈ సంస్కరణ తెచ్చారని తెలిపారు. ముఖ గుర్తింపు పద్ధతిలో గత సంవత్సరం 52.73 లక్షల మంది లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించారని చెప్పారు. పెన్షనర్లు నిరంతరాయంగా పెన్షన్ పొందాలంటే ఏటా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. వ్యక్తిగతంగా బ్యాంకుకు వెళ్లి ఇవ్వాల్సి రావడం అనేక ఇబ్బందులకు గురిచేసేది. దీనిస్థానంలో డీఎల్సీ పద్ధతిని ప్రవేశపెట్టడం పెన్షనర్లకు సౌకర్యవంతంగా మారింది.



కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని గంగా నదిలో పవిత్ర స్నానం చేసేందుకు బుధవారం హరిద్వార్‌కు పోటెత్తిన భక్తులు

దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో రేపు
భాజపా 'వందేమాతరం' ఆలాపన

దిల్లీ: జాతీయ గీతానికి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా 150 ప్రాంతాల్లో శుక్రవారం భాజపా 'వందేమాతరం' గీతాన్ని సామూహికంగా ఆలపించనుంది. దిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరగనున్న కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ మైలురాయిని పార్టీ వేడుకలాగా జరపాలని భావిస్తున్నట్లు భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ మీడియా సమావేశంలో వెల్లడించారు. ''నవంబరు 7 నుంచి 26(రాజ్యాంగ దినోత్సవం) వరకు దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నాం. శుక్రవారం 150 ప్రాంతాల్లో జాతీయ గీతాన్ని సామూహికంగా ఆలపిస్తారు. ఆ తర్వాత స్వదేశీ వస్తువులను మాత్రమే ఉపయోగిస్తామని ప్రతిజ్ఞ చేస్తాం" అని ఛుగ్ తెలిపారు.

సాయుధపోరు వీడి లొంగిపోండి

● నక్సలైట్లకు ఉపరాష్ట్రపతి పిలుపు

నవరాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, భద్రతాదళాలు సమష్టిగా చేపట్టిన చర్యల కారణంగా నక్సలిజం అంతరించిపోయే దశకు చేరిందని, ఈ పరిస్థితుల్లో నక్సలైట్లందరూ ఆయుధాలు త్యజించి లొంగి పోవాలని ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్ బుధవారం పిలుపునిచ్చారు. నవరాయ్‌పుర్‌లో జరిగిన ఛత్తీస్‌గఢ్ రజత్ మహోత్సవ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అతితక్కువ కాలం క్రితం ఆవిర్భవించి రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్ అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్ర స్థాయికి చేరిందని ఉపరాష్ట్రపతి కొనియాడారు. "చిరకాలంగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర అభివృద్ధికి అవరోధంగా నిలిచిన నగక్సలిజానికి మనం చరమగీతం పాడటం రాష్ట్రానికి గర్వకారణమైంది. శాంతి అనివార్యమైనది. శాంతి లేకుండా ఎలాంటి అభివృద్ధీ సాధించలేం" అని రాధాకృష్ణన్ అన్నారు. ఆయుధాలు త్యజించి రాష్ట్ర యంత్రాంగానికి లొంగి పోవాల్సిందిగా నక్సలైట్లను అభ్యర్థిస్తున్నాను, అని ఆయన అన్నారు. ఒకప్పుడు తీవ్రవాద హింసకు ప్రసిద్ధమైన ప్రదేశాల్లో సుస్థిరత నెలకొల్పామని, కేంద్ర, రాష్ట్ర బలగాల అవిశ్రాంత కృషి ఫలితంగా ఇది సాధ్యమైందని ఉపరాష్ట్రపతి అన్నారు.

ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య ఎదురు కాల్పులు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్వాడ్ జిల్లా ఛత్రు ప్రాంతంలో బుధవారం తెల్లవారుజామున ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు జరిగాయని అధికారులు తెలిపారు. ముగ్గురు ఉగ్రవాదులు కొన్ని నెలలుగా ఆ ప్రాంతంలో నక్కి ఉన్నట్లుగా నిఘా వర్గాలు సమాచారం అందించాయి. దీంతో భారత సైన్యంలోని వైట్ నైట్ కార్ప్స్, కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించాయి. ఈ క్రమంలోనే ఉగ్రవాదులను గుర్తించిన భద్రతా దళాలు వారిని చుట్టుముట్టాయి. దీంతో ఇరువర్గాల మధ్య భారీగా ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి.

మరో మృతదేహాన్ని హమాస్ అప్పగించింది: ఇజ్రాయెల్

డెయిర్ అల్–బలా: హమాస్ మరో బందీ మృతదేహాన్ని అప్పగించిందని ఇజ్రాయెల్ పేర్కొంది. డీఎన్ఏ పరీక్షలో ఆ భౌతికకాయం.. 19 ఏళ్ల సైనికుడు ఇటే చెన్‌దిగా నిర్ధారణైందని తెలిపింది. గాజా కాల్పుల విరమణ ఒప్పందం తొలి దశలో భాగంగా హమాస్ ఇంకా ఏడుగురు బందీల మృతదేహాలను అప్పగించాల్సి ఉంది. మరోవైపు ఇజ్రాయెల్ బుధవారం 15 పాలస్తీనీయన్ల భౌతికకాయాలను గాజాకు పంపింది.

హైదరాబాద్-విజయవాడ హైవే విస్తరణకు డీపీఆర్ సిద్ధం!

- త్వరలో పీఏటీఎస్‌సీ ముందుకు..
- 209 కి.మీ. బ్రౌన్‌ఫీల్డ్.. 22 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా..
- రూ.10 వేల కోట్లతో నిర్మాణం



ఈనాడు, హైదరాబాద్: ఆరు వరుసలుగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధమైంది. దీన్ని ఈ నెల రెండో వారంలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ప్రాజెక్టు ఎప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ (పీఏటీఎస్‌సీ) ముందు అధికారులు ప్రవేశపెట్టనున్నారు. డీపీఆర్‌లో మొత్తం నాలుగు ఆప్షన్లను తయారుచేయగా మొదటి ఆప్షన్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. దీని ప్రకారం.. మొత్తం 231.32 కి.మీ. మేర (209.07 కి.మీ. బ్రౌన్‌ఫీల్డ్, 22.25 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్) రోడ్డు విస్తరణ ఉండనుంది. తెలంగాణ పరిధిలో ప్రస్తుతం ఉన్న రహదారినే 4 వరుసల నుంచి 6 వరుసలుగా మారుస్తారు. ఏపీలో అంబారుపేట, ఐతవరం పరిధిలో 7.3 కి.మీ. మేర బైపాస్ రోడ్డు (ఇందులో 6.65 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్) నిర్మిస్తారు. అలాగే కాచవరం, పల్లిపాడు పరిధిలో 16.15 కి.మీ. మేర బైపాస్ రోడ్డు (ఇందులో 15.6 కి.మీ. గ్రీన్‌ఫీల్డ్) నిర్మాణం చేపడతారు.

- ■ మొత్తం నాలుగు ఫ్లైఓవర్లు ఉంటాయి. చిన్నవి, పెద్దవి కలిపి 60 వాహనాల అండర్‌పాస్‌లు, జంతువులు రోడ్డు దాటడానికి మరో 10 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.
- ■ 4 నుంచి 6 వరుసల విస్తరణకు 182.41 హెక్టార్ల భూసేకరణ అవసరమని గుర్తించారు. యాదాద్రి జిల్లా మల్కాపూర్ సమీపం నుంచి ప్రారంభమై చౌటుప్పల్, చిట్యాల, నార్కట్‌పల్లి, నకిరేకల్, సూర్యాపేట, కోదాడ, నవాబుపేట, నందిగామ, కీసర, పరిటాల, ముళ్లపాడు, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి, గొల్లపూడి మీదుగా విజయవాడలోని కనకదుర్గ ఫ్లైఓవర్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. ఇందుకుగాను కేంద్రం సుమారు రూ.10 వేల కోట్లు ఖర్చు చేయనుంది.

అన్నీ అనుకున్నట్లు జరిగితే..

డీపీఆర్ మొదటి ఆప్షన్‌ను పీఏటీఎస్‌సీ ఆమోదిస్తే టెండర్ల ప్రక్రియకు వేగంగా అడుగులు పడనున్నాయి. ఇందులో ఏమైనా సూచనలు చేస్తే.. మరోసారి ఎలైన్‌మెంట్‌లో అవసరమైన మార్పులు చేస్తారు. పీఏటీఎస్‌సీ అలాగే ఆమోదిస్తే వెంటనే నివేదికను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ఎప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ముందుంచుతారు. ఇక్కడ ఆమోదం పొందిన తర్వాత కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ ముందుంచుతారు. అనంతరం ఎన్‌హెచ్‌ఏఐ. . టెండర్ల ప్రక్రియకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తుంది. దీనికి 2-3 నెలలు పట్టే అవకాశముంది. మొత్తంగా 2026-27 ఆర్థిక సంవత్సరంలో హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనులను ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.

25 నుంచి పౌల్ట్రీ ఇండియా-2025 ప్రదర్శన



పౌల్ట్రీ ఇండియా-2025 ప్రదర్శన గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నేతలు చక్రధరరావు, సురేష్‌రాయుడు, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఉదయ్‌సింగ్, అనిల్‌ధుమాల్, భాస్కర్‌రావు, కేజీ ఆనంద్

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ నెల 25 నుంచి 28 వరకు పౌల్ట్రీ ఇండియా-2025 ప్రదర్శన నిర్వహించనున్నారు. భారత పౌల్ట్రీ పరికరాల తయారీ సంఘం ఈ విషయం వెల్లడించింది. దక్షిణాసియాలోనే ఇది అతి పెద్ద ప్రదర్శన అని పేర్కొంది. ఒక దేశం-ఒక గుడ్డు నినాదంతో నిర్వహించే ఈ అంతర్జాతీయ ప్రదర్శనకు 50 దేశాల నుంచి 500 మందికిపైగా ప్రదర్శకులు, 40,000 మందికి పైగా సందర్శకులు, అంతర్జాతీయ నిపుణులు, ఉత్పత్తిదారులు హాజరవుతారని తెలిపింది. బుధవారం హైదరాబాద్‌లో ప్రదర్శన గోడపత్రికను వివిధ సంఘాల నేతలు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ మాట్లాడారు. "వికసిత్ భారత్ దిశగా పౌల్ట్రీ రంగ సుస్థిర భవిష్యత్ కోసం వరుసగా 17వ సంవత్సరంలో అంతర్జాతీయ ప్రదర్శన నిర్వహిస్తున్నాం. 25న హైటెక్స్ నోవోటెల్ హోటల్‌లో నాలెడ్జ్ డేతో ప్రదర్శన ప్రారంభమవుతుంది. పౌల్ట్రీరంగ సమస్యల పరిష్కారం, కృత్రిమ మేధ, ఆటోమేషన్ సాంకేతికత, పౌల్ట్రీ వ్యాధుల నివారణ, ఎరువుల నిర్వహణ, భవిష్యత్ ఉద్యోగావకాశాల వంటి ముఖ్యమైన అంశాలపై చర్చా గోష్ఠులు నిర్వహిస్తాం" అని తెలిపారు. వెంకటేశ్వర హ్యాచరీస్ జీఎం కేజీ ఆనంద్, శ్రీనివాస ఫార్మా ఎండీ చిట్టూరి సురేష్‌రాయుడు, నేషనల్ ఎగ్, చికెన్ ప్రమోషన్ కౌన్సిల్ అధ్యక్షుడు బాలస్వామి, రాష్ట్ర పౌల్ట్రీ సమాఖ్య అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్‌రెడ్డి, భాస్కర్‌రావు, నెక్ హైదరాబాద్ జోన్ ఛైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఇతర నేతలు అనిల్‌ధుమాల్, చక్రధరరావు, నరసింహారెడ్డి, వలసన్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని అభినందించిన గవర్నర్ అబ్దుల్ నజీర్

ఈనాడు, అమరావతి: లండన్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ నుంచి ప్రతిష్ఠాత్మక 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్' అవార్డును అందుకున్న సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేట్ గవర్నెన్స్ విభాగంలో హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు లభించిన 'గోల్డెన్ పీకాక్' అవార్డును ఆ సంస్థ వీసీఎండీ హోదాలో భువనేశ్వరి అందుకున్నందున ఆమెను గవర్నర్ అభినందించారు.

గవర్నర్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

ఈనాడు, అమరావతి: కర్ణాటక రాష్ట్ర న్యాయ విశ్వవిద్యాలయం నుంచి 'డాక్టర్ ఆఫ్ లాజ్' డిగ్రీని అందుకున్న గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. న్యాయవ్యవస్థ, సేవా రంగాల్లో ఆయన అందించిన సేవలకు గాను ఈ గౌరవం లభించిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

గవర్నర్‌కు గౌరవ డాక్టరేట్.. రాష్ట్రానికి గర్వకారణం: జగన్

ఈనాడు, అమరావతి: "న్యాయమూర్తిగా ఎన్నో కీలక తీర్పులు ఇచ్చిన అబ్దుల్ నజీర్, ఇప్పుడు రాష్ట్ర గవర్నర్‌గా కూడా రాజ్యాంగస్ఫూర్తిని కాపాడడంలో ముందున్నారు. చట్టం, న్యాయ పరిరక్షణకు విశేషకృషి చేసిన ఆయనకు కర్ణాటక న్యాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ఇవ్వడం రాష్ట్రానికి గర్వకారణం. ఇది ఆయన అంకితభావానికి లభించిన గుర్తింపు. గవర్నర్‌కు హృదయపూర్వక అభినందనలు" అని మాజీ సీఎం జగన్ బుధవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

యువ వైద్యులకు ఆదర్శం చలమలశెట్టి సురేంద్రనాథ్

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు చలమలశెట్టి సునీల్ తండ్రి సురేంద్రనాథ్ కన్నుమూశారని తెలిసి చింతించాను. నిబద్ధతతో వైద్య సేవలు అందించిన ఆయన ఎందరో యువ వైద్యులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలి' అని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

జోహ్రాన్ గెలుపు ట్రంప్‌నకు గొడ్డలిపెట్టు: సీపీఐ

ఈనాడు, అమరావతి: అమెరికాలోని న్యూయార్క్ నగర మేయర్‌గా డెమొక్రటిక్ పార్టీకి చెందిన జోహ్రాన్ మమ్దానీ గెలుపు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్‌నకు గొడ్డలిపెట్టని సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ వ్యాఖ్యానించారు. "భారత మూలాలున్న జోహ్రాన్ ఓటమి కోసం ట్రంప్ నేరుగా రంగంలోకి దిగడంతో ఈ ఎన్నికకు ప్రాధాన్యం సంతరించుకుంది. కమ్యూనిస్టు భావజాలం కలిగిన జోహ్రాన్ మేయర్‌గా గెలిస్తే న్యూయార్క్ సిటీకి కనీస ఆర్థిక సాయం చేయబోనని ఎన్నికలకు ముందు ట్రంప్ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ట్రంప్ అహంకారానికి అద్దం పడుతున్నాయి. జోహ్రాన్ విజయం ట్రంప్ అనాలోచిత విధానాలు, పాలనకు గట్టి ఎదురుదెబ్బ' ' అని పేర్కొన్నారు.

'మందుల కంపెనీలతో మత్స్యకారులకు అన్యాయం'

ఈనాడు, అమరావతి: సముద్ర తీర ప్రాంతంలో మందుల కంపెనీల ఏర్పాటుతో మత్స్యకారులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాటంలో మద్దతుగా నిలవాలని జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోసా అప్పలరాజు కోరారు. బుధవారం వైకాపా అధినేత జగన్, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును వారి క్యాంపు కార్యాలయంలో కలిసి మత్స్యకారుల సమస్యల గురించి వివరించారు. ఉప్పాడ, రాజయ్యపేట పరిసర గ్రామాల్లో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లారు. రాజకీయ, క్వాసీ-జ్యుడీషియల్ సంస్థల్లో నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించేలా చూడాలని కోరారు.

సి'కిల్' సెల్‌తో.. జాగ్రత్త!

- 16 జిల్లాల్లో వ్యాధి జాడలు
- సమస్యను తెలుసుకునేలోపే ప్రాణాపాయం
- బాధితులకు రక్తహీనత, పలు అనారోగ్య లక్షణాలు
- రాష్ట్రంలో కొనసాగుతున్న సర్వే



అల్లూరి సీతారామరాజు జిల్లా సీలేరులో విద్యార్థులకు సికిల్ సెల్ ఎనీమియా పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఈనాడు, అమరావతి: రక్తహీనతతో నీరసిస్తున్నారు. ఛాతీ, కడుపు, కీళ్ల నొప్పులతో విలవిల్లాడుతున్నారు. కాళ్లూ చేతుల వాపు, ఎదుగుదల లోపం, చూపు మందగించడం తదితర సమస్యలతో అవస్థలు పడుతున్నారు. వ్యాధిపై స్పష్టత వచ్చి డయాలసిస్ అందేలోపే మృత్యువాత పడుతున్నారు. సికిల్ సెల్ ఎనీమియా బాధితుల దయనీయ స్థితి ఇది. బాధితుల్లో ఎక్కువమంది గిరిజనులే. పరిస్థితిని చక్కదిద్దడానికి జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద ప్రభావిత ప్రాంతాల్లో 40 ఏళ్లలోపు వారికి 'సికిల్ సెల్ ఎనీమియా' పరీక్షలను కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. స్క్రీనింగ్, కౌన్సెలింగ్, వైద్య సేవలను అందిస్తోంది. బాధితులు ఎందరో తేల్చేందుకు రాష్ట్రంలో 2023 జులైలో సర్వేను ప్రారంభించారు. ఇది 2026 మార్చి నాటికి పూర్తవ్వాలి. పలు గిరిజన కుటుంబాలు వలస వెళ్లడంతో వైద్య బృందాలకు వారు అందుబాటులోకి రావడంలేదు. కౌన్సెలింగ్ ఇస్తున్నా చైతన్యలోపం లాంటి సమస్యలూ ఉన్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేకు, వ్యాధి కట్టడికి ఇవి ప్రతిబంధకంగా మారాయి.

మూడు జిల్లాల్లో సమస్య తీవ్రం

ప్రస్తుత సర్వేలో రాష్ట్రంలో 16 జిల్లాల్లో సికిల్ సెల్ ఎనీమియా బాధితులున్నట్లు తేలింది. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,579 పాజిటివ్ కేసులు వెలుగుచూస్తే.. ఆ తర్వాతి స్థానాల్లో పార్వతీపురం మన్యం (291), శ్రీకాకుళం (189) జిల్లాలు ఉన్నాయి. అనకాపల్లి, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, ఎన్టీఆర్, విజయనగరం, తూర్పుగోదావరి తదితర జిల్లాల్లోనూ పాజిటివ్ కేసులు కలవరపెడుతున్నాయి. మరో ఐదు నెలల్లో 5.38 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించి, సర్వేను పూర్తిచేయాల్సి ఉంది.

- ◆ స్క్రీనింగ్ చేసిన అందరికీ సికిల్ సెల్ స్టేటస్ ఐడీ కార్డులు జారీ చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 4,77,831 మందికే ఇచ్చారు.
- ◆ గిరిజనుల్లో దగ్గరి కుటుంబాల మధ్య వివాహాలు వ్యాధి వ్యాప్తికి కారణమని గుర్తించారు. క్యారియర్లు పీడితులు కాకపోయినా.. వీరి ద్వారా భవిష్యత్తు తరాలకు వ్యాధి వచ్చే అవకాశం ఉన్నందున పెళ్లిళ్లు, గర్భం ధరించేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. అయినా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. ఒకప్పుడు మన్యానికే పరిమితమైన కేసులు.. ఇప్పుడు ఇతర ప్రాంతాల్లోనూ వెలుగుచూస్తున్నాయి.

సేవలు చేరువైతే..: సికిల్ సెల్ పీడితుల మరణాల్లో ఎక్కువ భాగం ఇతర అనారోగ్య సమస్యల కేటగిరీలో నమోదవుతున్నాయి. ఇప్పటివరకు 2,241 మంది బాధితులున్నట్లు తేలితే.. వారిలో కీమోథెరపీ డ్రగ్ హైడ్రాక్సీయూరియాను 697 మందే వాడుతున్నట్లు గుర్తించారు. మిగిలిన వారికి వైద్యసేవలు అందించే దిశగా చొరవ చూపాలి. బాధితులకు రూ.10 వేల చొప్పున పింఛను అందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం భరోసానిస్తోంది. విశాఖలోని జీజీహెచ్‌లో సికిల్ సెల్ జన్యు పరీక్షల కోసం రూ.4 కోట్లతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇది అందుబాటులోకొస్తే ఉత్తరాంధ్ర జిల్లాలకు మేలు జరుగుతుంది.

సర్వే ప్రకారం రాష్ట్రంలో తాజా పరిస్థితి...

- ◆ వైద్య పరీక్షల లక్ష్యం: 19,89,970 మందికి
- ◆ ఇప్పటివరకు స్క్రీనింగ్: 14,51,530 మందికి
- ◆ పాజిటివ్ కేసులు: 2,241
- ◆ క్యారియర్లుగా తేలినవారు: 21,406 మంది

జిల్లాల వారీ పరిస్థితి..

జిల్లా	పాజిటివ్ కేసులు	క్యారియర్లు
అల్లూరి సీతారామరాజు	1,579	13,888
పార్వతీపురం మన్యం	291	4,796
శ్రీకాకుళం	189	859
ఏలూరు	35	905
విశాఖపట్నం	32	1
అనకాపల్లి	24	197
పల్నాడు	15	20
ప్రకాశం	13	206
ఎన్టీఆర్	13	78
విజయనగరం	12	266
నంద్యాల	11	85
తూర్పుగోదావరి	11	7
కాకినాడ	7	63
అనంతపురం	3	10
శ్రీసత్యసాయి	3	5
అన్నమయ్య	3	1

స్టాండింగ్ కౌన్సెళ్ల నియామకం

ఈనాడు, అమరావతి: హైకోర్టులో వివిధ ప్రభుత్వ సంస్థలు, విశ్వవిద్యాలయాల తరఫున వాదనలు వినిపించేందుకు పలువురు న్యాయవాదులు స్టాండింగ్ కౌన్సెళ్లుగా నియమితులయ్యారు. న్యాయశాఖ కార్యదర్శి జి.ప్రతిభాదేవి బుధవారం వేర్వేరుగా నియామక ఉత్తర్వులిచ్చారు. సంస్థలు, నియామకాలు ఇలా..

- ◆ ఏపీ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ - బసు నాంచారయ్య నాయుడు
- ◆ ఏపీ స్పోర్ట్స్ అథారిటీ- జి.సాయి నారాయణరావు
- ◆ రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్‌జీయూకేటీ) - ఎం. శివకుమార్
- ◆ శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి - వల్లభనేని శాంతిశ్రీ
- ◆ రాయలసీమ ప్రాంతంతోపాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలు - తర్లాడ వినోద్‌కుమార్

ఔషధాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన సాధారణ ఔషధాల సరఫరాకు ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు- మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) టెండర్లు పిలిచింది. మందుల తయారీదారులు, దిగుమతిదారులు (ఇంపోర్టర్లు) మాత్రమే టెండర్లలో పాల్గొనడానికి అర్హులని పేర్కొంది. 13 జిల్లాల సెంట్రల్ డ్రగ్‌స్టోర్లకు ప్రమాణాలకు అనుగుణంగా నిర్దేశిత 111 రకాల మందులు రేట్ కాంట్రాక్ట్ కింద అందించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ నెల 5 నుంచి టెండర్లు డౌన్లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 10వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రీబిడ్ సమావేశం నిర్వహిస్తారు. బిడ్ సమర్పణకు ఈనెల 26వ తేదీ సాయంత్రం 4.30 గంటల వరకు గడువు ఇచ్చారు. టెక్నికల్ బిడ్ అదే రోజు సాయంత్రం 5.01 గంటలకు తెరుస్తామని ఏపీఎంఎస్ఐడీసీ పేర్కొంది.

వైకాపా నేతల భూకబ్జా

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితురాలి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తన నాలుగెకరాల భూమిని ఆక్రమించిన వైకాపా నాయకులు.. ఆన్‌లైన్‌లోనూ వారి పేర్లను నమోదు చేసుకున్నారని కర్నూలు జిల్లా ఆదోని మండలానికి చెందిన వసంతమ్మ వాపోయారు. తనకు న్యాయం చేయాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి కురుబ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, నూర్‌బాషా, దూదేకుల అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. కోర్టు కేసులో ఉన్న తన భూమిని అధికారులు, కబ్జాకోరులు కుమ్మక్కై కాజేశారని బాపట్లకు చెందిన సుభాషిణి ఫిర్యాదు చేశారు. తప్పుడు పత్రాలతో తన పొలాన్ని కబ్జా చేయాలని చూస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన వెంకటేశ్వరరావు కోరారు.

జలజీవన్ మిషన్‌లో పెండింగ్ పనుల పూర్తికి

రూ.10వేల కోట్ల రుణం

- ఎన్ఏబీఎఫ్ఐడీతో సంప్రదింపులు కొలిక్కి
- మూడు దశల్లో రుణం విడుదలకు ప్రాథమిక అంగీకారం

ఈనాడు, అమరావతి: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్ల ద్వారా మంచినీటిని అందించేందుకు చేపట్టిన జలజీవన్ మిషన్ (జేజేఎం)లో పెండింగ్ పనుల పూర్తికి జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు (ఎన్ఏబీఎఫ్ఐడీ) నుంచి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే రెండుసార్లు బ్యాంకు ప్రతినిధులతో చర్చించారు. మూడు విడతల్లో రుణాన్ని విడుదల చేసేందుకు బ్యాంకు ప్రాథమికంగా అంగీకరించింది. బ్యాంకు సాంకేతిక కమిటీ పరిశీలనలో ప్రభుత్వ ప్రతిపాదనలు ఉన్నాయి. పాలకమండలి ఆమోదం తర్వాత తొలివిడత రుణం నెలాఖరులో విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

- ◆ జలజీవన్ మిషన్‌లో కేంద్ర ప్రభుత్వం మొదట ఆమోదించిన రూ.27వేల కోట్ల ప్రాజెక్టును పూర్తిచేయడంలో వైకాపా ప్రభుత్వం విఫలమైంది. రాష్ట్రప్రభుత్వ వాటా నిధులు సరిగా కేటాయించకపోవడంతో 2019-24 మధ్య రూ.4వేల కోట్లకు మించి వినియోగించుకోలేకపోయింది. పనులు కూడా అరకొరగా చేపట్టిన కారణంగా కుళాయి కనెక్షన్లు అనేక ప్రాంతాల్లో అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.
- ◆ ఈ పథకంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేకదృష్టి సారించింది. పెండింగ్‌లోని రూ.23వేల కోట్ల విలువైన పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేలా యత్నిస్తోంది. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వ వాటా కింద సమకూర్చాల్సిన రూ.10వేల కోట్లను బ్యాంకు నుంచి రుణంగా తీసుకుంటోంది. మరో రూ.13వేల కోట్లను కేంద్రం సమకూర్చనుంది.
- ◆ పెండింగ్‌లోని పనులు వచ్చే రెండు, మూడేళ్లలో పూర్తిచేసి మిగిలిన 25 లక్షలకుపైగా ఇళ్లకు కుళాయి కనెక్షన్లు జారీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. పథకం అమలులో భాగంగా బాగా వెనుకబడిన శ్రీకాకుళం, అనకాపల్లి, పల్నాడు, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం, విజయనగరం, కర్నూలు, అనంతపురం జిల్లాలపై ప్రత్యేకంగా దృష్టి సారించనుంది.

డీపీఆర్‌కు ఆమోదం తర్వాతే

- ◆ జలాశయాలు, నదుల నుంచి నీరు సేకరించి కుళాయిల ద్వారా ప్రజలకు రక్షిత నీరు ఏడాది పొడవునా సరఫరా చేసేలా కూటమి ప్రభుత్వం రూ.84,500 కోట్లతో తయారు చేసిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)కు కేంద్రం ఆమోదం లభించిన తర్వాతే ప్రతిపాదిత పనులు చేయించాలని ప్రభుత్వం భావిస్తోంది.
- ◆ వైకాపా ప్రభుత్వంలో బోర్ల నుంచి నీరు సేకరించి ప్రజలకు సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందించారు. వేసవిలో భూగర్భజలాలు అడుగంటినప్పుడు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని గుర్తించిన కూటమి ప్రభుత్వం.. నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించేలా డీపీఆర్ తయారుచేయించింది.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ సిటీ

- సినీ ప్రముఖుల సమావేశంలో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క. చిత్రంలో దిల్ రాజు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫిల్మ్ సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఇక్కడ తెలుగు ఫిలిం క్లబ్‌లో సినీ రంగ ప్రముఖులు, ఈ రంగంలోని కార్మిక నాయకుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. "రాష్ట్రంలో సినీ పరిశ్రమ గురించి చాలామంది చాలా రకాలుగా మాట్లాడుతున్నారు. కానీ నాడు ఉమ్మడి రాష్ట్రంలో.. నేడు ప్రత్యేక రాష్ట్రంలో సినీ పరిశ్రమకు ఏదైనా మేలు జరిగింది అంటే.. అది కాంగ్రెస్ ప్రభుత్వాల ఆధ్వర్యంలోనే. సినీ పరిశ్రమకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సినీ పరిశ్రమ బాగా ఎదగాలి. ఎంత ఎదిగితే అంతమందికి ఉపాధి లభిస్తుంది. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. 'మా' అసోసియేషన్ కార్యాలయ నిర్మాణానికి స్థలం విషయంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్‌తో మాట్లాడి.. ఆ కల సాకారం అయ్యేలా ప్రభుత్వం ప్రయత్నిస్తుంది' అని భట్టి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి చికిత్సకు అనుమతించాలన్న చెవిరెడ్డి పిటిషన్‌పై ముగిసిన వాదనలు

ఈనాడు, అమరావతి: ప్రకృతి చికిత్స చేయించుకునేందుకు అనుమతించాలని కోరుతూ మద్యం కేసులో నిందితుడైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి వేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. వెన్నునొప్పికి చికిత్స నిమిత్తం ఉండవల్లిలోని మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమంలో చేరేందుకు తనను అనుమతించాలని ఇటీవల పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం వాదనలు ముగియడంతో తీర్పు నిమిత్తం పదో తేదీకి న్యాయాధికారి వాయిదా వేశారు. జైలులో సౌకర్యాలు కల్పించాలని మరో నిందితుడు చాణక్య వేసిన పిటిషన్‌పై న్యాయాధికారి బుధవారం ఉత్తర్వులిచ్చారు. మంచం, కుర్చీ, దోమతెరకు అనుమతించారు.

'డీఎస్సీ-98లో మిగిలిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి'

ఈనాడు, అమరావతి: డీఎస్సీ-1998 మినిమం టైం స్కేల్ నియామకాల్లో మిగిలిపోయిన 1,814 మందికి పోస్టింగులు ఇవ్వాలని డీఎస్సీ-98 మిగిలిన అభ్యర్థుల సమాఖ్య అధ్యక్షుడు భైరవకోన శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం సమర్పించారు. 'గత ప్రభుత్వం అన్యాయం చేయడంతో 1,814 మందికి ఉద్యోగాలు రాకుండా మిగిలిపోయాం. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో లోకేశ్, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబుకు మా సమస్యను విన్నవించాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించాం. 60 ఏళ్ల పదవీ విరమణ తర్వాత ప్రస్తుతం 1,500 మంది వరకు ఉన్నాం' అని పేర్కొన్నారు.

సీడాప్‌లో ఒప్పంద గడువు ముగిసిన ఉద్యోగుల నిలుపుదల

పనితీరుతో మళ్లీ విధుల్లోకి తీసుకుంటామన్న సీఈఓ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ (సీడాప్)లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న 33 మంది ఉద్యోగులను తొలగిస్తూ సీఈఓ ఆదేశాలు జారీచేశారు. ఈ ఉద్యోగుల ఒప్పంద గడువు గత నెల 30, 31న ముగిసిందని పేర్కొన్నారు. తదుపరి నియామకం కోసం ఎలాంటి అభ్యర్థన అందలేదని వెల్లడించారు. కార్యాలయానికి సంబంధించిన వస్తువులు, పరికరాలు, ఆస్తులను సీడాప్ నిర్వాహక విభాగానికి అప్పగించాలని సూచించారు. భవిష్యత్తులో నియామకంపై ఆసక్తి ఉన్నవారు పనితీరు నివేదికలను సమర్పించాలని, దాని ఆధారంగా మళ్లీ విధుల్లోకి సిబ్బందిని తీసుకుంటామని సీఈఓ నారాయణ స్వామి తెలిపారు.

సీఎంఈజీపీ.. పారిశ్రామికవేత్తల తయారీ పథకం!

- ఏటా రూ.300 కోట్లతో అమలు చేయనున్న ప్రభుత్వం
- మార్గదర్శకాలు సిద్ధం చేశామన్న మంత్రి కొండపల్లి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు 'ముఖ్యమంత్రి ఉపాధి కల్పన హామీ కార్యక్రమం (సీఎంఈజీపీ)' పేరిట ప్రభుత్వం ఓ కొత్త పథకాన్ని ప్రకటించబోతోంది. దీనికి ఏటా రూ.300 కోట్లు ఖర్చుచేయనుంది. ఈ పథకం కింద సేవా, తయారీ రంగంలో ఏటా కనీసం 10వేల కొత్త యూనిట్లు ఏర్పాటు చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. ఒక్కో యూనిట్ ద్వారా కనీసం ముగ్గురికి ఉపాధి లభించనుంది. పథక మార్గదర్శకాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. మంత్రివర్గంలో చర్చించాక అధికారిక ప్రకటన చేసే అవకాశముంది.

స్వయం ఉపాధి కల్పనే ప్రధాన లక్ష్యం

సేవా, తయారీ రంగాల్లో సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తృతం చేయాలన్నది ప్రభుత్వ ఆలోచన. 'ఒక కుటుంబం.. ఒక పారిశ్రామికవేత్త' లక్ష్యానికి అనుగుణంగా ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీనికి 'స్టేట్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ ప్రోగ్రాం' అమలుచేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. ఆ మేరకు రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ విధానాలను తయారుచేసింది. వాటిని ఇప్పటికే సీఎం పరిశీలనకు పంపింది. సీఎం విదేశీ పర్యటన నుంచి వచ్చాక పరిశీలించనున్నారు.

యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకు రుణం

ఈ పథకం కింద ఏర్పాటుచేసే యూనిట్లకు క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. యూనిట్ల ఏర్పాటుకు బ్యాంకులు రుణం ఇస్తాయి. సేవా రంగమైతే గరిష్ఠంగా రూ.20 లక్షలు, తయారీ రంగ యూనిట్లకు రూ.50 లక్షల రుణం ఇచ్చేలా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ మేరకు త్వరలో బ్యాంకర్లతో సమావేశమై మార్గాన్ని నిర్దేశించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకానికీ.. కేంద్రం అమలుచేస్తున్న ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) మార్గదర్శకాలనే వర్తింపచేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.

గ్రామీణ ప్రాంతాలకు ప్రాధాన్యం

యూనిట్ ఏర్పాటు చేసి.. మూడేళ్ల నిర్వహణ తర్వాత క్రెడిట్ లింక్డ్ సబ్సిడీని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా చేయడం వల్ల ఈ మూడేళ్లలో నిర్వాహకులు యూనిట్ నిర్వహణకు అలవాటు పడతారు. దీనివల్ల దీర్ఘకాలం వాటిని కొనసాగించే అవకాశం ఉంటుందన్నది ప్రభుత్వ ఆలోచన. నిర్దేశిత వ్యవధి తర్వాత బ్యాంకు నుంచి తీసుకున్న రుణంలో గ్రామీణ యూనిట్లకు 25 శాతం, పట్టణ ప్రాంతాల్లోని యూనిట్లకు 15 శాతం మొత్తాన్ని మార్జిన్ మనీ సబ్సిడీ కింద ప్రభుత్వం చెల్లించేలా నిబంధన రూపొందించారు. దీనిపై సీఎం తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉంది.

సీఎం పరిశీలనకు ముసాయిదా విధానం

స్వయం ఉపాధి అవకాశాలు ప్రోత్సహించే లక్ష్యంతో సీఎం ఆదేశాల మేరకు సీఎంఈజీపీ పథకాన్ని తీర్చిదిద్దామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 'ఈనాడు'తో తెలిపారు. 'పథకాన్ని ఎలా అమలుచేయాలనే దానిపై ముసాయిదా తయారు చేశాం. అది సీఎం పరిశీలనలో ఉంది. సీఎం నిర్ణయం తర్వాత పథకాన్ని ప్రకటిస్తాం' అని పేర్కొన్నారు.